గాంధారి

అంతర భారతీయ పుస్తకమాల

గాంధారి

రచన

నా. ధో. మహానోర్

అనువాదం

డా॥ అయాచితుల హనుమచ్ఛాస్త్రి

నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా

ISBN 81-237-1263-4

ప్రథమ ముద్రణ 1995 (శక 1917)

Original title in Marathi: GANDHARI by N.D. Mahanor

Telugu translation: GANDHARI

రూ. 27.00

డైరెక్టర్, నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా, ఎ-5, గ్రీన్ పార్క్,
న్యూఢిల్లీ - 110016 ద్వారా ప్రచురింపబడినది.

పరిచయం

గాంధారి మహానోర్ వ్రాసిన నవల క్రీ.శ. 1973లో వెలువడింది. అంతకు పూర్వమే అనగా క్రీ.శ. 1967లో ఆయన వ్రాసిన 'రానాంతల్యాకవితా' అనే కవితా సంకలనం ద్వారా సమకాలిక కావ్యపరంపర ఆయన కవిముద్ర ప్రస్ఫుటమైంది. మర్డేకర్ తరువాతి కాలంలో మరాఠీలో కాల్పనిక ప్రకృతి కావ్యం(Romantic Naturalism) లోని ప్రతీక ప్రయోగం(use of symbols) వింత భావనా పద్ధతిని, కృత్రిమ భాషాసరళిని కైవసం చేసుకొని నడిచింది. ఇటువంటి పార్శ్వభూమి పైని, దేశాలముల చే ఆబద్ధమైనటువంటివన్నీ, అందుచే జానపద జీవనం లోటుపాటులు చూపించే ఒక విశిష్టమైన భూభాగాన్ని మహానోర్ ఎంతో సహజంగా చిత్రించి, ఎంతో ప్రతిభావంతంగా మన ముందుంచారు. ప్రాకృతిక చైతన్యంలోని వివిధ రూపాలు, వానికి జానపదజీవితంతో గల సందర్భాలతో సహా, అందుకు ప్రయోగానుకూలమైన, నుడికారం, పదబంధాలు, లయ, వీనిని సమన్వయించి, వ్రాస్తూ, మనకు ప్రదర్శించారు. 'రానాంతలాకవితా' మరితదనంతర కావ్యములలోనూ, మనకు కానవచ్చే, మహానోర్‌లోని సంవేదనశీలము, ముఖ్యంగా, మౌలికంగా కాల్పనికము, ఆత్మాశ్రయము అయివున్నది మనం ఒకటి గమనించాలి. ఈ రకమైన కావ్యఖండికలలో కూడా, వ్యక్తిగత ప్రపంచం నుంచి బైటికి నలుప్రక్కలా మెడ సారించి చూస్తూ, సామాజిక కష్టనిష్ఠురాలకు అవగాహన చేసికొనే ఒకానొక సీమితమైన హృదయాందోళన మాయనకుంది. దానిని ఆయన ఎంతో సశక్తంగా వ్యక్తం చేసిన పట్టులున్నాయి. ప్రకృతి సౌందర్య లావణ్యాలను, లయబద్ధంగా మనోమోహకంగా, సలంకరించి అందిచ్చే మహానోర్, భగ్గున మండే సామాజిక వాస్తవాలను సూచించే తీరు, మనకీ క్రింది పంక్తుల్లో సాక్షాత్కరిస్తుంది:

"వేసవి మండుటెండలు
    మండుటెండల వేసవి!
వచ్చిపడిందోసారి ఊరిమీద
    ఊరుఉస్సురంది; ఉన్నంతమేర
జోలిలో వేసుక్క తాను దిమ్మరైంది
ఆశలారిపోయి రాలిపడిపోయిన పూరేకుల్లా,
అభం శుభం తెలియని
    అమాయకపు మనుషులు;
కండలు తేరిన బాహుదండాలు
    అరిగి కరిగిపోయినా-
    చేవదేరిన మనుషులు
కనురెప్పలు పిటకరిస్తూ
కళ్లముందు ముసుగు కప్పుకొని
ఎటోపోతున్న; మోటారులోని
    ఆ నిద్దంపు ముద్దరాండ్రు!
వాళ్ల అమాయకపుమాటలు,
కల్లబొల్లి మాటల ఓదారింపులు!
    మంచు దుప్పటి కప్పుకొని
    వస్తున్న రోజువారీ
    పొద్దు పొడుపులు!
ఊళ్లూ పల్లెలూ! నూతులూ గోతులూ
పిట్టలూ, పల్లాలు, లోయలూ, పాయలూ,
ఏమి, ఏదీకనబడడంలేదు!
    పొగమంచు కప్పుకున్న
    సంగం చచ్చిపడి వున్న
    ఊళ్లూవాడలూ ఏవీ కనరావు!
అంతా అయోమయం, గందరగోళం
తెలియడంలేదే, ఏ ఒక్కటీ!"

'రానాంతలాకవితా' పుట.14

కాల్పనికమూ, ఆత్మాశ్రయమూనైన భూమికనుంచి కొంచెం అవతలికి వెళ్లి, సామాజిక వాస్తవానికి ఎదురుగా వెళ్లే ప్రయత్నం, పై పంక్తుల్లో మనకు కనబడుతుంది. కాని జానపద గేయ రచనలకు చెందిన లయతాళబద్ధ రచన కలవాటు పడిన మహానోర్ కవిత, ఇటువంటి సామాజిక చారిత్రిక వాస్తవాలను, విశాల పటంపై, వివరాలతో చిత్రించడానికి అనువుగా వుండడం కష్టమైన పని. అందుచేత కాల్పనికాత్మవలయ కవితలకు నైజమైన భాషా లాలిత్యమును, అంగభూతంగా చేసుకొనే, నేటి గ్రామీణ జీవితాలలోని సామూహిక శోకప్రవృత్తులను (Collective Tragic Trends) వ్యక్తపరచడంకోసం, మహానోర్‌కు, కథలను నవలలను రచించడం వైపు తన కలాన్ని మళ్లించక తప్పింది కాదు.

'గాంధారి' నవల, 'గావాంతల్యాగోష్టి' అనే కథాసంగ్రహం- ఈ రెంటిలోనూ, మహానోర్ ప్రయత్నం, నేటి మారుతూన్న పల్లెపట్టులను అవగాహనచేసుకొని, వానిని చిత్రించడమే. చాలాసార్లు మౌలికంగా కాల్పనిక శిల్పానికి చెందినకవి, సామాజిక స్పృహ కలిగినప్పుడు, సమాజంలో కనబడే లోటుపాటులను గురించి, వ్యంగ్య వైఖరిలో కొన్ని ఖండికలు రాసి, తద్వారా తన సానుభూతిని ప్రకటించడం చూస్తాం మనం. వాటిని మించి, కాల్పనిక ప్రవృత్తికంగ భూతములైన లక్షణాలను గ్రహించే, కథ, నవలవంటి, యథార్థోన్ముఖములైన రచనా వైఖరులను చేపట్టి మహానోర్ తన చేతిలో, ఈ శిల్పానికి, మొత్తం వాఙ్మయంలోనే ఒక విశిష్ట వ్యక్తిత్వాన్ని రూపు దిద్దడం, మనం మెచ్చుకోదగ్గ విషయం.

మరాఠీలో గ్రామీణ సాహిత్య పరంపర రెండుగా వింగడించ వచ్చును. స్వాతంత్ర్య పూర్వ సాహిత్యము, స్వాతంత్ర్య ఉత్తర సాహిత్యమనీ కాగా మనకు రచయితలలో కూడా స్వభావసిద్ధంగానే రెండు వర్గాలేర్పడుతాయి. వేంకటేశ మాడ్గూల్కర్ అనంతరం వచ్చిన జానపద సాహిత్య రచయితలలో, స్వాతంత్ర్యోత్తర కాలంలో, గ్రామీణ జీవితాల్లో కలుగుతూ వున్న పరివర్తనలను, సూక్ష్మేక్షతో దర్శించి రాయాలనే సఫల ప్రయత్నం మనకు కనబడుతుంది. 'గాంధారి' కన్న ముందే శ్రీ రా.రం. బోరాడేగారి 'పాచోళా', శ్రీ ఆనందయాదవ్‌గారి 'గోతావళా' అనే రెండూ, ఇటువంటి పరివర్తన శీలమైన పల్లెపట్టు మనుగడలను చిత్రించిన, చెప్పుకోదగ్గ నవలలు. ఈ రెండు నవలల్లోనూ, కొత్త తంత్ర విజ్ఞానము; పారిశ్రామికీకరణం మొదలైన వానివల్ల ఏర్పడే నాగరిక ప్రవృత్తి ఉత్తుంగ తరంగంగా వచ్చి పడుతుంటే, గ్రామీణ జీవితంలోని పాతకాలపు వ్యవసాయ జీవనంతో అసంతృప్తి చెందిన ఒకరిద్దరి కుటుంబ జీవితాలు,

మనస్తత్వాలు, ఎలా దెబ్బతిన్నాయో చిత్రించబడింది 'గోతావళా' లోని నారుబ పాత్ర, 'పాచోళా' లోని పార్వతి పాత్ర, ఈ విధమైన వ్యక్తిగతమైన శోకాత్మికతను (Tragic consciousness) పొంది వుండడం, అతి సూక్ష్మంగా వీనిలో వ్యాఖ్యానింపబడింది. పరంపరాగతమైన వ్యవసాయ పద్ధతిలో యంత్రాలపై ఆధారపడని కర్షకుడు, ప్రకృతిసిద్ధమైన సుఖమయ జీవితం, విచారసంతులనం, భావసమున్మేషం కలిగి వుంటాడు. అదీగాక, ప్రాచీన అర్థవ్యవస్థయందు స్పర్థాభావం లేనందువల్ల, వ్యక్తి కౌటుంబికంగా, మానసికంగా, సుఖాన్ని అనుభవిస్తాడు. తనకు తాను సురక్షితునిగా భావిస్తాడు. ఈ పద్ధతిని, ఏవిధంగానైనా సరే, గతకాల వైభవాన్ని మోసుకుంటూ, అంటే భవిష్యకాలాన్ని కొట్టి పారేస్తూ వుండే దృక్పథం ఈ నవలల్లోని పాత్ర చిత్రణమందు, మనకు ముఖ్యంగా కనబడుతుంది.

మహానోర్ రచించిన 'గాంధారి' పైన చెప్పబడిన జానపద నవలలకంటె విలక్షణమైంది. మార్పుచెందుతూవున్న జానపద జీవితంలో కానవచ్చే వ్యక్తి మనోభూమిక యందలి శోకాత్మికతను చిత్రించడం, మాత్రమే ఈ నవల ఉద్దేశం కాదు. అట్లాగే, సామాజిక పరివర్తన ప్రారంభం కాక పూర్వం, గ్రామీణ జీవనం, స్వయం సంపూర్ణం, భావనాత్మక దృష్టితో చూసినప్పుడు, అధిక సురక్షితం, ప్రశాంతి మంతం, అంటూ చెప్పే గతవైభవ స్మారకమైన విలాపగీతిక కాదీ నవల. అంచేత, ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న మార్పులలో, అంతర్భూతంగా వున్న భవిష్యత్తు యొక్క ఆహ్వానాన్ని, ఈ నవలలో తోసిపుచ్చడం జరగలేదు. గాంధారిలోని విశద వైశిష్ట్యం ఏమిటంటే, దీనిలో గ్రామంలోని సామూహిక శోకాత్మక చిత్రణం-అందులోని వివిధ వ్యక్తుల మధ్య ఉండే ఆంతర సంబంధాలనే చేకట్టులో-వారి సామాజిక, రాజకీయ ఆర్థిక పరిమాణాల సందర్భాలను, చక్కగా పరిశీలించడం జరిగింది. సమకాలిక గ్రామీణ జీవన వాస్తవాల సందర్భంలో, గాంధారిలో ఈ మూల్యవంతమైన భూమిక మరింత విస్తృతంగా విశదంగా చిత్రితమైంది.

'గాంధారి' మరాట్వాడాలోని, అజంతా పరిసరాల్లో వున్న కొద్దిపాటి పల్లెటూట్లు. నిజాం శాసనం కింద వుండే హైదరాబాదు రాజ్యానికి పేరు ప్రతిష్టలు తగ్గుతున్న రోజులు. అంటే రజాకార్ల మీద పోలీసు యాక్షను ప్రారంభమైన కాలం ఇక్కడినుంచే ఈ నవల ఆరంభమైంది. శతాబ్దాలుగా సంప్రదాయగతమైన జీవితాన్ని గడిపే ఈ పల్లెటూట్లు రజాకార్ల దుండగడుతనానికి బలి అయి ధ్వంసమైంది పొగరుపోతు రజాకార్లు చాంద్‌మల్‌సేఠ్ ఇల్లు దోపిడీ చేసారు. జయసింహ్ షూల్యాను, నిండు ప్రాణాలు

బలిగొన్నారు. దొరికినంతమేరకు, ఆస్తిపాస్తుల్ని బలవంతంగా కాజేసారు. గ్రామంతా మొత్తానికి, దాదాపు జనశూన్యమై పోయి. ఎప్పటికో, తెప్పరిల్లి, గ్రామస్థులు, చుట్టుప్రక్కలనుంచి తిరిగి మెల్లిమెల్లిగా స్వగ్రామం చేరుకున్నారు. ఇంత ఉపద్రవం జరిగినా, ఊరికే లబ్ధమైన రాజకీయ స్వాతంత్ర్యం వల్ల, వాళ్ల మనోభూముల్లో ఆశాంకురాలు మొలకెత్తినాయి. రజాకార్ల దౌర్జన్యకాండను, ఒక ఆకస్మికమైన దురదృష్ట సంఘటనగా భావించి, సరిపుచ్చుకొని, వాళ్లు తిరిగి మైత్రిభావంతో పరస్పరం మసలుకోసాగారు ఓచోట చేరి. ఆధునిక కాలం, అందించే ఆహ్వానాన్ని ముక్త హృదయాలతో స్వీకరించి, ఆశాభావంతో బ్రతుకడానికి వాళ్లు సంకల్పించారు. కాయకష్టం చేసి పొలాల్ని పుష్కలంగా పండించి గ్రామాన్ని సంపత్సమృద్ధం చేశారు. కోర్టు కచేరీలకు పోకుండా, తమలో తామే, ఊళ్లోనే తగాయిదాలను పరిష్కరించుకునే వాళ్లు. వానసప్తాహాలు, యాత్రలు, కీర్తనలు, గ్రామభోజనాలు, వంటి సామూహిక కార్యక్రమాలు, యధాపూర్వంగా సుభంగా, నిరంతరాయంగా జరిగిపోతున్నాయి. ప్రాథమిక సంబంధాలపై ఆధారుడివున్న ఒక శ్రద్ధామయమైన, సద్భావనా పూరితమైన, ఆశావాదియైన, పల్లె జీవితానికి అద్దం పట్టిందా వూరు.

కాని రజాకార్ల దాడి దోపిడుంలోంచి, బైటపడి స్వశక్తి మీద ఆశాభావంతో, నూత్నశక్తి సంపదలను పోగుచేసుకుంటున్న ఈ గ్రామం రజాకార్ల దాడి దోపిడులలోంచి, బైటపడి, స్వశక్తి మీద ఆశాభావంతో, నూత్నశక్తి సంపదలను పోగుచేసుకుంటున్న ఈ గ్రామం, సమాజంలో వస్తూ వున్న పరివర్తనం వల్ల, సాంప్రదాయిక జీవనం అనే బండి దారి నుంచి బైటకు విసర వేయబడింది. మార్పు తెచ్చిన ఈ కొత్త తెన్ను గాంధారిలో పైకి దృశ్యాదృశ్యంగా కనబడుతున్న దాని దృఢస్వరూపం, జగదేవు అనే పాత్రలో మనకు స్పష్టంగా కానవస్తుంది. స్వాతంత్ర్యం తర్వాత ప్రజాస్వామ్యం మూలంగా, దేశం యొక్క రూపురేఖలే మారడం మొదలైంది. పంచాయతీ రాజ్యం మూలంగా, ప్రభుత్వ వికేంద్రీకరణం వల్ల గ్రామాలలోకి ఎన్నో సంస్థలు వచ్చిచేరాయి. సహకార సంస్థ వ్యవసాయాభివృద్ధి పథకాలు, మొదలైన వాటచే గ్రామాలలోని ఆర్థిక వ్యవస్థ కూడా కొంచెం మారడం మొదలుపెట్టింది. ఈ మారుతున్న అన్ని పరిస్థితులలోనూ, అధికారం యొక్క ప్రాముఖ్యం ఎంతగా వుంటుందో గ్రహించి, దాన్ని కైవసం చేసుకొనే దారిలో, తన ధూర్త ధోరణితో, ముందుకు అడుగులు వేయనారంభించాడు. తన ప్రతిస్పర్థియైన రాజమల్లును తన దారిలోంచి వైతొలగించడానికి ప్రయత్నాలు సాగించాడు. రాజమల్లు మరణానంతరం

జగదేవు గుండాగిరీకి మోస ప్రక్రియతో కూడిన రాజనీతికి స్వేచ్ఛా విహారానికి బాహాటమైన మైదానం దొరికింది. అమాయిక జనం యొక్క సాదాతనాన్ని అజ్ఞానాన్ని, తన సొంత లాభానికి వాడుకుంటూ, తన స్వార్థంలో కొంత పాలు, తన కుమ్మక్కు దారులకు పంచి పెడుతూ, వాళ్లను భాగస్వాములుగా చేస్తూ, తన సొంత ప్రాపకాన్ని పలుకుబడినే, వృద్ధి చేసుకుంటూ, గ్రామంపైని మొత్తం అధికారమంతా తానే తన చేతిలో పెట్టుకొని, చలాయించాలనే మహత్వాకాంక్షతో కలలు కంటాడు జగదేవు.

దానికనుగుణంగా, గ్రామంలో ముఠారాజకీయాలు పెంచి పంచాయితీ ఎన్నికల్లో గెలిచి తానే సర్పంచ్ కూడా అయ్యాడు. చేతిలోకి వచ్చిన అధికారం వల్ల అతనిలో అవినీతి పై అభిరుచి పెరిగిరది. గ్రామంలో కఱువు కాటకాలు ఏర్పడినప్పుడు ఋణాల పంపకం, దిగుడు బావులు మొదలైన వాటికోసరం జనాల నుంచి డబ్బులు సులభంగా వసూలు చేసేవాడు. స్వాతంత్ర్యం వచ్చింతర్వాత బారతదేశంలో అట్ట అడుగు దాకా వ్యాపించివుండే ప్రజాస్వామ్య విధానం, వెనుక కల్యాణకారియైన రాజ్యస్థాపనే మహదాశయంగా వుంది. ప్రభుత్వము ఆ స్వప్నాన్నే చూసింది. కాని అవినీతితో అధికారం సంపాదించిన, అవినీతితోనే అధికారంలో పాదుకొనిపోయి వుండే ఒక తరం అన్నిచోట్ల వ్యాపించిపోయి, సంక్షేమ రాజ్య స్వప్నాన్ని ఛిన్నాభిన్నం చేసింది. జగదేవు, అతని ముఠావాళ్లరూపంలో, మహార్ మారుతూవున్న గ్రామ జీవితంలో, అటువంటి తరం వాళ్లని చిత్రించాడు. ఈ తరంవాళ్లు సాగించిన కార్యకలాపాలు, జీవిత మూల్యాలనే మార్చివేసి ఇతర విషయాలన్నింటికంటె, ధనం, అధికారం, అవినీతి, వీటికి ఎక్కడ లేని ప్రాధాన్యం తెచ్చిపెట్టాయి. అంతేకాదు. పరంపరాగత జానపద జీవనాన్ని సమూలంగా సంక్షోభితం చేసేశాయి.

లాక్షి, సావిత్రి, జయవంత, హవుసా, భాగవత్, వీళ్లు ఇతర పాత్రలైన జగదేవు అతని సహచరుల తరానికీ అన్ని విధాలా విరోధి స్వరూపంగా కనబడుతారు. విశేషించి, లాక్షి, సావిత్రి, హవుసా, భాగవత్ ఈ పాత్రలు మరింత వైశిష్ట్యాన్ని ప్రోదిచేసుకోవడానికి ఒక ముఖ్యమైన కారణం ఏమిటంటే, వీరి వ్యక్తిగతములైన నీతి విలువలు, ఎవరికి వారివి స్పష్టములు, స్వచ్ఛములువై వుండడమే. నీతి విలువల ఈ యెఱుకవారి కుందుట చేతనే, వారి నడవడికలో కూడా ఒక విధమైన నిర్భయత్వం, స్వచ్ఛందత మనకు గోచరిస్తాయి. జగదేవుని నీతి బాహ్యమైన దుష్టత్వం పార్శ్వభూమిపై, లాక్షి సావిత్రి, హవుసా, భాగవత్ వీళ్లకు గల నైతిక మూల్యముల

ఎటుక ఎంతో ప్రాముఖ్యం వహిస్తుంది. ఈ అన్ని పాత్రల మధ్య వ్యక్తమయ్యే వ్యక్తిగత సంబంధాల విలక్షణ పటం, తయారుకావడానికి ఇదే మూలకారణం.

లాల్జీ, భాగవత్‌కు గ్రామంలో ఒక్కగాని ఒక్క మిత్రుడు. ఎంతో పొలంపుట్ర, వ్యవసాయం ఉన్న లాల్జీ, భాగవత్ మైత్రీ ప్రభావం మూలాన్నే జూదం లాంటి వ్యసనంలోంచి బైటపడ్డాడు. మంచి హృదయం, చెప్పుకోదగ్గ నడవడి, సమయం వస్తే విటుచుకుతినే స్వభావం గల లాల్జీ అంటే ఊళ్లోని గుండాలకు, గుండెదిగులు, ప్రాణసంకటంగా వుండేది. ముఖ్యంగా చెప్పాలంటే లాల్జీమౌలికంగా గొప్ప కళాశీలి. ఒకసారి, ప్రసంగవశాత్తు, తమాషా చూడడానికి వెళ్లిన అతను గులాబ్ నృత్యంలో ఎంతో మక్కువతో తబలా వాయించి తోడ్పడ్డాడు. ఆ క్షణం నుంచే వాళ్లిద్దరు పరస్పరం ఆకర్షింపబడ్డారు. పంజాబీ తల్లి, గుజరాతీ తండ్రికి పుట్టిన గులాబ్, జీవితమంతా, దిక్కులేని అనాథలా బ్రతుకవలసి వచ్చింది. తన ప్రస్తుతపు ఈ నాట్య వృత్తి జీవితంపై రోత పుట్టిన గులాబ్, కళాశీలమైన లాల్జీ వ్యక్తిత్వానికి మురిసి, అతని వలపువలలో పడింది. ఇరువురికీ పెళ్లి అవుతుంది. సావిత్రి అని పేరు మార్చిపెట్టి లాల్జీ ఆమెను ఊళ్లోకి తీసుకు వస్తాడు. కాని, లాల్జీ ఒక్కణ్ణి మినహాయిస్తే ఊళ్లో వాళ్లితరులందరూ, ఆమెను వెలివేయబడిన దానిగా చూసే వాళ్లు. లాల్జీ, సావిత్రి మధ్య ఉండే వైవాహిక జీవితం, మహానోర్ వర్ణించిన తీరు, గ్రామసీమల్లో, హిందూ వివాహ సంస్థ వ్యక్తి యొక్క జీవితాన్ని ఎట్లా సంకటగ్రస్తం చేస్తుందో, నిరూపించే, దయా పాత్రమైన చిత్రణం. ఈ దయనీయ పరిస్థితి వల్లనే లాల్జీ, సావిత్రీ, బహిష్కృతులుగా నిర్ణయింపబడడం! ఈ నికృష్టస్థితి వల్లనే ఏ నృత్య కళకోసం తన యావజ్జీవితాన్ని ధారపోసిందో, ఆ కళ నుంచి కూడా ఆమె శాశ్వతంగా వైతొలగిపోయింది. ఇందుకు పరంపరా బద్ధమైన ఆ గ్రామజీవితమే ప్రబల కారణం. లాల్జీ, సావిత్రి, ఈ యిరువురిని ఆధారం చేసుకుని, మహానోర్, రూఢిగ్రస్తమైన పల్లె జీవితంలో, కళాశీలుర హృదయ సంవేదనా స్వభావాలకు తగిలే సమ్మెటపెట్టులను మిక్కిలి ప్రభావోత్పాదకమైన రీతిగా వర్ణించాడు. గాంధారిలో, అమాయక ప్రజని వంచించి జీవించే, అవినీతిపరుడైన జగదేవుకు రోజులు బాగానే గడుస్తాయి. కాని నిర్భయంగా, స్పష్టమైన నీతివిలువల మీద ఆధారపడి, స్వచ్ఛమైన జీవితాలను గడుపజూచే లాల్జీ, సావిత్రులకు మాత్రం రోజులు గడవడం గడ్డు సమస్యగా మారింది. ఈ విసంవాదం, మన సామాజిక నైతికత్వాన్ని గురించి ఎంతైనా వ్యాఖ్యానించి చెప్పగలుగుతోంది.

జయవంత, హవుసా ఈ రెండు స్త్రీ పాత్రలలోను, సంప్రదాయబద్ధమైన పల్లె

జీవితంలోని కరడుగట్టిన నీతిమూల్యాలు, సమాజంలోని వ్యక్తులకు కలిగే నైసర్గిక ప్రేరణలను, ఎలా గొంతు పిసికి, వికసింపకుండా చేస్తాయో వేరు వేరు విధంగా రచయిత ద్వారా నిరూపింపబడింది. పెనిమిటిచే విడువబడిన, హవుసా కేవలం తన తల్లి మొండిపట్టుకు బలి అయి, రెండో పెళ్లి చేసుకోలేక పోయింది. కెనడీ భార్య భర్త మరణానంతరం రెండో పెళ్లిచేసుకున్నదని ఆమెను పొద్దస్తమానం, దుమ్మెత్తిపోసే జయవంత ముసలి తల్లి, ఆమె మనస్సు పై రోజురోజల్లా సీత, సావిత్రి మొదలైన ప్రాచీనకాల స్త్రీల ఆదర్శాలను ప్రతిబింబింపచేస్తూ వుండేది. అందువల్ల, విడిచి పారిపోయిన తన పెనిమిటి ఎప్పుడో ఒకప్పుడు బుద్ధి కుదిరి తిరిగి తన దగ్గరకు రాకపోడనే ఆశాసూత్రంపై ఆధారపడి దుఃఖమయమైన తన జీవితం ఒంటరిగా గడుపుతూ వచ్చింది. ఈ ఒంటరి జీవితం, తన యౌవోద్యానాన్ని సమూలంగా నాశనం చేసేసింది. తనలోని తారుణ్యం, పొంగులు వారుతూవుంటే, స్వాభావికంగా పెల్లుబిగే ఇంద్రియ వాసనలను, అదుపులో పెట్టడం ఆమెకసాధ్యమనిపించింది. అనుభవించిడానికామె ·వంతులో భాగవత్ చూపేసహానుభూతి తప్ప దూర దూరాలగా కూడా మరేమి లేదు. పెళ్లిచేసుకొని కూడా విధవ జీవితాన్ని గడిపే జయవంత ద్వారా, లాజ్జీ సావిత్రుల దాంపత్యం ద్వారా మహానోర్, ఒక మహత్వపూర్ణమైన సందర్భాన్ని సూచించాడు. అంతకంతకు పెరుగుతున్న నగరీకరణ ప్రక్రియ గ్రామభాగాల్లో తెచ్చిపెడుతున్న మార్పు, ద్వారాఅదివరకటి బాహ్యపరిస్థితుల్లో గొప్ప పరివర్తనం వచ్చింది. గ్రామంలోని అధికార కేంద్రాలు, రాజనీతి, అర్థవ్యవస్థ వీటన్నింటిలోనూ పెద్ద పరివర్తన వచ్చింది. కాని అయితే ఈ మార్పుల ఒత్తిడిలో పడిన, మనుషుల జీవన మూల్యాలలో మాత్రం, పరివర్తన నిష్పత్తికి తగినట్లుగా మార్పు రాలేదు. తగినంత ఆధునికత వ్యాపించలేదు. గ్రామంలోని పరంపరా నిష్ఠములైన ఆచార విచారాలు ఎక్కడివక్కడే పాదుకొని వున్నాయి. విద్యావిధానం, పరిపాలనా పద్ధతి, ఆర్థిక సామాజిక సంస్థలు, వీని మధ్య మాత్రం మార్పు ఎంతగానో వచ్చింది. కాని కుటుంబం వివాహం, ఇటువంటి మౌలిక సంబంధాలపైన ఆధారపడ్డ సామాజిక వ్యవస్థలో మాత్రం ఆధునికీకరణం వల్ల రావలసినంత మార్పు రాలేదు. పరివర్తనం, పరంపరాప్రవాహం ఈ రెండి మధ్యవుండే సాంస్కృతిక తారతమ్యము, లాజ్జీ సావిత్రి, జయవంత వీళ్ల జీవితాల్ని దుఃఖకరమైన ఒంటరిపాటుకు గురి చేయడానికి, చాలావరకు దోహదం చేసిందని చెప్పవచ్చు.

పరంపరకు కట్టుపడ్డ పల్లెటూరి జనసమూహంలో, సామాజిక నీతినియమాల

పేరుతో, వ్యక్తి యొక్క స్వభావసిద్ధములైన ప్రేరణలు, వానికి అభివ్యక్తికి కావలసిన స్వాతంత్ర్యం; ఏవిధంగా అణగదొక్క బడుతాయో చూపడానికి చక్కని ఆశయ సూత్రాలున్నాయి. ఈ విషయం హవుసా విఠల్ మహారాజు వీరిద్దరి లైంగిక సంబంధాల ప్రసక్తిలో మనకు స్పష్టమవుతుంది. విధవరాలైన హవుసా తన దగ్గిర పొలుకు వ్యవసాయం చేస్తున్న కడోబాతో యౌన సంపర్కం పెట్టుకుంటుంది. గ్రామంలోకి ఓ సంవత్సరం 'ఆళంది' నుంచి విఠ్ఠల్ మహారజ్ విచ్చేస్తాడు. జ్ఞానేశ్వరి మీద రసభరితంగా ప్రవచిస్తూవుండే యీమహాజ్ఞాని అంటే భాగవత్‌కు ఎంతో ఆదరాభిమానాలు, గౌరవప్రపత్తులూ ఉన్నాయి. కాని వాస్తవానికి మాత్రం విఠ్ఠల్ మహారాజు కామవాసనకు బలి అవుతాడు. సాగరమల్‌సెట్టి కోడలితోనూ సంపర్కము ఏర్పడుతుంది. తర్వాత హవుసాకు నెల తప్పుతుంది. తనకు అప్రతిష్ఠ వస్తుందనే భయంతో మహారాజు తల్లడిల్లిపోతాడు. కాని హవుసా ఆయనకు ఈ రహస్యాన్ని ఎక్కడా బైటపెట్టనని మాట యిస్తుంది. ఆవిధంగానే ఎంతో భద్రంగా దాస్తుంది. మహారాజు వల్ల కలిగిన గర్భాన్ని ఆమె కడోబా సాయంతో పోగొట్టుకుంటుంది. కాని మందు పుచ్చుకున్న మైకంలో కడోబా నిజం వెల్లడించాలని చూస్తాడు. హవుసా మెల్లిగా ఎండ్రిన్ తాగించి వాడిని చంపేస్తుంది. ఆ తర్వాత కూడా ఆమెకు మహారాజుతో సంబంధం వుంటూనే వచ్చింది. కారణం–హవుసా అంటే మహరాజుకు కామోన్మాదం పెచ్చురేగిపోవడమే. మళ్లీ యింకోసారి, ఆమెకు ఆయన వల్ల కడుపయింది. చిట్టచివరికి, తన పొలం ఉళ్లోని దేవాలయానికీగాను, నిత్యనైవేద్యాది ఉపచారాలకు దానం చేసి, తాను మహారాజుతో కలిసి లేచిపోయింది, ఊరువిడిచి. జయవంత, హవుసా, మహారాజు ఈ మూడు పాత్రల ద్వారా మహానోర్ ప్రకృతి సులభమైన మానవ వాసనా ప్రక్రియలను చిత్రించాడు. కాని వీరి వాసనా భివ్యక్తిలో భిన్నత్వముంది; జయవంత కామవాసన పూర్తిగా దమింపబడి వుండేది. మహాలయితే లైంగిక ఆత్మక్రీడాస్వరూపంలో అభివ్యక్తమయ్యేది. మహారాజుకు ఆయన సామాజిక సంస్థలతో, ధర్మసంస్థలతో ముడిపడి వుండడంచేత ప్రజానీకంలో తన జీవితానికున్న మదింపుకు, కామవాసనకు విసంవాదిత్వమేర్పడడంచేత, దొంగచాటు వ్యవహారంగా, ఒక విధమైన అపరాధమనే ఎఱుక కలిగి వాసనా తృప్తి చేసుకోవలసి వచ్చేది. ఆయనకు ఆ విధంగా ఆమెకడుపుల ద్వారా మరో జీవితాన్ని గడుపవలసి వచ్చింది. హవుసా మాత్రం తన ప్రకృతిసిద్ధమైన ప్రేరణకనుగుణంగా బాహాటంగా నిర్భయంగా కడోబాను ఉంచుకున్నది. మహారాజుతో సంబంధమేర్పడ్డ తర్వాత ఆ సంబంధానికి ఋజుత్వం

ఉండాలనే భావంతో, కడోబాను చరిష మహారాజుతో కలిసి లేచిపోయింది. కట్టుబాట్లు సామాజిక నైతికత్వం, వీటి దృష్ట్యా ఈ నడవడి ద్రోహపూర్వమైందని అనిపించినా, వ్యక్తిగత నైతికతను బట్టి విచారిస్తే హవుసా సమాజానికి సాహసంగా సమాజానికి ఎదురొడ్డి నిలిచి, తన జీవిత సాఫల్యాన్ని తాను పొందడంలో ధీరత్వాన్ని ప్రదర్శించిందని చెప్పాలి. ప్రకృతి సహజమైన కామప్రేరణను, సందర్భాన్నిబట్టి, తృప్తిపరుచుకోలేక, అతృప్తమైన కామవాసనలో వేగి మ్రగ్గిపోయిన జయవంత ఏకాకిజీవితం, కామవాసన తృప్తిచెందినప్పటికీ, అపరాధ భావంతో సతమతమవుతూ, దొంగచాటుగా వ్యవహరించే మహారాజు, వీళ్లకు వ్యతిరేకంగా, ముక్తహృదయంతో బాహాటంగా, ప్రకృతి శీలత్వాన్ని ప్రకటిస్తూ కామప్రేరణలు సంపూర్తిగా అనుభవిస్తూ జీవితాన్ని గడిపిన హవుసాలోని ధీరత్వం మన యెదుట ఈ రెండు విధాల జీవితాలలోని మర్మాన్ని మహానోర్ కళ్లకు కట్టినట్లు చిత్రించాడు.

నవలలోని కథావస్తు కేంద్రం మెల్లిమెల్లిగా భాగవత్ వైపు మొగ్గుతూ పోతుంది. నవలను నివేదించే పద్ధతిలో కూడా భాగవత్ యొక్క దృష్టికోణం ప్రముఖంగా ప్రతిబింబిస్తూ వుంటుంది. మిగిలిన అన్ని పాత్రలకంటె భాగవత్ యొక్క వ్యక్తిత్వం విలక్షణమైంది. రాఘవ పాటేలు యొక్క ఏకైక పుత్రుడైన భాగవత్ మంచి సుసంస్కృతి కలిగి, వ్యవసాయం కష్టించి చేస్తూ, దానిలోనే తన జీవితాన్ని రమింపజేసే వ్యక్తి

ఆయనకు సామాన్యంగా అందరికీ కుటుంబ జీవనంలో వుండే కష్ట నిష్ఠురాలుండనే వున్నాయి కాని వాటితో పాటు, లాక్ష్మి-సావిత్రులు, జయవంత, హవుసా వీళ్ల సమస్యలు, అదే విధంగా గ్రామంలోని అవినీతిపరమైన జీవితంతో కలిసే మానసిక దుఃఖం యొక్క వివిధ రూపాలు కూడా అతను భరిస్తూనే వుంటాడు. ఇతరుల ఊహాపోహలను అర్థంచేసుకునే పరిష్కృతమైన తెలివితేటలతని కున్నాయి. జయవంతయొక్క వాసనాతృప్తమైన యౌవనాన్ని, లాక్ష్మియొక్క కళాశీలమైన హృదయాన్ని అతను మిక్కిలి ఆత్మీయతతో అర్థం చేసుకున్నాడు. పారంపరిక నైతిక మూల్యాల కఱుడుగట్టినతనం, దానివల్ల వ్యక్తి స్వాతంత్ర్య నాశనం ఎలా జరిగేదీ –ఈ పరిజ్ఞానం అతనికి నిండుగా, మెండుగా వుంది. పొలం పాటులో అతని హృదయం రమించినా, ఆధునీకీకరణ ప్రక్రియ ద్వారా గ్రామ సమాజంలో జరిగే పరివర్తనపట్ల అతనికి గతకాలానికి సంబంధించిన మోహం వల్ల వైముఖ్యం ఎంతమాత్రంలేదు. మీదుమిక్కిలి మారుతున్న పరిస్థితులలో, అధికారులకు వలసినంత తోడ్పాటిచ్చి,

గుండాగిరిని ఎదుర్కొనే నైతిక నిర్భీకత, గ్రామజనుల వద్ద ఉండవలసినంత లేదే అని విచారిస్తాడు. పిల్లా జెల్లా గిలగిలా కొట్టుకొని చచ్చిపోయారు. దేశం పాతాళానికి పోయింది అయినా వాళ్లకు చీమకుట్టినట్టుగా నైనా లేదు. ఇటువంటి ఆలోచనలతో కాలంగడిపే మన గ్రామంలోని జనానికి ఏమిటి చెప్పగలం. వాళ్లకోసం మనం ఏం గట్టి ఉపకారం చేయగలం? ఈవాక్యాల్లో భాగవత్ పొందుతున్న సామాజిక దుఃఖం యొక్క అనుభూతి స్పష్టంగా మనకు గోచరిస్తుంది. అంతేకాదు దానితోపాటు, అతని వ్యక్తిత్వం యొక్క సీమావధులు కూడా మనకు స్పష్టమవుతున్నాయి. ప్రౌఢ నాగకరికుని కుండవలసిన సుసంస్కృతమైన ఆశాభావం, ఇతరులను అవగాహన చేసుకునే శక్తియుక్తులు, సామాజిక కష్టసుఖాల ఆకళింపు -అతనిలో ఈ అన్ని సులక్షణాలున్నా, అతని యందు సమయోచితంగా తీసుకోవలసిన గంభీర నిర్ణయశక్తి లేకపోవడమే అతని సీమిత వ్యక్తిత్వానికి, కారణం.

దీని మూలంగా సామాజిక సమస్యా సందర్భాలలో, అతని మనోదశ ఎంత డోలాయమానంగా వుంటుందంటే, ఆ స్థితిలో అతని లఘువ్యక్తిత్వం ప్రకటమవుతుంది. మనిషి తేలికై, తేలి పోతాడు. ఎవరికి వారే యమునాతీరే అన్నట్టుగా అయిపోతున్నా గ్రామాన్ని ఒకదారికి తీసుకరాగల శక్తి, ఒక్క భాగవత్‌కు మాత్రమే ఉన్నదన్న నమ్మకంతో, అతన్ని గ్రామ సమస్యలవైపు దృష్టి మళ్లించమని లాల్జీ కోరుతాడు. ఈ సమయంలో లాల్జీకి ఆతనిచ్చిన సమాధానంలో మనకి అతని డోలాయమాన పరిస్థితి, మితిమీరిన అతని తేలికపాటి మనోలక్షణం, స్పష్టమవుతాయి. భాగవత్ అంటాడు. ఇంటి సమస్యలలో మునిగివున్న మనిషిని నేను. నేటికి మనస్సువాటిలో నిమగ్నమైవుంది. ఏమాత్రం వెష్ట తట్టుకోలేను. ఇంటి సమస్యలతో సతమతమైపోతూ వేగుతున్నాడు, వేలాది గ్రామ సమస్యలతో తలదూర్చి, ఎలా బైటపడగలడు? నా దుఃఖాన్ని నేను ముందు చల్లార్చుకోవాలి, కొంచెంసేపు వ్యవసాయం పనితో కాలక్షేపం చేసి, మరికొంతసేపు పచ్చని తోటల మధ్య చల్లని నీడల్లో గడపి.

భాగవత్ మనస్సు పడే ఊగులాట, అతని లాఘవమైన మనోలక్షణం, వీటి రూపాంతరాలు, ఒక విధంగా అతని ఆత్మాశ్రయ లక్షణానికి పరసీమ అనవచ్చు. తన మనోవేదనను తాను తన పొలం పనులతో, పచ్చని తోటల్లోని నీడలతో, చల్లార్చు కోవచ్చునని చెప్పే భాగవత్,నవల చివరలో గర్భవతియైన తన భార్య

గంగతో గ్రామంలోని తంటా తగాదాలను గురించి ఎప్పుడు అవే చెప్పుకుంటూ కూచోడం, వాటిలో జోక్యం కలిగించుకోడం కష్టమైన పని అంటూ చెప్పి వచ్చిక మొలకల గురించి, ఇంటి సమస్యల గురించి, త్వరలో అవతరించపోతువున్న శిశువు గురించి మాట్లాడడం అతని ఆత్మాశ్రయ లక్షణంలోని స్వీయస్వప్నాలకు రంగువేయడం ప్రదర్శిస్తుంది."ఇక్కడి మనుషుల విపరీతపు దోరణలు, ఇక్కడే పుట్టి పెరిగినా, ఎంత పరిశోధిస్తూవున్న నాకు అంతుపట్టటంలేదు". ఈవిధంగా చెప్పే భాగవత్ వ్యక్తిత్వం దారుణమైన సాంఘుక యధార్థ సందర్భంతో, నిస్త్రభమైన అతని దిశా విమూఢత్వాన్ని, ఒక రకంగా మనకు పట్టే యిస్తోంది. నవల చివరిలో, ఎదిగి ఏపుగా వచ్చిన తన పైరు పంటలను రౌడీలు దగ్ధం చేయడం తెలిసినప్పుడు, అతని వద్ద మిగిలింది ఈదిశా విమూఢత్వమే.

గాంధారిలోని సామాజిక వాస్తవాలకు, కథానాయకుని(భాగవత్)ఆత్మాశ్రయ ప్రవృత్తితో కూడిన లఘుమనస్తత్వానికి మధ్యవుండే ఈ విసంవాదమే ఈ నవలలోని వివిధ ఆశయ సూత్రాల విస్తరీకరణకు దొరకవలసినంత ఆయామాన్ని దొరకకుండా చేసింది. ఉదాహరణకు నవల చివరి భాగంలో, హిందూ సమాజంలో అట్ట అడుగు బడుగు వర్గానికి చెందిన తోతమాంగ్(వెట్టివాడు) అధికారలోలుడైన జగదేవు దురధికారాన్ని కంటగించుకుంటూ నేను అణగిపడివుండి అడుగులకు మడుగులొత్తే మనిషిని కాను.నాకిక్కడ ఇచ్చిపుచ్చు కోవాలసిన లావాదేవీలేమీ లేవు. ఈ ఊరినుంచి బైటి ఊరికిపోయి ఎట్లాగో యింత ఎండు రొట్టెలు తిని బ్రతుకు తాను అని కుండ బద్దలు కొట్టినట్టు నిర్మోహమాటంగా మొహంపైన, సవాలు చేసి మాట్లాడడంలోని తిరుగుబాటు కేక చాలా మహత్వ పూర్ణమైనది. కాని మహానోర్ ఈ గొప్ప ఆశయ సూత్రాన్ని వివిధ సందర్భాల్లో అన్వయించి చూపలేదు. కాగా ఈ దృశ్యం కేవలం క్షణికమైన తిరుగుబాటు పొంగుగా మాత్రమే నిలిచిపోయింది. ఇందుకు కారణం భాగవత్ యొక్క తేలికపాటి మానసికత, ఆత్మాశ్రయ లక్షణం వీని మధ్య వుండేవి సంవాదం, నవల చిట్టచివరిదాకా కవి మహానోర్, నవలా రచయిత మహానోర్, ఈ యిరువురి మధ్య నడచిన ద్వంద్వ యుద్ధ పరిణామమే అని చెప్ప వలసి వుంటుంది.

చంద్రశేఖర్ జహగిర్దారు.

1

గాంధారి కొద్దిపాటి బస్తీ. మరీ అంత పెద్దదీ కాదు, మరీ చిన్నదీ కాదు. మహాభారతంలోని గాంధారికి పట్టిన నసీబే(తలరాత)దీనికీ పట్టింది. రాజయోగి. దురదృష్ట జీవి. నిజాం నిరంకుశ పరిపాలనా పాశాలనుంచి తప్పించుకుని బైటపడడం నిజంగా 'గాంధారి' చేసుకొన్న గొప్ప అదృష్టం. నిజాంనుంచి ముక్తి పొందడానికి, చివరి పోరాటంలో ఎందరోపాల్గొన్నారు. ముక్తి సేన ప్రాణాలొడ్డి పోరాడింది. ప్రాణజ్యోతితో మంగళహారతి పట్టింది. స్వాతంత్ర్యం సంపాదించింది. అయితే, కొన్ని గ్రామాలు మాత్రం దురదృష్టానికి గురి అయినాయి-గాంధారి లాంటివి. వాటికదివరకున్న పరువూ, మర్యాదామట్టూ అన్నీ మంట కలిసిపోయినాయి. నిజాంలో భోగవిలాసాలు పరాకాష్టను చేరుకున్నాయి. తర్వాతి కాలంలో కూడా అదృష్టవంతులు తమకు చేచిక్కిన భోగాలన్నీ పూర్తిగా అనుభవించారు. నిజాం రాజ్యంలో విలాసాలేమిటి దుర్విలాసాలేమిటి కళ్లుండి కూడా చూడడానికి వీలయినవి కావు.

అది 1948. హైదరాబాదుపై పోలీసు యాక్షను. నిజాం రాజ్యపాలనకు 'మంగళాంతం' పాడే రోజులు. గ్రామాల్లో జనులందరి మొహాలు కళాకాంతీ లేకుండా కారునల్లగా కళ్ళుడుగట్టి వున్నాయి. అందరూ చింతాగ్రస్తులు. కడుపులో భయం బాంబులు పేలుతున్నాయి. గడియలో ఏం కాబోతోందో, ఏమీ నమ్మకం లేదు. రోజూ ఏవో ఏవో కొత్త కొత్త వింతలు వినబడుతున్నాయి. కళ్లల్లోంచి నిద్రాదేవి పారిపోయింది. మొన్నటి రోజు, పరభాణీకి దగ్గిర వున్న మూడు గ్రామాలు దోచుకున్నారు. ఇళ్లూవాకిళ్లూ, సమస్తం పరశురామప్రీతి అయింది. రజాకర్లు చాలాచాలా 'హింసరచన' చేశారు. హిందువుల యువతుల్ని చెఱబట్టి తీసుకుని పోయారు. ...వాళ్లను నగ్నంచేసి పంచుకున్నారు. దగ్గిరలో ఉన్న ఫర్దాపూర్‌లో జుమ్మా మసీదుకు తీసుకుని పోయిన మనుషుల్ని ఖతం చేశారు. ...అజంతాలోని అహమ్మద్ గుహ

కొత్త అఖాడా ఓటపెట్టాడు. ... ప్రతి ఊరులోని ధనసంపత్తి దోచుకోవడం, స్త్రీలను దోపిడీ మిషతో కాజేసి అనుభవిచడం... వింత వింత సంగతులు వింటున్నాము. హైదరాబాదులో, నిజాం ప్రభువు మీద ఎవరో బాంబు విసిరాడుట. అన్ని చోట్ల ఇప్పుడు వాళ్ల అధికారమే. ఇప్పుడింకేముంది రక్తనదులు ప్రవహిస్తాయి. రోజూ ఇటువంటివే కొత్త కొత్త పుకార్లు పుట్టుకొస్తూ వుంటాయి. అంతటా భీతావహమే. ఎవడూ, ఎవడితోనూ ఎక్కువమాట్లాడడు. ఎవడైన ప్రత్యేకించి మాట్లాడాలంటే, చెవులు కొఱుక్కోవడమే. అతి రహస్యంగా. గ్రామంలో ముసల్మానుల బస్తీ పది పదిహేను ఇళ్లపట్టు మాత్రమే. అయినప్పటికీ గ్రామంలో మూడువందల ఇళ్లలోని, జనాభా వాళ్లంటే భయపడతారు. ఊళ్లోని 'మదర్సా' పాఠాల హెడ్మాష్టరు హజరత్, కష్టమ్స్ గుమాస్తా మహ్మదలీ, మరివాళ్ల బంట్రోతు, పట్టుగలే సందుసందుల్లో లాఠీలు పట్టుకుని మజామజాగా తిరుగుతూ వుంటారు. జనం వాళ్లకు పరుగెత్తుకొనిపోయి సలాంలు కొడుతూ వుంటారు. ఆడువాళ్లు, ముసలాళ్లు ఇళ్లల్లోదూరి కూచుంటారు. ఆషాఢ మాసం నడుస్తోంది. నాట్ల సమయం ఎప్పుడో అయిపోయింది. పైరు చర్రున ఎదుగుతూ వస్తోంది. కాని ఎవడూ, ఇంతవరకూ, కలుపు మొక్కలు తీయడంగాని, కుళ్లగించి పారెయ్యడంగాని, చెయ్యాలనే ఆలోచనలో లేడు. ఒక్కడూ, అర ద్గ్గిరగా పొలం వున్నవాడు వెళ్లుతున్నాడంతే. ఆడువాళ్లు ఇల్లు విడిచి బైటకి రావడంలేదు. ఎవడికీ దేనిమీదా ధ్యాస పోవడంలేదు. పగలు ఎల్లాగో గడుస్తుంది రాత్రిళ్ల గడుపడమే యమగండంగా వుంటోంది గ్రామంలోని ప్రజ, గ్రామంచుట్టూ మిద్దెల మీద స్థావరాలేర్పఱచుకున్నారు. గస్తీ తిరిగేవాళ్లు రాత్రంతా పారా తిరుగుతున్నారు. టార్చిలైట్లు తిప్పుంతూ కేకలు వేస్తున్నారు.

"ఆల్‌వెల్!-(అంతా బాగున్నారు!)" అని "నాలుగు వైపులా బాగానే వుంది, పరిస్థితి" ఆల్వెల్ కేక పూర్తి అవుతుందో లేదో, ఆబాల గోపాలం, భయం కప్పేస్తూంది వాళ్లొకళ్లను అంటుకొని పోతారు. రాత్రిళ్లంతా అక్కడక్కడా, మనుషులు, వసారాల్లో, పెరటిదొడ్లల్లో, ఇంటి కప్పులమీద, నిశ్శబ్దంగా ఒక చోట చేరుతారు. కొద్దిమంది చెవులలో గుసగుసలు పోతారు. కర్రలు, రాళ్లూ, గొడ్డళ్లు, లాంటి ఆయుధాల్ని పోగుచేసి పెట్టుకుంటారు. రోజురోజూ, ఎక్కడినుంచో అక్కడినుంచి, కొత్త కొత్త వార్తలు పుట్టుతూవుంటాయి.

స్త్రీలు తిరగలి తిప్పటం పూర్తి అయి, పిండి పొగు చేస్తున్నారు. అక్కడక్కడా కలయంపు చల్లి పేడతో అలుకుతున్నారు. అటువంటి మంచి తెల్లవారుజామున సరిగా

తెల్లవారుకమునుపే ఓ పదిమంది ఖద్దరుదారులు ఊళ్లోకి వచ్చారు. వాళ్లు తమమీద ఊళ్లో జనానికి నమ్మకం కలిగించారు. కొంతమంది ఊళ్లోని పెద్దమనుషులకు, వాళ్ల చెవుల్లో చెప్పవలసిందేదో చెప్పారు. ప్రాణాలు రక్షించుకోవాలంటే జనమంతా ఊరు వదిలి వెంటనే వెళ్లిపోవాలి. ఊరంతా, ఊరి బైటకూడా తిరిగి అందరికీ కేకలు పెడుతూ చెప్పారు. ఇవ్వాళ గ్రామం దోచేసుకుంటారు. పర్దాపూర్-అజంతా వైపునుంచి రజాకార్లు గుర్రాలమీద, ఆయుధాలతో వస్తున్నారు. వెంటనే పరుగెత్తికొనిపోవడం తప్ప గత్యంతరం లేదు. ఆడవాళ్లను, పిల్లలను మొట్టమొదట పంపించేసెయ్యండి. శీఘ్రంగా నిజాం పొలిమేరలు దాటి వెళ్లండి. ఖాన్దేశ్ హద్దు చేరగానే మీకు సహాయం లభిస్తుంది.ఉన్నవాళ్లున్నట్లు బయలుదేరి వెళ్లిపొండి. ఆ ఖద్దరు వేషధారులు వెళ్లిపోయారోలేదో, అజంతా కొండల వైపునుంచి తుపాకుల మ్రోత రెండుసార్లు వినబడింది. నాలుగైదు పొలాల దూరంలో వున్న 'పిర్బక్షీ' గుట్టల మీద గుర్రం స్వారీచేస్తూ వస్తూవున్న రజాకార్ల జాడ కనబడింది. తుపాకుల మ్రోతలు ఒకే పెట్టున వినబడుతున్నాయి. జనానికి పరుగెత్తడానికి అట్టే చోటులేకుండాపోయింది. నిద్రపోతున్న పిల్లలను మోసుకుంటూ, స్త్రీలను వెంట పరుగెత్తిస్తూ మనుషులు పారిపోసాగారు. ఎన్నో యేండ్ల నుంచి, గిజిగాని గుజ్జనగూడులా ఒక్కొక్క పరక కూడబెట్టి నిలబెట్టిన సంసారం, తలుపులు బారలగా తెఱచి, వదిలేసి ప్రాణాలు అర చేతిలో పట్టుకొని, పారిపోనారంభించారు. ఏ రకమైన లోభమూ లేదు. దేనిమీది కోరికా మిగులలేదు. కేవలం ఎట్లా బతకడమా అని ఆరాటం. గ్రామానికి మూడువైపులా ఖాన్దేశ్, సరిహద్దులు. అదికూడా మైలు, రెండు మైళ్ల దూరం. గర్భిణీ స్త్రీలకు నిజంగా ప్రాణం మీదికి వచ్చింది. పరిస్థితి. అక్కడక్కడా, దారిలోనే చతికిలబడి పోయేవాళ్లు. పొదలమధ్య, గుబుర్ల మధ్య, చాటుచేసికొని, దాగుకొన్నారు. మరికొంతసేపటికి, పరుగుతీసారు. గ్రామంవైపునుంచి, కేకలు, బొబ్బలు, తుపాకీమోతలు చెవులు బద్దలయ్యేటట్లు వినబడుతుంటే జనం, బొంగరంలాగా అక్కడక్కడే ఒక్కళ్ల చుట్టూ ఒకళ్లు పరుగెత్తడం మొదలు పెట్టారు. అడివి ఉన్నంతమేర, పొదలలోంచి, కంపలలోంచి, ఏటి ప్రవాహాల్లోంచి, దిక్కు తెలియని గ్రుడ్డివాడులా, ఏదో విధంగా, ఎక్కడికో అక్కడికి చేరారు కొందరు. కొందరు మధ్యలోనే చిక్కుకొని పోయారు. ఇంటిలోనే మూలల్లో, పిట్టల్లా ప్రాణాలు దాచుకొన్నారు. తలుపులు బ్రద్దలుగొట్టి ఇంట్లో ఉన్న బంగారం, వెండి, డబ్బు మొత్తం సంపత్తి దోచుకుపోతున్నా, చూస్తూకూడా, నోరు మెదల్పడంలేదు, కళ్లుమూసికొని, శరీరం భయంతో కంపించిపోతూవుంటే, సారాయితో

మత్తెక్కిన రజాకార్లు తమ కళ్ళ బాంబులను ఇండ్లల్లో అంతటా విసురుతారు. పెద్దగా అరుస్తున్నారు.దోచుకున్న సంపత్తి ఎద్దుల బళ్లమీద కెక్కిస్తున్నారు. కొంతమంది రజాకార్లు ఇండ్ల కప్పులమీద, కొంతమంది గుర్రాలమీద, ఇంకా కొంతమంది ఇళ్ళ తలుపులు పగలకొట్టి సొమ్ము దోచుకోవడంలో-కొందరు పారిపోతున్న జనాన్ని తరుముకుంటూ-గ్రామంలోని మదర్సా హజరత, నాకేదారు మహ్మదలీ, చెప్పిన మాటలనుబట్టి వాళ్లకు తెలిసిన ఇండ్లల్లో దోపిడీ చక్కగా చేసారు. చాంద్‌మల్ సేఠ్ దుకాణంలోని మొత్తం సామాను, ఇంటిలో వున్న మొత్తం బంగారం దోచుకొని బైటికి పోతూ వుంటే, అకస్మాత్తుగా ధ్వని వినపడింది ఇంట్లోంచి. రజాకార్లు మళ్లీ ఇంట్లోకి వెళ్లారు. నేరుగా దొడ్డిలోకి. గాజుల చప్పుడు. మళ్లీ అంతా వెదకడం, మొదలు పెట్టారు. ఓ తుపాకి బారు పెట్టేటప్పటికి, స్నానాల తొట్టిలోంచి చెవిటి ముసలమ్మ ఏడుస్తూ మొత్తుకుంటూ ఎదుటికి వచ్చింది. ఆమె ఆ ఇంట్లో అంట్లు తోమేది. వెర్రిది. మూగది. దాన్ని పట్టుకోగానే అది మళ్లీ పెద్దపెట్టున ఏడవనారంభించింది. "పోనివయ్యా! ఈమె పిచ్చిదానిలావుంది. అంట్లు తోమేది. మార్వాడీలందరు పారిపోయారు." అన్నాడు హజరత్. ఆ తరువాత వాళ్లు అక్కడి నుంచి తిరుగుమొహం పట్టారు. ఆ చెవిటిది చప్పుడు కాకుండా తలుపువేసి వెనుక ప్రక్క ఉన్న వీధికి వచ్చింది. చాంద్‌మల్‌సేఠ్ పెళ్లాం వంటిమీద, కోడలి వంటిమీద మరో ప్రయోగం,-వేడలో, తులసి ఆకులతో వాళ్లమీద నీళ్లు చల్లింది - తిరిగివచ్చి తను, నీళ్ల తొట్టిలో కూచుంది.

జయసింహ్ పహల్వాను మందు మత్తులో ఉన్నాడు. కళ్లు రాగిముద్దలా ఎర్రగా ఉన్నాయి. అయిదారుగురు రజాకార్లు అతన్ని నలువైపులా చుట్టు ముట్టి గోల చేయడం, అటకాయించడం మొదలుపెట్టారు. జయసింహ, నేరుగా వాళ్లముందుకు వచ్చి నిలబడ్డాడు.

"లంజ కొడుకుల్లారా! ఒక్కొక్కడే రండి..."

అప్పుడు చూడండి నా తడాఖా..."

లంజ పారిపోయింది! నన్ను వదిలేసి..

ఇప్పుడిక్కడే వుంది.. భడవా కొడుకుల్లారా!

నా లంజ ఎక్కడవుందర్రా?

ఒక్క తుపాకి పోటుతోనే జయసింహ అడ్డంగా పడ్డాడు.

"నిజాంసర్కార్‌కీ.." అని అమ్మ బూతులు తిట్టాడు.

ఒక్కడు సైగ చేశాడు. జయసింహను మిగతావాళ్లు ఎత్తిపట్టుకొని గ్రామం సరహద్దులో వున్న టోలుగేటు దగ్గిరకు తీసుకువచ్చారు. ఆయన బట్టలు ఊడతీసారు. తమ బాకును పైకి దూసారు. కసుక్కున ఆయన రెండు తొడల్లోనూ పొడిచారు. జయసింహ పెద్దపెట్టున 'అయ్యో! అమ్మో!' అని అరిచాడు. రక్తప్రవాహంలో ఆఫీసు వసారా అంతా తడిసి ఎర్రముద్దయిపోయింది

"లండీకే ఖప్పుడు చెప్పు ఎవడురా లంజకొడుకు!"

"మీరు వెళ్లండి ఈ కొజ్జావాడి యిల్లు సోదా చేయండి, వీడి ముండ తప్పకుండా ఇంట్లోనే వుండివుంటుంది. దాన్ని పట్టుకొని అజంతా తీసుక పొండి. అహమ్మదు గవుసు సాబ్, జనానాలో చేర్పండి. తొరగా పరుగెత్తండి..." తర్వాత జయసింహ రెండు చేతులు నరికేశారు. రెండు పాదాలు తెగ్గొట్టారు. వెంటవెంటనే వాడి గుండెల్లోకి రెండు గుండ్లు పేల్చారు. ఆఫీసులోని జవానులు అతని రక్తసిక్తాలైన గుడ్డల్ని తెచ్చి భవానదేవి గర్భగుడిలో పారేశారు. ఆఫీసు, పోస్టాఫీసు, బడి, పాటేలు ఇల్లు–ఈ అన్నిచోట్లవున్న కాగితాలన్నీ తగలబెట్టి హోలీ చేశారు. బంగారు నాణ్యాలు, మొత్తం సంపత్తి ఎడ్ల బళ్ల మీద కెక్కించి, గుర్రం డెక్కలు 'టక్ టక్'మని చప్పుడు చేస్తూ అజంతా వైపునుంచి వెళ్లిపోయారు.

* * * * *

ధైర్యం చేసి, రెండు మూడు నెలల తర్వాత మెల్లిమెల్లిగా పదేసిమంది, అయిదేసిమంది ఊళ్లో ఇళ్లవైపు వచ్చి చేరుతున్నారు. చెల్లా చెదరయిపోయిన ఊరు తిరిగి, ఒక ఆకారానికి రానారంభించింది. గ్రామం తూర్పువైపున ఉన్న బంజారీల బస్తి అంతా ఊడ్చుపెట్టుకొని పోయింది. అక్కడ ఒక్క పిట్ట గూడా లేదు. వాళ్లు రెండు మూడు మైళ్ల దూరంలో ఖాన్దేశ్ సరిహద్దుల్లో వున్న తమ లంబాడీ తండాలో చేరి అక్కడే నిలిచిపోయారు. మార్వాడీలు కొందరు నేరుగా మార్వారు దేశానికే వెళ్లిపోయారు. వాళ్లు తిరిగి వచ్చే ప్రసక్తి లేదు. ముసల్మాను బస్తీలో ఒక్క ఇల్లు కూడా మిగుల లేదు. ఊళ్లో పొలమూ, వ్యవసాయమూ లేని వాళ్లెవరూ తిరిగి వచ్చే పని లేదు. మట్టి మిద్దెలు, గోడలు, ఇంటికప్పులు, అన్నీ వర్షాలకు కూలిపోయినాయి. సందుల్లో, వీధుల్లో, ఇళ్లల్లో కూడా గడ్డి బాగా పెరిగింది. తలుపులు, దర్వాజాలు అన్నీ పగిలి చక్కాపోయినాయి. ఊళ్లోకి వచ్చి మాత్రం చేసేదేముంది? అంతా

ధ్వంసమైపోయింది. కొండ విరిగి నెత్తిన పడ్డట్లయింది. ఏమీ పాలుపోవడం లేదు. ఇల్లే బాగుచేసుకునేదా? పొలం పనే మొదలుపెట్టేదా. మరి భార్య బిడ్డల సంగతి? మనుషులెవరూ మాట్లాడరు. అందరికళ్లల్లోంచి అశ్రుధారలు. భయకంపితాలయిన మనస్సులు. ఏమిటి మాత్రం మాట్లాడుతారు? మాట్లాడడానికి కంఠం పెగలడంలేదు. ఒకళ్లమెడలు, ఒకళ్లు కౌగిలించుకొని ఏడుస్తున్నారంతే. ఊరికి వచ్చిన తర్వాత ఇవ్వాళే అందరూ దేవుని వేదిక ముందు గుమికూడారు. "ఓయి అబ్బిగాళ్లు! ఇట్లా ఎన్నాళ్లేడుస్తూ కూచుంటారు? అయిందేదో అయింది. ఇప్పుడు ఇహముందు జరగవలసిన దాన్ని గురించి, ఆలోచించండి. రాళ్లు మట్టి చూసి ఏడుస్తూ కూచుంటే కడుపులు నిండవు. ఇహ పనులలో చొరబడండి; మీమీ పొలాల్లోకి వెళ్లి కాస్సేపు కూచోండి. ఆ పొలాలే మీకు పనులు చెబుతాయి. దాంతో జరిగిపోయిన పాట్లు మరుపుకువస్తాయి."

"నడుం విరిగిపోయింది నాకు. కళ్లు విప్పి ఇంటి వంక చూడడానికి కూడా మనసొప్పడంలేదు. మా ఆవిడ ప్రాణమొడ్డి కష్టపడేది. ఎముకలు విరుచుకొని, సంసారాన్ని నిలబెట్టింది. భవానీదేవిని ప్రార్థించింది. భవానీమాత ఆమె కోరికను మన్నించింది. పిల్లడు కడుపున పడ్డాడు. గర్భంతోనే తన పుట్టింటికి అడ్డదారిని పోబోతోంది. ఈ రాక్షసముండాకొడుకుల ఒత్తిడికి, ఆమె పరుగెత్తడం మొదలుపెట్టింది. పరుగెత్తడం మొదలుపెట్టింది. పరుగెత్తడం ఆవిడకు చాతకాదు. పరుగెత్తుతూ పరుగెత్తుతూనే ఆమె ప్రసవించింది. పిల్లవాడిని చూసింది. అంతటి తో కళ్లు మూసింది. ఇహమాటలేదు. ఆమె జీవితం ఇల్లా తెల్లవారింది..."

"బొత్తిగా పిచ్చిగోలపడితే లాభంలేదు. ఏం జరిగిందో ఆ చింతంతా ఇప్పుడు బుర్రలోంచి తొలగించేసెయ్యి. అందరిసంసారాలు మట్టి కొట్టికొని పోయాయి. మనమన కర్మలకి, ఏడుస్తూ కూచోవటం ఎంతసేపు ఏం లాభంలేదు. ఇదంతా మఱచిపోయి, కొంచెం, పొలాల వైపు చూడు. ఇంత కష్టపడి కలుపు తీసి చాలా శ్రమించితే దేవుడు మన కిచ్చేదానికంటె ఎంతో ఎక్కువ మనకందరికీ ఇచ్చాడు. పొలాల్లో ఈ రోజు లక్ష్మితాండవిస్తోంది. కొంచెం కళ్లు విప్పి చూడండి. ఊరికే బుర్ర ఎందుకు బద్దలు కొట్టుకోవడం? ఇది మాత్రం నిజం కాదా! నాట్లన్నా పూర్తి అయ్యాయోలేదో, ఊరిమీదికి ఉపద్రవం వచ్చి నడిచింది. అంతటితో ఎక్కడివాళ్ల మక్కడ పారిపోయాం. రాగులు, జొన్నలు, పత్తి, వేరుసెనగ, ఇదివరకెన్నడూ పండినంతగా విరగపండాయి. పంట హొయలు చూసి తీరాలిసిందే. ఇదివరకెప్పుడూ

ఇంత విగారం, చూసిందిలేదు. భవానీమాత, మారుతి, వీళ్ల దయ గ్రామానికుంది. ఈ తడవ పంటకోసిన తర్వాత, మారుతి దేవునకు ఒక వారం రోజులపాటు నామ సప్తాహం చేయించాలి. భవానీ మాతకు, ఆంజనేయస్వామికి సిందూరం పట్టించి, అభిషేకం చేయించాలి. దాంతో గ్రామానికి పట్టిన పీడలన్నీ పటాపంచలవుతాయి..."

"దేవతల పేరు మీద ఎన్నటికీ లోపం జరగదు. వృద్ధి అవుతుందిగాని. వాళ్ల ఆశీర్వాదం వల్లనే ఈ పంట మన చేతికందుతోంది. ఇతర గ్రామాలలోని జనం మనకెంతో ఉపకరించారు. వాళ్ల సాయం మనకెంతో లభించింది. బంధుమిత్రులూ మనల్ని ఎంతగానో ఆదుకొన్నారు. డబ్బు ఇబ్బంది తీర్చారు. వాళ్ల ఋణం మనం సవినయంగా తీర్చుకోవాలి. మనం ఇహ మన సంసారం, ఇల్లూ వాకలీ, చూసుకోవడానికి వీలయిందిప్పుటికి... ఇకమీద రాళ్లు రువ్వుతారనే భయం పోయింది అగ్ని మంటల్లోంచి ఎల్లాగో బైటపడ్డాం. స్వతంత్రులమయ్యాం. ఇప్పుడింక పంట ధాన్యం పన్నులకి కింద చెల్లించడం, ఫల్లరికి డబ్బులు కట్టడం మొదలైనవేమి లేవు. నిజాం సర్కారు జెండా క్రిందికి దిగింది. ఇకమీదట ముసల్మానుల ఒత్తిడి, జబర్దస్తీ వుండవు గనక ఎటువంటి భయం మనక్కర్లేదు. ఇప్పుడిది మన సొంత రాజ్యం. ఇటుచూడు లెదరుబ్యాగ్‌లో దాచిపెట్టిన "మరాట్వాడా" పత్రిక ఇప్పుడా భయంలేదు. పేపరులో అంతా రాసి వుంది. సిక్కుజవానులు, పోలీసులు, మిలిటరీ వాళ్లు, భలే దెబ్బతీసారు రావూ! మొత్తం రజాకార్లు, వాడెవడూ రిజ్వీటా, అందరూ పట్టుపడ్డారుట. మన అజంతా అహమ్మదు గప్పునిని మోటారుకు కట్టి రోడ్డమీద ఈడ్చి వదిలిపెట్టారు. ఆయన పెళ్లాం మంచి మనిషి, సతీ సావిత్రివంటిది. ఆమెను వాళ్లు తమ కస్టడీలోకి తీసుకొన్నారు. లేకపోతే ఏం జరిగి వుండేదో! ఆడవాళ్లనీ, మగవాళ్లనీ అందరినీ వదిలి పెట్టేశారు. స్పష్టంగా అంతా అచ్చయి వచ్చింది చూడండి, అర్థం చేసుకోండి. భగవంతుడి పేరు స్మరించి, పొలంపనుల్లో ప్రవేశించండి."

"మారుతి మహారాజ్ కీజయ్!" అని నినాదాలు పెడుతూ, మారుతి పూజావేదిక ముందు గుమికూడిన జనులందరూ, దుఃఖాగ్ని జ్వాలలను దిగమ్రింగి, మనసారా విరగబడి నవ్వారు. మరిమరీ నవ్వారు. చుట్టా, బీడీ కాల్చుకున్నారు. మారుతి రాయని దర్శనం చేసుకొని అందరూ హర్షోల్లాసాలతో ఇంటింటికీ వెళ్లారు.

2

సంధ్యాకాలం సరగునవచ్చింది
బీచీం 'అల్లా! అల్లా!' నినదించింది
హత్యారాత్రి, బొయీాం డోం
ఊగింది అతిలీలాహేలం!

ముసల్మానుల హంగామా రోజుల్లోని 'ఓవీ'లను మహిళలు, మఱచిపోతున్నారు. తిరగలి గిరగిర తిప్పుతూ, అందులోని లయతో శృతి కలుపుతూ, గాంధీమహిమకు సంబంధించి పట్టి నూత్న ప్రపంచానికి సంబంధించినట్టి, ఉత్సాహాలు ఆనందం రేకెత్తించే ఎన్నో ఓవీలు ప్రచారంలోకి వచ్చాయి. క్షేత్రమాత మళ్లీ అందరినీ నిలవదొక్కుకొనేటట్లు చేసింది. చూస్తూచూస్తూ వుండగానే రోజులిట్టే గడిచిపోతున్నాయి. ఇళ్లు వాకిళ్లూ, గుడిసెలూ, గుడారాలు కొత్త సంవత్సరంలో మంగళ సూచకాలైన తోరణాలు కట్టుకుంటున్నాయి. లక్ష్మి ఇంటింటా, నృత్యం చేస్తోంది. దుఃఖస్మృతులు గులాలు దుమ్ములా ఎగిరి చక్కా పోయినాయి. చిన్న గ్రామం రెండు, రెండున్నర వేల జనాభా ఊరు కాని చుట్టూ ఉన్న పది గ్రామాలకు చాలినంత ధనధాన్యం పండిస్తోంది గ్రామం చిన్నదయినా, గ్రామ ఖండం కింద నాలుగున్నర వేల ఎకరాల భూమి ఉంది చాలా సుక్షేత్రమైన భూమి. ఎంత బాగా అయినా చెయ్యి; వ్యవసాయంలో ఇంకా చేయవలసివుంటుంది ప్రతి ఒక్కడూ, తమతమ వ్యవసాయం పనిలో, సంసారం గొడవలో మునిగిపోతున్నాడు. ఎవడికీ, ఎవడితోనూ ఈర్ష్యా ద్వేషాలు లేవు. కఱువు కాటకం లేదు. ఎక్కడైనా తగాదా వుంటే, ప్రైవేటుగా కూచుని తగాదా పరిష్కరించుకోవడమే. జగడం లేదు. కోర్టు కచ్చేరీల చుట్టూ తిరగడం లేదు. నలుగురు చెప్పిన మాట అందరూ సమ్మతించడం. నాకు పర్రబూమి ఇచ్చారు... బావి సౌకర్యంలేదు, ఇటువంటి మాటలు, పంచాయితీలలో మాట్లాడడం

జరగదు. గ్రామంలోని నలుగురు పెద్దమనుషులు చెప్పిన తీర్పు మీద విశ్వాసం. భవానీమాత, మారుతీ రాయల ఆశీర్వాదం మీద విశ్వాసం. మారుతిరాయని దేవాలయంలో, శ్రావణం మాసంలో అఖండ నామసప్తాహం ఏడు రోజులపాటు ప్రతి సంవత్సరం జరపడం, ప్రారంభించారు. అందులోనే గ్రామ సమారాధన, భజన సంకీర్తనలు, హోమం హవనం మొదలైనవి కూడ జరుపడం ప్రారంభమైంది. జనులు అడిగించుకోకుండానే ధనం ధాన్యం చందా క్రింద పంపుతున్నారు. దేవి ఉత్సవాలు ప్రారంభించారు. నవరాత్రుల్లో హోమం, పూజ, అలంకరణ మొదలయినవి ఎంతో ఉత్సాహంతో జరుగుతున్నాయి. ఆ రోజుల్లో రాత్రింబగళ్లు దీపమాలలు, దివ్వెలతో అడుగడుడునా కాంతి ప్రసరిస్తూ వుంటాయి. గ్రామంలో కూడా ఏకాదశి నుంచి కీర్తనలు గురువారం రోజున దత్తాత్రేయునికి హారతులు, దత్త చరిత్ర పారం నియమపూర్వకంగా జరుగుతూ వుంటాయి. పైఠణీకు పోయే ముక్తా బాయి శోభాయాత్ర, రాత్రంతా ఊళ్లో విడిది చేస్తుంది. నాసిక్, త్ర్యంబకేశ్వరం వెళ్లే, యాత్రలు కూడా, గ్రామంలో మకాం చేస్తాయి. తాము, ధ్వంసమైఉన్న ఊళ్లో అడుగుపెట్టిన తర్వాత దేవతాదులే, మనవైపు దయతో చూశారు. వాళ్ల ఆశీర్వాద ఫలమే, గ్రామంలో, ముత్యాలవానలు, పగడాల వానలు కురుస్తున్నాయి. పుష్కలంగా భూమాత పండుతోంది. గ్రామం ఆనందంలో మునిగి తేలుతూ వుంది. అన్ని గ్రామంలోని జనానికి భక్తి భావనలేర్పడుతున్నాయి. చుట్టుప్రక్కల ఊళ్లోల్లో, తలదాచుకున్న పది, పదిహేను కుటుంబాల వాళ్లు కూడా, తిరిగి గ్రామం వచ్చి చేరారు. మార్వాడనుంచి కూడా మూడు నాలుగు కుటుంబాలు మళ్లీ వచ్చాయి. కొంతమంది కొత్తవాళ్లు కూడా, ఊళ్లో కాయకష్టం చేసుకొని బ్రతుకుదాంలే అని వచ్చారు. ఊరి ప్రతిష్ఠ అంతకంతకూ, ఆ యేడాది కా యేడాది పెరుగుతూ పోతోంది.

జగదేవు జాఫ్రాబాదు వైపున్న సహ్యాద్రి గుట్టల మధ్య కవులుకు తీసుకున్న భూమి వదిలేసి ఈ ఊరు వచ్చి చేరాడు. సుఖసంపత్తులతో వున్న తన మేనకోడలి ఇంటికి. జగదేవుని భార్య చనిపోయింది. మళ్లీ పెళ్లెందుకు చేసుకోలేదో ఎవరికీ తెలియదు. పిల్లా పీచూ, ఎవరూ లేరు. ఎడంకన్నుకి పెద్ద గాయం తగిలి పొంతం పోయింది. ఆయన కనుబొమ్మల మధ్య పెద్ద బొడిపె. కళ్లకు ఎప్పుడూ నల్లని కళ్లద్దాలు మహాకాముడు అందులోనూ ఊగిసలాడుకొంటూ నడవడం, తెల్లని దుస్తులు, కొంగును మించిన తెల్లని నిర్మలమైన నడత. ఎండాకాలం, వానాకాలంలోనంటే సరే

బాగానే వుంటుంది మరి శీతాకాలంలో కూడా ఉదయం ఎనిమిదిగంటు కొట్టగానే గొడుగు వేసుకుని బయలుదేరడం. చేతిలో ఓ వార్తా పత్రిక తీసుకొని, ఏ ఇంటిలోనైనా సరే, ఏ వసారాలోనైనా సరే పదిమంది మనుషులతోపాటు బితాయించడం!కొత్తవీ, పాతవీ వార్తలు తిరగదేస్తూ, నెమరువేస్తూ వుండడం, లా పాయింట్లు మాట్లాడడం,-ఇదీ కాలక్షేపం! నిజాం కాలంలో, మనమెన్నో కష్టాలు పడ్డాము. పోరాటం సాగించాము. జైళ్లకు వెళ్లాము మొదలైన కబుర్లు హుషారుగా చెబుతూ వుంటాడు. తన్ను గురించి తానెన్నెన్నో గొప్పలు మాట్లాడుతూవుంటాడు. జనంకంటె తానెప్పుడు కాస్త ఎత్తయిన చోట కూచుంటూ వుంటాడు. హైద్రాబాదుకు సంబంధించిన ప్రత్యేక శైలిలో హిందీలోగాని, ఉర్దూలోగాని సంభాషణ సాగుతూ వుంటుంది. పొరబాటున మధ్యలో ఒకటి రెండు ఇంగ్లీషు మాటలు దొర్లుతూ వుంటాయి. అవి కూడా తప్పులుగానే వుంటాయి; చాలాసార్లు. దారితప్పి మరీ పొరబాటున ఎప్పుడయినా, మరాఠీలో మాట్లాడుతాడు. అతని చుట్టూ ఉన్నవాళ్లకు లోకాభిరామాయణం వినిపించడమయిన తర్వాత, వాళ్లందరినీ ఇంత పొగడి, నాస్తా తినిపించి, ఓ చుక్క తాగించి పొద్దుపుచ్చుతూ వుంటాడు. మా మేనకోడలికి పొలం పుట్ర కావలసినంత ఉంది, సుక్షేత్రమైన భూమి అయితే వ్యవసాయం చేయించే వాళ్లెవరూ లేకపోవడంతో, ఇక్కడికి నేను రావల్సి వచ్చిందని చెబుతూ వుంటాడు.

హైదరాబాదు భూచట్టం కింద మేనకోడలి భూమి చాలా పోయింది. ఆ భూమినంతా తిరిగి నేను వచ్చేటట్లు చూస్తాను. కోర్టులో ఎన్ని దావాలు వేయాలంటే, అన్ని వేస్తాను. మనకు కావాలిసినంత పలుకుబడీ, పరపతీ, అన్నీ అన్నిచోట్లా వున్నాయి. అంతేగాక ఈ న్యాయశాస్త్రమంతా మనకు హస్తక్కవిలే నంటాడు. జనం ఇప్పకల్లుసీసా మీది ధ్యాసతో వచ్చి చేరుతారు. వింటారు. ఒకడూ, అరా, కొంచెం తుంటరిగా అడుగుతాడు కూడా. ఇతరులకు భూమి చెందిన తర్వాత, చట్టం సమ్మతించనీ, సమ్మతించక పోనీ, అది మళ్లీ నీకెట్లా వస్తుంది తిరిగి?"

"మీకీ విషయాల్ని గురించిన అవగాహన చాలా తక్కువ. మా బుర్రకు తట్టిందంటే సాధించామన్న మాటే. ఈ రోజుల్లో నోటు ముక్కలకు మొత్తం ప్రపంచం లొంగిపోతుంది. తెలుసా? కరణానికి వంద, రెండు వందల రూపాయలిచ్చుకున్నామంటే చాలు-పెన్సిలుతో రాసింది సిరాతో, సిరాతో రాసింది పెన్సిలు రాత కింద మారిపోతాయి. గుమాస్తాకిస్తే ఆయనే సొంతంగా ఇటూ అటూ

కొట్టిపారేసి మార్చేసి సంతకం పెట్టేస్తాడు. తహసీల్దారుకంతా అర్థమయ్యేటట్లు చేస్తాడు. అయితే ఎక్కువ దానా పెట్టాలి. మన అవసరమేమీ వుండదు. పై నిర్ణయానికి ముందు తాసీల్దారు గారిని ఇంటికి వెళ్లి కలుసుకోవాలి. ఎక్కడైన కలిసినప్పుడు, సాయం కోరుతూ మీరే మా అన్నదాతలు అంటూ పొగడుతూ వుండాలి. ఈ కాలం తీరే అట్లా వుంది. వెయ్యి రెండువేల ఖర్చుతో పదివేలరూపాయలు వచ్చే వ్యవసాయం లభిస్తే అంతకంటె ఏంకావాలి? వదులుకోవడం దేనికి? మీకనిపించవచ్చు అబద్ధాలులాగా! కాని నష్టమైనా సరే, మేము ఒకటే రెండూ కాదు, వేలాది దావాలు ఆడాం, ఆడించాం. మీ ఊళ్లో ధారళంగా పొలం ఇచ్చేశారు. నేను సొంతంగా కరణం దగ్గిర చూశాను. నాకు, కాగితాలు డబ్బూ ఇవ్వండి. ఎవడి పనయినా సరే, చేసిచూపిస్తాను.

జనం మెల్లిమెల్లిగా కాగితాలు తీసుకొని జగదేవు దగ్గిరకు రావడం మొదలుపెట్టారు. వ్యవసాయం భూమి కోసం, తమలోతాము చేసుకుంటున్న భూమిలో వాటాలు సరయినవి కావని వాదించుకోవడం మొదలుపెట్టారు. తాసీల్దారు దగ్గిర కేసులు పెట్టడం సాగింది. కచ్చేరీ ప్రాంగణంలో అందరూ నిలబడి, జగదేవుగారితో సంప్రదింపులు సాగించడం మొదలయింది. మెల్లిమెల్లిగా ఇదంతా పెరుగుతూ పోయింది. దెబ్బకు దెబ్బగా తయారయింది పరిస్థితి. దాంతో ఊళ్లో, వాదప్రతివాదుల సంఖ్య పెరిగింది. ఒకళ్లిద్దరికి పోయిన పొలం తిరిగి వచ్చింది. జనం మనస్సులు చలించి పోయాయి. తెలిసినా తెలియకపోయినా, వ్యవసాయానికి సంబంధించిన వాదాలు, వివాదాలు, పెరిగిపోయాయి. మనస్సుల్లో పొరలేర్పడేటప్పటికి జనం అడుగడుక్కీ ముఠాలుగా ఏర్పడడం మొదలయింది. దాని ఫలితంగా, వాగ్వ్యాద్ధాలు, కోర్టుకేసులు, తన్నుకోవడం, గుద్దుకోవడం,-ఇవన్నీ వరుసగా ఊళ్లో వచ్చిపడుతున్నాయి. సొమ్ము, ఇటువంటి వాటిల్లో విచ్చలవిడిగా ఖర్చయిపోతూవుంది.

మామూలు ఓ చిన్న పర్రనేల వ్యవసాయాన్ని పురస్కరించుకొని ఓ పెద్ద తగాదా రేగింది. జగదేవు, రాజమల్ శేఠ్‌ల మధ్య. తాలుకా కచేరీ, కలెక్టరాఫీసు దాకా రెండుసార్లు వెళ్లిన తగాదా కోర్టులో తీర్మానమయ్యేటట్లు కనపడింది. రాజమల్‌శేఠ్ గారు ఆపొలంపైన ఏడెనిమిది సంవత్సరాల నుంచి కృషి సాగిస్తున్నారు. ఆ పొలం ఆయనకు హైదరాబాదు మక్తా పద్ధతి ప్రకారం లభించింది. పూర్తిగా చట్టసమ్మతంగా. కోర్టువారి అనుమతి లభించింది. కాని ఈ లోపలనే ఆ భూమి పైన జబర్దస్తీగా నాట్లు వేసి, ఓ సంవత్సరం తాను నాట్లు వేసినట్లుగా చూపించి, హడావుడిగా స్వాధీనం

చేసుకున్నాడు. రాజమల్, తిరిగి హైకోర్టులో, తాలూకాలో కేసు పెట్టాడు. ఇంత వరకు వాదులుగా జగదేవులతో కలిసివుండే వాళ్లే గ్రామంలోని వ్యవసాయానికి సంబంధించిన జగడంలో ప్రతివాదులుగా తమంతతామే రాజమల్ దగ్గరకు రావడం మొదలెట్టారు. వాళ్లకు కూడా పొలాలకు సంబంధించిన, వ్యవహారాల్లో, చట్టం, తెలిసిన మనిషి సాయం కావలసి వచ్చింది వాళ్లు రాజమల్ సేఠ్‌కు ఎంతో సాయపడ్డారు. హైకోర్టు తిరిగి రాజమల్‌కు ఆ పొలంపైన సర్వహక్కులు మంజూరు చేసారు. రాజమల్లు, పోలీసులు, కరణం, బిల్లు కలెక్టరు, వీళ్లందరి సాయంతో దుక్కిదున్ని పొలం స్వాధీనం చేసుకొందామని వెళ్లాడు. పొలంలో అడుగుపెట్టేసరికి, తారీలతో కర్రలతో, గొడ్డళ్లతో సిద్ధంగా నిలబడి వున్న జగదేవు, అతని వత్తాసు మనుషులు, వీళ్లని చావబాదడం మొదలుపెట్టారు. రాజమల్లు అతనికి తోడుగా వచ్చిన రైతుకూలీలు బాగా దెబ్బలు తిన్నారు. ఒకే పెట్టున ఏడుపులూ, బొబ్బలూ, కేకలూ, కేరింతలూ, చెలరేగినాయి. కరణం, బిల్లుకలెక్టరు, పోలీసులూ, పదినిమిషాల పాటు ఆ గందరగోళంలో కనబడకుండా పోయారు. సెట్టి రాజమల్లుకు తలపైన చాలా తీవ్రమైన గాయం ఏర్పడింది. అతన్ని అక్కడకక్కడే 'జలగావ్'లోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. నెలా రెండు నెలలు అక్కడే చికిత్స పొందాడు. ఇక్కడ పోలీసుల పంచాయితీ గ్రామంలో, గొప్పగొప్ప పోలీసు అధికార్లు. రాజమల్లు సేఠ్ బతుకుతాడని ఎవరూ అనుకోలేదు. కరణం, పోలీసు పార్టీలు, వీళ్లను అతిలొతుగా విచారించి పంచాయితీ చేశారు. జగదేవు గ్రామంనుంచి పారిపోయాడు. ఆయన ముఠాలోని వాళ్లు కొంతమంది మాత్రం పట్టుపడ్డారు. కాలాంతరంలో కేసు కోర్టులో సక్రమంగా, సావకాశంగా నడిచింది. జగదేవు తిరిగి బైటికి వచ్చాడు. జగదేవు అతని బృందం ఉత్సవ యాత్రలాగా కొర్టుకు వెళుతూ వచ్చారు. రాజమల్లు జీవితాశ ఎవరికీ లేనే లేదు. అందు మూలాన జగదేవు మరింత బండబారిపోయాడు. ఈ కేసును గురించి, ఊరంతటా అంతేగాదు చుట్టు పక్కల గ్రామాల్లోకూడా చర్చించుకోవడమే జనం. ఒక రోజు చిట్టచివరికి కోర్టువారు తీర్పు చెప్పారు. అందు పై అపీలుకు వీల్లేదు. జగదేవుకు, అతని వత్తాసుదార్లకు అపీలు లేకుండా, శిక్షా జుర్మానా విధించారు. జగదేవుని అహంకారానికి ముల్లు గుచ్చుకున్నట్లయింది.

* * * * *

కాలం గడవగా గడవగా, ప్రతిష్ఠ కోసరం, డబ్బుల తడాఖా చూపించడం,

జగదేవుకు, రాజమల్లుకు గూడా కష్టమనిపించింది, వాళ్లిద్దరూ అలసిపోయినట్లుయినారు. కాని తమ తమ ముఠాలతో కూచునప్పుడు, గూడు ప్రత్యేక్ష దురాలోచనలు, ఉచ్చాటనం మొదలైనవి పైకే మాత్రం కనబడకుండా, వాళ్ళ బుర్రల్లో గిరగిరా తిరుగుతేనే వుంటాయి. అప్పుడప్పుడూ హఠాత్తుగా నాగుబాము పడగ విప్పి లేచినట్లు తగాదాలు లేస్తూనే వుంటాయి.

"మన గ్రామానికి గ్రామపంచాయితీ ఏర్పడబోతోంది. ఎవరెవరు ఫారం పూర్తి చేసి ఇవ్వాలనుకుంటారో వాళ్లు ముప్పైయి తారీకు లోపల తాలూకా కచ్చేరీలో దాఖలు చేయాలండాహో!..." అంటూ తోతామాంగ్ సాయంకాలం పూట వీధి వీధుల, సందు సందుల, పెద్ద గొంతుతో డప్పుమీద దెబ్బ కొట్టి మరీ చాటింపు వేశాడు. ఆ రోజునుంచి, కొత్తగా మళ్లీ తగాదా ఎట్లాగా పెట్టుకోవడమని రహస్యాలోచనలు ప్రారంభమయినాయి. జగదేవు, రాజమల్లు వీళ్లిద్దరి ఇళ్లలో జరిగే సభల్లో మంతనాలు ప్రారంభమయినాయి. తెలతెలవారుతుండగానే మేల్కోవడం, దగా, మోసంగా వ్యవహరించడం, ఏమీ తెలియని వెర్రివాళ్లల్లా నటిస్తూ కొంతమంది తప్పని సరిగా, ఒక మీటింగు నుంచి ఇంకో మీటింగుకు పోయి కూచుంటూ వుండడం ఇటువంటివన్నీ ప్రారంభమయినాయి. కుచేష్టలకు, తోతామాంగ్‌ది ఈ ఊళ్లోకల్లా పెట్టింది పేరు. అతడీ వూరికి పాతకాపు. లావుపాటి కర్ర తీసుకొని, నేలకు మోటిస్తూ వాడు నిలబడ్డాడంటే గంటల తరబడి మాట్లాడుకుంటూ పోతాడు. పాత కాలపు నిజాం పరిపాలన నాటి కబుర్లు చెబుతూ వుంటాడు. పాతకాలపు కథలు చెప్పడంలో తోతాది అందరి కంటె పై చెయ్యి. 'ఇంత రొట్టె ముక్క పడెయ్యండమ్మా పున్నెముంటుంది' అని నాలుగు ఇళ్లూ సాయంకాలం తిరిగి రొట్టె కూర బుట్టలో వసూలు చేసుకొని వసారాలో కూచోవడం వారివీరి తగాదాలు అడిగి తెలుసుకోవడం- వాళ్లేమన్నా తనకు రోషం లేకపోవడం-అందరికీ తెలిసిన విషయమే నేను ఊరి వెట్టివాడినవి-జనం చెప్పు తీసుకు కొట్టినా, నాక్కోపం రాదు సుమండీ- అని చెబుతూ వుండడం-తగవులు పెట్టి తమాషా చూడడం, తోతా చేసే ప్రత్యేకమైన వృత్తి. తంపులు పెట్టి ఏమీ ఎరగనట్లు వుంటాడు. గ్రామంలో తగాదాలు ఎంతపెరిగి పోయినాయంటే, తోతాలాంటి మనుషుల మూలకంగా, తగాదాలు తుఫానే వచ్చినట్లయింది. తోతా పెరటిలోకి వెళ్లినా అక్కడ వుండే చీమలకు, తగాదా పెట్టిస్తాడంటాడు సుపడామాంగ్. జగదేవు తగాదా అప్పటినుంచి రాజమల్లుకు తోతా అంటే వళ్లు మంట. కాని గ్రామపంచాయితీ ఎలక్షనులో పోటీచేసి సర్పంచ్ కావాలనే

కోరికతో, ఆయన వాడితో చాలా తియ్యగా మాట్లాడుతున్నాడు. తొమ్మిది ఫారాలు పూర్తి చేయించడంలో వెట్టి మహార్ల ఫారం కూడా వుండాలి. తోతా ఒక్కడూ తనవాడయితే, మిగతా ఎనమండుగురూ తన వాళ్ళయినట్లే. మెట్లకు కింది భాగంలో నిలబడివుండే తోతాను-జగదేవు, రాజమల్లు ఇద్దరూ కూడా పైకి వసారాలోకి రమ్మనమని ఆహ్వానిస్తున్నా రిటీవల. వాళ్ళతో వాడు ఎప్పుడూ నిజాం కాలంనాటి పాత ఊసరికాయ కబుర్లు చెబుతూ వుంటాడు. అర్ధరాత్రి, అపరరాత్రి కూడ, ఇద్దరి ఇండ్లకూ వెళ్ళి వాళ్ళ ఇష్టాగోష్ఠిలో తానూ పాల్గొంటాడు. వాళ్ళను నమ్మించి, వాళ్ళ చెవుల్లో ఈవిధంగా రహస్యం ఊదుతాడు.

"నేను సొంతంగా నా చెవులతో విన్నాను. ఎవళ్ళో ఏదో చెప్పింది కాదు. మారెమ్మ మీద ఒట్టు. మీరు నావాళ్ళు గదా అని చెబుతున్నా..." ఈ విధంగా అవీఇవీ చెప్పడంతో గ్రామ పంచాయితీ మొదటి ఎలక్షనులకు తోతా కూటనీతి, ఓ కొత్త రంగు తెచ్చిపెట్టింది. రెండు వర్గాలవారికీ, తోతా కళ్ళకు కునుకు రాకుండా చేసాడు. ఇటీవల గ్రామంలోని ఉద్దండుండాల కీర్తి చాలాదూరం వ్యాపించి పోవడంతో పోలీసు బందోబస్తు ఎక్కువగా చేయబడింది. ఒక రోజున ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి. వారం రోజులలో అధ్యక్ష పదవికి ఎన్నుకోవాలిసివుంది. జగదేవు, రాజమల్లు ఇద్దరూ మనమే ఈ ఊరికి మహారాజులం కాబోతున్నామని ఎవరికి వారే సంతోషిస్తున్నారు. లోపల తీపిగుటకలు వేస్తున్నారు. ఎన్నిక చాలా పోటాపోటీగా జరిగింది. జగదేవుకు నాలుగు, రాజమల్లుకు నాలుగు ఓట్లు వచ్చాయి. తోతా ఓటు మీద ఆధారుడి వుంది గ్రామపంచాయితీ చైర్మను పదవి. తోతా మావాడంటే మావాడనుకున్నారిద్దరూ. పేడాలు, అటుకులు, కోడిమాంసం పంచిపెట్టడం ఎన్నికకు ముందుగానే జరిగింది. పంచాయితీ ఆఫీసు కింది మెట్టు దగ్గిర నిలబడి టీ తాగే తోతా ఇవ్వాళ ఆఫీసు డ్రాయింగు రూంలో ఫలహారం చేస్తున్నాడు. గ్రామ సుంకం వసూలు చేసే చోటు ఇప్పుడు గ్రామ పంచాయితీ ఆఫీసు అయింది. అధ్యక్షుని ఎన్నుకొనే రోజు. ఎన్నికైన సభ్యులు వచ్చి చేరారు. ఆఫీసు చుట్టు జనసమ్మర్ధం, కోలాహలం ఎక్కువగా ఉన్నాయి. తోతా ద్వారం దగ్గిర తన కర్ర మోటుస్తూ చాలా వినమ్ర భావంతో నిలబడి వున్నాడు. "తోతా! నువ్విప్పుడు మెంబరు వయినావు. మధ్యకురా. నువ్విక మీద కుర్చీలో కూచుంటూ వుండవచ్చు. ఆఫీసు మెట్లమీద కాదు. ఇంకా నిజాం కాలంనాటి ప్రభుత్వమేననుకుంటున్నావా? ఏమిటి?"

తోతాను లోపలికి తీసుకొని పోయారు. అందరూ గుమికూడి వున్నారు. తోతా ఎన్నికాధికారిని అడిగాడు.

జగదేవు, మరి రాజమల్లు వీళ్లిద్దరిలో నువ్వు నీ వోటెవ్వరికిస్తావో చెప్పావంటే అధ్యక్షులెవరో బహిరంగ పఱచడానికి వీలవుతుంది.

“నేను ఊరి వెట్టివాణ్ణి. నలుగురూ పారేసిన పాచి ఎంగిలి తుంపులు తిని బతికేవాణ్ణి. నా ఇద్దరు పెళ్లాలు కూడా నాలాంటివాళ్లే... మరిడి మారెమ్మ మీద ఒట్టుపెట్టి చెబుతున్నా... వట్టి పనికిమాలిన పని ఎలా చెయ్యడం? చెడ్డపేరు నాకెందుకు? నా వోటెవరికి ఇచ్చేది లేదు...”

తోతామంగ్ యిచ్చిన జవాబుతో, గంట రెండు గంటలు పెద్ద గందరగోళం జరిగింది. జగదేవు, రాజమల్లు ఇద్దరికీ మొహాలు నల్లబడిపోయాయి. ఎవరి మొహం మీద కత్తి వాటేసినా నెత్తురు చుక్క లేదు. బైట జనం, పూలదండలు, తూర్యనాదాలు తీసుకొని బాజాభజంత్రీలతో సహా ఊరేగింపుకు తయారుగా ఉన్నారు. ఈ ఊరికి ఎవరు సర్పంచ్ అయ్యేది, ఊరి వెట్టివాడు నిర్ణయించే ఇంచక్కని కాలం దాపురించిందీ నాటికని జనం నెత్తి కొట్టుకుంటున్నారు. చాల కోపతాపాలుగా వుంది వాతావరణమంతా. బైటనుంచి 'థింగాణా' నృత్యం వినవస్తోంది. తోతా భయపడుతూ, భయపడుతూ, ఓసారి జగదేవు వంక కంటి కొసలతో చూసి అధికారితో అన్నాడు. “జగదేవుగారిని గ్రామానికి సర్పంచ్ చెయ్యండి”

ఈ మాటలన్నాడో లేదో జగదేవు స్నేహితులు గులాలు విరజిమ్మడం మొదలెట్టారు. భజంత్రీ వాళ్లకు వాద్య ఘోషకై సైగ చేశారు. రాజమల్లు, అతని ఆప్తజనం ఏం మాట్లాడకుంటా మొదలకుండా ఇళ్లకు వెళ్లిపోయారు.

“జగదేవుకీ జై!”

“జగదేవుకీ జై!”

గులాలు చిమ్ముకుంటూ, అక్కడనే బాజాలు వాయిస్తూ అందరూ సంతోషంతో అడుగులు వేస్తూ చిందులు తొక్కడం మొదలెట్టారు. జగదేవు మండలి మధ్య భాగంలో నిలబడి ఊగిసలాడుతూ అటూ ఇటూ నడుస్తూ, మొత్తం గులాలులో మునిగి తేలాడు. అతని పక్క పక్కనే తోతా అంటి పెట్టుకుని నడుస్తూ వున్నాడు. అన్ని వైపులా చూస్తూ, కొంటె నవ్వులు వెదజల్లుతున్నాడు. జగదేవు ఇంటిలో ప్రవేశించేటప్పుడతనికి హారతి పట్టారు. దిగదుడుపు తీసారు. మళ్లీ ఓసారి బిగ్గరగా 'జగదేవుకీ జై!'

జగదేవుని ఏల్బడి గ్రామంలో ప్రారంభమయింది. మాటతీరు, నడతతీరు, వ్యవహార పద్ధతి, కలహ సందర్భాలు, వీటి అన్నింటిలో అధికారపు పోకడలు, తుది అంచులు చేరుకుంటున్నాయి. గూఢపురాణీ చిక్కులు పేచీలు, ఎత్తులు పై ఎత్తులు అన్నీ చంక కిందపెట్టుకోవడంలో, రాచరికపు ఠీవి మెఱుస్తోంది జగదేవులో. ఇంటి డ్రాయింగురూమ్, గ్రామ పంచాయితీలోని కుర్చీలు ఎన్నడూ ఖాళీగా వుండడంలేదు. కాగితాలు, తీర్మానాలు, వేలు లక్షలు ఖర్చుపెట్టవలసిన ప్రణాళికలు ఒక దానిపైన ఇంకోకటి ఎడతెఱిపి లేకుండా వచ్చిపడుతున్నాయి. తాలూకాకు, జిల్లా ఆఫీసులకు వెళ్లడం, రావడం. అక్కడినుంచి అక్కడి గప్పాలు కొట్టడం, పామరజనం సైతం సూంచలేనంతటి కర్రపెత్తనం! జనానికి అంతా తెలిసినా, తలలూపుతూ వుంటారు. ఇంత జోరుగా జగదేవు ఏల్బడి ప్రారంభమైంది. భవిష్యత్తులో జరుగున్న అభివృద్ధి కార్యక్రమాల రూపురేకలు వచ్చాయి. ఇళ్లకు పన్నులు పడ్డాయి. పాఠశాల కోసరం, ఆస్పత్రి కోసం, నిధులు వసూలు చేసే పనిబడింది. వీటన్నిటికీ, మూలుగుతూ ముక్కుతూ, ఇష్టమున్నా లేకపోయినా, డబ్బులు జనం ఇస్తూనే వున్నారు. సాయపడకపోతే, గ్రామ పంచాయతీ, సర్పంచ్, ఈ వికాస కార్యక్రమం, ఇవన్నీ ఎందుకోసరం మీరు నెలకొల్పారు? అని జనాన్ని ఎదురు ప్రశ్నించి, జనుల్ని తన వైపు మళ్లిస్తాడు. మెల్లిమెల్లిగా జనంకూడా, ఈయన ధోరణి కలవాటు పడ్డారు. ఇంత మట్టుకు తెచ్చిందంతా తమరేగా! ఇప్పుడు క్షమునిపించినా, గందరగోళం పడకుండా, సహించి వుండేపాటి తెలివితేటలు వాళ్లకు ఏర్పడ్డాయి. చరచరా రోజులు గడిచిపోతున్నాయి. పాత సంగతులన్నీ తుడుచుకు పోతున్నాయి. కొత్తలు పైకి పొక్కనివ్వడం లేదు. కొత్త దారులు వెదుకుతున్నారు జనం.

జగదేవు, ఆయన మిత్రబృందం ఊరంతా తిరిగారు. రాజమల్లు సెట్టిని, అతని డ్రాయింగురూంలోని మిత్రుల్నీ, గ్రామంలోని రైతుల్నీ, అందరినీ మారుతి దేవాలయం వేదిక దగ్గిరకు రావాలిసిందిగా ఆహ్వానించి, సభ చేసారు. జనమంతా పోగుపడ్డ తర్వాత జగదేవు తన ఉపన్యాసం ప్రారంభించాడు:

"ఊళ్లోని సోదరీసోదరులారా!

నేనివ్వాళ మీముందు, జనానికి మేలు కూర్చే అనేక విషయాలు చెప్పడానికి నిలబడ్డాను. మీ జనాలకు శ్రేయస్సు చేకూర్చడం కోసరం, గ్రామంలోని బీదతనాన్ని నిర్మూలించడం కోసం, నేను జిల్లా కేంద్రానికి వెళ్లి వచ్చాను. వాళ్లతో బాగా తగువులాడి మీకోసరమే. ఇవ్వాళ మన రైతూ బిడ్డ ఎంతో బక్కచిక్కి వున్నాడు. అతని దగ్గిర

పొలం వుంది. అయితే, పొలం పాటు చేసుకోవడానికి కావలసిన పైసాలు అతని దగ్గర లేవు. నూతి కోసరం, బావి కోసరం పైసా కావాలి. తోట పెంచాలంటే పైసా కావాలి. అందుకని, మన గ్రామంలో కృషి సంఘం ఒక దాన్ని స్థాపించుకుందాము. అందుకోసరం తీర్మనం పాసు చేయడమవసరం. మీరంతా ఈ తీర్మానం కింద సంతకాలు చేయండి లేదా వేలిముద్రలు వేయండి. మేము పైకి పంపేస్తాం. సావుకారు జనం లాగా ఎక్కువ వడ్డీ తీసుకునేది లేదు. ప్రభుత్వం మీది నేడు. చాలా తక్కువ వడ్డీ మీద, కేవలం, పొలం తాకట్టు పెట్టి డబ్బు వడ్డీకి తీసుకోవచ్చు. ఇప్పుడు మన అదృష్టం, నిజాం చేతిలోగాని, ఇంగ్లీషువాడి చేతిలో గాని లేదు. అది మన చేతుల్లోనే వుంది. నాకు తెలుసు, ఈనాడు మీ పని చాలా గడ్డుగా వుందని మీ ఎద్దుల జతలు, బండ్లు ఇల్లూ, వాకిళ్లూ, గిన్నెలూ, గిలెలూ, అన్నీ సావుకారు దగ్గిర తాకట్టు పెట్టబడి వున్నాయి. ఈ పరిస్థితిని ఆలోచిస్తే నాకు ఎంతో తలవంపులుగా, సిగ్గుగా వుంటోంది. నాకు చాలా దుఃఖంగా వుంది. మీరందరూ కలిసి నన్ని ఊరికి నాయకునిగా ఎన్నుకున్నారు. నా మీద నమ్మకముంచారు. నేనీ ఊరి సర్పంచ్‌గా మీ అందరితో విన్నవిస్తున్నా- గ్రామాభివృద్ధి సంఘాన్ని స్థాపించుకోవాలనే మన తీర్మనం ముసాయిదా మీద, సంతకాలు పెట్టండి. మిగతాది అంతా నాకు వదిలేయండి. నేను సాధించి పెడుతాను. దానికి నేను సిద్ధమే. ఏమయినా చేసి తీరుతాను." "మేం మీ సొసైటీలో ఎన్నడూ చేరం. మేం వేరే ఇంకో సంఘం స్థాపించుకొంటాం" ఆ విధంగా, మొరాయించి, ఎదురు మాట్లాడి, రాజమల్లు సెట్టి అతనితో వచ్చిన పదిపదిహేను మంది లేచి చక్కాపోయారు.

"నా మాట కొంచెం వినండి, సేఠ్‌జీ! ప్రతిఘటించకండి. చట్టం ప్రకారం ఇంత చిన్న గ్రామంల్లో రెండు సంఘాలు పెట్టుకోవడానికి వీల్లేదు. మీరు దెబ్బలాడుతూ కూచుంటే, ఊరికి నష్టం. జనం చాలా ఇబ్బంది లో ఉన్నారు. ఊరిని అభివృద్ధిలోకి తీసుకురావాలి కూడా." "చట్టం పుస్తకం చదవడం మాకూ వచ్చు. చట్టం మాకు నేర్పడానికి చూడకు. మేం మా ఖర్రలెక్కడా తాకట్టు పెట్టలా-" అంటూ ఉన్న మిగతావాళ్లు కూడా లేచివెళ్లిపోయారు. జగదేవు, అతని మిత్రమండలి, కొంచెంసేపు ఆలోచనలు, సంప్రదింపులు జరుపుకొని ఎవరి ఇండ్లకు వాళ్లు వెళ్లి పోయారు.

"వివిధ ప్రయోజనకారీ సేవా సహకార సంస్థ నంబరు ఒకటి, నంబరు రెండు, బలే. బలే. గాంధారీ!

ఇంత చిన్న కుగ్రామంలో రెండు సంస్థలకు అనుమతి ఎలా ఇవ్వబడుతుంది?

అని ఈ చర్చ తాలూకాల్లో, జిల్లా కేంద్రాల్లో అంతటా వ్యాపించి పోయింది. ఎవరికీ ఏమీ తెలియడం లేదు. జిల్లా నాయకులతో, అధికారులతో ఏక ధాటిగా మూడు రోజులు వాదోపవాదాలు సాగాయి. ఎలాగో చివరికి రెంటికీ గుర్తింపు ఇచ్చారు? పెలుకుబడివున్న జనంకూడా, ఏడవడం మొదలుపెట్టారు. రహస్యం తెలిసింది కాదు. ప్రభుత్వం చట్టంలో ఎక్కడా ఇటువంటిది లేదు. చట్టం అవతలకు నెట్టి ఎలా ఇట్టా చేశారు? ముందు అసెంబ్లీ ఎన్నికలు వస్తున్నాయని చేశారేమో? వాళ్లల్లో వాళ్లు పరస్పర కోపావేశాలతో ఒకరిపై ఒకరువేసుకున్న వ్యక్తిగతములైన కేసులకు సంబంధించిన చట్టానికి కూడా మార్పులు తెచ్చిపెడతాయేమో? ఇప్పుడు ప్రతి ఊళ్లో ఇటువంటి డిమాండులు బైలుదేరుతాయి. వాళ్లు కూడా తగవులాడుకుంటారు. సహకార సంస్థ అంటే రెండు ప్లాలనీ ఒకటి చేయాలా లేక మరింత చీలికలు కలగ చేయాలా? జనం జిల్లా అధికారుల ప్రాణం మెగించడం మొదలుపెట్టారు. జగదేవు, రాజమల్లు సెట్టి తమతమ సంస్థలకు చైర్మనులయిన తర్వాత ఇరువురూ గొప్ప ఊరేగింపులు చేసుకున్నారు. మళ్లీ యింకోసారి గులాలు ఎర్రరంగు ధూళితో గ్రామమంతా మెత్తబడింది దట్టంగా.

* * * * *

రాజమల్లు సెట్టి కూడా సామాన్యుడు కాదు. చాలా టక్కరి మనిషి. వ్యభిచారం, అతని రక్తమాంసాల్లో జితించి పోయింది. ఆయనొక 'రంగ్‌రంగేలీ'ని ఇంట్లోనే పెట్టుకున్నాడు. తాను సొసైటీ అధ్యక్షుడయినందుకు ఆ సంతోషంలో, రెండు సన్నని పొరలలాంటి పెట్టీ కోట్లు జరీఅంచుల రవికె గుడ్డలు, ఆమెకు బహూకరించాడు. తన సొంత జనానికి పార్టీ ఇచ్చాడు. సొసైటీ మిగతా సభ్యులను కలుపుకొని తిరగడం మొదలెట్టాడు. ఋణం పంపిణీ, విత్తనాల సరఫరా ఎరువుల స్లయి మొదలైన పనులన్నీ ప్రారంభించాడు. తాను ప్రత్యేకమైన గౌరవం పొందాలనే ఉద్దేశంతో మానవసేవ ఇంకా ఎక్కువగా చేయాలని, సంస్థ తరఫున ఒక ధాన్యపు దుకాణం తెరవడానికి పైనుండి అనుమతిపత్రం సంపాదించి తెచ్చుకున్నాడు. ఈ మధ్యకాలంలో వర్షాలు సరిగా పడకపోవడం వల్ల కఱవు పరిస్థితి లాంటిది ఏర్పడింది. తిండిగింజల కోసరం ఎంతో పోటాపోటీ ఏర్పడింది. చక్కెర మీద, తిండి గింజలమీద ముఖ్యంగా రాగుల మీద జిల్లా ప్రతిబంధం, రాష్ట్ర ప్రతిబంధం ఏర్పడింది. కర్షకులకు, కరణం, తాసీల్దారు, కలెక్టరు వీళ్ల దగ్గరనుంచి, కాగితాలు వెళ్లాయి. ధాన్యం

తప్పు మిగలాదంతా, లెవీ రూపంలో తాలుకాకు పంపించి వేయాలిసుందే. గ్రామాల్లోని కూలీనాలీ జనానికి ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా సప్లయి చేస్తుంది; వస్తువలన్నీ. ఇలా ఉంది పరిస్థితి అంతా. సంస్థ ద్వారా దుకాణం నడపించడంలో పేరుకు పేరు పెరుగుతుంది, మరి చేతిలో మంచి వ్యాపారమూ ఉంటుందనే ఉద్దేశంతో రాజమల్లు, ధాన్య దుకాణం మంచి జోరుగా ఆరంభించాడు. రేషను కార్డు మీద రాయబడ్డ ఇంట్లోని జనసంఖ్య ప్రకారం రాగులు, జొన్నలు, గోధుమలూ, బియ్యం, చక్కెర మొదలైనవి ఇస్తున్నారు. ఉన్న డబ్బుల ప్రకారమే ఇవ్వడం. చాలామంది కేవలం రాగులే తీసుకుంటున్నారు. డబ్బులు లేకపోవడంతో బియ్యం, గోధుమలు, చక్కెర తీసుకోవడంలేదు. కార్డులో ఎంట్రీ చేస్తారు. అంతా క్రమపద్ధతిలో జరుగుతోంది. రాజమల్లు సెట్టీ, పంచాయితీ కమిటీ, తమ పనికి తామే సంతోషిస్తున్నారు.

పెద్దదయ్యంలా ఒకరోజు మధ్యాహ్నం వేళ అకస్మాత్తుగా దుకాణం మీదకి ఉపద్రవం వచ్చి పడింది. సప్లయి యిన్స్పెక్టరు, తాహసీల్దారు, పోలీసు సబిన్స్పెక్టరు అందరూ వచ్చిపడ్డారు. దుకాణాన్నీ, కార్డునీ, రసీదు పుస్తకాలను, లెడ్జరును వశం చేసికొన్నారు. సొసైటీ సభ్యులను, సెక్రటరీని, అందరినీ పక్కకు నెట్టేశారు. కొంతమంది పోలీసులను, రాజమల్ ఉంటూ వున్న ఇంటిని స్వాధీనం చేసుకోవడం కోసరం పంపించారు.

"సెక్రటరీ ఎవడు?"

"నేనండీ"

"ఇక్కడ బియ్యం బస్తాలు నాలుగు, గోధుం బస్తాలు పది, పంచదార బస్తాలు రెండు జమ రాయబడి వున్నాయి."

"అవునండీ సార్!"

"మరి చెప్పు. ఈ దుకాణం లోపల బస్తాలెక్కడ దాచేశారు. ఇక్కడ కేవలం రాగుల బస్తాలే కనబడుతున్నాయి!"

తాహసీల్దారు సాబ్! మా మాట కొంచెం విని అప్పుడు మాట్లాడండి దయచేసి పంచాయతీ సభ్యులు

"మీరు సెక్రటరీలా! నేనుసెక్రటరీతో మాట్లాడాలను కుంటున్నాను. మీరు ఇదంతా మీ సొంత సొమ్మనుకొని ప్రవర్తిస్తున్నారు. సిగ్గుపడాలయ్యా! కలెక్టరు గారికి కూడా ఈ ఊరు నుంచి రిపోర్టులు వెళ్లాయి. కలెక్టరుగారితో మేం ఏం చెప్పాలి?"

"ఆదాబర్జ్ సాబ్!..... రాజమల్లు సెట్టిగారి ఇల్లు సోదా చేయడం అయిపోయింది.. బియ్యం మూట ఒకటీ గోధుమల బస్తా ఒకటీ ఉన్నాయి. చక్కెర ఏదో కొద్దిగా దొరికింది... పంచాయితీ జరుగుతోంది.

"పదండి మేం అక్కడికే వస్తున్నాం...."

"నమస్తే తాసీల్దారుగారు!

"నమస్తే ఇనస్పెక్టరుగారు!

రండి, ఇక్కడ ఈ దూది మెత్తమీద కూచోండి.."

"వీరు రాజమల్లు శెట్టిగారు! సొసైటీ చయిర్మను!

ఇది వీరి ఇల్లేనా!"

"అవునండీ! మీరు లోగడ రెండు సార్లు ఇక్కడికి వచ్చివెళ్లారుగా! నేను మీకు ఆ సమయంలో..."

"మన్నించండి, సెట్టిగారు! మీరంతా మా ప్రాణాల కొసరు తెచ్చారు. ఇంత గడబిడ అవుతున్నా మాకేం మీరు తెలుపలేదు. సాయంత్రం ఆరు గంటలకు కలెక్టరు గారు వస్తున్నారు. అయ్యా! రాజమల్లుసెట్టిగారు! మీరండీ! రేషను షాపు సామానంతా జలగావ్ జిల్లా హద్దులో అమ్మారు. కార్డులమీద కొనకుండానే ఎంట్రీలు పూర్తి చేసారు. మీరు చేసే ఈ ప్రైవేటు నల్లబజారు వ్యాపారానికి, మీరందరూ త్వరగానేతగిన శిక్ష అనుభవించాల్సి వుంటుంది. మనిషివా? లేక అడవిదున్నవా? చట్టాన్ని మీరు తప్పుండర్థం చేసి కొన్నట్లుంది. ఈ మీ ఊరిలోని వందమంది సంతకాలతో రేషను షాపుమీద రిపోర్టు చేయబడింది. మరో జిల్లాలో మీరు ఎక్కువ ధరకు అమ్మితే కొనగోలు చేసిన ఆ మనిషి పట్టుబడ్డాడు. సామాగ్రి కైవసమైంది. విషయమంతా ఇప్పుడు మీ ముందుకు రానే వస్తుంది." "అయ్యా! మా ఇంటికని చూపించిన ఋణం మూలన్నే సొసైటీ యాయనకు మోటరు వచ్చింది. నేను ఆంజనేయస్వామి మీద ఒట్టు పెట్టి చెబుతున్నా, నేను ఋణం చేయనే లేదు. అటువంటప్పుడు, తీర్చడమనే మాటే రాదుగా! ఓసారి సెట్టిగారు, మూడు నాలుగు చోట్ల నాచేతనిశాని వేలి ముద్రవేయించారు సిరాతో. ఇహ పొలంపైన అప్పు ఎప్పుడు చేశాను? ఎందుకు చేశాను? అయ్యా!నాకేం తెలుస్తుంది, ఇంత పెద్ద మనిషిగా కులబడే చెయిర్మన్ నన్ను ఈ విధంగా క్షవరం చేస్తాడని నాకెక్కడా ఏ కోశానా, అప్పు చేసిన జ్ఞాపకమే లేదు. ఇప్పుడు డబ్బులు చెల్లించూ అంటే అయ్యా! ఈయన ఈ పాప ఫలం అనుభవించి

తీరుతాడు. బీదగా బిక్కుచిక్కుయున్న అమాయికులం మేము ఏమిటి చేయగలం! ఎక్కడికెళ్లి న్యాయం సంపాదిస్తాం..."

"ఈ పిచ్చి వాగుడు చాలించు! ఎవడీ గాడిద! అటు సెంట్రల్ బ్యాంకు చెయిర్మనుతో మాట్లాడు... మేం మా చిక్కుల్లో..."

"ఇనస్పెక్టరుగారూ! గ్రామం పరిస్థితే అదోమాదిరిగా ఉంది. సరిగా పంచాయితీ చేయండి, వీళ్లందరినీ, మాకుమ్మడిగా అవురంగాబాదు తోలండి. వీళ్లకు జైలుగాలిమీద మోజుగా వున్నట్టుంది. నాకయితే బుర్ర పని చేయడమే లేదు!"

పంచాయితీ జరిగింది. అవురంగాబాదు వెళ్లి రాజమల్లు, ఆయన మిత్రులు పంగనామాలు దాఖలు చేసి వచ్చారు. జామీను మీద వాళ్లు తిరిగి వచ్చేశారు. రాజమల్లు, రెండు రోజుల పాటు మార్వాడ్ మధ్యకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. నిజాం ప్రభుత్వ కాలంలో, చాలామంది అధికార్లు నోట్లు చూసి నాట్యం చేస్తారనే సంగతి, ఆయనకు బాగా తెలుసు. అయినప్పటికీ, గాబరాతో ఆయన విచారసాగరంలో మునిగాడు. శరీరం భయంతో కంపించి పోతోంది. మార్వాడ్ ప్రాంతంలో ఉన్న తన ఇల్లు అమ్మేసి, పైసా తీసుకొన్ని వస్తానని చెప్పి, అదే పోకగా వెళ్లిపోయాడు. అయిదారు రోజుల్లో మార్వాడ్ నుంచి తంతి వచ్చింది. ఆవార్త మీద మొదట్లో ఎవరికీ నమ్మకం కలగలేదు.

"రాజమల్ సేఠ్ నిన్న గుండె ఆగిపోయి మరణించారు." అని తంతి తెల్పిన సందేశం.

* * * * *

జగదేవు ఇప్పుడు సర్వతంత్ర స్వతంత్రుడయినట్లుగా వ్యవహరిస్తున్నాడు. ఆయనలో ఆనంద తరంగాలు ఉప్పొంగి పోతున్నాయి. ఏ విషయమైనా సరే నిశ్చింతగా, దర్పంగా విలాసంగా ఆయన మాట్లాడుతాడు. ఆయన జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత, దాని నష్టపరిహారం పూర్తిగా పొందుతున్నాడు. రాజమల్లును జైలుకు పంపించాడు. "ఇప్పుడు జనులందరూ తిరిగి నా పాదాల దగ్గరకు రానే వస్తారు. నేను ఈ గ్రామానికి ఏకచ్ఛత్రాధిపతిని" ఈ విధంగా అనేక విషయాలగురించి వాగుతూ వుంటాడు. షేకు మహ్మదు కంటే కూడా ఎక్కువగా బుర్రకు తట్టాలే గాని, వెంటనే ఆ పని చేపట్టుతాడు. రైతులకోసం ఏమైనా ప్రణాళిక వచ్చినా, వాళ్లకేమైనా సౌకర్యాలేర్పడుతున్నా రహస్యంగా దాచి పెట్టి ఎవడికీ చెప్పడు. అంతా తన అధీనంలో

పెట్టుకుని, వాళ్ల మీద తానేదో దయ చూపిస్తున్నట్లు నేను మీ కోసరం ఈ పని చేసుకవచ్చానర్రా అని ప్రగల్భాలు కొడుతూ వుంటాడు. నా శక్తివలన సెంట్రల్ బ్యాంకు ఛైర్మను, భూవికాస బ్యాంకు ఛైర్మను, జిల్లా పరిషత్తధ్యక్షులు మొదలైన లాకలూకాయిగాళ్లందరూ నేడు మనకు నాయకులయినారు. వాళ్లు మన చుట్టూ ప్రదక్షిణం చేస్తూ వచ్చినవాళ్లే. మేం పెద్ద వాళ్ల యింట్లో మీటింగులు నడిపించినప్పుడు నేటి ఈ పెద్దమనుషులు, ఆనాడు, బైటనో, లేక ఏదో ఒక మూలనో నక్కి కూచుండేవాళ్లు. వాళ్లు ఈనాడు ఆయా పదవులందుకున్నంత మాత్రాన గొప్ప వాళ్లయిపోయినారా? మేం వాళ్లందరినీ మించిన మహానుభావులం, వాళ్లు మాకేపనయినా, అర్ధరాత్రి సమయం లోనయినా చేసి పెట్టాలిసిందే. ఈ రకంగా ఏదో నోటికి వచ్చినట్లు పేలుతూ వుంటాడు. జనానికి పైసల అవసరం జాస్తి జనం కాళ్లు చేతులు పట్టుకుని బ్రతిమాలి ఋణం ఇప్పించేటట్లు చేసుకుంటారు. జగదేవ అంటూ ఉంటాడు-తాలూకాకు వెళ్లాలన్నా, జిల్లాకు వెళ్లాలన్నా, పనులన్నీ మంజూరు చేయించాలన్నా అధికారులకు పొట్ట నిండేటట్లు సంతర్పణ చేయాలంటే చాలా డబ్బు కావాలి. ఎన్నో కష్ట నష్టాలెదుర్కోవాలి. మీరు వెళ్లితే మీ మొహం చూసే వాళ్లెవరున్నారు? అంతకంటె, ఓ అయిదు వందల రూపాయలు మీవి కావనుకొని, నాకిస్తే దిగుడు బావి కోసరం అయిదు వేల రూపాయలు శాంక్షన్ చేయిస్తాను. ఇదిగాక కాగితాలు, ఫైళ్లు, వీటి ఖర్చు వేరు. మరో పది పదిహేను మందిని కూడా కలుపుకున్నామంటే, అందరి పనులూ, ఒకేసారి పూర్తి చేయించుకోవచ్చు. ఒకటో రెండో ఫైళ్లు ఎవడు చూసి మంజూరు చేస్తాడు! అంతేగాక, ఈఋణాలు మొదలైనవి బుద్ధికి ఎలా తోస్తే అలా కల్పించి చెప్పి, జనానికున్న అవసరాల్ని గమనించి, మెత్తమెత్తగా వాళ్ల జేబులు కత్తిరిస్తాడు. జనం పాపం, పట్టి అమాయకులు. అదీగాక, బతుకులు వెళ్లించడమే కష్టమైనప్పుడు, డబ్బులు దొరుకుతాయంటే ఏం చెయ్యడానికైనా అంగీకరిస్తారు. సొసైటీ వ్యవహారాలు, గ్రామపంచాయితీ కార్యకలాపాలు కూడా, నీతి నియమాలు లేకుండాపోయినాయి. మెంబర్లు ఇబ్బందిలో వున్నా లేకపోయినా కూడా మెంబర్లే. రొక్కం తీసుకొనేటప్పుడయినా సరే, సంతకం పెట్టడానికి నూటికి యాభై వంతులు కమిషన్ ఇచ్చుకోవాలి లేదా అధంపక్షంలో కోడిని దానం చెయ్యాలి.

చాలా టక్కరి మనిషి. ఏదో మరీయెరిగి ఉన్న నలుగురైదుగురిని విడిచి, మిగతా అందరితో ఇదే నడవడిక. రెండుమూడేళ్లనుంచి వర్షం బొత్తిగా పడడంలేదు. పూర్తిగా

కటువుకాటకం పరిస్థితి. చేతిలో డబ్బులేదు. తింటానికి కూడు లేదు. జనం భయపడిపోతున్నారు. పొలాల్లో ఉప్పుగడ్డి ముళ్లపొదలు తప్ప యేమీ లేదు. ఋణం కోసరం, కాళ్లావేళ్లాపడి చేతులు నొప్పి పుట్టాయి. అందులో కూడా సగం గొలుగుడు. మిగిలింది చేతికి వస్తుంది సంసారం, వ్యవసాయం, వీటిని చూసుకోవడం, పైపెచ్చు పిల్లల పెళ్లిళ్లు, పేరంటాలు. జనం, ఏం చేయాలో తోచక పిచ్చి వాళ్లయి పోతున్నారు. నడివేసవిలో ఆకులు లేని, చెట్లలాంటి పరిస్థితి. ఎటువంటి సాయసంపత్తులూ. లేవు. పరాధీనంగా అసహనంగా బ్రతుకులు వెళ్లదీయడం! పుష్కలంగా పంటపండే గ్రామంలో ఇప్పుడు ధాన్యంలేదు. ఒకవేళ ఉంటే, అదంతా తాలూకాలో లెవీ రూపమైన ముష్టి సంచిలో పోసేయడం జరిగింది. ఇంట్లోని ధాన్యలక్ష్మి ఇంట్లోంచి వెళ్లిపోయిన తర్వాత ఇంట్లో అందరూ జబ్బు పడ్డారు. అందరూ డోకుకోడం, అందరికీ వాంతులే. కుటుంబం వీధిలో పడ్డ రైతు. ఏ రైతయితే ఇన్నాళ్లూ మహారాజు అనిపించుకున్నాడో, అతనే కాలుతూ వున్న కడుపుతో, ముష్టి సంచీ తీసుకొని ముష్టెత్తుతున్నాడు నేడు. కూలినాలి జనం సగం పస్తులతోనే జీవిస్తున్నారు. రైతుల దగ్గర ధాన్యపు గింజలు లేవు. కొంటానికి, ఊళ్లో దుకాణం ఊళ్లోని పాడు తగాదాల మూలాన మూతపడింది. చుట్టుపక్కల ఇతర జిల్లాల పొలిమేరలు. జిల్లాల ప్రతిబంధం. ధాన్యం ఓ జిల్లానుంచి ఇంకో జిల్లాకు రావడానికి పోవడానికి లేదు. కూలినాలి జనం, పొలాల్లో దొరికే కొద్దిపాటి పటిగ పంట నుంచి, పెసరకాయలు, మినపకాయలు, లేతవో ముదిరినవో, చీల్చుకొని తినడం మొదలుపెట్టారు. పొలంమీద, ఊళ్లోనూ దొంగతనాలు బలిసినాయి. మొదలే బక్కచిక్కిపోయిన పరిస్థితి జనానిది. చవుక రోజుల్లో, బతికి సుఖపడి, హాయిగా తిని తాగిన ముసలివాళ్లు తీరని ఆకలితో, తిట్లూ శాపనార్థాలు ప్రారంభించారు. "వీళ్లకంటే నిజాం ప్రభువు రాజ్యంలోనే ఇంత పొట్టనిండా రొట్టెలయినా దొరికేయమ్మా" అంటూ అమాయకులైన ముసలివాళ్లు పాతకాలపు స్మృతులు కళ్లల్లోకి కష్టసుఖాల బండరాళ్లను మోసుకొస్తున్నాయి.

జగదేవు తలలో ఈ విషయాల కన్నిటికీ తగినంత చోటు లేదు. ఎంతవరకూ, కార్యకాలాపాల్లో, డబ్బులు, పైళ్ల, సౌకర్యాలు, ఎలా ఎంతెంత కలిసి వస్తాయాయనే చింత ఒకటే. చేపట్టిన కార్యకలాపాలకు, తగిన ప్రామాణికత, ఎలా నిరూపించడాని కవుతుందనే విషయాన్ని, తెలివితేటలతో నిర్ణయిస్తాడు. పాఠశాల నిర్మించడం, పాఠశాల బడ్జెటులోంచి, ఊరిబావి త్రవ్వించడం అయిదు వందల రూపాయల్లో. అయినా పనివాళ్ల చేత సంతకాలు వేలరూపాయల మీద పెట్టిస్తాడు. పెట్టకపోతే పనికి

పెట్టుకోడు. కూలి వాళ్ళకు కూలి, ఎక్కువని, తక్కువనీ ఆలోచించకుండా, సంతకం పెట్టడం కంటె గత్యంతరం లేదు. రోడ్ల అభివృద్ధి మరమ్మతులంటూ, ఆ పనులన్నింటినీ, తాను సర్పంచ్‌నంటూ, తన మిత్రబృందం పేరిట గుత్తకు తీసుకోవడం, ప్లాను ప్రకారం, ఖర్చులో మార్పులు చేర్పులు, కోతలూ, తగ్గింపులూ చేసి, డబ్బులు మిగుల్చుకోవడం. ఇవన్నీ అయిన తర్వాత, పనులు సగంలోఆగిపోయినా, చీమ కుట్టినంత చింత లేకపోవడం, రికవరీకి వస్తే ముందే నాయకుల్ని తనవైపు పెట్టుకుని, జబర్దస్తీ చూపించి, ఒడ్డునపడడం. అధికారులు మరీ నోరుపారేసుకుంటుంటే, తిండి తీర్థాలు బాగా పెట్టి పత్రం పుష్పం సమర్పించుకొని వాళ్లనోళ్లు మూయడానికి ముందే ఏర్పాట్లు చేయడం, ఇలా అంతా నిర్వహించుకుంటున్నాడు.

కొన్ని రోజుల తర్వాత, జగదేవుని మిత్రులు కొందరు, తలవని తలంపుగా, గ్రామంలోని స్మశాన భూమిని, నాగళ్లతో దున్నడం ప్రారంభించారు. రెండెకరాల స్మశానభూమిలో అరటితోట పెంచడానికి, ప్లాను తయారుచేశారు. జనదేవు, గ్రామ పంచాయితీకి కూడా సొంతంగా బోధపరిచాడు దాన్ని గురించి. వ్రాసి చూపించాడు. జనులు మొదట్లో నవ్వుకున్నారు. తర్వాత చిర్రుబుర్రులాడారు. జనం పెట్టిన సంతకాల మహాజారు చింపేశాడు. కరణం, పన్నులు వసూలు చేసే గుమాస్తా, వీళ్ల చేత రిపోర్టు రాయించి తీసుకున్నాడు, చాలా జాగ్రత్తగా. కాని ఏన్నో ఏళ్ళనుంచి స్మశాన భూమిగా పరిగణింపబడే చోటు, నిర్ణయించి పారేశారు. జనం మరీ ఉడికిపోయారు. శవాలిక ముందు, ఎక్కడ పాతిపెట్టాలి? స్మశానం చోటును మార్చడానికి వీల్లేదు. ఈ మార్పిడి అసలెందుకు చేస్తున్నాట్లు? కొంతమంది, మళ్లీ ఔరంగాబాదు వెళ్లివచ్చారు. తాసీల్దారు, కొంతమంది బైట ఊళ్లలోని నాయకులు, విచారణ కోసరం, ప్రత్యేకించి వచ్చిన డిప్యూటీ కలెక్టరు అఫ్జల్ షూర్కార్ సాబు, గ్రామంలోని జన సముదాయం, వీళ్లంతా స్మశాన రంగస్థలంపై గుమికూడారు. అఫ్జల్ షూర్కార్ సాబు విచారించడం మొదలెపెట్టాడు–

"మీరందరూ నిలబడింది స్మశానభూమిపైనేనా?"

"అవునండీ!" అంటూ అయిదారుగురు కేక పెట్టారు.

"కాదండీ!" అంటూ మరో అయిదారుగురు అటిచారు.

"మొట్టమొదట, శ్రద్ధగా వినండి. మీ గ్రామం సర్పంచ్‌గారు ఇది స్మశానం కాదని అంటున్నారు. పన్నుల గుమాస్తా కరణమూ అల్లాగే రాసి ఇచ్చారు."

గ్రామంలోని జనులందరు మళ్లీ నోళ్లు మూసుకొని వుండిపోయారు. వెంటనే, గడుగ్గాయి గట్టిమొండం, రామోపాటీలు, చెప్పాడు-

"సాబ్! మేమేదైన కొంచెం హెచ్చు తగ్గులుగా మాట్లాడితే కోపగించుకోకండి. మీరే మాకు తల్లిదండ్రులు సర్కార్! నేను చెబుతాను సాబు! ఇది స్మశానమే. ఏళ్ల తరబడిగా వస్తున్న లెక్క కాగితాలున్నాయి. జగదేవు, నేటికి ఈ ఊరికి సర్పంచ్ అయినంతమాత్రాన ఏమయింది? ఆయనకు నాకంటె ఏమిటి ఎక్కువ తెలుసు? ఈ గ్రామం గురించి గాని, దీని పొలిమేరల గురించి కాని. ఇక్కడకీయన వచ్చి అయిదారు సంవత్సరాలు కూడా కాలేదు. అందుకే ఇది స్మశానం కాదని చెబుతున్నాడు. ఆయన మిగతావేమి చేస్తున్నా మేమెప్పుడైనా అడ్డు చెప్పామా? ఎప్పుడైనా ఫిర్యాదు చేశామా? దీనివల్ల ఆయన మనలనందరినీ బుద్ధిలేని గాడిదల కింద జమకట్టి స్మశానంలో దుక్కిదున్నుతున్నాడు. రేపటి రోజు మేముండే ఇళ్ళు కూడా ఇళ్లు కావు, చెఱువులని చెప్పేస్తే అప్పుడుకూడా దొరలు, కేవలం, కాగితాలు పత్రాలు చూడడం, అంతేనని నిర్ణయించడం జరగవచ్చు. గ్రామంలో ఇంకెక్కడ సేద్యానికి పొలం దొరక్కపోయిందా! బీడుపడివున్న నేలెంతో! ఏం చెప్పను? అక్కడ పండించుకోండి చావండి" అంటున్నాము.

సాబ్! ఈ కంఠంలో తులసీమాల వుంది. గడిచిన ఆషాఢ మాసంలో, పండరిపురం 'వారీ' వెళ్లినప్పుడు దీన్ని తీసుకొన్నాను. దీని వెల నాలుగణాలే. కాని దీని మీద నాకెంతో భక్తి భావముంది. నా పది రూపాయల ఈ శాలువను మీరు చింపేయండి, నేను కాదనను. కాని కంఠంలోని ఈ తులసి మాలను తెంపితే, నేను వాడి తలకాయ పగులకొడుతాను. ఇక్కడి సమాచారం ఇట్లావుంది సాబ్! ఈ కాగితాల కట్టలన్నీ వట్టి బూటకాలు, నాటకాలు! ఓ గడియసేపు నేను ఇది స్మశానం కాదని అంగీకరిస్తాననుకోండి. మరి ఇక్కడ పోగుపడి వున్న గేనే సంచులూ, కట్టెల రాశి ఇంతగా పెరిగి ఎట్లా పోయినాయి? ఈ మంటపెట్టిన బూడిద దిబ్బలు మీకు కనబడడంలేదా? అదీ పోనివ్వండి స్మశానాన్ని తవ్వుతాను పదునిహేను రోజులైంది పక్కింటి తోటమాలి నెల్లావాణ్ణి ఇక్కడ పాతేసి వెళ్లిగించి చూపిస్తాను. గోతిలోంచి

'వారీ'- మహారాష్ట్రంలో భక్తుల్లో 'వార్కరీ' సంప్రదాయం వుంది. ఆ సంప్రదాయం వాళ్లు ప్రతి యేటా ఉత్సవ యాత్రలు చేసుకుంటూ ఆషాడ మాసంలోనూ, కార్తిక మాసంలోనూ పండరి యాత్ర చేసి పాండు రంగ విఠల్ దేవుని సేవిస్తారు.

ఎముకలు బైటపడితే చాలు, వీళ్లందరినీ ఆ గోతిలోనే, ఒక్కొక్కరినీ పాతిపెడుతాను. ఏం కుట్రలు పన్నుతారో గ్రామాన్ని ఎటువంటి సుడిగుండాల్లో ముంచుతూ వుంటారో చెప్పడానికి వీల్లేదండి కాని పరమేశ్వరుడి కళ్లున్నాయి. సాబ్! కలెక్టరు సాబు మధ్యలోనే పెద్దాయాన్ని ఆపేసాడు మాట్లాడకుండా!

"బాబా! మీరు చెప్పింది వూటికి నూరు పాళ్లు నిజమే. ఇంతగా బాధపడకండి. ఈ గ్రామంలో వున్న జనం ఏం చేస్తూవుంటారో, నాకు బొత్తిగా తెలియడంలేదు. పనిపాటలూ, వదిలేసి ఏహో కొత్తకొత్త వేషాలు వేస్తూ వుంటారు. ఏదైనా కొంచెం తేడా వస్తే చాలు, పెద్ద తగాదా పెట్టుకుని కూచుంటారు. అది అలా ఉంచండి. నేను మీకేమీ వేదాంతం చెప్పక్కర్లేదు. మీరే నాకు చెప్పగలరు. నాకిప్పుడు కావాలిసింది మీ ఈ స్టేటుమెంటు ఈ కాగితం మీద మీ సంతకం. అంతే. మీ భక్తిభావన, ఈ విషయాన్ని గురించిన మీ ఆందోళన, మీ హృదయసంవేదన, నేను అర్థం చేసుకో గలను. ఇది మీ స్మశానభూమి గానే వుండిపోతుంది. ఎవడూ ఇహమీద ఇందులో వేలుపెట్టడానికి వీల్లేదు. ఇక్కడే సంతకం పెట్టండి. నేను వెళ్లివస్తాను.

ప్రేతకళ వేలాడుతూవున్న మొహాలతో, ఆ మనుషుల గుంపు ఎక్కడివాళ్లక్కడ వెళ్లిపోయారు. రాహోపాటీలంటే, ఏమిటో జగదేవుకు బాగా అర్థమైంది. ఆయన స్మశానం వైపు వస్తున్నాడని కనిపెట్టి ఏదో సాకు పెట్టుకుని, అతను వెళ్లిపోతాడు. రాహో పాటీలు తలకాయ ఎగర కొట్టేస్తామంటూ కొన్నాళ్లపాటు ప్రగల్భాలు కొట్టారు. ఆ తర్వాత చాలా రోజులు గడిచిపోయాయి.

3

భాగవత్ రాఘోపాటిలు ఒక్కగాని ఒక్కకొడుకు. చక్కని, నిగనిగలాడే సుకుమార జీవి. తండ్రి పసు అయిపోయిందని, వ్యవసాయం చూస్తూ వుండడానికి భాగవత్‌ని ఇంటి దగ్గరే అట్టే పెట్టేశారు. అతనికి మరి సేద్యమంటే ఇంతా అంత వెర్రి కాదు. పొద్దస్తమానమూ వ్యవసాయం గొడవలోనే మునిగి తేలుతూ వుంటాడు. ఊళ్ళో ఏ కుట్రలోనూ. తాను ఏ పక్షానికి ఒత్తాసుగా వెళ్ళడు. గ్రామం శివారులో విశాలమైన పొలం ఒకటి ఉంది. దానిలో కొత్తరకం పంటలు పండించడమే అతని పని. అక్కడ కొత్తగా దిగుడు బావి తీయించాడు. ఊరికి దగ్గిరగానే ఉన్న తెల్లి చవిటి భూమిలోకూడా దిగుడు బావి ఒకటి తీయించాడు. రెండూ నీటిని బాగా సప్లై చేస్తున్నాయి. ఆ పొలంలో అరటి, బత్తాయి, చెఱకు, మొదలైన తోటలు పెంచడం ప్రారంభించాడు. 'భాగవత్' వ్యవసాయం పనికై ప్రాణాలు ధార పోస్తున్నాడు. రాత్రింబవళ్లు వ్యవసాయంతోనే సతమతమవుతూ వుంటాడు. పొలం కంకులు తొడిగి పాలుపట్టినా, తోటల్ని పూతకు తిరిగినా అతనికి మహా సంతోషం. మనస్సుకు తట్టితే ఇంటికి వెళ్లడమేగానీ లేకపోతే, రాత్రిపూటకూడా పొలంలోనే వుండిపోతాడు. మొదట్లో, ఈ మీసాలురాని పోరగాడు వీడు చేయించే యెగసాయం ఏమంత నిర్వాకం కాబోతోంది అని వెటకారం చేసినవాళ్లే ఇప్పుడు ముక్కుమీద వేలేసుకుని ఆశ్చర్య ముగ్ధురాలవుతున్నారు. వాళ్ల హయాం, అంతా వ్యవసాయంలోనే గడిచిపోయింది, రాత్రింబగళ్లు వ్యవసాయానికి సంబంధించిన శాస్త్రజ్ఞానమే వల్లేసిన ఉద్దండపిండాలు, అటువంటి వాళ్లకు కూడా, 'భాగవత్' ఏడాదికింత పంట ఇంటికి తోలడం, ఎంత తన్నుకున్నా అర్థం కావడం లేదు. అతని పొలంపుట్ర, దొడ్డితోట చూద్దామని వెళ్లినవాళ్లు ఆశ్చర్యంతో, స్తంభీభూతులై పోతున్నారు. భాగవత్ నోరు విప్పితే అమృతపు జల్లే. నడవడిక కూడ అంత మధురమైందే. ఊళ్లోని కూలినాలి జనం, ఇతర జనాలు, అతనిముందు, నోరెత్తకుండా తోక ముడుచుకొని కూచుంటారు. అతని

దగ్గిరకు వచ్చిన వాళ్లకు, వాళ్లకిష్ట నిష్టూరాల్లో, చేతనైనంత సాయం చేస్తూ వుంటాడు. వాళ్ల సమస్యల్ని పరిష్కరిస్తూ వుంటాడు. అతని సంసర్గంలోకి వచ్చినవాళ్లు కుట్రలూ, కున్నాపాలూ, మానేసి సవ్యమైన మార్గంలో, వ్యవసాయం వృత్తిలో పాటుపడుతారు. దగ్గరగా వున్న తెల్ల చవిటి పొలంలో భాగవత్ ఉన్నాడంటే, లాల్జీ విఠోబా, రామ్‌లాల్ మొదలైన వాళ్లు అతని మిత్రమండలికి చెందినవాళ్లు తప్పకుండా ఉండి తీరుతారు. గ్రామంలోంచి ఒకళ్లిద్దరు, మెల్లిగా గప్పాలు కొట్టుకోవడానికి కూడా చేరుతూ వుంటారు.

"భాగవత్‌రావ్! కొంచెంసేపు గ్రామంవైపు వెళ్లదాంపద! పొలంపని ఓ దరికి చేరింది. ఏమీ ఆదుర్దా లేదు. అప్పుడప్పుడూ, కాస్త మధ్యమధ్యల, గ్రామంలో యాగారాలు కూడా ఓ కంట కనిపెట్టుతూ వుండు. ఎవడో గుడ్డివాడు గారడీ చేస్తున్నాడు. పద చూద్దాం." అన్నారు. అది నా పని కాదు చిన్నాన్నా? ఎవరి పనో వాళ్లచేత చేయించు నావంటి కొత్తగా పొలంపాటులో దిగిన వానికి, అగ్గికి మగ్గుతూ వుండడమే మంచిది. అందువల్ల లక్షలాభాలనుకో. ఇంతకీ మంచిచెడ్డల పంట మనకొంగులోనే పడుతుంది మరికొంత పొద్దు ఇక్కడే ఈ పనిలోనే వెళ్లబుచ్చుతా ఇంతేగా!" అంటూ వాళ్లు చెప్పిన సలహాను పాటించక నవ్వేశాడు. "నీకు ఏం చెప్పేది భాగవత్! నువ్వే అలా అంటే ఎలా నప్పుతుంది చెప్పు! ఊళ్లో సంగతులన్నీ అలా గాలికి వదిలేస్తే, చెప్పుతున్నాను విను. ఊరు తొందరలోనే మన్సూమసానం అయిపోతుంది. బొత్తిగా నాథుడంటూ లేకపోతే ఎట్లా? నేను చెప్పేది కాగితం మీద రాసిపెట్టుకో. ఊళ్లో మంచీ చెడ్డా దేనికీ పొత్తూపొందు అంటూ లేదు."

"మీరేగదా జగదేవ గురించీ, వాళ్లముఠాదొంగల గురించీ ఎప్పుడూ చెవిలో ఇల్లు గట్టుకొని చెబుతూ వుంటారు. నాకు తెలుస్తూనే వుంది. కాని మీరంతా పొర్తి శంఠాయలుగా వుండడం చూస్తే ఏం చెయ్యాలి? వాళ్లు వాళ్లకు తోచినపని చేస్తూ వుంటే, మీరు మాత్రం ఇలా, ఎందుకు గంగిరెద్దుల్లా, "నేను అంతే! అంతే! అంటూ తలలూపుతారు? అందుకే వాళ్లు వాళ్ల యిష్టం వచ్చినట్లు బండి నడుపుతున్నారు. సొసైటీకీ గ్రామపంచాయితీకి ఎన్నికలు జరిగేటప్పుడు మీరెందుకు బెల్లంకొట్టిన రాయిలా మూతులు బిగించుకొని కూచుంటారు? మీ అలుసు చూసుకొని వాళ్లు నెత్తికెక్కుతున్నారు. లాభం గడిస్తున్నారు." "పరిస్థితులు జనాన్ని అట్లా నోళ్లు మూయిస్తున్నాయి భాగవత్‌రావు! లేకపోతే వాళ్లను ఎవళ్లు లెక్కపెడతారు? పొలంపని గిట్టడం లేదు, పంటలు పండవు, దాంతో జనం వాళ్ల దగ్గిర అప్పులు తీసుకొని, నోళ్లు కట్టేసుకొంటున్నారు. మరిలేకపోతేనో..."

"పాండు చిన్నానా? నాకు ఇవేమి చెప్పకు. జగదేవు గురించీ సర్కారు(అధికార్ల) గురించీ, అంతగా గోలపెడతారు. పొలం ఈ రోజుల్లో పండక పోవడమంటూ ఏమి లేదు. ప్రభుత్వం ఇచ్చిన పైకంతో ఇల్లూ, వాకిలీ, కుటుంబం, పెళ్లిళ్ల పేరంటాలు, పొలంపాటు, అన్నీ చక్కగా సరిదిద్దుకోవచ్చు. నేనూ, కాస్తో కూస్తో పొలంపని నేర్చుకున్నా బాబూ! మనమంతా హైదరాబాద్ స్టేట్ శాసనం క్రింద ఉన్నాం కదూ! 1950 తర్వాత భూస్వాముల దగ్గిర నుంచి, ఎవరు పాలుకు, కౌలుకు పొలం తీసుకున్నారో, ఏడాది రెండేళ్లు మూడేళ్లు నాలుగేళ్లు, ఎంతకాలమైతే అంత కాలానికి- ఆ పొలం పాటుకైన కూలి, నాలి,-అంతా లెక్కచూసే ఆకులు ప్రకారం, ఆ పొలాన్ని వాళ్లకు అన్ని హక్కు భుక్తాలతో అప్పగించింది ప్రభుత్వం. నిజానికి ఊరికే ఉచితంగా వచ్చినట్లే వాళ్లకు. 8000 రూపాయలు చేసే భూమి 800 రూపాయలకు వచ్చినట్లయింది. పొలంపని చేసే కూలివాడు రైతుబిడ్డ అయ్యాడు. భూస్వాముల పొలం తగ్గించి బీదలకు పంచిపెట్టిందంటే ప్రభుత్వం చేసిన తప్పేమిటి ఇందులో. ఆ పొలం మీద ఆ రైతులకు ఎద్దులు మొదలైన వాటికొనుగోలుకై తకావి ఋణం ఇచ్చారు, దిగుడుబావులు తీసుకోవడానికి పదివేల రూపాయల చొప్పున ఒక్కొక్కరికీ గ్రాంటు ఇచ్చారు. ఇంజన్లు ఇచ్చారు. ఖర్చుకోసం సొసైటి డబ్బు లోంచి, ఎంత కావాలంటే అంత ఇచ్చారు. వేలాది ఉపాయాలు కలగజేసారు. వాటిల్లోంచి ఎంత డబ్బు మన గ్రామంలో వుండే రైతులు, ఆయా పద్దుల క్రింద ఖర్చు పెట్టారు? తాగుడూ, తందనాలూ, ముండలూ, ములకలూ, కుట్రలూ, కున్నాపాలూ, కొట్లాటలూ, పోట్లాటలూ, సోమరిపోతుతనం, విలాసాలూ, వినోదాలూ, వీటికిందే మొత్తం తగలబెట్టేశారు. మన ఊళ్లో సగంమందికి పైగా ఉమ్మడి భూమి కలిపేసుకున్నారు. ఉట్టుడియంగా అప్పు దొరికింది. నిజానికి ఇందులో గమ్మత్తేమిటంటే, వీళ్లంతా ఒకప్పుడు పొలంపాటు చేసుకొని బ్రతికిన వాళ్లే. ఒకటి రెండు సంవత్సరాలు కష్టపడ్డారో లేదో, తమకే తెలియకుండా చట్టమంటూ వచ్చి ఉట్టిపున్నాకి వీళ్ల ఒడిలో పొలం వచ్చి పడింది. అంచేత కాయకష్టం చెయ్యాల్సిన పని లేదు. ఈ పొలం వాళ్లకు 'పిత్రార్జితమూ' కాదు. అంచేత వాళ్లు దొరికిన అప్పు దొరికినట్లు పప్పుకూడు చేసుకొని తినేశారు. అందులోనూ, ఎనిమిది పదివేలు మించి అప్పు దొరికింది. పొలం పని ఎక్కడ ఉన్నావే 'కంబళీ' అంటే వేసిన చోటే ఉన్నా 'గొంగళీ' అంది. ఇవ్వాళ ప్రభుత్వం ఋణం తీర్చడమెలాగా అని గానీ, దీన్ని అమ్మవలసి వస్తుందేమోనని గాని వాళ్లకు చింతాకంత చింతైనా లేదు. వాళ్లకా భూమి

మీద మమకారం ఉంటేనా? మనం ఇంత దాకా వ్యవసాయ కూలీలమే. ఇప్పుడు మళ్లీ అదే చేస్తాము అవసరమైతే. ఈ పది పదిహేను సంవత్సరాలు నిర్విచారంగా గడిచిపోయాయి. అదే మన అదృష్టం! ముందు నుంచీ, పెద్దమ్మోరు అంటే మనకు తెలిసిన విషయమే. ఇదీ వాళ్ల భావన. అప్పు తీసుకోవడం కోసమే, ఎంతసేపూ వీళ్ల తహతహ. పొలం గురించి అటువంటి వాడేమీ తపన పడతాడు? మొన్న ఇద్దరు ముగ్గురిక్కడికి వచ్చారు. బాంకు నోటీసు గొడవ చూపించడానికి."

"చాలా మందికి నోటీసులు జారీ అయ్యాయి భాగవత్ భాయీ! ఇహ పొలంలోంచి, ఇండ్లల్లోంచి, సామ్మూసామానూ, పాడిపంటా, అంతా జప్తు చేస్తారని వినికిడి. జగదేవు జనానికి చెప్తున్నాడు. పొలం చేజారి పోకముందే-ఒకటి రెండు స్కీములు కొత్తవి అప్పులిచ్చేవి, అమలులోకి వచ్చాయి, వాటి మూలంగా అప్పు తీసుకొని,వీటిని చెల్లించండి; పొలంపోగొట్టు కోవడం కంటె మంచిది. ఎవరికీ చెప్పకండి; ఎప్పుడో ఓ రోజు ఈ మొత్తం బాకీలన్నీ ప్రభుత్వం, కొట్టిపారేస్తుంది. పంటలే పండందే! బొత్తిగా కఱవుకాలం అవడంలో నాలుగణాల పంట మాత్రమే వస్తోందని పంచనామా రాయించి, మూడునాలుగేళ్లు వరుసగా సర్కారుకు పంపించండి" అని.

"బొత్తిగా వెర్రిమొగాలు మన పాలపడ్డారు. ఈ బ్యాంకుఋణం ఎవడబ్బా చెల్లించేది లేదు. ఇల్లూవాకిలే, పొలం పుట్రా చివరికి అప్పుక్రింద జమకట్టు కోవాలిసి వస్తుంది. మీరందరూ దారి తప్పి సంచరిస్తున్నారు. నీకు చెబుతున్నా వినావా? నీకు చెడ్డగా అనిపించవచ్చు, కాని మన ఊళ్లో ఇంత పిచ్చి మొగంవాళ్లు, మరోడు చూద్దామన్నా లేడు. పొలం ఎట్లా వచ్చిందో, అట్టా పోనియ్యి అనే మహానుభావులెందరో! మనూళ్లో. పిల్లా జెల్లా, కళ్లముందు గిలాగిలా కొట్టుకొని చావనీ, దేశం పాతాళంలోకి కొట్టుకొని పోనీ, వీళ్లకు చీమ కుట్టినట్లుగా కూడా వుండదు. అటువంటి మహానుభావులు మన వూళ్లో వుంటుంటే, వాళ్లకేమిటి చెప్పగలం! వాళ్లకోసరం మనం ఏమిటి ముక్కుసూటిగా చెయ్యగలం? నువ్వే చెప్పు. తిని కూచుని నెత్తికి తద్దినం తెచ్చుకోవడం తప్ప మరేముంది? అంతకంటె మనపని, మనం చూసుకుంటే మంచిది."

"ఇంతకు పూర్వం, మేమంతా నిన్ను తీసిపారేశాం భాగవత్ చివరికి ఎట్లాగో అట్లాగా, దారి ఏర్పడక మానదు. ఊళ్లో చెడిపోతున్న వ్యవహారాలు కొంతవరకైనా సరైన మార్గానికి మళ్లించాలి. ఆ పనిక నీవే తగ్గవాడివి. బైటి ఊళ్లవాళ్లు మన ఊరి

మీద ఉమ్మేయ్యడానికి సిద్ధంగా ఉన్నప్పుడైనా, మనం కొంచెం బుద్ధి తెచ్చుకొని మసులుకోవాలి. ప్రపంచం అందరినీ వేయి కళ్లతో చూస్తూవుంటుంది.

"లాల్ జీ! మీ చింత నాకు తెలుసు. అల్లాకాక పోతే, మీ తబలా వాద్యానికి సంతోషించి, మిమ్మల్ని, మీ నేరాల్ని నాలుగైదు సార్లు క్షమించి వుండివుండను. నలుగురైదుగురు మనుష్యులు తప్ప, మిగతా వాళ్లెవరూ నాదగ్గరకు రానేరారు. మంచి విషయం చెప్పడానిక్కి వినడానిక్కి సరైన పరిస్థితి కాదు. వాళ్లు నన్నూ, నేను వాళ్లనూ మొదట సరిగ్గా అర్థం చేసుకొని వుండాలి. దానికి తగిన ఏర్పాటు మీరే చెయ్యాలి. నేను దారి చూపెడతాను. దానికి కారణం వేరు. లాల్జీ నీవు నన్ను చాలా దగ్గరగా ఎరుగున్నావు. అయినా ఎన్నడూ ఏ విషయం నీతో కూడా స్నేహితుడవయినా చెప్పుకోలేదు. ఇంటికి సంబంధించిన కష్టసుఖాలు ఇంకోళ్లతో మొఱపెట్టే మనిషిని కాదు. మనస్సులో క్షోభ ఇంతగా ఇవ్వాలనే అని కాదు. లోపలి మంట సహించుకొవడం కష్టం. ఇంటి సమస్యలలోనే వేగి పోయేవాడు ఊళ్లో వేలాది సమస్యల్నించి ఎలా బైటపడతాడు? నేను ఈ విషయం ఇదివరకెప్పుడూ ఎవరికీ చెప్ప లేదు. జనం ఎదురు మనల్నే చూసి నవ్వుకుంటారు. తన దుఃఖం తనే మింగేసుకోవాలి.

లాల్జీ! నీవు అర్థం చేసుకోలేవు. మనిషి ఈ రోజుల్లో లోపలొకటి, బైటొకటి! భాగవత్ కళ్ల వెంబడి అశ్రువాలు అమావాస్యనాటి చీకట్లులా క్రమ్ముకొని వచ్చాయి. లాల్జీ గాని రామలాల్ గాని ఎవరూ ఏమి మాట్లాడలేదు.

భాగవత్ దూరాన ఉన్న పొలంలో వుంటే ఇంట్లో ఏమిటో వెలితగానే వుంటుంది. దగ్గిరగా ఉన్న తెల్ల చవుటి పొలంలో ఉంటే, గంగ మధ్యమధ్యల కలుసుకోవడానికి వెళ్లుతూ వుంటుంది. కలుపు తీయడానికీ, పాటిడోకుడు పనికీ, మిష పెట్టుకొని, అప్పు డప్పుడులక్కడే మాటలాడుతూ వుండిపోతుంది మొగుడితో బాటు. ఇంట్లోని ఆడవాళ్ల కబుర్లు చెబుతూ వుండేది. భాగవత్, చెవులప్పగించి ఊరుకునేవాడు. ఏమీ అనేవాడు కాదు. పగలు గడిచిపోయేది. పెద్దవాళ్లు ఏమన్నా విని ఊరు కోవాలి. జనం వాళ్లను తప్పు పట్టరు. మనల్ని గురించే అనుకుంటారు. ఇట్లా ఎన్నోసార్లు జరగడం చూశాం. 'భాగవత్' గంగకు నచ్చచెప్పాడీ విధంగా. ఆపైన గంగ ఏమి మాట్లాడలేదు. కన్నీళ్లు కారుస్తూ కూచుంది. భాగవత్ విసిగిపోయాడు. అందుకే రాత్రిళ్లు కూడా భాగవత్ ఎప్పుడైనా ఇంటికి వెళ్లేవాడు. గంగకు కొంప కూలినెత్తిన పడుతున్నట్లుంది. అంతా సహించుకోవలసిందే. బైటికేమి కక్క గూడదు.

సంప్రదాయం కోసరం, మర్యాద కోసరం మగ్గిపోవాలిసిందే. లోకం పోకడని మన్నించాల్సిందే. అన్నిటినీ మించి పతిదేవుని మర్యాద కాపాడాలంటే వేరే మార్గం లేదు.

"ఇవ్వాళ ఏదో వింతగా కనబడుతున్నావు. జరీ అంచు సన్న చీర ధరించి పొలానికి వచ్చావ్. ఉప్పు, ఆవాలూ మంటేసి దిష్టి తేసెయ్యాల్సి వచ్చేటట్టుంది. కొంపదీసి ఇవ్వాళ శనివారం కాదు గదా?"

"నీ మాటలన్నీ ఎప్పుడూ వింతగానే ఉంటాయి. శనివారం అయితే జరీచీరకేం వచ్చింది! కట్టుకోగూడదని రాసిపెట్టారా? ముద్దూ ముచ్చటా ఏమి అక్కర్లేదా?"

"ఓసేయి! గంగా! కాస్త దగ్గిరగా రావే! ఎప్పుడూ సిగ్గులేనా ఎన్నాళ్లు పోయినా! పెళ్లి అయిపోయి రెండేళ్లు దాటిపోయింది ఇంకా ఏం సిగ్గులు. సిగ్గుల పరమాన్నం చాలా వడ్డించావ్. చాలు! నువ్వుకూడా గడుసుతనం చాలా నేర్చావ్."

"ఇందులో గడుసుతనం ఏముంది? కొంచెం దగ్గిరగా కూచోమన్నాను. అంతే-వెర్రిదానా!"

"ఇదిగో చూడు. ఇందుకే నేను తోటకి రాంది."

"ఏమైంది. ఇంత అడ్డం తిరుగుతోంది కథ! ఈ తోటలో ఇవాళ ఎవడూ మనిషంటూ లేడు. పై తోటలో పనిలో పడున్నారు."

"ఎవరూ లేకపోతే మాత్రం! మొగుడూ పెళ్లాం అయినా, వేళాపాళా చూసుకో అక్కర్లేదా?"

"మరిమొగుడితో కాస్తమాట కలిసిమెలిసి ఉండాలిగదూ! ఏమంటావ్!"

"నాకు ఇంటి దగ్గిర బోలెడు చాకిరీ వుంది."

దూరాలోచన గల పెళ్లానివి వువ్వింతైనా! నేను చెప్పింది ఒకటి నువ్వనుకొనేది ఇంకొకటి! రాత్రింబవళ్లు ఇల్లు కనిపెట్టుకొని వుండేదానివి. అబ్బో! నాకు తెలుసులే!

"చాలుచాలు.బలేవాడివి. నీకు బాగా తెలుసు-నీకు గనక కోపం వస్తే ఆపైన నేనేమి మాట్లాడనని."

"అయితే మరి పెద్ద మనిషితనం చూపిస్తున్నావే!"

"దొరా! అన్నది చాలు. ఆ పక్కకు పదండి కొంచెం..... జొన్న చేను చాటుకు నడు."

"బొంతలేనా?"

"తే, లేకపో. నన్నెందుకడుగుతావ్!

దిగుడుబావి ప్రక్కనుంచి గాజుల ధ్వని వినపడింది. గంగ గాబరాతో లేచింది. ఎట్లాగో వదిలించుకొని బైటపడింది. అత్తగారే వస్తున్నట్టుంది. ఇప్పుడు పరువు దక్కదు. బాగవత్ జొన్నచేను పక్కనే బొంత కప్పుకొని ఉర్రుపెడుతున్నట్లు పడుకొన్నాడు. దిగుడుబావి దగ్గిర 'జాయిబాయి' పిల్ల జయవంత కనబడింది. దాన్ని చూసిన తర్వాత గంగకు ప్రాణం లేచివచ్చింది. గాబరాతిన్న గంగ జయవంతతో ఏమిటేమిటో తలా తోకా లేకుండా మాట్లాడు తోంది. ఇద్దరూ ఇండ్లవైపు వెళ్లడానికి బయలుదేరారు. జయవంత దారి మధ్యలో గంగని నిలేసింది. పెద్దగా విరగబడి నవ్వడం మొదలుపెట్టింది.

"ఏం కథ నడిచిందేం?"

"గంగక్కా! కొంచెం, చీరచెంగు సర్గిగా కప్పు కో." గంగ బిత్తర పోయింది. జయవంత వీపు మీద పెద్దగా ఒక్క చఱపు చఱచింది. కళ్లు మిటకరించుకుంటూ, ఇద్దరూ పరుగులుదీస్తూ ఇండ్లకు పోయారు.

జయవంత, జాయిబాయీ వృద్ధ వేశ్య కూతురు. జాయిబాయీ భర్త పదిహేను ఇరవై యేళ్ల కిందట మరణించాడు. ఆమె ఆ ఒక్క కూతురిని పెట్టుకొని విధవరికం వెళ్లదీస్తోంది. ఇప్పుడు చాలా వయసైంది. నడవడానికే చాతకావడం లేదు. జయవంతకు సంబంధం చూసి పెళ్లి చేసింది. జయవంత దురదృష్టవంతురాలు. ఆమె మొగుడు, పెళ్లి అయిన ఏడాది రెండేళ్ల లోపలనే సంసారానికి స్వస్తి చెప్పి, ఇంట్లోంచి పరుగెత్తి చక్కాపోయాడు. దాంతో జయవంత మళ్లీ పుట్టింటికి వచ్చి, తల్లి దగ్గరే, వుండిపోయింది. జయవంత తల్లిదండ్రుల దగ్గిరనుంచీ, రాఘోపాటీలకు, వాళ్లకీ జీవికాజీవిక సంబంధం. జయవంత తండ్రి చనిపోయిన తర్వాత కూడా, రాఘోపాటీలు, ముసలిదాన్ని చేరదీసాడు. 'జయవంత' అదృష్టం ఏమీ బాగలేదు. ఊళ్లోవాళ్లు జాయిబాయికి చెబుతూ వుంటారు. దేవతలకు కూడ నీ కూతురి కిచ్చిన అందం బ్రహ్మదేవు డివ్వలేదు. దాని మొగుడు పారిపోతే పోయాడు. రెండో పెళ్లి చేసి ఎవడి మెడకైనా కట్టు. ముసలిది మా చెడ్డ కోపిష్ఠి. చెప్పినవాళ్లను తిట్టి పోసేది. 'జయవంత' తిరిగి ఎప్పటికైనా వచ్చి తీరుతాడు. అతను ఏడాది రెండేళ్లు పెళ్లితో సంసారం చేశాడు. అతను రాకుండా ఎన్నటికీ వుండడు. అతని పేరే ఎప్పుడూ స్మరిస్తూ కూచుంటుంది నా పిల్ల. అతని పేరు మీద కుంకుమబొట్టు పెట్టుకుంటుంది. మెడలో మంగళ సూత్రం అట్లాగే వుంది. నా ఒక్క కూతురు విధవరాలయింది. ముసలిది సతీ సావిత్రి, సీతమ్మోరు, మొదలైన వాళ్లను గురించి, పురాణాల్లో ఉన్న

విషయాలు అన్నీ చెబుతే వింటుంది; ఆ కథలే వింటూ వుంటూంది. కెనడీ పెళ్లాన్ని చచ్చేటట్టు తిడుతూ, పటపటా పళ్లు కొరుకి, పెటపెటా మెటికలు విరుస్తుంది.

ముసలిదాన్ని చుట్టాల్లో ఎవరో ఇద్దరు ముగ్గురు ఒసారి, జయవంతను పెళ్లి సంబంధానికిమ్మని అడగడానికి వచ్చారు. అప్పుడు వాళ్లు ముసలిదానికీ విషయం నూరిపోసారు. ఆమెకు సముజాయిస్తూ చెప్పారు. కాలం మారిపోతూవుంది. బాయీబాయీ! మేం మొన్ననే పత్రికలో చదివాం అమెరికా దేశం దొర. ఆయన పేరు కెన్నడీయనో, కెనడీ అనో వుంది. గాంధీ మహాత్ముడంత గొప్పవాడుట. పాపం గుండు దెబ్బతిని చచ్చిపోయాడు. ఆయన పెళ్లాం ఇప్పుడు రెండో పెళ్లి చేసుకుంది. నువ్వేమిటో ఇంకా పాతకాలం కబుర్లు చెబుతున్నావ్. పెళ్లి వయసులో వుంది. ఎప్పుడైనా కొంపదీసి హెచ్చు తగ్గులేమైనా వస్తే ఏ దేవుడితో మొఱపెట్టుకుంటావు చెప్పు? అంటూ. అప్పటినుంచీ, ముసలిది, కెనడీ పెళ్లాం పేర అష్టోత్తరం పూజ చేస్తూ వుంటుంది. ఆమెకు ఱంకుపోతు ముండ అని కుండ బద్దలుగొట్టి చెబుతుంది.

రాఘోపాటీలు తోటకు, ముసలిది పనీపాట మీద జయవంతను పంపుతూ వుంటుంది. ఆపాటి కూలినాలి మీద బ్రతుకు తెరువు చూసుకుంటుంది. తక్కువైతే పటేలును అడిగి తెచ్చుకుంటుంది. రెండో చోటికి వెళ్లడానికి వీల్లేదని జయవంతకు ముసలిదాని కట్టడి. దిగుడు బావి చెట్టు దగ్గిర దిబ్బ మీద భాగవత్ ఒకసారి కూచుని ఉన్నాడు. జయవంత ఆమాంతంగా పరుగెత్తుకుంటూ వచ్చి అతన్ని గట్టిగా వాటేసుకొని కూచుండి పోయింది. అతని గుండెలో గుండెదూరిపోతుందేమో అన్నట్లుగా వుంది. గుండెలు దడదడా కొట్టుకుంటాన్నాయి. ఇల్లా ఇదివరకెప్పుడు జరిగివుండలేదు. జయవంత ఎంత బిగ్గగా కౌగిలించుకుంది! భాగవత్ దిమ్మెరపోయాడు. అతను మాట్లాడబోయాడు. అతని నోరు గట్టిగా మూసేసింది. సైగలతో ప్రక్కవైపు చూపించింది. అదిచూసి, అప్పుడు భాగవత్ కొంత తెప్పరిల్లాడు. మళ్లీ కంపించి పోయాడు. అమెను కౌగిలించుకున్నాడు. నీళ్లకుండు దగ్గిరగానే పొలం మడి చాలు మైదానంలో అసలైన నాగుబాము-మగ, ఆడ-రెండూ. సంగమ కార్యంలో నిమగ్నమై ఉన్నాయి. గోధుమరంగుతో చాలా బలంగా ఉన్నాయి. వాటి ఒళ్లు కౌగిలింతలో బిగిసిపోయి చరచరా పైకి ఒక్కసారిగా తోకలమీద లేస్తున్నాయి. ఉద్రేకంతో రెండూ వణకి పోతున్నాయి. పరిసరాల్ని మఱచిపోయి ఉన్మత్తులైన నేత్రాలతో కష్టం మీద చూస్తున్నాయి. వాసనా భరితాలైన దృక్కులు-ఒళ్లంతా మెలికలు తిరిగి పోతున్నాయి. కాస్సేపు శాంతించాయి. తిరిగి మళ్లీ

అమాంతం కౌగలించుకొని పక్కపక్కలకు పోతున్నాయి. రెండూ మెల్లిమెల్లిగా, మడిచాలు అంచులంచుల పడిపోవడం మొదలుపెట్టాయి. అయినా జయవంత కౌగిలి వదల్లేదు. పట్టు సడలింపలేదు. ఒళ్లంతా చెమటలు పోసాయి. వక్షోజాల దడదడ, ఇంకా అట్లాగే వుంది. కొంచెం దూరంగా చేద్దామన్నా ఆమె జరిగేటట్లులేదు అవతలికి. అంతగా భయపడి పోయింది. పాపం! ఇప్పుడే కొంచెం మతి మతిలోకి వస్తున్నట్టుంది. రవికె చాటున స్తనబారాన్ని కప్పిపుచ్చుకోవడానికి చీరపైట సవరిస్తోంది. ఇంకా నోటి వెంట మాట రావడం లేదు.

"నువ్వు మహాగాబరాపడుతున్నావ్. జయవంతా! ఈ పాములు నాకు, ఇక్కడ పనిచేస్తూ వుండే చాలమంది మనుష్యులకూ ఎన్నో సార్లు ఈ తోటల్లో కనబడుతూనే వుంటాయి. కాని ఇంతవరకు ఎప్పుడూ ఎవరి జోలికి వచ్చిన పాపాన పోలేదు. ఆ! ఇవ్వాళనే వీటిని జంటగా ఒక్కచోట చేరడం! లోకులంటారు గదా! "అట్లా కలిసినప్పుడూ చూడడం చాలా మంచిదని -చూసిన వాళ్లకు ఎంతో అదృష్టం పడుతుందనీ. మంచి రోజులు వస్తే ఆ దాక్కొన్న ధనం బైటపడి మన చేతికి రావడమెంతసేపు! ఇహ నా కొక్కడికేమిటి మన ఇద్దరికీ కూడా మంచి భాగ్యం పట్టపోతోంది అనుకో! మంచి రోజులు గడపలోనే ఉన్నాయి. జయవంత బుగ్గలు మందహాసంతో గులాబి రంగులు చిమ్మయి వెంటనే రెండు దీర్ఘ నిశ్వాసాలు వదిలింది. భీతభీతంగా మళ్లీ భాగవత్ వైపు చూసింది. ఏమి మాట్లాడకుండా, పైట సవరించుకుంటూ గ్రామంవైపు నడక సాగించింది.

ఈ రోజు, ఊరిదగ్గిర తెల్లచవిటి తోపులో అంతగా ఏమి పని లేదు. ఇక్కడి వాళ్లందరినీ, మగవాళ్లనీ, ఆడవాళ్లనీ-దూరంగా ఉన్న పొలంలోకి పంపించేసారు. ఈ తోటలో అంతటా అంతా నిరామయంగా, నిశ్శబ్దంగా వుంది. జయవంత మధ్యాహ్నం సడీ చప్పుడు లేని సమయంలో, ఈ చవిటి తోపులోకి వెళ్లింది. ఒకే ఒక్కత్తె ఒంటరిగా. ఎట్లా వచ్చిందో, ఎప్పుడు వెళ్లిందో, భాగవత్ గమనించలా. చేతిలో ఓ డోకుడు పారగాని, ఓ కొడవలి గాని ఏమీ లేదు. తోటలో ఏమైనా పని ఉన్నా లేకపోయినా, వెళ్లేటప్పుడు చెప్పి వెళ్లటం అలవాటు. ఇవ్వాళ, ఒంటరిగా, మధ్యాహ్నంవేళ, ఎవరికీ చెప్పకుండా పెట్టకుండా ఎందుకు వెళ్లినట్లు? 'భాగవత్' ఉండబట్టలేకపోయాడు. అతనికి లోపల గుబగుబ ఎక్కువైంది. కొద్దిసేపట్లోనే, మెల్లిగా చప్పుడు లేకుండా అడుగు వేసుకుంటూ తోటలో ప్రవేశించాడు. దిగుడుబావి దగ్గిర దట్టంగా గుబురు కట్టివున్న చెఱకు తోటవైపుకు వెళ్లి వచ్చాడు. అతనికి జయవంత

కనిపించలేదు. అరటిచెట్టు పాదుకు పోసిన కట్ట దగ్గిరగా చెప్పులు మాత్రం పడి వుండడం చూసాడు. అది 'జయవంత' చెప్పుల జతే అయివుంటుంది. అరటి చెట్టు పాదులకు పోసిన కట్టల దగ్గిరగా ఉన్న దోవ నాధారం చేసుకొని 'జయవంత'అరటితోటలోకి వెళ్లి ఉంటుంది. ఆమె అడుగుజాడలు దోవలోని బురద మట్టిపైన కొట్టవచ్చినట్లు కనబడుతున్నాయి. ఆ అడుగుల వరుసను బట్టి భాగవత్ లోపలి లోపలికి వెళ్లాడు. జయవంత ఎన్నడూ, ఏ పాపాన, ఎవరివంక ఓరచూపులు చూసి ఎరగదు. తనతోనైనా, పాదబాటున గూడ అట్లా ప్రవర్తించి ఉండలేదు. ఇప్పుడెవడామెను పిలిపించాడో కనిపెట్టాలి. అతని కుతూహలం రెచ్చసాగింది. దొంగ అడుగులుపెట్టుకుంటూ 'భాగవత్', ఆమె బురద మట్టి మీద వేసిన అడుగు ముద్రలపైన అడుగులు వేసుకుంటూ, ముందుకు వెళ్లాడు. మధ్యలో నిలబడి పోయాడు. అరటి చెట్టు పెద్ద బోదను చాటు చేసుకొని, దాగి నిలబడి, చూడడం ప్రారంభించాడు.

జయవంత వక్షులంపైన, తలమీద, పైటగాని, ముసుగుగాని లేదు. కట్టుకున్న రంగుచీర విప్పి దూరంగా పడేసి వుంది. నగ్న శరీరం ఆపాద మస్తకం పచ్చగా అరుణకాంతులీనుతున్న తొడల కంపనం. అందమై కోమలమైన తొడలమీద రెండు మూడు వాతల గుర్తులు. నల్లగా ఉన్నాయి. నడుం సన్నగా ఉన్నచోట నల్లని నల్ల మొలనూలు. అందులో అమర్చబడిన తాయెత్తు నల్ల మొలనూలు మూలాన నడుం క్రింది మనోజ్ఞమై నిండుగా ఉన్న భాగం మరింత పసిడి మిసిమి కాంతులు చిమ్ముతోంది. అరటిస్తంభం ఆధారం చేసుకొని జయవంత అదోలా నిలబడివుంది. ఎడం చేతివేళ్లు తొడల మధ్యలోకి దూర్చి, క్రిందికి మీదికి పరుగెత్తిస్తూవుంది. మిగతా ఏ విధమైన పరిసర జ్ఞానమూ లేదు. తన ధోరణిలో తాను 'జయవంత' పరవశురాలై వుంది. చెమటతో తడిసిన కుంకుమ జారి బొట్లుబొట్లుగా పడడం ప్రారంభించింది. మెల్లిగా ఉయ్యాలలా ఊగులాడుతోంది మెడలో నల్లపూసల పేరు. దాని మధ్య మంగళసూత్రం. నిండిని బిడమైయున్న స్తనభారం! కిక్కిరిసి అవిక ముడిలో ఇముడటం లేదు. ఆమె చీరకట్టుకుంది 'భాగవత్' తన కళ్లను తానే నమ్మలేకుండా వున్నాడు. అతను తన వ్రేళ్లగోళ్లను అరటి బోదలో గట్టిగా గుచ్చేసాడు.

4

కార్తీక మాసం వస్తోందనగా రెండు నెలలముందు నుంచే, జనం వెర్రెత్తి పోతారు. అజంతా కొండల మీది సిద్ధేశ్వరస్వామి యాత్రకై జనం ఉవ్విళ్లూరి పోతూ వుంటారు. కార్తీక పూర్ణమికి చాల పెద్ద తిరునాళ్లు జరుగుతుంది. భజనలు, పల్లకీలు, నామసంకీర్తనలు, రథయాత్ర వీటికంటె, సినిమాల్లో, డాన్సుల్లో, తమాషాల్లో, జనానికి ఎక్కువ మోజు. వాళ్లు వీటిని మజామజాగా చూస్తారు. వేలకొలది రూపాయల కొనగోలు, విక్రయం, స్పెక్యులేషన్ వ్యాపారం సాగుతుంది. ఇంతపెద్ద తిరునాళ్లు చుట్టుప్రక్కల ఎక్కడా జరుగదు. దగ్గిర దాపుల్లో ఉన్న చుట్టు ప్రక్కల ఇరవై పాతిక గ్రామాల ప్రజలు, ఆ పదిహేను రోజుల్లో అక్కడ పరస్పరం కలుసుకుంటారు. పేరు సిద్ధేశ్వరునిది. కానీ అక్కడ పెద్దగా చెప్పుకోదగ్గ ఊరూ, ఉనికీ ఏమిలేదు. ప్రజలు ఎక్కడవాళ్లక్కడ ఆ నాలుగు రోజులు, స్థావరాలు ఏర్పఱచుకుంటారు. కొద్దిపాటి భావుకులూ, రసికులూ, కూడా వస్తూ వుంటారు. ఈ సంవత్సరం, ఎద్దుబళ్లు, మోటార్లు, గుర్రాల మందలా తిరునాళ్లకు వచ్చిపడ్డాయి. కాలినడకను వచ్చే ప్రజలు చీమల బారులా వచ్చి పడుతోంది. ఇంత తేనె తుట్టెలా పట్టిన తిరునాళ్లు ఈ మధ్య పది పన్నెండు సంవత్సరాల మధ్యకాలంలో వుండి వుండలేదు. మహాకొట్టి కోలాహలంగా వుంది. వర్తకులు రోజురోజుకూ, దుకాణాల్ని వస్తువులతో నింపేశారు. కానీ హోటళ్లను మినహాయిస్తే మరెక్కడా చెప్పుకోదగ్గ అమ్మకాలు జరుగుతున్నట్లు లేదు. రెండు మూడు రోజులకల్లా, ఇంతోటి, తిరునాళ్ల జాతరలోనూ, పల్లెపట్టులకంతటా, సంగీత కచ్చేరీల గురించి, 'తమాషాల'గురించీ, కోల్లాపురం మండలికి చెందిన 'గులాబ్' రాకను గురించీ, వార్తలు ప్రాకిపోయాయి. అప్పుడు తెలిసింది తిరునాళ్లలోని అసలు పసు పల్లె జనాలకు కూడా ప్రత్యేకించి పౌరాణికమైన సినిమాలు, దారాసింగు, వైజయంతీమాల, దిలీప్‌కుమార్-వీళ్లు అభినయించిన సినిమాలన్నీ ప్రదర్శించారు. అయితే అది రెండు

మూడు రోజుల్లో చప్పబడిపోయినాయి. డాన్సు గరల్స్‌తో కూడిన 'తమాషా'లు ప్రతియేడూ ఎంతో 'ధూంధాం'గా వుండేవి. అవి బందై పోయినాయి. ప్రజలకు ఆ నోటా ఆ నోటా పడి 'గులాబ్' ప్రశంస బాగా తలకెక్కింది గదూ! ఎంత జన సమ్మర్దం, కిక్కిరిసి వున్నా టిక్కెట్టు తీసుకొని గాయక బృందం నడిపే సంగీత కచ్చేరీలు వెళ్లి కనులవిందుగా వాళ్ల మొహాలు చూడడం ముఖ్యమైంది రోజూలాగానే ఇవ్వాళ చాలా జనం కిక్కిరిసి ఉన్నారు. ఛబూ సతార్కర్, లీలాజలగావ్‌కర్, గులాబ్‌కోల్హాపుర్‌కర్, ఈ మూడు గాయక బృందాలు రాత్రంతా నాట్య సంగీతాల కాలక్షేపంలో గడిపేస్తారు. రాత్రి 'గులాబ్' బృందం వాళ్ల వంతు చిట్టచివరికి పెట్టారు. కారణం–ఆ సమయంలో జనాలు తెర దింపేస్తే 'ధింగాణా' పాడుకుంటూ, గుంపులు గుంపులుగా వచ్చిపడతారు. తోపిడీ, గ్రుద్దులాటలు కుమ్ములాటలు, కేకలూ, బొబ్బరింతలూ, ఈలలు వేయడం, ఒకటేమిటి- గందరగోళమే గందరగోళం- అందుకనే మేనేజరు ఆ సమయం లో, మొత్తం థియేటరు తలుపులన్నీ తెరిచేస్తాడు. స్టేజి మీద తెర కొస్త జరిగిందంటే, హార్మోనియం మాస్టరు, తబలా వాయించేవాడి ప్రక్కనుంచి రెండు పిల్లి మొగ్గలు వేస్తే వినోద సమ్రాట్ సర్జేరావ్ హిందువులకు 'సలాం'గొట్టి ముసల్మానులకు 'రామ్ రామ్' చెప్పి, అందరినీ పెద్దపెట్టున నవ్వించి ఇలా చెప్పాడు: ఇప్పుడు మా రాణీ సాహిబా గులాబ్ కొల్హాపూర్కర్ తన ఇద్దరి దాసీలతో కూడ, మీ సేవ కోసం, రాబోతోంది. మీరందరూ, సగౌరవంగా ఆమెకు సలాం చెయ్యాలండోయ్!"

హార్మోనియం, తబలాలకు సలాంచేసి శుభారంభానికి ముందుగా గులాలు నాలుగు వైపులా చల్లిన వెంటనే, నట్టువరాండ్ర పాద ఘట్టనలతో మొత్తం స్టేజీ అంతా అదిరిపోయింది. నడుంగా నాట్యం చేసే కాలు నల్లగా ఉన్న 'నాగిని'ని జనం బ్యాటరీ లైటు వేసి పిలవడం మొదలుపెట్టారు.

"డబ్బు ఏమాత్రం?"

"నన్నుబలవంగీ మిర్చి అంటారు."

"పాట ఎటువంటివి కావాలి?"

"పచ్చిమిరపకాయలు కూరికూరి మరీ పడాలి!"

"నీ రూపాయలు పట్టుకో. చేతిలో నోట్లు తీసికో... నాకు చెయ్యి తగిలించకు..."

పక్కనుంచి ఇద్దరు నట్టువరాండ్రు జనం గందరగోళంలో డబ్బులూ, కాసులూ వసూలు చేసు కోవడం ప్రారంభిస్తారు. జనం చాలా గడుసువాళ్లు. అంతలోనే చెయ్యి పట్టుకొని నొక్కుతారు. వాళ్లు కేకలు పెడుతారు.

"అంత గోల యెందుకూ! ఈ కాస్తకే! కావాలిస్తే ఓ ఐదు రూపాయలు తీసుకోండి"

"కాని ఈ పైసలన్నీ ఎల్లా పట్టుకోవాలి. పన్న చీర కొంగున ముడి వేసారు. అంతే."

"గులాబ్‌బాయీ! గులాబ్... 'గులాబ్'ని రమ్మనమనండి."

గులాబ్ ఒక్కత్తే సలామీ తబలా దెబ్బకు నాట్యం చేయడం మొదలుపెట్టింది. నాట్యం మీద తప్ప మరో దాని మీద ఆమె దృష్టి లేనేలేదు. ఆమెకు మరేమీ పట్టలేదు. తబలా వాడు వాయించడం నిలిపాడు. 'గులాబ్' పాదాలు కూడ, నిలిచిపోయాయి. ఆమె పాదాలకు చిరుమువ్వల వరుస చక్కగా తగిలించుకొన్నది. జనం ఇప్పుడు ఆమెను హాయిగా చూస్తున్నారు. ఎంత ఎతైన, నిండైన విగ్రహం! ఇంతోటి అందకత్తె నాట్యం చేయడం ఎన్నడూ చూసింది లేదు. వైజయంతీమాల, పద్మినీ అంటారే నాట్యానికి, అట్లా ఉందే! సినిమాలో లాగానే డిటోగా వుంది. ఉత్సవంలో ఉన్నప్పుడు 'పట్ట' పాట ఎంచక్కగా పాడాలి! 'ఏక్‌గావ్ బారా భానగుడీ(ఒక ఊరు పన్నెండు తంటాలు) అనే సినీమాలో నాట్యం చేసిన తార కంటె కూడా పెద్ద గొంతుతో పాడడం మొదలైంది. ఎంచక్కా ఒళ్లు విరుస్తూ కళ్లు త్రిప్పుతూ .... ఆడుతోంది-

"ఐదు రూపాయలు-ఏం?"

"ఏమిటి?"

"గులాబ్‌బాయి, పదహారేళ్ల పిల్లలా వుంది."

"పైసలు పట్టుకో. నీ బాణం గురితప్పదంతే. 'తేరా తీర్ ఓ బేదీర్ దీల్‌కీ' నీ చూపుతూపులు!అబ్బా గుండెల్లో తీపులు!"

పాటలు పాడాలి. అసలు సంగతి అది. షాహూ పాటీలు బరాడీకర్, టోపి కోటు ధరించి.....

"నీ నూరు రూపాయలివిగో. మా పేరు చెప్పు నీవు నక్కను తొక్కి వచ్చావ్..." జనం మత్తెక్కి ఉన్నారు. గొల్లున గోల. రెండు చేతులా, ఒకడు డబ్బు వసూలు చేసి పెట్టె దగ్గర పోగుపెట్టుతున్నాడు. హాస్యగాడు మొగ్గలేస్తూ అప్పుడప్పుడూ

గమ్మత్తు చేస్తున్నాడు. ఈలలు, మోగిపోతున్నాయి. కేకలు, బొబ్బలు చెవులు చిల్లులు పడుతున్నాయి- 'గులాబ్'! చేతితో, అందరినీ నిశ్శబ్దంగా ఉండమని చెబుతోంది. "నేను మొదట ఒక 'లావణీ' పాడుతాను. ఆ తర్వాత మీరు కోరిన పాటలకు అభినయిస్తా." అంది. తబలా మీద ఒక దెబ్బపడిందో లేదో, పాదాలు నాట్యంతో కరిపించి పోతున్నాయి.

"ఎడదలోతుల దాచి
కొంటిని ఎంతగానో!
ఇంత దనుక నా రాజా!
దాచిపెట్టితి వలపు 'పట్టు॥ఎడద॥
రంగురంగుల పైఠిణీ
జరీ అంచుల రేవిణీ
నామనసాయె వికావికి॥ఎడద॥
పంచుకొన్నవి లక్ష కళ్లు-
గ్రుచ్చుకొన్నవి ఈత ముళ్లు
ఒళ్లంతా, పాటల ఈ జల్లు
అడుగుపడదు నా రాజా!
గులాలు దూళి ఎగిరింది
అందులో స్నానమాడింది
దుమ్ము దుమారం రేగింది
మృదులమైనదీ కొమ్మ
కడవలంతలో! గుమ్మ
ఇరుకున పడింది సుమ్మ
ఈ రవిక పో పొమ్మ॥ఎడద॥
చాలు, సభలో నీవు చూస్తే
నయనాలు నీవు విరిస్తే
మేఘమల్లారె ఆలపిస్తే
ఏం చెప్పనురా జా॥ఎడద॥"

తబలావాడు ఒక్కసారిగా ఆపేశాడు. వాడిమీద గులాబ్ విరుచుకుపడ్డది. "వన్స్‌మోర్!వన్స్‌మోర్" అంటూ వన్సుమోర్‌లు కొట్టారు. బ్యాటరీ లైట్లు వేశారు. ఈలలు కొట్టారు. ఒకటేమిటి! ఒకటే గందరగోళం!

"వహ్వారే!" గులాబ్ బాయి- నీకు సాటి లేరు పో!

తిరిగి గొల్లుమని గోల.

"పంచుకొన్నవి లక్ష కండ్లు... ఒళ్లంతా... వాహ్వా!"

డేరాకు ఆమూల నుంచిబేటరీల లైటు పెద్దపెట్టున 'గులాబ్' ముఖంమీద పడుతోంది. ఎడతెరిపిలేకుండా.

"నేను రాను. ఇక్కడి ఈ జనాలు పొర్తి వాగుడు పిట్టలు! ఏదేదో మాట్లాడుతారు!"

"అయితే డ్యాన్సు ఎల్లా చేస్తున్నావ్!"

జనాల గలభా తప్పించుకుని వెళ్లిన డ్యాన్సుగరల్స్'గులాబ్' దగ్గరకు వచ్చారు. నూరు రూపాయల పచ్చనోటు పట్టుకొని మరీ చెప్పారు. "ఆ చివరి మూల కూచున్న పెద్దమనుషులు:- ఒకాయన లాల్జీ, మరో ఆయన భాగవత్‌రావు అంట! వాళ్లు ఈ నోటిచ్చి పురమాయించారు" పాటలు వద్దు. దీపం సెమ్మె ముందు నాట్యం మాత్రం చెయ్యి. అక్కడికి రమ్మంటున్నారు వాళ్లు.

"నేను అక్కడికి ససేమిరా వెళ్లను గులాబ్

"మనం వెళ్లకపోతే కథ ఎట్లా నడుస్తుంది. నూరు రూపాయల నోటు దొరుకుతుంటే!"

"నేను మేనేజరుని వెళ్లి అడుగుతా. ఎవరు వీరని. నేను వస్తున్నా. నా వెంట పద" సర్జేరావు.

"వాళ్లు ఏమిటంటారు" గులాబ్.

"పాట వద్దు నిన్న రాత్రి చిట్టచివరికి నాగస్వరం మీద నాట్యం చేసావే, `అట్లా చెయ్యాలి."లాల్జీ.

గులాబ్ ఆశ్చర్యంగా వాళ్ల ఇద్దరివైపు చూస్తూ నిలబడిపోయింది. వీళ్లు నిజంగా పోకిరీ మూకకు సంబంధించిన వాళ్లు కారు. ఆ పిచ్చి వాళ్లు వేరు. వీళ్లు వేరు. పాట లేకుండా కేవలం నాట్యం చెయ్యమని అడిగేవాళ్లు ఈ తిరునాళ్లలో నాకెవరూ తటస్థపడ లేదింతవరకూ. రాత్రి చివరికి పొర్తి నాట్యం చేశానంటే అది నాకు నేనుగా చేసిందే. ఒకళ్లు చెప్పిందాని మీద గాదు. వీళ్లు దాన్ని ఇంతగా మెచ్చుకుంటున్నారు! తిరునాళ్లకు వచ్చిన ఈ లాకలూకాయిగాళ్లల్లో కూడా యింతోటి రసికత వుందే! డాన్సు చేసేవాళ్లను కూడా వీళ్లు మర్యాద యిచ్చి పిలుస్తున్నారు! వాళ్లను తిరిగి అక్కడే చూస్తున్నాం. నిన్న మధ్యాహ్నం చాలాసేపు మా డేరా ముందు తబలావాడితో

ఈ ఇద్దరే మాట్లాడుతున్నారు. వీళ్ల ఇక్కడి వాళ్లు కాక పోవచ్చు.

"కావలంటే మరో నూరు రూపాయలు తీసుకోండి అంతేగాని 'లేదు, కాదు' అని మాత్రం చెప్పకండేం!"

"లాల్జీ రాచఠీవి కల బంగారు కాంతులీను దేహం వైపు చూస్తూ నిలబడిపోయింది. ఇంత ఆదరంగా, ప్రేమగా మాట్లాడే ఈ విలువరి ఎవరు చెప్మా?"

"డబ్బు సంగతి వదిలివేయి. నేను అడ్డుచెప్పడానికి కారణం వేరు. తబలావాడు నేను ఆడినంతసేపూ ఏకధాటిగా వాయించడంలేదు. వాడి చేతులు వణికి పోతూ వుటాయి..." గులాబ్.

"మేం మరో మనిషిని,తబలా వాయించడానికి పెడతాం. మీకు అప్పుడు వీలవుతుందిగా!"భాగవత్.

"రక్తిగట్టదు. నాకు మా ఊరి తబలావాడు కావాలి. నాకు వాయించే వాడు జబ్బు పడ్డాడు. ఓ నెల రోజుల నుంచి..." గులాబ్.

"గులాబ్ భాయీ! నువ్వు 'సరే' అను. మా తబలా వాడు బాగా చెయ్యి తిరిగిన ఘటం"భాగవత్.

"ఎక్కడ ఉన్నాడు? నాకు టైం లేదు... జనం అక్కడ గోల పెట్టేస్తున్నారు." గులాబ్.

"ఈయనే. ఈయన పేరు లాల్జీ. తబలా, హార్మోనీ, సారంగి- ఏదైనా వాయించును." భాగవత్. గులాబ్ ఒక్కసారిగా ఖంగుతిని లాల్జీవైపు చూడ సాగింది.

"భాగవత్! ఏమైనా చెప్పు. నేను వింటా. ఇక్కడ వాయించమని మాత్రం అడగకు. నీకు పుణ్యముంటుంది"- లాల్జీ.

"ఏం"- భాగవత్.

"జనం ఏమంటారు? ఇంతోటి పెద్దమనిషి, జమీందారీపాయవాడు, తిరునాళ్లల్లో తబలా వాయించాడు" అని తక్కువ చూపు చూస్తారు. అదీ గాక మన వాద్యం ఇక్కడ రక్తి గట్టదు" లాల్జీ.

"ఏమిటి అట్లా మాటలాడుతావు, తెలివి తక్కువ వాడిలాగా. ఇంత గొప్ప నాట్యకత్తె ఎదుట ఉండగా, నీకు వాయించడం రాదంటావా? బలే బాగుంది! లే పద!"-భాగవత్.

"వద్దుబాబూ భాగవత్"-లాల్జీ.

"లేవయ్యా!లే! నామీద ఒట్టు!" భాగవత్ మరి ఇద్దరు ముగ్గురు మనుషులు కలిసి

అతన్ని లేవదీసి నిలబెట్టారు. గులాబ్ వెంటవెంట, లాల్జీ స్టేజిమీదకు వెళ్లాడు. తబలావాడిచోటు ఆక్రమించాడు. తబలా అంచులమీద సన్నని సుత్తి తీసుకొని కొంచెం మెల్లిగా కొట్టి చూసాడు. దాని బైటముక్క ఒక్క పెట్టువేసి చూశాడు. తబలా అక్కడ అక్కడ వ్రేళ్లతో వాయించి పరీక్షించాడు. లాల్జీ మూలంగా జనంలో ఒకటే గందరగోళం రేగింది. మళ్లీ కేకలూ, బొబ్బలూ, ఈలలు, పాటపాడమని అరుపులు. నోట్లకట్టల ప్రదర్శనం.

గులాబ్ లాల్జీ వైఖరి గమనించింది. అతని వ్రేళ్లు తబలా మీద లయబద్ధంగా నాట్యం చేస్తున్నాయి. పాదనూపురధ్వని పదచాలనం తోబాటు లాల్జీ ఆవేశం పెరిగిపోయేది. లాల్జీ ఒళ్లుమఱచి తన్మయత్వంతో, ఊగిపోతూ, శిరఃకంపనం చేస్తూ వాయించ సాగాడు. ఇంత దాకా ఒకటే గోల చేసే జనం, పరవశించి పోయారు. ఒకసారి లాల్జీవైపు, మరోసారి గులాబ్ వైపు వాళ్లు రెప్పవాల్చకుండా, ఆమోదముద్రతో చూసేవాళ్లు వెదురుబెత్తంలా, తీగెలా, ఎటుపడితే అటువంగి, సాగిపోయే ఆమె మొదటి నడలు చూసి జిగ్గుమనేవాళ్లు. గులాబ్ గిరవాట్లు కొడుతూ నటించింది. పైపెచ్చు తాళం, ఎప్పటికప్పుడు మారుస్తూవుండేది. ఎన్నోసార్లు ఈ విధంగా మహావేచిగా నాట్యం చేసింది. అయితేనేం? లాల్జీ తబలా వాయించడంలో ఆరితేరిన చేయి. అతని వేళ్లు వేళ్లు కావు. సుతిమెత్తని నాజూకుతనానికి వాటికి పెట్టింది పేరు. తాళ లయబద్ధంగా ఆవర్తిస్తూ పరివర్తిస్తూ వున్న అతని వ్రేళ్ళ వేటులు, ఆమె నాట్యాన్ని చక్కగా అనుగమిస్తూ, అనునదిస్తున్నాయి. జనం సంతోషంతో వెర్రెత్తి పోతున్నారు. అదే సమయంలో మత్తు ఆమె స్పృహను మందుఱచింది కాబోలు, ఆమె ఎప్పుడా చిన్నిరంగస్థలం నుంచి, కాలుజారి పడిందో తెలియదు. సర్జేరావు, లాల్జీ, ఆమెను వెంటనే డేరాలోకి మోసుకెళ్ళారు. ఆమెకు చాలాసేపటిదాకా స్పృహరాలేదు. బైట టిక్కెట్ల కోసం గోలగోల. మేనేజరుతో జగడం, వాదులాట! కొట్టుకోవడం, గుద్దుకోవడం. ట్యూబ్‌లైట్లు బ్రద్దలు గొట్టడం! లాల్జీని తిట్టడం- గులాబ్‌ని శాపనార్థాలు పెట్టడం! బూతుల వర్షం కురిపించారు. తిరునాళ్లలోని జనం పోలీసుల్ని పిలిపించి, మెల్లి మెల్లిగా జనాల్ని తోలేశారు. గులాబ్ డేరాలో ఇద్దరో ముగ్గురో నాట్యకత్తెలు మిగిలారు. వాళ్లతో బాటు యజమాని మరి నలుగురు మనుష్యులూ. గ్రామంలోని పెద్ద మనుషులు, పదిమంది సానుతాపం చూపించడానికి నిలబడ్డారు. వాళ్లు యజమానికి, తిరునాళ్ల మేనేజరుకి, చేతులు జోడించి, నమస్కరించి తమ దారిని తాము వెళ్లారు. ఓ జాము సేపటికి, గులాబ్‌కి స్మృతి వచ్చింది. అప్పుడందరికీ

ప్రాణాలు లేచివచ్చాయి. ఎక్కడా పెద్ద దెబ్బ తగలలేదు, కొంచెం తలకాయ మాత్రం గీచుకుపోయింది. ఆ చోట పసుపు మెత్తారు. గులాబ్ రంగస్థలం మీదవుంటే ఒక్క రాత్రికి రెండు మూడువేల రూపాయలు రొక్కం వచ్చి వుండేది. ఆమె లేక పోవడంతో నాలుగువందలైనా పోగుపడలేదు. ఆమెకు ఎక్కడా పెద్దదెబ్బ తగలకపోవడం మేనేజరుకు సంతోషాన్ని కలగజేసింది. గులాబ్ మొహం కడుగుక్కొంది. చపల దృష్టితో భయంభయంగా నలువైపులా చూసింది. అందరూ ఇక్కడే నా డేరాలో ఎందుకు చేరారు? ఆమె మెల్లిగా ప్రపంచంలో పడింది. అక్కడి పరిసరాల్ని గమనించింది. మేనేజరు సాబుని మళ్లీ అడిగింది "మనం ఎక్కడ వున్నాం ఏమిటి?" అని. తబలావాడి మాట విని, ఊరికేనే నాట్యం చేసిందని మేనేజరుకు తనమీద కోపంగా వుంది. తబలావాడి పేరు చెప్పగానే ఆమె బుర్రలో మళ్లీ స్మృతులు రేకెత్తాయి. తబలావాడు వాయిస్తున్నాడు. తాను నాట్యం చేస్తోంది. ఆమె మనస్సు మళ్లీ చిందులు తొక్కడం ప్రారంభించింది. ఆమె మళ్లీ అడిగింది.

"తులసి ఎక్కడ?"

"వెళ్లిపోయాడట. నువ్వు కదలకుండా మెదలకుండా పడి వుండు." అంది ఓ నట్టువకత్తె.

"పిచ్చిగా మాట్లాడకు. అతన్ని ఎందుకు ఆపలేదు?"గులాబ్.

"ఆపేవారెవరు? అతని తబలావాద్యంతోనేగదా నీ ప్రాణలకెసరు తెచ్చింది. అంచేత ఎవరికీ చెప్పకుండా తానే పారిపోయాడు." మేనేజరు.

"గులాబాయీ! తబలా వాయించేవాడు గ్రామంలో ఎక్కడుండేదీ నాకు తెలుసు 'పిలిపించనా?" తిరునాళ్లకు చెందిన తులసి.

"నీకేమిటి తెలుసు? ముందుగానే పని పాడు చేసే అలవాటు. రాత్రి రెండు గంటలు కావస్తోంది. ఇప్పుడు వాడిని శోధించి, పట్టుకువచ్చి ఏం చేయాలి? ఏమంత పెద్ద గుంపు చేరింది గనుక ఉత్సవంలో..." సర్జైరావు.

"గులాబ్‌బాయీ! ఈ గొడవంతా ఇట్లా జరిగింది. జనం ఎవరికి వాళ్లు నలుముఖాలా చెదిరిపోయిన తర్వాత ఆ పక్కడేరా దగ్గిర ఆ తబలా వాయించేవాడు, మరోడూ ఉన్నారు అంతే. మామంచి గడియలు దాపురించాయి! కొంచెం ఉనికిలో, పాటలో, ఆటలలో, దరువులో ఎగుడుదిగుడులు వస్తే చాలు, ఊళ్లో ఉండడానికి చోటిచ్చిన వాళ్ల ప్రాణాలు కొటుకేసారున్నమాటే..." తబలావాడు.

"సరిలే, పొద్దున్నే కబురంపించి వెంటనే రప్పించు. నా పేరు చెప్పు. కష్టసుఖాలేవి

చెప్పుకోవద్దు. లేకపోతే ఓ పని చెయ్యి. ఇప్పుడే వెళ్లిరా. మీరంతా ఎందుకిలా కూచుంటారు? నాకేమీ కాలేదు. మీమీ డేరాలలోకి వెళ్లండి. నన్ను కాస్సేపు నిద్రపోనియ్యండి" గులాబ్.

"ఇవ్వాళ మొత్తం బేరం దివాలా తీసేసింది.." మేనేజరు.

"చేతులు జోడించి మొక్కుతున్నా! నన్ను ఇహ నిద్రపోనియ్యండి. మీకు ఎప్పుడు చూసినా, డబ్బుపిచ్చి తప్ప వేరే ఏమీలేదు. మనుషుల్ని అమ్ముకుని బ్రదుకుదామని చూస్తారు ఎంతసేపూ..." గులాబ్.

గులాబ్ విసుక్కోవడం, విసిరి కొట్టడం చూసి అందరూ మెల్లిగా జారుకున్నారు. ఒకే ఒక్క నట్టువరాలు మిగిలింది. ఆమె తలకాయకు దెబ్బ తగిలిన చోట, పసుపు మెత్తుతూ వుండిపోయింది.

"గులాబ్‌బాయీ! నీవింత మనస్సు హత్తుక పోయేటట్లు నాట్యం చేయడం నేనిది వరకెప్పుడూ చూసింది లేదు. ఇవాళ్ళ కళ్లున్నందుకు ఎంచక్కగా చూడగలిగాను!" నాట్యకర్త.

"నువ్వు పొర్తి వెర్రిబావులదానివి. నేనేమంత బాగా నాట్యం చేశాను. నీ తలకాయ! ఆ తబలా ఆయన లాల్జీ అని గావుల్ని అంటారాయన్ని, ఆయనకు కృతజ్ఞతలు చెప్పు. అవి మనిషి చేతులా లేక దేవుడివా! ఆ వ్రేళ్లల్లో అంత మత్తు నింపుకోవడం అతనికెలా సాధ్యమైందో నాకు తెలియడం లేదు. చాలా ఏళ్ల కిందట, నేనోసారి లక్నోలోని "ఆయినామహలు" లో నాట్యం చేశాను. సరిగ్గా ఈయన లాగానే వస్తాదుగా వాయించేవాడు దొరికాడు. ఆ తర్వాత ఈ రోజు నాకోర్కె మళ్లీ నెఱవేరింది. రేపు ఆఖరి రోజుగా! అతన్నే తబలా వాయించడానికి పెడితే బావుంటుంది" గులాబ్.

"బాబోయీ! మేనేజరు సాబు అసలే ఏడుస్తున్నాడు. నాలుగు డబ్బులు రాలేదని. రేపటిరోజు అతన్ని నీకు తబలాకుగా, పెట్టడు. అతగాడు కేవలం పాట మీదనే నాలుగు డబ్బులు రాల్చుకోవాలని చూస్తున్నాడు." నాట్యకర్త.

"మేనేజరు వాడి దుంపతెగిరి! గోతిలో పడమను. నూతిలో ఉరకమను. నోట్లకోసం పైసలకోసం నాట్యం చేసే దాన్నయితే, ఈ పాటికి ఎంతైనా సంపాయించి వుండేదాన్ని! జనం కూడా వట్టి మొద్దు స్వరూపాలు. ఇప్పుడు కూడా నా పాదాలు నాట్యం కోసం గులగులమంటున్నాయి చూడు. ఝణఝణలు నీకు వినబడడంలేదా! చూడు. అతన్ని పక్కవాద్యాని కుంచితే నేను గజ్జెకడుతాను. లేకపోతే

అటాలేదు పాటా లేదు. పొద్దున్నే నీవు ఒ పుష్పమాల తీసుకునిరా." గులాబ్

"ఏం చెయ్యాడానికి?" నాట్యకత్తె.

"లాల్జీ మెడలో వెయాలి నా చేతులతో. బరోడా మహారాజువారి దర్బారులో నాట్యం చేస్తానని ఓ సారి నేను తమలపాకు కిల్లీ తీసుకున్నాను. అది ఎప్పటి మాటో! బరోడాకు నేను లాల్జీని తీసుకొని వెడతాను..." గులాబ్

"మరి మా పని ఏం కావాలి?" నాట్యకత్తె.

"పద. ప్రస్తుతం నిద్రపో. తర్వాత చెబుతాను అన్నీ. నాకిక్కడే ఈ పనితో విసుగెత్తి పోయాయి ప్రాణాలు. కాని ఇంతకీ ఇంకా తలరాత మారలేదు." గులాబ్.

* * * * *

లాల్జీ విశాఖం పట్టినవాడిలాగా మాటికిమాటికి తిరగడం ప్రారంభించాడు. బరోడా, గ్వాలియరులలోని దర్బారు నాట్యాలు లాల్జీ ప్రేమిప్రేయులతో, దరువులతో శోభించాయి. దర్బారులో శాశ్వతంగా నాట్యంకోసం ఓ నృత్యాంగన కావాలిసి వుంది ఆమె రాచమర్యాదలన్నీ పొందికూడా, అక్కడ వుండిపోలేదు. ఓంకారేశ్వరుని గర్భగుడిలో లాల్జీని పెళ్లి చేసుకొని జీవితానికి ముక్తి సాధించింది. గులాబీ నడక తీరు, మర్యాద మన్ననలూ, దైవభక్తి ధార్మిక ప్రస్తావనం, అన్నీ లాల్జీ గమనిస్తూనే వున్నాడు. ఇంతవరకూ గాలికెగిరి పోయిన, ఆమె స్వైరజీవితం తెలుసుకొని అతని మనస్సు స్తిమితపడింది. ఓ నృత్యాంగన జీవితం, ఇంతోటి విలక్షణమూ, భయానకమూ అయినా, ఇంత ఆకలుషితంగా వుండగలగడం-మొదట్లో అతనికి విశ్వాసం కుదరింది కాదు- ఆమె తల్లి పంజాబీది. తండ్రి గుజరాతీ. గుజరాతీని హత్య చేశారు. దాంతో ఆమె తల్లి లక్నోలోని రాజమహలులో వుంది. గులాబ్ చిన్నతనం, లక్నో గ్వాలియరు, బరోడాలలో గడిచింది. పది పన్నెండేళ్లు వచ్చేదాకా. లక్నో నుంచి ఎవరో ఎత్తుకొనిపోయి, బొంబాయి మురికివాడలలోని వేశ్యా గృహంలో, ఇనుప కట్టుబాట్ల మధ్య వుంచినా, గులాబ్ ఆ చెఱసాలనుంచి రెండు మూడు రోజుల్లోనే ఎలా బైటప్రపంచంలో పడిందో, అది ఆమెకే ఎఱుక. ఆమె లాల్జీకి మొత్తం తన కథ అంతా పూస గ్రుచ్చినట్లు చెప్పింది. లాల్జీ గొప్ప కళాకారుడు. కళ అతని నరనరాల్లో జీర్ణించుకు పోయింది. అతడు గొప్ప కళాకారుడు మాత్రమే కాదు, మనసున్న గొప్ప మనిషి కూడా. దేన్నీ లక్ష్యపెట్టకుండా, అతను ఒంకారేశ్వరుని సాక్షిగా పెళ్లిచేసుకుని

ఆశీర్వాదం కోరాడు. అతను గులాబ్‌కు అప్పటినుంచీ సావిత్రి అని పేరు పెట్టాడు.

లాల్జీ సిద్ధేశ్వరుని జాతరలో గులాబ్ బాయిని పెళ్లి చేసుకుని రావడం, ఊళ్లోనూ పరిసర గ్రామల్లోనూ అంతటా వ్యాపించింది. లాల్జీ ఇంట్లో నా అన్నవాళ్లు ఎవరూ లేరు. ఒక్క ముసలి అవ్వ మాత్రముంది. ఆవిడైనా దూరపు చుట్టం. వరుసకు మేనత్త అవుతుంది కాని లాల్జీ సంపూర్ణ స్వతంత్రుడు. అతను ఒంటరిపాటున ఉన్నా ఇంటికి ఎటువంటి భయమూ వుండదు. హార్మోనియం పెట్టె, తబలా, సారంగి, ఈ వాయిద్యాలేమో తానేమో, ఇవ్వి తప్ప వేరే ప్రపంచమే అతనికి లేదు. వ్యవసాయం భూమి చాలా వుండడం వల్ల అది నల్లరేగడినేల అవడం వల్ల పొలం నుంచి పంట దిగుబడి కావలసినంత వుండేది. అయితే దానిపైన గూడా అతనికి శ్రద్ధ వుండేది గాదు. అతనికి ఊళ్లో ఎవరితోనూ సరిపడేది కాదు. కేవలం భాగవత్ తోనే అతని స్నేహితం. భాగవత్ చాలాసార్లు తబలా, సారంగి, సంగీతం వినడానికి అతనింటికి హాజరవుతూ వుండేవాడు. భాగవత్‌తో స్నేహం చేసిన తరువాత అతని పరిసాయం కూడా పెరుగుతూ వచ్చింది. భాగవత్‌కు లాల్జీ కళాచాతుర్యం మీద ఎంతో మక్కువ. గాన రసానందం తనివితీరా అనుభవిస్తూ వుండేవాడు. ఒక్క భాగవత్‌ను మినహాయిస్తే ఊళ్లో మరేవరూ అతన్ని మెచ్చుకునే వాళ్లు కాని, కనీసం అతన్ని పలకరించే వాళ్లు కాని లేరు. భాగవత్ అంటూ వుంటాడు. నువ్వే గనక ఏ బస్తీలోనైనా వుంటే, ఏ పాటకి వేలకొలది డబ్బు సంపాయించి వుండేవాడివి. ఎంతో పేరు, ప్రతిష్ఠలు వచ్చి వుండేవి. కాని ఈశ్వరుడు నీకు ఈ నల్లి రేగడి నేల మెడకంట కట్టాడు. కాని నువ్వు 'గానా బజానా' వీటిల్లోనే మునిగితేలుతూ వుంటావు. అని నిజానికి లాల్జీకి వీటిల్లోనే సరదా. లాల్జీకి మొదట్లో ఇవే కావు, జూదం, గుట్కా మొదలైన వ్యసనాలు కూడ వుండేవి. ఒకసారి, ఒక జూదమాటలో మూడునాలుగు రోజులు, అన్నం నీళ్లు కూడాలేకుండా కూరుకొని పోయాడు. ఆట నడుస్తూనే వుంది ఎడతెరిపి లేకుండా. ఆ దెబ్బలో ప్రత్తి పంటమీద వచ్చింది, అపరదినుసులమీద వచ్చిందీ సుమారు ఏడువేల రూపాయల దాకా ధారపోసి చేతులు కడుక్కున్నాడు. భాగవత్ ఊళ్లోకి కాయంగా వచ్చివుండడం మొదలుపెట్టిన తర్వాత మెల్లిమెల్లిగా లాల్జీని అదుపులో పెట్టి వీటినుంచి తప్పించాడు. లాల్జీకి ఎవరూ ఎదురుబెదురు లేదు. లాల్జీ ఓసారి ఓ గొప్ప వస్తాదు కుస్తీ పట్టడం చూసి తానుకూడా అంతవాడు కావాలనుకున్నాడు. ఇహనేం! ఆరోజు నుంచీ రాత్రింబవళ్లు వస్తాదు గిరీ చింతే. కసరత్తు జోరుగా సాగింది. నిజానికి లాల్జీ మంచి స్వభావం గలవాడు. ఓసారి ఏమైందనుకుంటున్నారు? కల్లుతాగి ఓ

తుంటరి వెధవ, ఊళ్లో ఆడవాళ్లనీ, ఆడపిల్లల్నీ బూతులు తిట్టడం మొదలుపెట్టాడు. లాల్జీకి కోపం ఎగేసుకువచ్చి, వాణ్ణి కుయ్యో మొర్రో అనేదాకా బాది వదిలిపెట్టాడు. సొంత ఖర్చు మీద కేసుపెట్టి వాణ్ణి జైలుకు పంపించాడు. ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవడైనా హద్దు మీరి ప్రవర్తించాడా, వాడిని నడివీథిలో పెట్టివాడి పొగ్గ దులిపేసేవాడు. లాల్జీని గురించి అపోహలు జనంలో చాలా వుండేది. జూదరి, సూరాపాయి, మదంతో కొట్టుకునేవాడు, ఎదురూబెదురూలేని పోరగాడని అనుకునేవారు. అంచేతనే వాడంటే గూండాలకు, రౌడీలకు తారు! అని ఊహించేవారు. భాగవత్ పనికట్టుకుని నలుగురికీ అతనిలోని మంచితనం చెబుతూ వచ్చేసరికి కొన్నాళ్లకు వాళ్లందరి అభిప్రాయం మారిపోయింది. జూదం ఆట మానేశాడు. ముందుగానే, జనాన్ని తన సొంత ఖర్చుతో, కష్టాల్లో ఆదుకోవడం మొదలుపెట్టాడు. ఓసారి, ఒకటి రెండు పార్టీలు ఎప్పటినుంచో దెబ్బలాడుకుంటూ వుంటే, వాళ్లను సరిదారికి రప్పించి, జగడం మాన్పించాడు. అప్పటినుంచి, జగదేవు కూడా అతనంటే కొంచెం అణిగిమణిగి వుండేవాడు. అతని ముందు పెద్దగా రభస చేసేవాడు కాదు.

లాల్జీకి పెళ్లి చెయ్యాలని రెండు మూడుసార్లు అతని మామ, అత్త వచ్చారు కాని వాళ్లకీ, లాల్జీకి సరిపడేది కాదు. నా తల్లిదండ్రులను ఈ స్వార్థమండలే మట్టేసారు, నన్ను ఏమీ తెలియని పసివాణ్ణి చేసి, నేను వీళ్ల పాడ కూడా దగ్గరకు రానీను అని వాళ్లముందే కుండ బద్దలు గొట్టినట్లు చెప్పేవాడు. భాగవత్ కూడా ఒకటి రెండు సార్లు చెప్పచూశాడు. పెళ్లిపెళ్లామంటూ ఈ గొడవలో తెలివైనవాడు ఎవడు పడతాడంటూ లాల్జీ టలాయించేశాడు. అప్పట్లో అతని బుర్రలో దారాసింగ్ పైలుమాను మెదలుతూ వుండేవాడు. లాల్జీ ఇప్పుడు వచ్చిన తర్వాత తన కులంవాళ్ల, ఎవరి దగ్గిరకూ వెళ్లకుండా సరాసరిభాగవత్ ఇంటికి వెళ్లాడు. భాగవత్ కాళ్లకు, గంగ కాళ్లకు నమస్కరించాడు. భాగవత్ అతని వైపు చూస్తూ వుండిపోయాడు. లాల్జీ అతని రెండు చేతులు గట్టిగా పట్టుకున్నాడు. బాగా గట్టిగా.

"క్షమించు బాబూ! అనుమతి తీసుకోవడానికి రాలేకపోయాను. అక్కడే అన్నీ చక్కబఱచుకుని వచ్చా నువ్వు నన్ను తలలా ముందు కూచో బెట్టక పోతే యింత రామాయణం నడచేది కాదు. ఇప్పుడు హృదయపూర్తిగా ఆశీర్వదించండి" "అరే! ఆశీర్వాదము నన్నెందుకడుగుతావ్! పరమేశ్వరుణ్ణి అడుగు. ఏంచేసినా చేయించినా అతడే మూలకారణం. మనం నామమాత్రులం. నువ్వు ఈవూరు రావడం నాకు అనిపించింది. నాకు నిన్ను గురించి ఒకటే చింతైంది. మొన్న నీ ఉత్తరం వచ్చింతర్వాత కొంత ధైర్యం కలిగింది. లేకుంటే ఏమీ తోచింది కాదు నాకు.

నాపేరు ఊళ్లో మ్రోగిపోతోంది. మీమామ ఓసారి ఇక్కడికి వచ్చివెళ్లాడు."

"ఓ చెప్పుం దెబ్బ కొట్టి తోలేయాల్సింది. ఆస్తి కోసం పరుగెత్తుకుని వచ్చి వుంటాడు ఇక్కడికి. కాని చెప్పాలిసింది లాల్జీ బొందిలో ఊపిరి ఉండగా పొలంలో కాలు పెట్టడానికి వీల్లేదని. నా తండ్రిని చంపారంటే అప్పటికి నేను బొడ్డూడని పసివాణ్ణి ఇప్పుడైతేనా? భడవాకోరుని..."

"ఏమిటి మరీ అల్లానోరుపారేసుకుంటున్నావు. వదినేగారు కొత్తగా వచ్చిందనైనా గమనించవు. ఏదిలి పెట్టు ఆ సోది. నువ్వు మాట్లాడడం మొదలుపెడితే కథ చేట భారతం లాగా పెరిగిపోతూనే వుంటుంది. "ఆ! ఇంకా కొత్తేమిటి. ఈ నెలరోజుల్లో పాతబడిపోలా!"

"గంగాజీ! మీరేమీ మాట్లాడరేం? (సామూబాయీ ఇంట్లో లేదు) నా భార్య పొందిక అందం ఎలా వున్నాయి మీ దృష్టికి. చెబితే విని సంతోషిస్తా"

"కేవలం ఆ లక్ష్మీనారాయణులాంటి జంట మీది. మీరు చాలా అదృష్టవంతులు. దిష్టితీయించుకోండి సాయంత్రం పూట."

"సరే! మీరే ఇవ్వాళ మా కోసం వంట చేసి వుంచండి. మేమెవ్వరం కొంతసేపు తిరిగి వస్తాం పొలంతోటల్లో. ఈమెతో కొన్ని సంగతులు చెప్పుకోవాల్సివుంది."

* * * * *

లాల్జీ తిరిగి ఇల్లంతా అలంకరించుకున్నాడు. సంసారం నెలకొల్పాడు. సావిత్రి లాల్జీ లిరువురూ ఒకే సారి భోజనానికి కూచుంటారు. వంటింటి లగాయతు ఇంట్లో చేయవలసిన పనంతా 'హరీబా కోళి' చక్కగా ఒంపులొంపు లేకుండా చేసిపెడతాడు. అడపాతడపా వీలు చూసుకొని భాగవత్, లోకాభిరామాయణం కోసం వస్తూ వుంటాడు. ఓసారి చాలా రోజుల తర్వాత భాగవత్ లాల్జీ ఇంటికి వచ్చాడు. సావిత్రిని, లాల్జీని ఆటపటించడం మొదలుపెట్టాడు మాటల ధోరణిలో. పెళ్లి అయి వచ్చింతర్వాత ఓసారైనా లాల్జీ సితారు గాని, తబలాగాని వాయించలేదు. భాగవత్ స్పష్టంగా చెప్పాడు. "అబ్బాయి! నాకు ప్రాణం విసుగెత్తి పోతోంది. తబలా వాయిస్తానంటే ఇక్కడ కూచుంటా కాసేపు. లేదంటావా! ఓ కప్పు చాయి తాగి నాదారి నేను చూసుకుంటా." లాల్జీ వాయించడానికి తయారయ్యాడు. తబలా మ్రోగడం మొదలైంది శాస్త్రోక్తంగా ఎప్పటికి మల్లేనే. జీవంతంగా వాయిస్తున్నాడు. భాగవత్ సంతోషం పట్టలేకుండా వున్నాడు. వాయించిన కొద్దీ లాల్జీకి కైపు

ఎక్కువయింది మరింత ఆవేశంగా వాయిస్తున్నాడు. భాగవత్ దృష్టి అకస్మాత్తుగా సావిత్రి పాదాల వైపు మళ్లింది పట్టెమంచం మీద సావిత్రి ఏకాగ్రంగా కూచుని వుంది. నేలకు పాదాలు అంటుతున్నాయి. ఆమె కుడిపాదం శాస్త్రబద్ధంగా కదలాడుతోంది మెల్లిగా... మళ్లీ ఎడమకాలుకూడా అలాగే లయబద్ధంగా ఆడడం మొదలుపెట్టింది. భాగవత్ చకితుడైనాడు. ఇంత సేపుతాను సావిత్రి పాదాలవైపు ఏకాగ్రంగా చూస్తూ వుండడం తనకే సిగ్గనిపించింది. సందుగొందుల్లోంచి జనం లాల్జీ ఇంటి వైపు చేరసాగారు. ఆడమగ పిల్లాపాయలు తలుపుల దగ్గిఱ, కటికీల దగ్గిఱ చేరారు. లాల్జీ వ్రేళ్లు నిలిచేటట్లు లేవు. తబలా మీద అవి నాట్యం చేస్తూనే వున్నాయి. భాగవత్ ఇట్లా చూసేటప్పటికి సావిత్రి పట్టెమంచం నుంచి జారి ధడేలుమని పడిపోయింది. సావిత్రి నెత్తికి పెద్ద దెబ్బే తగిలింది. గాయమయింది కూడా. నడుం కూడా కొంచెం బెణికింది. సావిత్రిని అమరునాడు, ఔరంగబాదులోని పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టరు కేసంతా విచారించాడు. అతడు మరో డాక్టర్ని పిలిపించాడు. ఇద్దరూ కేసు బాగా పరీక్షించి చూశారు. సావిత్రితో ఏకాంతంగా కూడా చాలా సేపు మాట్లాడి అన్ని విషయాలు తెలుసుకున్నారు. మాత్రలు మందులు రాసి ఇచ్చారు. లాల్జీతో భాగవత్ తోనూ స్పష్టంగా చెప్పారు: ఈమీదట ఈమె ఎదుట ఏ వాద్యాన్ని వాయించకండి. అంతేకాదు రేడియో సైతం మ్రోగించకండి. ఓ వేళ మ్రాయిస్తే ఆమెను కూడా స్వేచ్ఛగా నాట్యం చేయనీయండి. లేకపోతే ఈమె, శరీరమూ, మనస్సూ గిరగిరా తిరిగి పడిపోతుంది. ఇంతే. ఇంతకంటె చెప్పాల్సిందేమీ లేదు.

* * * * *

సావిత్రిని కళ్లారా చూసి సంతోషించాలనే కోరికతో జనం ఆ సందులోకి వెళుతూ వుంటారు. చాలా రోజుల పాటు ఊళ్లోనూ, ఊరిబైటా, ఇదే కాలక్షేపం వాళ్లకి. లాల్జీ జాతి వాళ్లంతా, అతన్ని కులంలోంచి వెలివేయాలనే నిర్ణయానికి వచ్చారు. పెళ్లిపేరంటాలకు ఆ యింట్లో ససేమిరా పిలవకూడదనే వాళ్ల ఫైసలా. ఎక్కడి నుంచి తెచ్చిపెట్టాడో ఈ భోగందాన్ని. సంఘం మర్యాద మట్టి పాల్జేసాడు. మన సంఘం వట్టి పోయిందా ఆడవాళ్లు లేకుండా? ఈ మాత్రం పిల్ల దొరక్క గొడ్డు పోయిందా? ఒక్కళ్లని మించిన ఒక్కళ్లని, వజ్రాల తునకల్ని తెచ్చి యిచ్చే వాళ్లం కావాలంటే! అందరూ అతనిపై దండెత్త సాగారు. లాల్జీ వీటినన్నింటినీ లెక్కపెట్టేవాడుకాడు. అతనికి ఎప్పుడూ ఎవరితోనూ, కులం వాళ్లతోనూ అంటారా అసలే జోలీ, సొంటూ

లేకుండా బ్రతికిన మనిషి. లేకుంటే కులం వాళ్ళే పాటేల్ని ఎప్పుడో అతని పని పట్టించి వుండేవాళ్ళు. సాయబ్బుల వీడినా తమ మీద పడడానికి కిష్టపడని వాళ్ళు, గులాం అలీఖాన్ దగ్గిర తబలా నేర్చుకుంటూ సాయబ్బు మిత్రుల ఎంగిలి కంచంలోంచి తినేవాళ్ళు. అటువంటి వాళ్ళితని పైనే ఇతన్ని రెచ్చగొట్టడానికా నేరం మోపుతూ వుండేవాళ్ళు ఎదురు. జనం మాట్లాడుకొనే వెర్రిమొర్రి మాటలకతనికేమీ గడ్డిపోచంతైనా ఖాతరు లేదు. ఎదుట కనుక మాట్లాడితే, "బుర్ర ఎగిరి పోతుంది జాగ్రత్త" అని చెప్పి వుండేవాడు. లాల్జీ మంచితనం, స్వాభిమానం, వస్తాదుగిరీ, అన్నీ జనానికి బాగా తెలిసిన విషయాలే. అందుకే, అతని ఎదుట అందరూ కుక్కిన పేనులా వుంటారు. ఇళ్ళలో మాత్రం అతన్ని గురించి మెల్లిగా గుసగుసలు పోతూ వుంటారు.

"పాటీలు! ఆ నాట్యకత్తె లోగడ ఏ గూటిలో వుండేదో?"

"ఛీ!ఛీ! ఏంచెప్పను? వాడవాడల నీళ్ళు తాగి ఏ ఊరు చేరిందయ్యా బాబు! లాల్జీని సర్వనాశం చేసే మరీ వదులుతుంది చూడు!"

"అక్కడే ఆసుక్కుసు వుండేది. మన లాల్జీతో భేటీ అయింది. మరే ఉద్దేశంతో కలుసుకున్నాడో కాని, వాడితోపాటు లేచి చక్కావచ్చింది"

"సిద్ధేశ్వరుని జాతరలో ఎంచక్కగా నాట్యం చేసింది రాజా. వైజయంతిమాల కూడ దీని ముందు దిగదుడుపే."

"అసలే కొక్కిరాయి. దానికి తోడు ఈ బజారు సరుకు నెత్తిని గట్టుకున్నాడు."

"ఈ పల్లెటూరిలో ఈ టక్కులాడి ఎన్నాళ్ళుండ బోయింది? పట్నంలో మజాలన్నీ చవిచూసి, భోగాలన్నీ అనుభవించిన ప్రాణం. దానికెట్లాగూ ఇక్కడ బోరెత్తి పోతుంది"

"ఓసారి తలుపులు బిగించి నాట్యం చేసింది. చిందులు తొక్కుతూ తొక్కుతూ పడిపోయింది. భాగవత్ కూడా అక్కడే వున్నాడు. అప్పుడు ఔరంగాబాదు ఆసుపత్రికి తీసుకుని వెళ్ళినట్లు జగదేవు చెబుతున్నాడు."

"అతడైతే చాలా పెద్దమనిషి. అతనీ రొంపిలో ఎందుకు దిగబడ్డాడో ఆ పెరుమాళ్ళకే ఎఱుక"

"భాగవత్ ఇటువంటి పెళ్ళిళ్ళు పట్నాలలో ఎన్నో జరుగుతూ వుంటాయని చెబుతాడు. వాళ్ళు ఓంకారేశ్వరంలో పెళ్ళిచేసుకుని వచ్చారుట. తరువాతి కథ నీకు నేను చెప్పాల్సిందేమీ లేదు."

"లాల్జీయే దాన్ని పెళ్ళి చేసుకోవాలని వెంటబడ్డాడుట. మొదట్లో ఆమె తనకు

తానై ఈ ప్రసంగం ఏమి తేలేదుట. ఆమె చాలా తెలివైనదీ చాకచక్యం గలదీ అని వింటున్నాం. మంచి భక్తురాలు కూడా. రోజూ తులసిలో నీళ్లు పోస్తుంది. పూజాపురస్కారం, గ్రంథపఠనం చేస్తూ వుంటుంది. సాయంత్రం శివునికి ఆరతి ఇస్తుంది"

"ఇదంతా ఎవరు నీకు చెప్పేది?"

"నేను సొంతంగా నాకళ్లతో చూసిన విషయం వటసావిత్రీ వ్రతం రోజున స్త్రీలందరిలోనూ ముందుగానే పూజా పురస్కారాలు చేసింది. ఆషాఢ శ్రావణ మాసాలలో పుస్తక పారాయణం చేస్తుందని అంటారు. ఇదంతా వుంది గనుకనే, లాల్జీని ఓంకారేశ్వరుని గర్భగుడిలో పెండ్లి చేసుకోవడం."

"ఇదంతా కొత్త విషయం వింటున్నాం. ఇంతకీ ఆవిడ కులం ఏమిటో!"

"మనకేం తెలుస్తుంది. కొందరంటారు బాపనావిడని. మరికొందరు గుజరాతీదంటారు. ఎవళ్ల ఇష్టం వచ్చినట్లు వాళ్లు..."

"అసలు సిసలైన జాతిది ఎట్లా అవుతుంది. వెర్రిమొహంవాడా?"

"మన మొహాలకు ఆడది అంటే పంచదార బెల్లంగా వుంటుంది. నువ్వేకదా అంటున్నాది. లాల్జీ నెత్తిని టోపి పెట్టి నెలలోగా పారిపోతుందని. ఇప్పటి కప్పుడే ఏడెనిమిది నెలలు గడిచిపోయాయి."

"ఏమి అర్థం కావడం లేదు. పట్నంలో పెద్ద మనుషులు పైసాలు గలవాళ్లు చాలామంది వుంటూ వుండగా, వాళ్లందరినీ కాదని ఈ పల్లెటూరిలో ఈ లాల్జీ వెంటపడిందేమిట్రా బాబూ! ఇందులో ఏదో వింత ఉండితీరాలి సన్నాసి!"

"తబలా చేసిందంతకీ ఇంత పని."

"అరే! లాల్జీకి తబలా వాయించడం వచ్చా అంట! గుడ్డివాళ్లల్లో మెల్లకంటివాడు మేలు. అంతే. ప్రపంచంలో ఎంతమంది లేరు బాగా వాయించేవాళ్లు. లాల్జీకి తీరా చూస్తే పాటకు పల్లవి వాయించడం కూడా రాదు."

"ఔనుమరి! నువ్వేమో తబలా వాయించడంలో ఏకంగా పదిహేను సర్టిఫికెట్లు సంపాయిస్తివాయె! కేవలం అసూయతో పడి ఏడుస్తున్నావు. అతను భోగందాన్ని పెళ్లి చేసుకున్నాడంటే అది వేరే విషయం. తబలా వాయించడం అతనికి రాదంటే-అది ఎవరూ ఒప్పుకునే విషయం కాదు. నీకో విషయం గుర్తుకు తెస్తున్నా. బంజారో(లంబాడీ)జనం, హోలీ పండుగ రోజున మనమంతా పాల్గొన్నాం. ఏడెనిమిది ఎండ్లయిందిప్పటికి. అప్పట్లో లాల్జీ ఇంకా తబలా నేర్చుకోవడంలోనే వున్నాడు.

బంజారీ వాళ్లంతా ఆడ, మగ, అందరూ ఆ రాత్రి మందు సీసాలు ఖాళీ చేసేరు. చెవులు గింగురేత్తేటట్లు నాట్యం చేసారు.

"వచ్చింది వచ్చింది

ఎర్ర రంగుల హెూలీ

రంగురంగుల హెూలీ!

ప్రియతమా! పొలాల్లో

తొంగి చూసింది హెూలీ!" వచ్చింది

బంజార్లుపాడిన ఈ పాట మీద లాల్జీ ప్రాణం ఒలకబోసి దరువు వేసాడు. వాళ్ల నాట్యాన్ని మించి వాయించాడు, అప్పట్లో నువ్వే అన్నావు. లాల్జీలాగా వాయించేవాడు చుట్టు పక్కల పాతిక ఊళ్లలో ఎవడూ లేడని..."

"కాని ఏమైనా ఆటకత్తెని దాన్ని ఇంటికి తెచ్చుకోవడం ఏమంత బాగా లేదు. గ్రామానికి చెడ్డపేరు వస్తుంది. గ్రామంలో కాటుకపెట్టుకొని చూసినా ఇకముందు నీతినియమాలంటూ వుండబోవు."

"వహ్వా! భలే వచ్చాడు ఆకాశంలోంచి నీతినియమాల పెద్దమనిషి! నూరు రంకులు చేసి సావిత్రీపూజ మొదలుపెట్టిందట ఒకావిడవెనకటికి! గ్రామంలో కడుపులు పోగొట్టుకొన్న వాళ్లెందరో! అప్పుడేమో నీబోటివాళ్లు నోటికి తాళం వేసుకుని కూచుండే వాళ్లే! అప్పుడు నీతినియమాలు అటకెక్కి కూచుంటాయి! ఎక్కడా కనబడవు. ఇప్పుడు మాత్రం మహాపెద్దమనిషి తరహా వెళ్లబోయడం! ప్రపంచంలో ఉంటూ అటువంటి ఘోరాలు జరుగుతూ వుంటే, ఊరంతా గోలపుట్టి పోతుంటే నీకేమి పట్టలే! ఇప్పుడు కేవలం బ్రహ్మజ్ఞానమే బోధించడం మొదలుపెట్టావు తగుదునమ్మా! అని."

"పోనియ్యి మనకెందుకొచ్చిన గొడవ! వెళ్లిన చోటల్లా ఏదో తగాదా పెట్టుకుని కూచుంటావ్!"

"తుకారాం, మాట వినండి

మూకీభావం వహింపుడీ

నడిచే నాటకం గమనింపుడీ"-అంతే.

* * * * *

పొద్దున్నే ఇంత పెందలాడే జగదేవు తన ఇంటికి రావడం లాల్జీకి కొంచెం

వింతగానే తోచింది. అతను సావిత్రిని మేల్కొల్పాడు. మంచం గదిలో వేశాడు. పక్కన మూలగా వున్న మంచంపైన జగదేవుని కూచోమని చెప్పాడు. సావిత్రి ఇంతలో ఇంట్లోకి వెళ్లిపోయింది. జగదేవు లాల్జీ ఇంటికి తరుచు వచ్చేవాడు కాదు. కిందటి అయిదారు నెలలనుంచి, ఏహో చిల్లర మల్లర పనుల నెపం పెట్టుకుని లాల్జీ ఇంటికి వస్తూ ఉన్నాడు. లాల్జీ లోలోపల గ్రహించాడు కూడా, కేవలం తన భార్య ఎలా వుంటుందో, ఎలాంటిదో చూడడానికే వస్తున్నాడని. ఇంటిలో రెండు మూడుసార్లు లోగడ వచ్చినప్పుడు గప్పాలు కొట్టుకుంటూ పెద్దగా అరుస్తూ చప్పట్లు చరుస్తూ వచ్చేవాడు. అతనికి భార్యతో పరిచయం మేర్పాడలనే రంధి పాపం! ఆమె కేవలం మొక ఆటకత్తో అనే అతని అభిప్రాయం. సావిత్రిని అతనికి టీ ఇచ్చివెళ్లమని పరిచయం చేయడం కూడా జరిగింది. ఆ తర్వాత ఒసారి సావిత్రి చెప్పింది లాల్జీకి "ఈ మనిషి మొహం చూస్తే పాపిష్ఠివాడు లాగ కనబడుతున్నాడు. దయచేసి మీరితన్ని బైటనే కూచోబెట్టి మాట్లాడి పంపించండి. నిన్న దారిలో కలిసినప్పుడు ఏమీ మాట్లాడలేదు, రాత్రికి రాత్రి ఏం పని వచ్చి పడింది తనికి? అయినప్పటికీ, మర్యాద కోసం, లాల్జీ ఇతని కోసం టీ పెట్టమని ఇంటిలో చెప్పాడు. ఎవరైనా రానీ సావిత్రి తానుగా ఎవరికీ టీ తెచ్చి ఇచ్చేది కాదు. హరిబా ద్వారానే వాళ్లకు టీ పంపించేది. హరిబా ద్వారా టీ పంపించడం, సావిత్రి తీసుకుని రాకపోవడంతో, జగదేవు మొహం ఒక్కసారిగా వెలవెలాబోవడం, లాల్జీ గమనించాడు. టీ తీసుకోండి..."

"టీ ఇంటి దగ్గరే తీసుకున్నా. ఎందుకు కనసరంగా పెట్టించావు. వదినెగారికి వృధా శ్రమపెట్టావు."

శ్రమ ఇవ్వకుండా ఎలా తప్పుతుంది? నువ్వు ఎప్పుడో అమావాస్య కోసారి అన్నట్టుగా వస్తూ వుంటావు. ఎప్పుడూ టీ అయినా తాగవు."

"వదినె గారు పెట్టిన టీ అయితే తాగాలనే వుంటుంది."

"ఇవ్వాళ ఏదో విశేషమున్నట్టుంది. ఏం పనిమీద వచ్చావు."

"ఏదో మామూలు పనే. కొంచెం పని పడింది."

"చెప్పు ఏంకావాలేం?"

"గోధుమ విత్తనాల గింజలు చల్లడానికి కావాలి."

"నువ్వింత వ్యవసాయం చేయిస్తూ వుంటావు. అవసరమైన వస్తువులు జాగ్రత్త పెట్టుకోవా? చాలా పనిముట్లు అడిగి తీసుకు వెళుతూ వుంటావేం?"

"సంవత్సరానికో సారి పని పడుతుంది. తర్వాత ఏం పనీ ఉండదు. అందుకని."

"నాట్లకుని ఎవరికైనా ఏడాదికోసారే వుంటుంది. అయిదారుసార్లు పని తగలదు. కాని ప్రతి తడవ, పనిముట్ల అడుగుతూ వుండం ఆట్టే బాగుండదబ్బా! అంతే కాకుండా మీ కిచ్చిన వస్తువులు విరిగి ముక్కలు కాకుడా వెనక్కు సరిగ్గా రాదు."

"నేనీ తడవ సరిగ్గా, పాడు కాకుండా చూస్తాగా!"

"అయిదారు రోజుల తర్వాత తీసుకొని పో. గోధుమలు విత్తడం ప్రారంభమైంది. రెండు జంటక్కల్లు పని చేస్తున్నాయి. త్వరలోనే పని పూర్తి అవుతుంది"

"కాని నాకు ఈ రోజే కావాలి. అతని దగ్గరనుంచి తెప్పించు."

"నాలుగైదు రోజులకు కూడా నీకు రాదు. అతని నాట్ల పని అయిన తర్వాతనే నువ్వు తీసుకపో, పొలానికి నీరు పెట్టిన తర్వాత విత్తడం. అందువల్ల తడియారేటప్పటికి విత్తడం పని పూర్తి కావాలి. అంతేకాకుండా రేణ్ణెల్ల పంటకు సంబంధించిన విశేషజ్ఞుడు, మంత్రి వగైరాలు ఆయన పొలాన్ని పరీక్షించడానికి వస్తారు. అప్పుడు పొలంలో అన్నీ చక్కగా సిద్ధంగా వుండాలి."

"ఇద్దంతా వొట్టి అబద్ధం. మంత్రులలాంటి గొప్ప వాళ్లకీ, ఇతనికీ ఏమిటి సంబంధం? భాగవత్ ఊరికే గప్పాలు కొడుతువుంటాడు."

"నువ్వు ఆరకంగా కోతలు కోసే కోతలరాయడవు గనుక నీ కట్లాగే తోస్తుంది. ఇది కొంచెం చదివి చూడు తెలుస్తుంది. మొన్ననే సచివాలయం నుంచి వచ్చిన కాగితం. నా దగ్గరే వుంది."

"అరటిపళ్లు, బత్తాయిల గురించి ఎందుకు రాశారు?"

"ఊళ్లో వుంటూ ఈ మాత్రం తెలియక పోతే ఎట్లా? ఈ మధ్యనే పూనాలోని కాలేజి విద్యార్థులు వచ్చి వెళ్లారు. రెండుసార్లుగా వచ్చారు. మోసంబీకి ఏదో తెగులు పుట్టన్నే పుడుతుంది. ఆ వ్యవసాయానికి సంబంధించిన నిపుణుని కంటె కూడా. భాగవత్ బాగా శ్రమపడి తెగుల్ని అదుపులో పెట్టాడు మొత్తం మీద. నిపుణులకు కూడ వశమైంది కాదు. అందుకే వాళ్లు చూడడానికి వచ్చారు. అప్పుడే అరటితోట చూసి వాళ్లు ముగ్ధులైపోయారు. కొన్ని అరటి గెలలను స్వయంగా తీసుకుని వెళ్లి వ్యవసాయ ప్రదర్శనంలో ఉంచారు."

"సర్కారు, ఈ మంత్రులూ అందరూ పచ్చి దొంగలు. వీళ్లంతా వృథాగా అతన్ని అతని పొలాన్ని పొగడుతున్నారు. అంతకంటె నా పొలం ఎన్నోరెట్లు బాగుంది. ఈ వ్యవసాయ శాఖకు సంబంధించిన అధికార్లు కూడ పట్టి గాడిదలులా వున్నారు."

"ఇప్పుడేగా నీవు వాళ్లని 'గొప్పోళ్లు' అంటున్నావు. నువ్వు వాళ్లను దేవతలుగానే భావిస్తావు. వాళ్లు భాగవత్‌తో కలిసేటప్పటికి మూర్ఖులైపోయారు. ఓమాట చెప్పు. భాగవత్ ఇక్కడ పది సంవత్సరాలలో సంపాదించిన కీర్తి ప్రతిష్ఠలు, ఇతరులు మొత్తం జీవితంలో సాధించ లేకపోయారు. నీకు కూడా దుఃఖం ఇందుకే. అతను ఎముకలకు జీర్ణించిపోయిన రైతుబిడ్డ. అతని మొత్తం జీవితం సేద్యంలోనే గడిచిపోతోంది. నువ్వు, నేను మనలాంటివాళ్లమంతా అతని ముందు, పట్టి నామకం రైతులం!"

"నీకు స్నేహితుడు. అందుకని నువ్వల్లాగే మాట్లాడుతావు. నేను మొన్ననే అతని పెద్ద తోటలోకి వెళ్లిచూశాను. దిగుడుబావిలో నీరు తగ్గిపోతోంది. అరటి చెట్లు ఎండివాడిపోతున్నాయి. ప్రదర్శనంలో పెట్టతగ్గంత అక్కడేమీ లేదు. నిజానికి నా అరటితోట అంతకంటె కలకలలాడుతోంది."

"నీ బుద్ధి కూడా వక్రించింది. నేను నిన్న, మొన్న రెండు రోజులూ, అక్కడే అతని పొలంలోనే వున్నా. రోజంతా బావిమీద ఇంజను పనిచేస్తూనే వుంది. తోటంతా పచ్చగా, కన్నుల పండువుగా విరగబడివుంది. నాకు నీ మాటలు గమ్మత్తుగా వున్నాయి."

"నేను చెప్పడంలో కొంచెం పొరబాటు జరిగింది. నేను కాదు వెళ్లింది. నా తరఫున మామనిషి వెళ్లిచూసి వచ్చాడు. వాడు చెప్పిన మాటలవి."

"ఇహ ఎప్పుడూ ఇట్లా మాట్లాడకు. మీ మనిషి చెప్పినా, చెప్పేది సరిగ్గా వుండాలి. నేను తోటలోనే వుంటిని. నువ్వు పంపిన వాడు నా ఎదుటే భాగవత్ వ్యవసాయాన్నంతటినీ పొగడలేక చచ్చిపోయాడు. నీ అసలు ఉద్దేశం కూడా వాడు మాకు చెప్పాడు. మరి నీతో చెప్పడమంటావా అది నీ మనసు కనిపెట్టి. అంతే. అతను మాతో ఏం చెప్పాడో తెలుసా? మా దొర ఎదుటివాడు నష్టపోతే మహా సంతోషిస్తాడు. ఆయనకు సరిపడేటట్లు చెప్పామంటే చాలు, మనకు కావలసినంత, తినిపిస్తాడు, తాగిస్తాడు. మత్తుతో మజాగా వుండిపోతాం మనం! ఇతరులది తన దానికంటె బాగుందంటే చాలు మండి పడుతాడు. 'పోరా! గాడిదా!' అంటాడు. సరే దానికేం! నీవు చెప్పావుగా, మొసంబి నీ పొలంలో బాగా ఎదిగి రావడం లేదని. మరి మోసంబి(బత్తాయి)తోట అంత విలువైంది ఎట్లా అయిందిప్పుడు?"

"చెట్లు అన్నీ నాశనమైపోతాయి. పై సంవత్సరానికి ఒక్క చెట్టు కూడా మిగలదు."

"కిందటేడు కూడా మీరంతా అట్లాగే వున్నారు. కాని చెట్లుండనే ఉన్నాయి. అంతే కాదు ఎంతో బాగా ఎదిగి వృద్ధిగా ఉన్నాయి."

"అయితే ఖర్చు కూడా చాలా పెట్టవలసి వచ్చిందిగా! నాకు మాత్రం ఇదంతా ఒట్టి ఆడంబరం, అట్టహాసం అనే అనిపిస్తోంది. ఎంతపండినా, ఖర్చుకు చాలితే మంచిదే. ఒక్క యేడు పంట నష్టమైతే చాలు, అయ్యగారి మోహం బైట పడుతుంది. పార్టీ కూడా క్లోజయి పోతుంది"

"నీ కళ్లకు ఎప్పుడూ నల్లద్దాల కళ్లజోడే వుంటుంది. అందుచేత ప్రపంచం అంతా నల్లగానే కనబడుతుంది. ఇదంతా వృథా చుప్పనాతి తనం! దీనివల్ల నీ ఫలసాయం భాగవత్‌తో సరిసమానంగా కాబోవడం లేదు. మాబోటి సాధారణజనం అభిప్రాయమేమిటంటే, ఎవరూ ఎవరిని గురించి లోపల అసూయతో ఏడ్వరాదనే. అసూయతో మనిషి కాలి మసి బొగ్గవుతాడు. తరువాత బూడిద బుగ్గిగా మారుతాడు. అంతకంటె అటువంటివాడికి ఒరిగేదేమీ లేదు సర్పంచ్‌గారూ!"

భాగవత్ పరిచయం పెద్దపెద్ద వాళ్లతో వుంటే, మాత్రం, గాలిమానికే లాభం? గ్రామం లాభం కోసరం అతను వాళ్లకు చెప్ప వుండాల్సింది.

"వాళ్లతో కూడా అతను చెప్పాడు. ఒకసారి నా ఎదుటనే ఒక్క మన గ్రామం కోసమే కాదు, మరి మొత్తం 'ఫార్మ్'కంతా లాభం కలిగేటట్లు ఎన్నో విషయాలు వాళ్లను అడిగాడు. వాళ్లు కూడా అందుకంగీకరించారు అతని సమక్షంలో. అయితే నీకు మల్లే తనకు తాను ప్రచారం చేస్తూ తన గొప్పతనాన్ని తాను డప్పు మోయించే గుణం మాత్రం లేదంతే. అయితే రోజూ వాళ్ల చుట్టూ ప్రదక్షిణాలు చేయడం అతని చేతనైన పని కాదు. అతనికి, మంత్రులనే కాదు, నిన్నే కాదు, ఎవరినీ కూడా మాట్లాడితే కలుసుకొంటూ స్తోత్రపాఠాలు చేయడం నచ్చదు. అతని స్వభావమే ఎంతో వింతయినది. నీవంటి నా వంటి కేవలం పల్లెటూరి గబ్బిలాయిల, తరగతికి చెందినవాడు కాడతను. అతని ఆలోచన లేమిటి, వ్యవహార విహారాలేమిటి, చాలా ఉన్నత స్థాయికి చెందినవిగా ఉంటాయి. అయితే కూడా, అతను గ్రామంతో పాటు కలిసే వుంటాడు. అయితే గాడిదను గుర్రమనమంటే అందరితో కలిసి ఏకగ్రీవంగా తనకూ అది సమ్మతమేనని చెప్పడం,-ఇంతకంటె అసమర్థత మరోటి ఉండదని అతని అభిప్రాయం."

"ఎంతమట్టుకూ తన పొలం బాగోగులు చూస్తూ కుచుంటే గ్రామానికి ఏమి లాభముండదని నువ్వూ ఒప్పుకోవాల్సి వుంటుంది"

"ఇదిగో సర్పంచ్‌గారూ! ఇటు చూడండి. నీవు నిన్నెప్పుడూ పరిశోధించి చూసుకోలేదు. జనం, నీకంటె చాలా వెనకబడి వున్నారని భావించడం, నీ తెలివితక్కువతనమే గాని, నిజం కాదు. జనానికి ఆయువు పట్టులు-సొసైటీ, గ్రామ పంచాయితీ, సహకార ఋణసంస్థ మొదలైన వాటి ద్వారా, ఇప్పటికెన్నో యేళ్లుగా, తెలివి తేటలతో, నీ చేతుల్లో చిక్కించుకొని, వాళ్లను నీచుట్టూ తిప్పించుకుంటూ వుంటావు విధిగా. వాళ్లకు అప్పిచ్చేటప్పుడే, ఇంచుమించు సగం పైకం నీకు అప్పు వాయిదాలో చెల్లిస్తాననీ, నమ్మకం పుట్టించి, తియ్యతియ్యటి కబుర్లతో, వాళ్ల సొమ్ము కాజేయడం నీకో డ్యూటీ అయిపోయింది. నీకు లేదని కాదని చెబితే ఇంకేముంది? మొత్తం తను అప్పే పుట్టకుండా పోతుంది. డబ్బు గాలికి పోతుంది. ఇవ్వాళ వాళ్లు కష్టాల్లో, వుండటానికీ, ఇక్కట్ల పాలవడానికి కారణం నువ్వు వాళ్లని తలెత్తకుండా అణచి వేయడమే. వాళ్లకు సాయంకాలానికి తినడానికి కూడు వుండదు. నీకు మాత్రం కోడి, సారాసీసా సరఫరా చెయ్యాలి వాళ్లు. వాళ్లు ఎక్కడినుంచి ఇస్తారు పాపం. ఇదంతా ఏ మాత్రం న్యాయమయ్యా! పైగా పైకి పురానాతనం! ఇదంతా బాహాటంగా జరుగుతున్న వ్యవహారమే."

"వాళ్లను అంత ఇబ్బంది పెడుతుంటే, వాళ్లెందుకు నన్ను ప్రతి సంవత్సరం, ఏ సంస్థల కెన్నుకొంటారు? అంచగొండితన మంటావా! నిజాం ప్రభుత్వంలో చాలా తక్కువ. కాస్తోకూస్తో తీసుకుంటే మీరంటా గోరంతల్ని కొండంతలు చేసి డప్పు వాయిస్తారు."

"నువ్వు కాకుండా మరొక డెవడున్నా, అయితే, ఈపాటికి, వాడికి నాకు శిక్షపట్ల గోత్రం అయ్యేదే! నువ్వు చెప్పేదేదో విని ఊరుకోవడమే అలవాటై పోయింది. అరే! ఏ మహానుభావుని పేరుతో, ఆయన సిద్ధాంతం పేరుతో, ఈ ఖద్దరు ఒంటి మీద ధరించావో, ఆయన్ను అనుసరించు. ఉపేక్షించి ఊరుకోకు. పల్లె పల్లెలా నాయకులు, పల్లెపట్టుల్ని, పట్టణాల కంటె కూడా వాసయోగ్యంగా, సుభిక్షమంతంగా చేసి వేశారు. ఏ జనతా జనార్దనుని పేరు చెప్పుకొని బ్రతుకుతున్నావో, ఆ బీదజనాన్ని తుసూకారించి పారెయ్యకు. జనాన్ని నీవు గుప్పిట్లో పెట్టుకున్నావు అందుకని వాళ్లు పైకి నీ వశంలో వున్నట్లు వుంటున్నారు. భార్యలేని కొఱత భర్తలేని కొఱత పూర్తి చేస్తూ వుంటావని గ్రామంలోని సిగ్గుకరం లేని ఆడది వక్కను ఎంగిలి చేసి నీకు పంపుతూ వుంటుందని నిన్ను గురించి చెప్పుకుంటూ వుంటారు. ఈ పరిస్థితికి గ్రామాన్ని తెచ్చింది నువ్వే. కాని ఆ పాపం ఎప్పటికో అప్పటికి పండి బ్రద్దలు కాకమానదు."

"పాపాలు, పుణ్యాలు సత్యయుగం నాటివి. ఇప్పుడు రెండూ లేనే లేవు. మీరు ఓ సంవత్సరం పాటు అతిథి సత్కారం చేసి అలిసిపోయినట్టున్నారు."

"నీ భ్రమ ఇప్పుడే తొలగిపోతుంది కాలచక్రం తిరుగుతోంది. మెల్లిమెల్లిగా జనం మేల్కొని తెలివిని బడుతున్నారు. మూర్ఛిల్లిన ప్రజకు, సంజీవని ఎక్కడనుంచో దొరకక మానదు. చాలామంది జనం ఇప్పుడు సంపాదన నేర్చుకున్నారు. సొల్లుకబుర్లు చెప్పుకుండా కూచోవడం మానేశారు. సంసార గోష్టిలో పడ్డారు. భాగవత్ గ్రామపంచాయితీ మీద, సొసైటీ మీద దృష్టి సారించాడు. ఎంతో బాగు చేద్దామని చూస్తున్నాడు. సొంత ఖర్చుతో ఎంతమందికో అప్పులిప్పించాడు. దానితో నీ కడుపులో పెద్ద కలవరం బైలుదేరింది. నువ్వు అతని పని పాటల మీద ఉన్నవీ లేనివీ మాటలు పుట్టిస్తున్నావు. దరఖాస్తులు పెడుతున్నావు. కేవలం నిష్కారణంగా, నీవు అతని వెంటబడ్డావు. తాలూకాలో, జిల్లాలో పెద్దపెద్ద నాయకులందరూ అతన్ని ఎంత వేధించారు నీ మాటల మీద! చట్రంలో బిగించి పెట్టినా నిన్ను, నీతోక వంకరే అది తిన్నగారాదు. గ్రామంకోసం అతనేదైనా మంచిపని తలపెడితే నువ్వు దాని భగ్నంపాడు చేస్తూ వుంటావు. భాగవత్ గ్రహించాడు. ఏమీ కారణం లేకుండానే నీవీ వక్రమార్గం పట్టావని. అప్పటికీ అతను తన సహన శక్తి కోలుపోలేదు. అతను నీ మార్గాని కెప్పుడూ అడ్డు రాకుండా దూరం నుంచే నమస్కారం పెట్టాడు. తిరిగి దీనికి జవాబేమిటా అని ఆలోచించాడు. అతను సూటిగా చెబుతాడు; గ్రామంలో చెయ్యవలసిన పని ఏదైనా వుంటే సొంతంగా చేసుకపోవడమే. నేటి ఈ కుట్ర చట్రంలో అతను ఇమడలేదు. ప్రక్కకు తప్పుకొని సూటిగా బ్రతకడమే ధ్యేయం. మర్యాదకు మర్యాదా దక్కుతుంది, లక్ష లాభాలూ వుంటాయి" అని. నువ్వు జీవితమంతా గ్రామోద్ధరణ, గ్రామోద్ధరణ అంటూ చాలాసార్లు ఘోషిస్తూ వుంటావు. ఇప్పటిదాకా ఒక్క మంచిపనైనా నీవు చేసి చూపించావా? నీ మీద మొత్తం మీద ఎనిమిది లక్షల రూపాయల ఋణం వుంది. వడ్డీ లన్నా సాలు చివరికి చెల్లించడానికి రాదు. బ్యాంకులన్నింటికీ తాళాలు వేయించాలని సంకల్పించావా? రాజ్యం మన చేతిలోనే వుంది. ఏమాడినా ఆడవచ్చు. అంతా గుడ్డి దర్బారు. నీవో సర్కారును తెలివి తక్కువ దద్దమ్మగా తయారు చేస్తావు, జనాన్ని మూర్ఖులుగా చేసి పెడతావు. నన్ను మాత్రం చేయలేవు. గ్రామంలోని మనుషుల్ని ఎవడెటువంటివాడో పసిగట్టె తెల్విటేటలు నాకు దేవుడిచ్చాడు బాబూ! నువ్వు నన్ను అమాయకుడని భావిస్తావు. నిజం చెప్పాలంటే నేను నిన్ను ఒక అమాయకుడి కింద ఎప్పుడో జమకట్టాను.

భాగవత్ మధ్య నీ మధ్యగాని, నా నీ మధ్యలగాని ఎటువంటి జగడమూ లేదు. మరి ఇంత మోహం ముదవు ఎందుకు నీకు? నీవు కేవలం వ్యక్తిగతమైన అసూయ నాధారం చేసికొని ఇంతగా నిందిస్తూ వుంటావు. మేమెంత కాలమని వింటూ కూచునేది? మరి ఎంతని వినేది? "లాల్జీ..." సావిత్రి మృదుమంజుల కంఠధ్వని మోరుసింది. జగదేవు ఉలిక్కిపడ్డాడు. లాల్జీ ఇంట్లోకి వెళ్లి వచ్చాడు.

"క్షమించు. సర్పంచ్ జీ! మన ఇద్దరి మధ్య జగడం నా భార్యకు ఇష్టం లేదు. మా ఆవిడ మాట నేను వినడం నా ధర్మం. అంచేత ఆమె వినతి ప్రకారం నువ్వింక దయ చేయవచ్చు. రాం! రాం!"

5

ఆంజనేయస్వామి ఆలయం ఎదుట మైదానం చుట్టుప్రక్కల సందులూ, గోడలూ అన్నీ జనాలతో క్రిక్కిరిసి పోయినాయి. మృదంగం వాళ్ళు తాళాలవాళ్ళు ఒకటి రెండు 'అభంగాలు' వినిపించారు. ఆ వెనుక భజనదాసు కీర్తనలు, భజనలూ పాడడానికి లేచి నిలబడ్డాడు. తెల్లని శుభ్రమైన దుస్తులు. తెల్లని మరాఠీ తలపాగ. తెల్లని ఉత్తరీయం నడుచుట్టూ చుట్టుకొని దాసు(బాబా)సిద్ధమయ్యాడు. పీటమీద పెట్టిన జ్ఞానేశ్వరి కింద పడింది. చేతితో తాళంవాడిని, మద్దెలవాడిని ఆపమని సైగచేశాడు. కీర్తన ప్రారంభించాడు.

పుండరీక వరదే హరివిఠల్,
శ్రీజ్ఞానదేవుతుకారాం
ఏకనాథమహారాజ్‌కీ జై
పండరినాథమహారాజకీ జై!

అందరూ ఏకకంఠంగా ఉచ్చైస్వరంతో జయజయకారాలు చేశారు. తాళ మృదంగం ధ్వనులు ఆకాశంలో మారుమ్రోగాయి. దాసు శరీరంలో కీర్తన కదంతొక్కి ప్రవహించడం మొదలుపెట్టింది. అంతా శాంతించిన పిమ్మట, సాధు హృదయాన్ని ప్రతి పంక్తిలోనూ, ఆవిష్కరించి చెప్పడం మొదలుపెట్టాడు. మరి ఆ పంక్తుల్ని తిరిగి తిరిగి నెమరువేస్తూ మురిసిపోవడం ప్రారంభించాడు.

"నాశవంతమీ యొడలు
తెలియండి ఓ జనులు,
ఆయువు నమిలివేస్తోందిరా బాబు
కాలదేవత ఇది గమనించు బాబు!"

దేహమునశ్వరము. దేహమటువంటిది? బాబుల్లారా! గమనించారా? నశించి పోయేది. నిజానికి ఈ దేహమంత పవిత్రమైంది భూమండలంలో మరొకటి లేదు

ప్రజల్లారా! తెలుసుకోండి! మరి ఈ శరీరమంత అపవిత్రమైనది కూడ మరొటి లేదంటే నమ్మండి బాబు! అయితే ఈ శరీరం పట్టి పాడుకట్టె అని తెలిస్తే మాత్రం పారిపోతామా! చెప్పండి. సుతరాం పారిపోం. వస్తువులన్నింటిలోనూ, హేయమైన మలంకంటె కూడ హేయమైంది ఈ శరీరం. అని మహానుభావుడు తుకారాం బాబా ఏనాడో ప్రసాదించాడు.

ఏ దేహం పవిత్రమైందో, ఏదేహం అపవిత్రమైందో, ఇప్పుడే మీకు నేను కీర్తనలో విశద పఱచి చెబుతాను. అంతకు ముందు మీరంతా, కరతాళధ్వనులు చేస్తూ పవిత్రమైన పదునారవిందంతో భగవన్నామం ఓ సారి ఉచ్చరించండి. పండరినాథుడు విఠల్‌స్వామిని కీర్తించండి.

విఠల్... విఠల్...విఠల్..విఠల్... దాసుగారితో పాటు జనమంతా పరవశమై పోయారు. నామస్మరణతో. దాసుగారు తిరిగి కీర్తన వ్యాఖ్యానించడం, ఆరంభించారు.

'దేహం మర్త్యమైనది నాశశీలమైంది' ఆగండి దాసుగరూ! మేము మిమ్మల్ని ఓ విషయం అడిగి తెలుసుకోవాల్సి వుంది. మీరు చెబుతున్నది సరిగాదు. మేమూ ఇంత భాగవతం, భగవద్గీత, జ్ఞానేశ్వరి చదువుకొన్నవాళ్ళమే. అధ్యాత్మ శాస్త్రాన్నంతటినీ, వాని ద్వారా తిరగేసినవాళ్ళమే. మమ్మల్ని పల్లెటూరి అలకా జనం అనుకోకండి. దేహం నశిస్తుందని మీరంటున్నారు అయితే గీతలో ఆత్మ అమరమైందని చెప్పబడివుంది. ఆత్మ భూతములన్నింట సమానం, అన్ని ఘటాల్లోనూ వ్యాపించి వుంది. అయితే అలిప్తమైంది. అని చెప్పబడివుంది. ఒక శరీరం ఆపవిత్రం, మరో శరీరం పవిత్రం అని మీరు చెప్పే మాటలు తప్పు. మేమైతే ఇలా చెప్పువుండేవాళ్లు(గందరగోళం పడవద్దు. శాంత చిత్తంతో చిత్తగించండి.) అన్ని ఘటాల్లో ఆత్మారాముడొకడైనా, ఎద్దు, ఆవు, కప్ప, ఇవన్నీ, మురికి కాలువల్లో నీళ్లుతాగితే, మనిషి మాత్రం అట్లా తాగడు. అతనూ ఆత్మారాముడే, ఇవీ ఆత్మారాములేగా! రెండు సమానమే. అంటే అసలు సంగతి ఇట్లాగూ!

"ధశరథుని పుత్రుడొక రాముడూ,
ఘటఘట రాముడు వేఱొకడూ!
మూడో రాముడు, సర్వాంతర్యాముడూ!
నాలుగోవాడు భలేభలే రాముడూ!"

హరిదాసుగారు చేతులు జోడించి విన్నవించాడు అతనికి. కీర్తన సాంతం కానీయండి. ఆపైన మీరేమైనా అడగండి. కీర్తన మధ్యలో గడబిడ సేయకండి కాని

యేద్యాకాక('పిచ్చికాకా)వినడానికి సిద్ధంగాలేడు. తను వేదాంతం సాగిస్తూనే వున్నాడు. అతను కేవలం 'రమ్పిచ్చి' రకం. అందుకే అతన్ని 'యేడా కాకా 'అని అందరూ పిలవడం. అతనికో అయిదారుగురు వంతపాటగాళ్లున్నారు. వాళ్లు తాను కలిసే ఏటకేడాది వేదాంతంపైన సిద్ధాంతరాద్ధాంతాలు చేస్తూ వుంటారు. ఇంతకు మించి ఆ మండలికి ప్రపంచమంటూ తెలిసింది లేదు. గంజాయి చిలు బుర్రకెక్కించి ఆ నిషలో, జపమంటూ, సద్గురు మహిమ అంటూ మెట్ట వేదాంతం సాగించడమే వాళ్ల పని. ఎవళ్లు ఎక్కడ ఏది మాట్లాడినా, మధ్యలో వేదాంతం పిడకలాట మొదలుపెడుతారు.

భూమి శేషుడు మీద వుంటే శేషుడెవరి మీద ఉన్నాడు? బ్రహ్మాండంలో శూన్య మెంత? అన్నిటికంటె మహా శూన్యమేది? భూమి ఎన్ని ఖండాలు? ఎన్ని ఖండాలు భరత ఖండం? కాశీఖండం భూగోళంలో ఎక్కడా కనబడదేం?

చదువుకొన్న వాళ్ల తెలివితేటలు వాళ్ల ముందు గడ్డిపోచకు పనికిరావు.

నడుస్తూ నడుస్తూ వున్న మనిషిని దారి మధ్యలో నిలవేసి చేయి చూపించ మంటాడు యేడాకాకా, చేతికి వున్న అయిదు వేళ్ల పేర్లు చెప్పమంటాడు. తలుచగా, ఎదుటి మనిషి బొటనవ్రేలు, చిటికెన వ్రేలు మాత్రం చెప్పి వూరుకుంటాడు. మిగతా వాటి పేర్లు తట్టవు దబ్బున. వెంటనే కాకా అతగాడి సోదరుల పేర్లు, పెద్ద వాళ్ల పేర్లు చెప్పమని అడుగుతాడు. అతను సహజంగానే అవన్నీ చెబుతాడు. వెంటనే కాకా అతన్ని మహా మూర్ఖుని కింద జమకడుతాడు. నీ చుట్టుపక్కల పేర్లన్నీ తెలుసు. నీ శరీరం జ్ఞానం మాత్రం నీకు లేదని హిహీ అని వెక్కిరించేస్తాడు. అంటే అజ్ఞానాంధకారంలో మునిగివున్నావన్నమాట అని తీర్పు చెప్పేస్తాడు. ఒకసారి ఒక మనిషి భజన చేస్తూ తటస్థపడ్డాడు. కాకా అన్నాడు.

"యోగములిర్వదియెనిమిది ఇలుకపై నిలబడు" దీనిలో యోగమంటే ఏమిటి? మాష్టరు చెప్పి ఉంటాడు వర్షములు, కాలములు గుణించి, యుగములు 28 అవుతాయని. ఇంకేముంది, అతన్ని కాకా మూర్ఖుని క్రింద జమకట్టేశాడు. యోగాలు ఇరవై ఎనిమిది. యోగమంటే! రాజయోగమా? బ్రహ్మయోగమా? లేక కర్మయోగమా? మీ మాష్టరేమిటిట్లా చెప్పాడు?

ఆత్మ పిండంలో వుందా? బ్రహ్మాండంలో వుందా? ఘటాలన్నింటిలో వ్యాపించి, అలిప్తమై వుంటుందని, గీతలో చెప్పబడి వుంది. అంటే భూతాలన్నీ సమానమేనని చెప్పినట్లేగా! మరి అయితే మనుషుల్లో ఎంత గొప్పవాడైనా సరే, వాడిని

'మహాత్ము'డనడం గొప్ప పొరపాటు. వాళ్లకి వేదాంత జ్ఞానం ఏమీ లేదు. చిలిం దమ్మెక్కించి, వేదాంతమంటూ రెట్టమతం సాగిస్తారందుకని, వాళ్ల చాయలకెవరూ దబ్బున వెళ్లరు. ఎవడైనా సాధువుకాని, విద్వాంసుడు గాని, హరిదాసు గాని కనబడితే చాలు, అతని తెలివితేటలు తూచి చూద్దామనే ఉబలాటం ఎక్కువ వాళ్లకి. వాళ్లు గ్రామంలో అప్పుడప్పుడూ, చక్కర్లు కొడుతూ, చెఱుకు ముక్కలు కోసి, చిన్న పిల్లలకు పంచి పెడుతూ వుంటారు. రకరకాల జెండాలు తీసుకొని, ఎగురవేస్తూ తిరుగుతూ వుంటారు. యేడాకా ఓట్ల బూతుకు ఓటు వేయడానికంటూ వెళ్లడు. తన ఓటు ఎవరికో వేయడమేమిటి వెర్రిగాని! అంతేకాకుండా సర్కారు హోటుకు ముసుగు కప్పింది. మనం ఎవరికైనా రహస్య గోష్ఠి చెప్పుకుంటామా చెప్పండి. ఆలుమగల మధ్య ఎన్నో రహస్యాలుంటూ వుంటాయి. ఆ రహస్యాల్ని ఇంకొకళ్లకు చెప్పుకుంటారా? అంతేమరి. మన రహస్యం ఓటును మన దగ్గరే వుంచుకోవడం మేలు. అది రహస్యమైంది గదా. అది ఇంకొకళ్లకెలా ఇస్తాం. చెప్పండి. ఇదీ ధోరణి. ఇందుకని అయిదు నిముషాలు మించి, ఓటు అడగడానికి వచ్చినవాడు యేడాకా వద్ద నిలబడడు. అతని ఓటు సంగతి ఎల్లావున్నా అతని ఉపన్యాసానికి తట్టుకోలేడు. వినడం కష్టసాధ్యం.

ఎడాకాకా తిరిగి జోరున వేదాంతం కురిపిస్తున్నాడు. జనమంతా పొట్ట చెక్కలయ్యేటట్లు విరగబడి నవ్వుతున్నారు. పెద్దపెట్టున పిల్లలు కేకలు, బొబ్బలూ పెడుతున్నారు. కొంతమంది జనం లేచి వెళ్లిపోతున్నారు. అంతా అయోమయం గందరగోళంగా వుంది. పోలీసు, సబినస్పెక్టరు, మునసబు, ఏదో అడుగుతున్నట్లు, నటిస్తున్నారు. పోలీసులు కీర్తన సభల్లో అల్లరి మూకను వెతుకుతూ తిరుగుతున్నారు. హెడ్డుకాంస్టేబిలు తటాలున 'సావజీమేషు'ని పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. వాళ్లందరూ గ్రామ పంచాయితీ ఆఫీసు దగ్గరకు వెళ్లారు. జనంలో మరింత గలభా బైలుదేరింది. ఏమిటి పితలాటం అని ఒకరొకర్ని అడిగి తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కీర్తన సభ కట్టిపెట్టి గ్రామ పంచాయితీ కార్యాలయం వైపు జనం పరుగు లిడుతూ పోయారు.

సావజీమేషుని పంచాయతీ ఆఫీసులో ఇనస్పెక్టరు సాబు కస్టడీలో వుంచారు. ఇనస్పెక్టరు సాబు, అప్పుడే పొలంలోని గుడిసెలోంచి పట్టుకొని వచ్చిన 'హవుసాను దర్యాప్తు చేస్తున్నాడు.

"ఈ మనిషిని నీవు గుర్తు పడతావా?"

"అవునండీ. ఈయన పొలం మా పొలం పక్కనే."

"ఈయన నిన్న నీ పొలంలోకి ఏదైనా పని మీద వచ్చాడా?"

"పనేంలేదు. ఊరికే అలా అలా వచ్చాడు."

"ఏమీ పనిలేకుండానే?"

"ఏం పని లేదు సాబ్."

ఇనస్పెక్టరు సాబు బెత్తంతో చర్రుమని ఓ పీకు పీకాడు. పెద్దపెట్టున ఏడ్చింది.

"లేదు సాబ్. నేనే పిలిపించాను."

"పనేంటి? నిజం చెప్పు. ఊరికే పోదు. నిజాం రాజ్యంలో అమీను సాబు తెలుసా!"

ఇనస్పెక్టరు సాబు మూలనున్న సారా సీసా నోటికి తగిలించుకొని, గటగటా ఖాళీ చేసి అవతల పారేశాడు.

"లంజముండకాన! నిన్ను ప్రాణాలతో వదిలిపెట్టను. చెప్పు."

"కడోబాను ఇంటికి తీసుకొని వెళ్ళున్నాను సాబ్!"

"కడోబా బ్రతికి వున్నాడా? చచ్చాడా?"

"చచ్చిపోనాడు సాబ్! కాని నేను చంపలేదు బాబో!"

ఇనస్పెక్టరు తటాలున లేచాడు. చుఱ్ఱున చుఱ్ఱున నాలుగు వేతలు వేశాడు బెత్తంతో, దాని జుత్తు పట్టుకొని లాగాడు. మెలవేసి గుంజడం మొదలుపెట్టాడు.

"చెప్పు ముండా! చెప్పు. నువ్వే ఆయన్ను ఖతం చేశావు. ఎండ్రిన్ తాగించావు. సిగ్గులేని ముండా! మా పోలీసులకు కూడ వెర్రులెత్తించావు. పంచనామ అబద్ధం ఎందుకు రాయించావు. గ్రామంలో ఈ హత్య వెనుక ఎవడి చెయ్యి వుంది చెప్పు."

"పోలీసులే అల్లా చెసారు సాబ్! నేను అలా అబద్ధాలు రాయమని చెప్పలా సాబ్!"

ఇనస్పెక్టరు సాబు మళ్ళీ బెత్తంతో వడ్డించడం మొదలుపెట్టాడు. సావజీ యెదుట వాయించాడు. పోలీసు జమాదార్ మరి ఇద్దరు ముగ్గురు పోలీసులు, వాకిటి బైట గాబరాగా పరుగెత్తి పోతూ జనాన్ని పెద్దగా కేకలు పెడుతూ జబర్దస్తీ తటిమివేస్తున్నారు.

ఇనస్పెక్టరు ధడీలుమని తలుపు వేసేశాడు. ఆఫీసు లోంచి సాక్షి హవుసాలు పెద్దపెద్దగా ఏడవడం మాత్రం వినబడుతుంది. ఇనస్పెక్టరు సాబు వాళ్ళ మీద గర్జిస్తూ విఱుచుకుపడుతున్నాడు. బైట పోలీసులు హెడ్డు కానిస్టేబిలు చెవిలో ఏదో గాబరాగా చెప్పుతున్నారు.

"పాటీలు, జమాదారు ఇప్పుడు చచ్చాడనే అనుకోండి. పంచనామాలో అతను ఓ ఘోరమైన తప్పు చేశాడు.

"మీ పోలీసులింత లోభులేంటయ్యా! ఏకేసులో తినాలి, ఏకేసు మార్చాలి, ఏ కేసులో అబద్ధాలు, సుబద్ధాలు దూర్చాలి, వీటిని గురించి సరిగ్గా ఆలోచించనే ఆలోచించరేం?

"కాని పాటీల్! వెనుక ఈవిడ కడుపు పోగొట్టుకుంది. ఈ విషయం చాలా చిక్కులతో కూడింది. మేం ఎల్లాగో దాన్ని పైకి పొక్కకుండా అణచివేశాం. నువ్వు కూడా అప్పుడు పోనియ్యి అన్నావు అందుకని. ఈ వ్యవహారమంతా సాక్షి ముందు నడిచింది. అతని కంతా తెలుసు. అతడొక వేళ కొంపదీసి, పారటాలున ఇనస్పెక్టరు ముందు ఈ బాంబు పేల్చాడో నేను కూడా చచ్చానన్నమాటే."

"జీవితంలో చాలా పోలీసు ఠాణాలు చూశాను, పల్లెటూళ్లూ చూశాను. కాని ఇటువంటి ఊరు, హవుసా వంటి ఆడదాన్ని ఎక్కడ చూసింది లేదు రావ్జీ!"

హవుసా చిన్నతనంలోనే ముండమోసింది. కొంచెంగా పొలం వుంది. దానిలోనే ఓ గుడిసె వేసుకుని కాలక్షేపం చేస్తోంది. అడపాదడపా ఊళ్లోకి కూడా వస్తూ పోతూ వుంటుంది. కడోబా ఆమె పని చూస్తూ వుండే జీతగాడు. చాలా ఏళ్లుగా ఉన్నాడు కనిపెట్టుకొని. ఆమె వయస్సును బట్టి చూస్తే అతను చిన్నవాడు. ఆమెకు అతనంటే గురి కుదిరింది. అతని ద్వారా కోరికలన్నీ నెరవేర్చుకుంది. తన దగ్గరే రాత్రిళ్లు వుండేవాడు. హవుసా గుడిసెలో నడిచే చరిత్రలోని ప్రతిపేజీ, కడోబాకు కంఠస్థమే. కాని ఎంత వైపరీత్యం! ఇంత ఘోరం జరిగింది ఎవరికీ తెలియదు. ఎండ్రిను ఇచ్చి మనిషిని చంపించేసింది. ఖచ్చితంగా అంతే నిర్దాక్షిణ్యంగా జరిగింది.

రౌడీ మూకాలన్నీ గుంపులు గుంపులుగా, ఆఫీసు దగ్గిరిసా, మారుతి దేవాలయం పహరీ మీద, గోడలమీద మూల మూలల నక్కి కూచున్నారు. అనేక రకాలుగా వాళ్లు వితర్కించు కుంటున్నారు, మెల్లిమెల్లిగా గుజగుజలుపోతూ.

"ఎంతపుణ్యాత్మురాలీ తల్లి! ప్రపంచంలో ఇటువంటి తల్లి మరి పుట్టబోదు. ఎన్నెన్ని ఘట్టాలు జరిగినా చెక్కు చెదరకుండా నాకే మన్నట్టు వుంది. ఈమె 'కడోబాను చూపించకుండా వుంటే-"

"అరే సాలా! నువ్వు వొట్టి గాడిదలా వున్నావు. అతనంటే ఆమె కెంత ప్రేమో నీకెం తెలుసు! అతను లేకుండా నోట ముద్ద పెట్టు కోదంటే నమ్ము! అతనికి తమలపాకులు చుట్టి తొడమీద కూచుని, నోటికి విడియం అందిస్తుందోయి. ఈమె

అతన్ని ఛస్తే చంపించ లేదు. ఎవడి ద్వారనో రాకపోక లేర్పడి, ఏదో పెద్ద రామాయణం నడిచి వుంటుంది. ఇది మాత్రం నిజం."

"జరిగిందో జరగలేదో గాని బుర్ర ఉపయోగించి చేసిన పని కాదు. ఎప్పుడు చూసినా, ఏదో ఒక నూతన ఘట్టం బైలుదేరుతూ వుంటుంది. గ్రామంలో నిజాయితీ అనేది లేకుండా పోయిందిరా బాబూ! మొగలాయీల తురక ప్రభుత్వంలో ఇంతకంటె ఎంతో బాగా భజనలు, పూజలు, నగర సంకీర్తనలు, నామ సప్తాహాలు, వనభోజనాలు ఇంకా ఎన్నో జోరుగా జరుగుతూ వుండేవి. అవన్నీ ఇప్పుడు లోకం మటుచేపోయింది. ఇప్పుడు స్వతంత్ర రాజ్యాంగం మంది. ఇందులో అందరూ సొతంత్రులే. ఎవడి ఇష్టం వాడిది. ఏలాటి అడ్డూ ఇక లేదని ఏదో ఒకటి రబస చేస్తూనే వుంటారు. ఇటువంటి గొడవల్లో ఊరు వృద్ధికి రమ్మంటే ఏం వస్తుంది?"

"ఎంతో 'కరకట్టు' మాటాడావు. ఊరు ముందుకి పోయేది పెట్టేదీ లేదు. మన ఆయుర్దాయాలన్ని ఇట్లా తెల్లవారి పోవాలసిందే. ఇంకో ఊరు అభివృద్ధికి పోతుందంటే, చుప్పనాతితనంతో మొట్టికాయలు విరవడమొకటే మనకు తెలిసిన విద్య. మనలో ఉన్న లోపాలు సర్దుకొని, మార్పు తెచ్చుకోవాలనే కోరికే లేదు. కాయకష్ట పడడం వదిలేసాం, నౌకరీ చాకిరీ చేయడం మానుకున్నాం. దురలవాట్లు పెరిగి 'థింగాణా'లతో పొద్దుపుచ్చుతున్నాం. గ్రామంలో దిగువటేల వాళ్లు ముందు నడుస్తుంటే, మనమూ చిందులు తిక్కుతున్నాం. ఇదివరకైతే ఊరంతా ఒక్క తాటి మీద నడిచేది. గ్రామంలో ఏమైనా హెచ్చు తగ్గు పొరబాట్లు జరిగితే, ఆంజనేయస్వామి గుడి అరుగు మీద పెద్దలు బిరాయించి, తీర్పు చెప్పే వాళ్లు! ఎవడి ఫలితం వాడి చెంగుకొంగున వుండేది. అనుభవించే వాడు కిక్కురుమనకుండా. ఎవడూ నోరెత్తడానికి వీల్లేదు. అదుగో సొవలీరాం. సాలా మాదరచోద్! ఆడకుక్కను కట్టేసి సంభోగించాడు! ఇది మీరు నమ్మరు. కాని నూటికి నూరు పాళ్లు నిజం. ఇది నా ఎదుటే జరిగింది. తన కులం గోత్రం వాళ్లందరి కాళ్లూ, గడ్డాలూ పట్టుకుని ఆంజనేయస్వామి గుడిలో పాతిక రూపాయలు జుర్మానా చెల్లించుకున్నాడు. ఇప్పుడు చూడు. కంఠంలో తులసీమాల. మళ్లీ తప్పుదారి ఎప్పుడూ తొక్కలేదు. ఇప్పుడు ఎవడన్నా దొంగతనం చేసినా కడుపులో పెట్టుకోవడమే, ఇళ్లు తగలపెట్టినా నోరుమూసుకోవడమే, థింగాణా చిందులు త్రొక్కితే, కళ్లు మూసుకొని వాళ్ల రభస అంతా చేయనీయడమే. పైకి ఎవడన్నా నోరు మెదిపాడా, వాడు వొట్టి మూర్ఖుడు, తెలివితక్కువ దద్దమ్మ, లోకానికి పరమశత్రువు."

"నిజం పాటేలు! తను గ్రామానికియ్యవలసిన బాకీ ఇచ్చాడు. నాట్లు ప్రారంభించడానికి రెండురజులు ముందు, భాగవతరావు పొలం గుడిసెలోని వ్యవసాయం పనిముట్లన్నీ ఎవరో భ్రష్టు పట్టించారు, భోషాణం, జక్కడ అన్నీ రాత్రికి రాత్రి తగలపెట్టారు. ఆయన పాపం నిజమే చెప్పాడు. నేను గ్రామానికెన్నడూ కీడు తను పెట్టనేలేదు. ఎవరికీ చెడు నేర్పలేదు. ఈ గ్రామంలో అంతకంతకీ చెడు విజృంభించిపోతోంది." అని. ఆయేడు ఆలస్యంగా నాట్లు పడినా, అతని పొలంలో, మిగతా వాళ్ళందరికంటె ఎక్కువ పంట పండింది.

"భాగవత్ లా ఇంకా నలుగురైదుగురు మనుష్యులు, సరైన పంట పండిస్తే ఊళ్లో రికామిగా పొద్దుపుచ్చేవాళ్లకి, కళ్లు తెరిపిళ్లు పడుతాయి. ఇంకోళ్ల దాకా ఎందుకు? సర్కారు నెత్తినోటా ఘోషిస్తోంది. బాబుల్లారా! డబ్బులు తీసుకోండి. విత్తనాలు తీసుకోండి. నాట్లు సకాలంలో నాటండి అంటూ. హైబ్రీడో అదేమిటో, ఆ విత్తనాలూ, ఎరువులూ విచ్చలవిడిగా అందజేసింది ప్రభుత్వం రైతాంగానికి. ధాన్యం శిస్తుడబ్బులూ, వసూలు చేయడానికి వస్తే మాత్రం అందరు పాడేది ఒకేపాట! దొర! ఈ హైబ్రీడు విత్తనాలు ఒట్టి నాసిరకం మాకిచ్చారు. నేలలోంచి మొక్క పైకి రానేరాదు. మేము మీకు డబ్బులు ఎట్లా చెల్లిస్తాం బాబూ! పొలమంతా పాడు పడిపోయింది. ఊరంతా దుబ్బుపాదలే! అంటూ అయిదాగురు మనుషులు మాత్రం ఎంత పండించినా, మిగతా వాళ్లంతా నిద్రపోతుంటే, 'నాతలకాయ' ఏం పండిచుస్తుంది! సర్కారుకు చెప్పడం మంచిది! నువ్వెంత డబ్బున్నా పారేయి. ఎంతైనా మొత్తుకోండి మా ఊళ్లో కొంచెంకూడా చీకూ చింతా లేదని.

కిందటేడు గిరిజాబాయిఇల్లు తగల బడ్డ కేసు నడిచింది. మోటారునిండా పోలీసులు వచ్చి ఊళ్లో దిగారు. గిరిజాబాయికి ఎవరితోనూ, ఏ పేచీ లేదు. విరోధంతో లావాదేవీలతో, చేసిన పని కాదు. నిష్కారణంగా తగులబెట్టారు పాపం! లోకం అనుకుంటుంది గ్రామ పంచాయితీ ఎలక్షనుకు సంబంధించిన కేసొకటి ఉంది. అందుకని తగలెట్టారని.

"మీబోటి వాళ్లకు విషయంలో అర్థభాగం కూడా తెలియదు. అంతా తెలిసినట్లు ఓ కథ అల్లిపెడతారు. కేసుగీసూ ఏమీలేదుటువంటిది. మన ఊళ్లో 'ఖుసరూ' అగసాలె లేడూ? వాడి పెళ్లాన్ని ఎరుగుదువా? ఆమె గొడ్రాలు. ఆవిడ చేసిన పనే అది. ఆమెకు పిల్లా మేకా ఎవరూ లేరు. గొడ్రాలుగా ఉండిపోతే ఎట్లా మరి! ఆ రోజు అమావాస్య. సగం రాత్రి గడిచిపోయింది. నిమ్మకాయలు కోసి పారేసింది గిరిజాబాయి ఇంట్లోకి

వేపమండలు చేతిలో పట్టుకుంది బాలెంతరాలి మంచం మీద పసిపిల్ల పడుకుని వుంది. ఆ పిల్ల ఒంటిమీద పడేటట్లు కిటికీ గుండా ఓ కొత్త రవికకు నిప్పంటించి, పడేసింది. సంతానం కలగాలని ఆవిడ పడిన పాట్లకు లెక్కాపక్కాలేదు. ఎవడో శుద్ధమొద్దు బైరాగి ఆవిడకు ఆ గురుమంత్రం ఉపదేశించి వుంటాడు.

"అట్లాగా! బాబోయి! ఇప్పుడర్థమైంది ఆమె ఎంత సాహసికురాలైందో! ఓయిబాబో! ఈవిడేమి ఆడమనిషి!..."

"అట్లాకాదు బాబూ! రోజుల తరహా ఎంతైనా మారిపోయింది, చూశావ్! రేపటి రోజు ఏమవుతుందో, చెప్పడం కష్టం. ఎవరినీ నమ్మేకాలం కాదిది బాబూ! చుట్టాల్ని స్నేహితుల్ని నమ్మడం కూడ కష్టమే. ఏకానాథ్‌మహారాజ్, ఏనాడో చెప్పి వేశాడు రానున్న కాలం గురించి. అది ఇప్పుడు మనకు అనుభవానికి వస్తోంది.

నిర్గుణ బ్రహ్మ వచ్చాడు మా గ్రామం,
చెప్పుతున్నాడు జ్యోతిషం,
వినుతాతా! ప్రపంచంలో జరిగే విపరీతం!
అన్నాచెల్లెలు అవుతారు భార్యాభర్తలూ!
అయిదేళ్ళ పిలకూన అలమటిస్తుంది మొగడికోసం!
ఆరేళ్ళ పిల్లలకు ఆర్నెల్ల గర్భం!।వినుతాతా।
సుడిగాలి రేగుతుంది భూమండలంపై,
పెద్ద పెద్ద కొండలు, ఎగురుతాయి దూదిపింజలై।వినుతాతా।
పద్దెనిమిది జాతులూ, పటుచుకొని చాపలూ
కలిసిమెలిసి తింటారు కంచాల్లో ।వినుతాతా।
కలియుగం తీరు, కనరా, వినరా!
కత్తికడతాడు తండ్రిపై కనిపెంచిన కొడుకూ!
పరిణయమాడిన పతిని విడనాడి,
ఇంటింట తిరుగుతాది, కలియుగ కాంతా।వినరా।
ఆకారం పోయి అంతా నిరాకారమవుతుంది,
సూర్యచంద్రులే నింగినుంచి పారిపోతారు తాతా!
జగమంతా అంధకార మీ జగమంతా అందకారం!।వినరా।

ఇదంతా మన కళ్ల ఎదుటే జరుగుంతుందని, ఈ సాధు మహాపురుషులు ఎంతో కాలం ముందే జోస్యం చెప్పారు. ఆ సమయంలో ఏకనాథ్ మహారాజా ఆ విధంగా

రాశారని బాబా ఆవేశంగా చెప్పాడు. ఇట్లా అశుభంగా మాట్లాడ కూడదని ఆనాటి పైఠాన్‌లోని పండితమండలి గొణుక్కొంది. అయితే ఆయన చెప్పిన 'కాలజ్ఞానాలు' అన్నీ ఖచ్చితంగా నడుస్తున్నాయి. ఏకనాథ్ మహారాజు 'తత్వాల్లో' రాసిందంతా అక్షరాలా నిజమే. నిజంగా జ్ఞాని అంటే అటువంటి వాడే!

"పాటీలు ఇటు వస్తాడా భాయీసాబ్!" అని అడిగాడు తోత్యామాంగ్.

పాటీలు ఇక్కడికి ఎలా వస్తాడు? నీవూ వినే వుంటావు జరిగిన సంగతి ఖచ్చితంగా. ఆఫీసు వైపు అంత గందరగోళం జరుగుతుంటే, పాటీలు ఇక్కడికేం వస్తాడు?"

"ఇదికూడా పెద్ద రగడే. నా మీద జనానికి విశ్వాసం లేదు. ఇప్పుడు పంచాయితీ మెంబరునైనా, నమ్మకం కుదరడం లేదు. పాటీలు ఎల్లాగో ఊళ్లోకి వెళ్లాడు. జమాదారుని కూడా పంపించాడు. అప్పుడప్పుడూ ఊళ్లో వినబడుతూ వుంటుంది. తండ్రికీ పిల్లకీ ఒకే మంచం అని అంటారు గదా సూది దారం ఒకే చోట వుంటాయని. కాని నిజమేమిటో నేటికీ ఎవరికీ తెలియదు. అంతా సద్దుమణిగింది. ఆ రండాముండను బాది బాది అంతా అలసిపోయారు. ఆ ఫౌజుదారు సాబు సావజీ మిటకరిస్తూ చెప్పిన మాటలన్నీ రాసుకున్నాడు. నేను స్వయంగా కిటికీ కంతలోంచి చూశాను ఈ తతంగం. జమాదారు కూడా చూసి గాబరా పడ్డాడు. పాటీలే జమాదారుని గ్రామంలోకి పంపించి వుంటాడని నా మనస్సు నాకు చెప్పింది. ఎప్పుడో ఒకప్పుడు కాలం దాచి పెట్టిన రహస్యం బద్దలై బైటపడక మానదు.

"సావజీ ఏమిటి చెప్పాడు?"

"సరిగ్గా వినపడలేదు. వాడిప్పుడు స్పృహ లేకుండా పడి వున్నాడు. వాడి ఎముకలూ బొమికలూ అన్నీ విరగగొట్టి మరీ వదిలారు. పొద్దున్నే పోలీసు, ఠాణాకు పట్టుకెళ్లతారు. ఆ లంజముండ తన అంతఃకరణాన్ని ఏమూలో దాచి పెట్టింది. పోలీసువాళ్లు స్టేషను వదిలిపెట్టి తనని హైదరాబాదు తీసుకెళ్లినాదానికి చీకూ చింతా లేదు. ఆ మహాతల్లి నిమ్మకు నీరెత్తిన రకం. తొణకదు బెణకదు."

అని తోతామాంగ్.

రాత్రి రెండు మూడు గంటల పొద్దు కీర్తన కోసం వచ్చిన జనం, ఈ నూత్న రాంభజనవిని, చెల్లాచెదరుగా వెళ్లిపోయారు. మారుతి ప్రాకారం దగ్గర వున్న గుంపుకూడ 'తోతామాంగ్' వచ్చిన ఏమ్మట మెల్లిమెల్లిగా జారుకుంది.

కీర్తన సమావేశంలో అల్లకల్లోలం పుట్టిన తర్వాత మండలి అంతా

చెల్లాచెదరై పోయింది. కీర్తన ధోరణి భంగమైంది. కీర్తన కారుడైన హరిదాసు 'పుండరీకవరదే హరి విఠల్,శ్రీ జ్ఞానదేవ్' అని బిగ్గరగా అని నెత్తిని చెయ్యి పెట్టుకుని వుండి పోయాడు. ఓ వైపు వేదాంతం గందరగోళం అయితే మరో వైపు పోలీసుల హడావుడి! బాబా బాగా బలవంతం పెట్టనీ, తనకే మనసు పుట్టనీ, భాగవతారు నేడు కేవలం కీర్తన కోసం, భజనానందం కోసమే వచ్చాడు. కాని భజన స్వారస్యం భగ్నమైపోయింది. ఒడ్డు పట్టు లేదు. గందరగోళం సద్దుమణిగిన తర్వాత, భాగవతారావు దాసుగారిని ఇంటికి తేసుకొని వెళ్లాడు. జాము, రెండు జాములసేపు అనేక పురాణ గ్రంథాల్లోంచి, అనేక ప్రసంగాలపై చర్చ నడిచింది. భాగవత్ దాసుగారికీ, నాకు ఈ కథలూ గోష్ఠులూ అన్నీ తెలిసినా కీర్తనలంటేనే ఎంతో మక్కువ. మా ఊళ్లో, ఊరి బైటవున్న దేవీ మందిరంలో, విఠల్ మహారాజు ఉండేవాడు. ఆయన దాదాపు ఓ సంవత్సరం పాటు ఉన్నాడు. అయితే పన్నెండేళ్ల సాన్నిధ్యం అన్నట్టుగా వుండేవాడు. అంతటి మహాజ్ఞాని నా దృష్టిలో మరోడు లేడు. గుట్టు చప్పుడు కాకుండా ఓ రోజు పిట్టకు కూడా చెప్పకుండా, ఓ ఉత్తరం ముక్క మాత్రం రాసిపెట్టి ఎక్కడికో వెళ్లిపోయాడు. ఆయన చేసిన ఈ పని నాకు ఏమాత్రం మింగుడు పడడంలేదు. జ్ఞానేశ్వరి, శ్రీమద్భాగవతమూ, వీని ప్రవచనం, నిత్యమూ, గుళ్లో నడుస్తూ వుండేది. నేను చెపుతున్నా మీకు- జ్ఞానేశ్వరిలోని ఓవీలను తీసుకుని, జ్ఞానేశ్వరుని మారురూపంగా, గంగా ప్రవాహంగా ప్రవచనం సాగిపోతూ వుండేది. మేం పదిమంది రోజూ ఇటీవలి తప్పనిసరిగా వెళ్లి వింటూ వుండేవాళ్లం. నాకున్నట్టుండి మంచి బుద్ధి కలిగింది. గత కార్తికమాసం మహారాజుతో పాటే, ఆళందికి వెళ్లి సజ్జన సాంగత్యం పొందాము. తిరిగి ఇంటికి రావడానికి ఓ పట్టాన మనస్కరించలేదనుకొండి. మహారాజంటే ఆళందిలోని జ్ఞానపీఠంలో ఎంత గౌరవం, ఎంత ప్రతిష్ఠ ఆయన శ్రీచరణాల నీడలో ఎంత మంది సాధుసంత్పురుషులు హాజరయ్యేవారు! అది అంతా చూసి నేను నిజానికి ఎంతో గాబరా తిన్నాను. నాకు గూడా అనిపించింది, మహారాజుగారు అక్కడే వుండి పోతే బాగుంటుందని. మన ఈ ముష్టి కుగ్రామంలో ఆయన పడివుండడం దేనికి? కాని మహారాజు నా మాట వినిపించుకోనే లేదు. మహారాజు ఎక్కడినుంచి వచ్చారు? ఇక్కడ ఈ పల్లెలో ఇన్నాళ్లు ఎలా నిలిచి పోయారు? ప్రాణం విసుగెత్తి ఎందుకు ఎలా, ఎక్కడికి ఎవరికీ చెప్పకుండా 'బిఛాణా' ఎత్తేసి వెళ్లిపోయారు, ఇదంతా అంతులేని ఆయన జ్ఞానం వలనే మన ఊహకందని ఓ అద్భుత ఘటన. ఆ తర్వాత చాలా వెతికాం. ఎరిగినచోట్ల కన్నిటికీ ఉత్తరాలు రాశాం.

ఎప్పుడైనా మనసు దిగులుగా వుంటే-మహారాజాగారి స్మృతులు నెమరువేస్తూ వుంటాను. ఈ విషయం చెబుతున్నప్పుడు భాగవత్ కళ్లు అశ్రుభరితాలైనాయి. దాసుగారు కూడా కొంత గాద్గద్యం వహించారు. ఇట్లా వుంటూ, బాబాలాంటి వ్యక్తి పృథ్విపైన అని ఏదో చెప్పపోయాడు. మహారాజు స్మృతులలోపడి భాగవత్ అలిసిపొలిసినట్లయ్యాడు. రాత్రి ఎంతో పొద్దుపోయింది. కీర్తనపరుడైన దాసుగారికి కూడా నిద్రముంచుకొస్తున్నట్లు వుంది భాగవత్ ఆయన్ను వదిలాడు. అవతలప్రక్క వసారాలో ఆయనకు ప్రక్క అమర్చి, ఆయన్ను అక్కడకు చేర్చాడు. తిరిగి గదిలోకి వచ్చి, వంకెకు లాంతరు తగిలించాడు. పక్కనున్న పడకపై గంగ వచ్చి పడుకొని నిద్రపోయింది భాగవత్ ఆమె వంటి మీద మరో దుప్పటి కూడా కప్పాడు. తను తన పడక మీద బిర్రబిగిసి కూచున్నాడు. అతనికి నిద్ర రావడం లేదు. విఠల్ మహారాజు స్మృతులు అతన్ని కల్లోలపరుస్తున్నాయి. ఇంతలో ఊళ్లోని అలజడులు. వీటిమూలాన, అతని నిస్పృహతా నైరాశ్యాలు మరింత పెరిగిపోతున్నాయి. కళ్లు రెండూ గట్టిగా బిగించినా, రెప్పలు మూత పడడం లేదు. వంకెకు తగిలించిన లాంతరు దగ్గరకు కదుపుతూ వున్న ఆడదానిలా, బల్లి మెల్లిగా వచ్చి చేరింది లాంతరు దగ్గర వున్న పురుగును, ఒక్క పరుగుతీసి గుటుక్కున మింగేసింది లాంతరు ఇటూ అటూ ఊగింది. పక్కనున్న గోడ సందులో రోజూ సాయంకాలం వచ్చి చేరే పిచ్చుక తుర్రుమని ఎగిరి గిరవాట్లు పెట్టుతూ చక్రాలు కొట్టుతూ ఇల్లంతా ఎగరసాగింది చాలా పొద్దుపోయింది. తిరిగి కొంతసేపటికి మెదలకుండా తన చోట తాను చేరింది పిచ్చుక. రెక్కలు ముడుచుకొని. అంతటా నీరవనిస్తబ్ధత. వెలాతెలాబోతున్న చీకట్లు. ఝంగుఝంగున కంకణధ్వనులు. భాగవత్ ఒక్కసారిగా చకితుడైపోయాడు. గంగ మెదలకుండా నిద్రపోతుంది. మళ్లీ గాజుల సవ్వడి. తలుపు మీద 'టిక్ టిక్', వేళ్లతో కొట్టిన ధ్వని. భాగవత్ భయపడుతూ భయపడుతూ, మెల్లిగా తలుపు తెరిచాడు. హౌసా ఎదురుగా.

భాగవత్ గుండెలదిరాయి. మాటరాలేదు గొంతులోంచి. హౌసా భాగవత్ పాదాలు పట్టుకుంది. అతను చేతితో వదిలించుకున్నాడు. ఆమెను చేతిలోకి తీసుకున్నాడు. హౌసా చేతిలో తాళం తగిలించే ఇనప బేడీ, కొంచెం తాడూ ఉన్నాయి. మొహం దిగజారి దిగాలుగా ఉంది. అయినా ఆకర్షణంగానే ఉంది ఇద్దరి మనస్సులో తొట్రుపాటు, భయం.

భాగవత్! కొంచెం ఇల్లు వెడలి బైటకి రావాల్సివుంటుంది. నా మీద నమ్మకముంచు.

"ఈ సమయంలోనా?"

"ఔను. త్వరగా."

"పొద్దున కలుసుకుంటే సరిపోదా?"

"అల్లా కాదు భాగవత్ నమ్ము నన్ను. నీనెప్పుడూ మోసగించను."

గంగ తటాలున స్వప్నంలోంచి మేలుకుంటున్నట్లు, కలవరింతలూ, పలవరింతలూ. భాగవత్ కాళ్లు కదలాడడంలేదు. హఠాత్తుగా నడుం సందులోకి చేయి పోనిచ్చి చటుక్కున నల్ల మొలదారం తెంపింది. నాలుగు పలకలుగా ఉన్న తాయెత్తు నొకదాన్ని భాగవత్ చేతిలో పెట్టింది. భాగవత్ లాంతరు వెలుతురులో ఆ తాయెత్తు చూసి బెంబేలు పడిపోయాడు. ఈ బంగారం తాయెత్తు తానే మహారాజుకు ఆశుందిలో చేయించి ఇచ్చాడు. దాని మీద జ్ఞానేశ్వరుని బొమ్మ కూడా వుంది. హఠాత్తుగా చిన్న డబ్బీలాగా వున్న ఆ తాయెత్తు తెరిచి, అందులోంచి, సన్నగా చుట్టచుట్టిన ఓ పత్రం భాగవత్‌కు చూపించింది. దాన్ని భాగవత్ ఆదరాబాదరా చదివేసాడు.

మహారాజు దస్తూరీ.

మహారాజు భాషే.

మహారాజురాసిన ఉత్తరమే.

భాగవత్‌కు ఒళ్లంతా చెమటలు పట్టాయి.

"ఉత్తరం ఎవ్వరిదో గుర్తు పట్టావా?"

"సరే. మహారాజు ఇప్పుడెక్కడున్నారు?"

"అంతా చెబుతా భాగవత్. అట్టే పొద్దు లేదు. నువ్వు నామీద నమ్మకం పెట్టి కాస్త బైటకి రా. దగ్గిరగా ఉన్న తోటకి వెళదాం. నా మీద పోలీసుల నిఘా ఉండనే ఉంది. వాళ్లు ఇక్కడే కొద్ది దూరంలో ఉన్నారు."

"అయితే మరి నువ్వెల్లా వచ్చావు?"

"పోలీసు వాళ్ల మద్దతే ఉంది. వాళ్లకూ నాకు ఎంతో పాత చుట్టరికం! వాళ్లు నా మాటలు విన్నారు. వాళ్ల దొర నిద్రపోయాడు. నేను పరుగెత్తి ఎక్కడికీ పారిపోననే గట్టి నమ్మకం వాళ్లకుంది."

"గంగా లోపలినుంచి తలుపు గడియపెట్టు. నేనెప్పుడే వస్తున్నా!"

"తొందరగా రండి. నాకు భయం భయంగా వుంది."

"ఇట్టే వస్తా వుండగా వస్తా."

దగ్గర ఉన్న పూలతోట లోకి భాగవత్, హౌసా ఇద్దరూ, గేటు మూసి ప్రవేశించారు. బైట కొద్ది దూరంలో పోలీసులు, కొత్వాలు బితాయించి వున్నారు.

"ఉత్తరం గుర్తుపట్టావా భాగవత్?"

"అవును గాని, ఉత్తరం నీ దగ్గరకెక్కడ నుంచి వచ్చింది?"

"చెపుతాను. అయితే ఇది మహారాజు రాసిన ఉత్తరమేనని, నీకు నమ్మకం కుదిరింది గదా?"

"నూటికి నూరుపాల్లు. ఇంకా సందేహము? కాని ఇది ఎవరికి రాసారు?"

"భాగవత్. అంతా చెబుతాను. నీవు ఇప్పటికీ ప్రపంచాన్ని సరిగా అర్థం చేసుకోలేదు. ఒక్కమాట మాత్రం జ్ఞాపకం పెట్టుకో. హౌసాలోని హెచ్చు తగ్గులు గురించి ఏమైనా అపోహలుంటే, వాటిని నీ బుర్రలోంచి వెంటనే తీసిపారెయ్యి. నువ్వేన్నో విని వుంటావు. నువ్వేన్నో ఊహించి వుంటావు. అవన్నీ లాగిపారెయ్యి మెదడు లోంచి. కొత్త సంగతి విను. నేను అడపాదడపా, దేవీ మందిరానికి వెళుతూ వస్తూ వుండేదాన్ని. మంగళవారం తప్పకుండా వెళ్లేదాన్ని. నీవు కూడా ఒకటి రెండు సార్లు నన్నక్కడ చూసే వుంటావు. గుర్తు తెచ్చుకో. ఇప్పుడున్న సంగతి అంతా చెబుతా. ఏమీ అడ్డుకుండా, ఆపకుండా. మీరు పదిపదిహేను మంది, దేవీ మందిరంలో చాతుర్మాస్యంలో, జ్ఞానేశ్వరి ప్రవచనం వినటానికి వస్తూ వుండేవాళ్లు. మీరు, మహారాజు, ప్రవచనంలో మునిగి తన్మయత్వంతో వుండే వాళ్లు. ఆశ్వయుజ మాసంలో దేవికి కలశ స్థాపన జరిగింది. దీపమాల వెలుగుతూ వుండేది. రోజూ అక్కడికి దేవీ దర్శనం కోసం ఊళ్లో జనమంతా, మగ, ఆడా, పిల్లాపిచూ అందరూ వచ్చేవాళ్లు. వింటూ కూచునేవాళ్లు. ఓ రోజు, దేవిదర్శనం కోసం, మార్వాడీ ఆడవాళ్లు అయిదారుగురు వచ్చారు. ఆ సాగర్‌మల్ సేఠ్ కోడలు చూశావూ. వజ్రపుతునక. బంగారుబొమ్మ. నిజంగా రత్నమంటే రత్నమే. ఆ పిల్ల కూడా వచ్చింది ఆ రోజు. మహారాజు నిజానికెంతో సాధు సత్పురుషుడు. కాని శరీరం ఆయన్ను మోసగించింది. మహారాజు బుద్ధి దారి తప్పింది. ఆయన వెర్రెత్తిపోయాడు. కట్టుబాట్లన్నీ పటాపంచ లయ్యాయి. శరీరం మత్తెక్కి పోయింది. తర్వాత ఓ మంగళవారంనాడు, నలువైపులా మబ్బులు కమ్మిన సమయం, దేవీదర్శనానికి వచ్చాను. పొలంలోనే నాకు చాలా పొద్దు పట్టింది. కాని ఆ మంగళవారం తప్పించుకోవడానికి లేదు నాకు. మందిరానికి వచ్చే తీరాలి. దేవిదర్శనం చేసుకున్నాం బైట చింత చెట్లు కింద, మహరాజు కూచుని వున్నారు.

ఆయన దర్శనం కూడా చేసుకున్నా. అప్పుడే మహరాజా, నా చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు. నేను పెద్దగా అరిచేదాన్నే, కాని ఎందుకో గొంతు పెగలలా. నా కళ్లను నేను నమ్మలేకపోతున్నా. మహారాజా కాళ్లు పట్టుకున్నాడు. సాగర్‌మల్లు కోడల్ని చూసినప్పటినుంచీ తనలో వచ్చిన మార్పు చెప్పాడు. నే నాయన కాళ్లు పట్టుకున్నాను. కాని మహరాజా వినిపించుకోలా. నా శరీరం, ఆయన శరీరం పెనవేసుకొని పోయాయి. చెప్పొద్దూ, ఇహ అదే నియతంగా కొన్నాళ్లు సాగింది. కొన్ని రోజులకు కడుపు బైటపడ్డ తర్వాత నేను మహరాజుకు ఆ సంగతి చెప్పా. ఆయన అప్పుడు భయపడిపోయాడు. నా కాళ్లు గట్టిగా పట్టుకున్నాడు. ఆయనకేమీ పాలుపోలేదు. నే నాయనకు ధైర్యం చెప్పాను నన్ను నరికి పోగులు పెట్టినా, నేను మీ పేరు బైటికి పొక్కనీనని, నా మీద ఒట్టుపెట్టుకుని మరీ చెప్పా. కాని నమ్మకం కుదరలేదు. మహరాజా పిచ్చిపిచ్చిగా మారి పోయాడు. పిచ్చిపిచ్చిగా మాట్లాడడం ప్రారంభించాడు. అటు తర్వాత రెండు మూడు రోజుల కల్లా, మహరాజా నీ పేర ఓ ఉత్తరం రాసిపెట్టి వెళ్లిపోయాడు. ఆ రోజు నేనక్కడే వున్నాను. వేరే ఏదో దేవాలయం దగ్గర ఉంటానని చెప్పి, ఈ తాయెత్తు రెండు పంక్తులు, నా కోసం రాసి పెట్టాడు ఈ ఉత్తరంలో. నాకు రాయడం, చదవడం వచ్చుననే అనుకున్నట్టుంది మహారాజు!

నేను ఉండబట్టలేకపోయాను. పాలంలో నేను కడోబా ద్వారా చదివించుకున్నాను. దాని తర్వాతనే కడుపు పోగొట్టుకున్నా. అదీ కడోబా సాయంతోనే. అప్పుడెక్కెన్నో ఎత్తులు ఎత్తా. వత్తులు వత్తా. కడుపులోని శిశువు మహరాజు కంటె కూడా తేజస్విగా ఉంది-భాగవత్-కడోబా ఈ రహస్యం ఎవరికీ చెప్పకూడదని, అతని ప్రాణానికి ప్రాణం ఒడ్డా, అతనూ నేనూ, ఒకే మంచం ఒకే కంచంగా కాలం గడిపాం. ఇదంతా మహరాజు మర్యాద కాపాడడం కోసం! నీకోసం! నీకూ, మహారాజుకు తేడా లేదు. మీరిద్దరూ జీవికా జీవులని ప్రపంచానికి తెలుసు. అయినప్పటికీ చీకట్లో కళ్లు పీక్కొన్నట్లయింది. కాని అప్పటికప్పుడే అంతా అంగీకరించి, మూటగట్టి అవతల పారేసా విషయాన్నంతటినీ. పోలీసులు కూడా నాకు తోడుగానే వున్నారు. నాకు చెడ్డపేరు వస్తుందనే చింత ఎప్పుడూ లేదు. కాని మొన్నటి రోజు, కడోబాకు ఏం దుర్బుద్ధి పుట్టిందో, ఎవరికి తెలుసు? వాడు కల్లు తాగి ఆ మత్తులో ఏమిటేమిటో వదరడం మొదలుపెట్టాడు. వాడు మహరాజా ఉత్తరాన్ని గురించి వాగడం సాగించాడు. ఎంత చెప్పినా వినలా. వాడి నోరు మూత పడందే! నా

ఒళ్లంతా జెర్రులు పాకినట్లయింది. మహారాజా మర్యాదముందూ, భాగవత్ పేరు ప్రతిష్ఠల ముందు? కడోబా ఓ లెక్కగా నాకు కనబడలేదు. ఇవ్వాళ నాకు ఏమైనా ఇష్టమే, భాగవత్! ఇంతకు ముందుకూడా నా జీవితమంతా అప్రతిష్ఠతోనే గడిచింది. నాకు దాన్ని గురించి చింత లేదు. మహరాజా ఇహ ముందిక్కడికి వచ్చేది, పెట్టేది లేదు. అయినప్పటికీ, మహరాజాకిచ్చిన మాటను నేనంత అక్షరాలా పాటిస్తూ ఉన్నాను.

హౌసా మాట్లాడుతూ, మాట్లాడుతూ ఆగింది. భాగవత్ పూర్తిగా మొద్దుబారి పోయి వున్నాడు. భాగవత్ వంటి మీద చెయ్యి వేసి, అతన్ని ఇటూ అటూ కదలించింది. అంత ఏం మునిగిపోయింది? జీవితమంతా ఎల్లాగో అల్లాగు గడిచిపోవాల్సిందే. నీవింకా పసివాడివే. ఇటు చూడు! ఇహ రాత్రి పొద్దు కొంచెమే ఉంది. మరో ముఖ్యమైన విషయం నీకు చెప్పాల్సి వుంది.

"ఏమిటా యేమైనా సరే! నేనసలు విషయం సూతరాం బైట పెట్టను. ప్రపంచానికి తెలియనియ్యను. కాని ఊళ్లో మరో రకమైన పన్నాగం, భైరవ తంత్రం, పన్నుతున్నారు."

"ఏమిటది?"

"పోలీసులు, పాటీలు గ్రామంలోకి వెళ్లారు. ఎవరెవరినో కలుసుకున్నారు. అంతేకాదు, పోలీసువాళ్లని కూడా కలుసుకున్నారు."

"ఏమంటారు?"

"రాకాసి గుంపు అంతా ఓ పెద్ద ఎత్తు ఎత్తారు. నాకు పాఠం చెప్పారు. నా కడుపున పడ్డ బిడ్డకు తండ్రి లాల్జీ అని చెప్పమని. చాలు వాళ్లకంటే చాలు. ఎదురు నాకు డబ్బు ఆశ కూడా చూపెడుతున్నారు."

"బాబోయి!"

"నువ్వెందుకు గాబరాపడిపోతావు? ఇన్ని దెబ్బలు తిన్నాను. నాకేమి పర్వాలేదు. నేను రాటు తేరినదాన్ని. ఢక్కా మొక్కలు చాలా తిన్నాను. లాల్జీ మీద ఎత్తు పారిందా అంటే, మెల్లిమెల్లిగా ఆ వ్యూహంలో నువ్వూ ఇరుక్కుంటావు. పోలీసువాళ్లకు కూడా అదే కావాల్సింది"

"ఇంత అభూతకల్పన, పన్నాగం ఎందుకూ?"

"అదే నీకు చెప్పడానికి వచ్చాను. లాల్జీని హెచ్చరించు. జాగ్రత్తగా వుండమని. లేదా ప్రస్తుతం ఎక్కడికైనా ఓ రెండు రోజులపాటు అతన్ని పంపించేసెయ్యి. నేను

మొండిఘటాన్ని. ప్రొద్దున్నే అజంతా పోలీసులు ఠాణాకు తీసుకుపోతారని విన్నికిడి."

"తర్వాత ఏం చేస్తారు?"

"ఎవరైనా జామీను వుంటే వదిలిపెడతారు. ఆపైన కోర్టులో కేసు నడుస్తూ వుంటుంది."

"నేనుంటాను జామీను."

"వద్దు నువ్వుంటే మరింత సందేహం బలుస్తుంది."

"కాదు. ఎవడేమన్నా అనుకోనీ. నేను వస్తాను."

"నామాట విను భాగవత్. నేను నా సంగతి చూసుకుంటాగా!"

"నేను కూడా నా సంగతి నేనే చూస్తా."

"చూడు బాబూ. నేనిప్పుడు వెళుతున్నాను. మహారాజామీద ఒట్టుపెట్టి చెబుతాన్నా ఇంట్లో, పెళ్లానికిగాని మరెవ్వరికి గాని ఈ మాట చెప్పకు సుమా."

"నువ్వు ఇహ వెళ్లిరా."

గేటు దాకా భాగవత్ హొసాను తీసుకుని వచ్చాడు. కొంచెం దూరంలో తోట గట్టు మీద కొత్వాలు, ఇద్దరు పోలీసులు సన్నని, చిన్న దీపం పెట్టుకొని కూచుని వున్నారు. వాళ్ల దగ్గరకు హొసా వెళ్లింది. చీకట్లో వాళ్ల ఆకారాలు పోల్చుకోవడానికి చాలాసేపు వాళ్ల వైపు భాగవత్ చూస్తూ నిలబడిపోయాడు. అతని నడుం పడిపోవడం మొదలు పెట్టింది. అతను అక్కడే గేటు దగ్గర చీకట్లో కూచుని పోయాడు. అరిటాకు గాలికి కదలడంలో, భాగవత్ ఒళ్లు గగుర్పొడిచింది. చీకట్లు వేరువేరుగా ఆకృతుల్ని మార్చేస్తున్నాయి. భాగవత్ తన కళ్లను తాను నమ్మలేకపోతున్నాడు. తన చెవుల్ని తాను నమ్మలేకపోతున్నాడు. అయినప్పటికీ ప్రత్యక్షంగా జరుగుతున్న ఘట్టాల్ని కాదని కొట్టి వేయడం సులభంకాదు. మహారాజాకెన్ని రూపాలు? ప్రవచనంలోని మహారాజా, ఆళందిలో మహారాజా, ఇష్టాగోష్టుల్లో మహారాజా, హొసాతో జల్సా చేసిన మహారాజా! రేపు మళ్లీ కొత్త వింతలేమి పుడతాయో! ఏం చెప్పడం! నిన్నటి సాధు పురుషుని వేషం లాగానే ఏదీ నిశ్చితంగా చెప్పలేం. లాల్జీని, కుట్రపన్ని ఈ కుతంత్రంలో ఇరికించారా, పంచాయితీ పెరిగి పోయిందన్నమాటే. ఈ గాంధారి అదృష్టం కూడా దుర్యోధనుని భాగ్యరేఖ లాంటిదే. కటికచీకట్లలో భాగవత్ ఆలోచనా పరంపర మరింత కటిడుగట్టి కొనిపోతోంది. రాత్రి పెరుగుతూ పోతోంది..

6

జరుగుతూవున్న హంగామాకు తోడు నూర్పిళ్ల రోజులు. పుష్కలంగా పండిన జొన్న చేలూ, మొక్కజొన్న చేలూ, కోతలు కోసి కుప్పలు వేసారు. పత్తితీసి పోగు చేశారు. పొలాల్లో ఇంకా పరిగలిట్లాగే వుండిపోయాయి. కోతల హడావుడి, హంగామా తగ్గిపోతున్న దృశ్యం గ్రామం శివార్లల్లో. రెండుమూడు సంవత్సరాలనుంచీ కథ యిట్లాగే నడుస్తోంది వర్షాలు ఆలస్యంగా పడడం, మృగశిర ఏమిటి ఆరుద్ర కార్తిక వెళ్లిపోతున్నా నాట్లు పడక పోవడం. పోలి అమావాస్యకు ముందే వానలు నిలిచిపోవడానికి సిద్ధపడడం. మళ్లీ వానల హడావుడి అంటూ వుంటే, అది మళ్లీ వచ్చే యేడే. ఈ లోపల ఏమీ లేదు. నల్లరేగడి నేలలో పెంచిన తోటలు కొంచెం బాగానే ఫలించాయి. ఫర్వాలేదు. సరిపెట్టుకోవచ్చు. తిండికీ బట్టకీ కొద్దిపాటి భూవసతి గల రైతులు దివాలా తీసి పోయారు. దానికి కారణం-పొలంపాటు, వ్యవసాయానికీ ప్రాధాన్యమివ్వకుండా, జనం వేరే చిల్లర విషయాల్లో మునిగితేలుతూ వుండడమే. ఊళ్లో రాజకీయాల మధ్య జరిగే వృధా వాగ్వివాదాలతో కాలం వృధా పుచ్చడంతో వ్యవసాయం గురించిగాని, ఇతర విషయాల గురించిగాని ఆలోచించడానికి సమయం మిగిలేది కాదు. దాంతో అన్నీ చిందరవందరగా వుండిపోయేవి, వ్యవసాయానికి ఖర్చు మొత్తమైనా ఫలసాయం నుంచి రాకపోతే అదే వ్యవసాయం అడుక్కుతిన్న వ్యవసాయం! అట్లా నష్టపోతున్నా వ్యవసాయం వదిలేసి కూచోవడానికి వీలైన వృత్తికాదు. మరి ఇల్లూ వాకిలీ నడవాలి గదా! పెళ్లిళ్లనీ, పేరంటాలనీ, శ్రాద్ధాలనీ, మాసికాలనీ, ఇవన్నీ ఎల్లా జరగడం? అప్పు పుట్టినంత మేరకు బ్యాంకుల్లోంచి తీసుకోవడం అయిపోయింది. ఇహ ఇప్పుడు ఎక్కడ చోటుపెట్టి తీసుకోవడానికి మిగిలింది లేదు. పైసా తిరిగి ఇవ్వకపోవడంతో, ఎక్కడ ఎవరినీ అడగడానికి మొహం చెల్లడం లేదు. జనం పని, కుడితిలో పడ్డ బల్లిలా వుంది. ఈ పంటనూర్పిళ్ల సీజనులో

ఊరి దృశ్యం విచిత్రంగా, విపరీత ధోరణిగా వుంది. కొంతమంది రైతులు, పంట ఫలసాయం సరిగా ఎదిగిరాక మునుపే, కచ్చాపచ్చాగా వున్నప్పుడే కోతకోసేసి, నాలుగు డబ్బులు చేసుకొని, ముల్లెమూటా సర్దుకొని ఊరు వదిలిపెట్టి వెళ్లడం ప్రారంభించారు. ఇళ్లకు తాళాలు వేసి దూరంగా వున్న ప్రాంతాలకు, కొంతమంది గుజరాతుకు, కొంతమంది బొంబాయికి, మరి కొంతమంది ఇందూరుకు, ఎక్కడైనా పనీపాటా దొరకుతుందా అనే వ్యావర్తితో బయలుదేరి వెళ్లారు. తిరిగి వాళ్లు వచ్చే ఏడాది వానకాలంలోనే, ఊరికి రావడం. ఊళ్లోగాని, ఊరి దగ్గిరగా గాని రోడ్లు వేయడం, చెరువులు త్రవ్వడంలాంటి కఱువు కాటకపు పనులేవైనా చేయాల్సి వున్నావాళ్లు అక్కడ వుండేవాళ్లు కారు. అక్కడే ఊరు చుట్టు పక్కల వుంటే అప్పులవాళ్ల తొందర పిశాచంలా వెంటబడుతుంది. ఇవ్వాలిటి రోజున ఊళ్లోకి జీపులేంటి, మోటారు కారులేంటి రవధూళిగా వచ్చిపడుతున్నాయి. శిస్తు బకాయి చెల్లించాలిసిన అప్పు, పంచాయితీకి ఇవ్వాలిసిన డబ్బులు, భూవికాస బ్యాంక్, మార్కెటింగు సొసైటీ మొదలైన వాటికి చెల్లించాలిసిన ఋణాలు, ఒకటేమిటి-వీటి అధికారులందరూ మోటార్లు వేసుకుని ఊరు చుట్టూ, డబ్బు వసూలు కోసం ప్రదక్షిణాలు చేస్తున్నారు. రెండు మూడు సంవత్సరాలనుంచి పంట దిగుబడి తక్కువైనప్పటికీ, సర్కారీ వసూలు ఆగింది కాదు. మిదుమిక్కిలి బాకీలు పడ్డవారి మీద, దివాలా బాకీదార్ల మీద ఒకే రకంగా సూరీ చేయడం మొదలుపెట్టారు. మెట్ట పంటవాళ్లు, తోటలవాళ్లు అందరికీ వీళ్లంటే నవ్వులాటగా వుంది. స్వయంగా బాకీలు చెల్లించేవాళ్ల సంఖ్య చాలా తక్కువ. ఒక్కొక్కడు పంట పండినా డబ్బులున్నా కూడా, కావాలని బుద్ధిపూర్వకంగా బాకీ చెల్లించేవాడు కాడు. కారణం-మొత్తం ఈ చెల్లించాల్సిన బాకీలన్నీ మాఫీ చేస్తారనీ, లేదా ఈ బాకీలను అందరికీ సమానంగా పంచి, అందరి దగ్గిరనుంచి వసూలు చేస్తారనీ, ఊరి చావడిలో జరిగే ఉబుసుపోక మీటింగుల్లో వినిఉండడమే-అవిధంగా నిర్ణయించుకొని, ఈ మాట నలుగురిలో ప్రచారం కూడా చేశారు. బ్యాంకువాళ్లు కొందరి ఎదిగి కోతకు వచ్చిన పంటనంతటినీ, జప్తుచేసేటప్పటికి ఇటువంటి వాళ్ల కళ్లు తెలపిళ్లు పడ్డాయి. గడిచిన ఏడాది, నీళ్ల ఇంజనూ, ఇంట్లో వున్న ధాన్యం అంతటినీ ఒకళ్ల దగ్గిర నుంచి తీసుకున్నారు. చతుర్‌సింగు, అమర్‌సింగు ఇళ్లల్లో-చెప్పేదేముంది? వంట బొచ్చెలు దగ్గిరనుంచి తీసుక చక్కావెళ్లారు. నడి వీధిలో పెట్టి అమ్మి డబ్బు తీసుకున్నారు. ఆ జనానికి ఈపాటి చిన్న సంఘటన గ్రామంలో ముందుగా చెప్పుకునే కబుర్లకు మూలమైంది. పంట దిగుబడి రూపాయలో

నాలుగణాల కంటె లేదని చేసే, బ్యాంకువాళ్ళకు బాకీ వసూలు చేసే అధికారం లేదని, ఇటువంటి వే మరికొన్ని చట్టానికి న్యాయశాస్త్రానికి సంబంధించిన సూత్రాలను కొన్నింటిని వాళ్ళు వల్లె వేశారు. అందువల్ల వీటి లాపాయింట్లన్నీ వాళ్ళు కూడా వేస్తూ వుంటారు. అయితే ఎప్పుడో ఒకప్పుడు అసలు సంగతి తెలియనే తెలుస్తుంది. దాని ఫలితమే ఏ కారు కనబడినా, ఏ జీపు కనబడినా చాలు, అది ఎక్కడినుంచి వస్తోంది, ఎవరిదీ అనే ఆలోచన లేకుండా ఆ పెద్దమనుషులు వెంటనే ఊరి వెలుపలకు పారిపోవడం మొదలుపెట్టారు. రెండు మూడు రోజులు బైటి వూళ్ళలోనే వుండడం. ఇంటికి రాకుండా తప్పించుకోవడం. ఓసారి వసూలు బండి ఊళ్ళోకి వచ్చింది. ఆ రోజు జప్తు జరుగుతుందని సెక్రటరీ నుంచి కర్ణాకర్ణిగా కబురు పొక్కింది. అప్పుడే చెంబు పెట్టుకుని, పోసం పాదల చాటున బహిర్భూమికి వెళ్లిన మాధవరావు దేశపాండే, ఇక్కడనుంచి అటే వేరే గ్రామానికి పారిపోయాడు. జగదేవు'ఇంట్లోలేడని' చెప్పించాడు. ఆ విధంగా వాళ్ళు చాలాసేపు అరటితోటలో లోన తలదాచుకొని కలిసి బస్సుస్టాండుకు పోయి అక్కడినుంచి 'జలగావు' వైపు పలాయనం లంకించారు. ఈ విధంగా, గ్రామంలోని యావన్మంది అతిరథులూ, మహారథులూ తీసిన పలుగు పందెం చూసి, ఇతర జనం కూడా వెర్రిగా పారిపోవడం మొదలుపెట్టారు. ఊళ్ళోంచి 'భూవికాస'వారి బండి వెళ్లిపోయిందంటే మర్నాడు మరో బ్యాంకు వాళ్ళ బండి ఊళ్లో హాజరు. మళ్లీ ఎక్కడ ఈ అధికారుల గుంపు వచ్చిపడింది వసూలు చేసుకోవడానికి! ఊళ్లో దివాలా బాకీదార్ల ఇండ్లకు నోటీసులు అతికించారు. రికవరీ ఆఫీసరు, బ్యాంకు ఇనస్పెక్టరు, సొసైటీ సెక్రటరీ, బిళ్ళ బంట్రోతు, పంచాయితీ సభ్యులు, మొదలైన వాళ్ళందరూ ఊళ్లో అంతా ఊరేగింపులాగా తిరుగుతున్నారు. ఒక్కొక్కచోట బైఠాయించి అందరూ కలిసి కచేరీలాగా ఏర్పాటు చేసేవాళ్లు. వాళ్ళ దగ్గరే ఉన్న పంచాయితీ చైర్మను, పంచాయితీ సభ్యులూ, నిజానికి వీళ్లవే వసూలు కావలసిన పెద్ద మొత్తాలు. వాళ్ళల్లో వాళ్ళు పెద్దగా అరవడం, కేకలు పెట్టుకోవడం, అంతా గందరగోళంగా వుంది. గత సంవత్సరం యాక్టు నూట ఒకటి క్రింద యాక్షను తీసుకోబడ్డ జనం ఇండ్లు సోదా చేశారు. సెక్రటరీ ఒక్కొక్కటి చెప్పుకుంటూ పోతున్నాడు. ఫలానా వాడింట్లో లేడండి. అతనా అతనూ ఇంట్లో లేడండీ! ఇతనా! ఇతనూ ఇంట్లో లేడండీ! అతనేమో వేరే ఊరు వెళ్లాడట. వీళ్లందరూ ఏడెనమండుగురు కలిసి బొంబాయి వెళ్లారటండీ! ఇతగాడంటాడు కదా-నేనీ అప్పు తీసుకోనే లేదు కావాలంటే కేసుపెట్టి వసూలు చేసుకో అని. ఇండ్లన్నిటికీ తాళాలు వేలాడుతున్నాయి.

ఎవడూ ఊళ్లో లేడు. ఊరకంగా ఊరంతా, అధికార్ల ఊరేగింపు జరిగింది.

తోటమాలి శంభు ఇంటి వసారాలో అధికారుబృందం తిష్ఠవేయడం చూసి, జనం కొంచెం సందేహంలో పడిపోయారు. శంభు నిజానికి నిరుపేద. ఎవరితోనూ లావాదేవీలున్న వాడు కాడు. ప్రపంచం బాగా వుంటే వాడూ బాగా వున్నట్టే ఎవడైనా రెండు తిట్టితే పడి ఊరుకుండే స్వభావం. కొద్దిపాటి భూవసతి. ఒక ఎద్దుల జత. దాన్ని శ్రద్ధగా చూసుకుంటాడు. అప్పు పెద్దగా చేసింది లేదు. ఓ వేళ చేస్తే సరిగా సమయానికి చెల్లించి వేస్తాడు. శంభు మెడ కిందకు వేలాడేసు వసారాలో ఓ మూల కిమ్మనకుండా కూచున్నాడు. దిగులు దిగులుగా. రికవరీ ఆఫీసరు, తాలూకా బ్యాంకు ఇనస్పెక్టరు, సెక్రటరీ బిళ్ళ బంట్రోతు, పంచాయితీ సభ్యులు. వీధిలో చిన్న చిన్న బడిపిల్లలు తమాషా చూస్తూ నిలబడ్డారు. ఈ వీధిలో జనసమ్మర్దం అంతగా వుండదు. అటువంటిది గుంపు బాగా చేరింది. జనం ఒకళ్ళ మొహం ఒకళ్లు చూసుకుంటున్నారు.

"ఏం శంభూ! డబ్బులు చెల్లిస్తావా?" ప్రశ్నించాడు రికవరీ ఆఫీసరు.

"లేదు, బాబూ! ఉన్న డబ్బంతా పత్తి కోసరం ఖర్చు పెట్టేశాను. ఇప్పుడు ఎక్కడనుంచి సర్దుబాటు చేయలేను." శంభు.

"అయితే మేమే ఇంట్లోంచి తీసుకొని వెళ్లమా?" ఆఫీసరు.

"మీరెమైనా చెప్పండి. నేను అబద్ధం చెప్పడం లేదు. పప్పు, ఉప్పు, తిండి గింజలు తప్పితే మరేమి లేదింట్లో" అన్నాడు శంభు.

"అదెట్లైనా వుండనీ. మేం ఇల్లు సోదా చేస్తాం. ఆ పని జరగకుండా ముందుగా నువ్వే డబ్బు ఇచ్చేస్తే ఎంతైనా బాగుంటుంది. చరాస్తి యొస్టేటు వీటి అర్థం నీకు తెలుసు గదా. ఎప్పుడెంతెంత డబ్బు ఋణంగా తీసుకున్నావో సరిగా చదువుతూ వెళ్లు." అన్నాడు ఆఫీసరు.

"అయ్యా! నేను అయిదువందల రూపాయలు మాత్రం తీర్చాలి. నా వల్ల అయినంతవరకూ చెల్లిస్తూ వుంటాను. నన్ను నమ్మండి మాకు తల్లి అయినా తండ్రి అయినా మీరే ప్రభూ!"-శంభు.

"నీ మీద మాకు నమ్మకం ఉండబట్టే నీవు పంపిన చీటీ ముక్కలకు ఇంత డబ్బు నీ కిచ్చాం. నీ సంగతి సమాచారమంతా ఇప్పుడు తెలిసింది. 'ఇస్తాం,ఇస్తాం' అగి అందరూ అల్లాగే చెబుతారు. మరో వైపునుంచి నీళ్లు లేకుండా మమ్మల్ని క్షౌరం చేయడానికి చూస్తారు. అంతేనంటావా?" ఆఫీసరు.

"అందరికి మల్లే నన్ను గురించి మీరు అభిప్రాయ పడవద్దు బాబూ! లోకులు

మీకు బాకీ పడ్డంత, అప్పు నేను చేయలేదండీ!"శంభు.

"గడుసుతనం చాలా చూపిస్తున్నావు. లోకులు దగ్గిర ఎక్కువ బాకీలుంటే దాంతో నీకేమిటి సంబంధం? జనం ఇస్తారో ఇవ్వరో దాంతో నీకు మతలబు లేదు. దూకోరు మనుషులు ఉండనే వుంటారు-దానికే! పద మీ ఇల్లు సోదా చేయాల్సివుంది. సెక్రటరీ గారూ! పంచాయితీ మనుషుల్ని ఇంట్లోకి పంపించండి. ఇంట్లో ఆడవాళ్ళుంటే వాళ్ళను బైటకు రమ్మనమని చెప్పేదా?"

"అయ్యా! నేను చేతులు జోడిస్తున్నా. నేను మీ డబ్బు ఇచ్చుకొంటాను బాబూ!"శంభు.

"అరే!తెలివిగల పిండం! నువ్వు ఇచ్చేవాడివి, మేము తీసుకొనే వాళ్ళమూనా! మిగతా ఆఫీసర్లకు చెప్పుంతాం." ఆఫీసరు.

"అయ్యా! ఎన్నిసార్లైనా వినండి నేను అక్రమంగా డబ్బులు సంపాదించి దాచి పెట్టలేదు." ఇంట్లోనుంచి శంభు భార్య.

"ఆడది చెప్తోంది గదా బాబు! కొంచెం అవకాశం ఇవ్వండి అని నా మనవి. వాళ్లు చెల్లించేస్తారు లెండి." సెక్రటరీ.

"ఈ సెక్రటరీ చాలా గడుసు మనిషిగా కనబడుతున్నాడు. మూడు నెలల్లో కేవలం మూడు వేల రూపాయలు మాత్రం వసూలు చేయగలగడం, ఇందుచేతనే. నీకు వసూలు చేసే తెలివి తేటలే లేవు. నీ జీతం డబ్బులు వీళ్ళ బాకీల కింద జమకడుతూ పొమ్మంటావా?" ఆఫీసరు.

"మీరు కూడా అదో రకం పంచాయితీ సభ్యులు. క్లాసులో ఉన్న పంచాయితీని ఇప్పుడు వర్గంలోకి చేర్చాలనా మీ ఉద్దేశం. అధ్యక్షుడా కంటికి కనబడడు. తప్పించుకుంటాడు. మీరైనా కాస్త పని చేయండి. పొండి యింట్లోకి- బ్యాంకు ఇనస్పెక్టరు, ఇద్దరు ముగ్గురు పంచాయితీ సభ్యులు, సెక్రటరీ ఇంటిలోకి వెళ్లారు, శంభు పెళ్లాం ఏడుస్తూ మొత్తుకుంటూ, దయాభిక్షం వేడుతూ వుంది. పంచాయితీ అంటే దేశానికి వెన్నెముక లాంటిది. సరేనవండి అంటూ శంభు భార్య పెద్దగా ఏడ్వడం ప్రారంభించింది. ఇదిగో చూడమ్మా! నువ్వు ఇంట్లోంచి బైటికి పద. ఈ కల్లిబొల్లి నాటకంతో కలిసి వచ్చేదేమి లేదు. సర్కారు ఖజానా, నీ ఇంట్లో మున్లె అనుకుంటున్నట్టుంది" అన్నాడు ఆఫీసరు.

"ప్రభూ! నేను ఈ ఊరివాణ్ణి ఎవరినైనా హామీ పెడతాను. మీరు జప్తు మాత్రం చేయకండి" అని శంభు.

"ఇక్కడ వుండే పెద్ద మనుషులు హామీ ఇవ్వడమంటే ఏమిటో నాకు తెలుసు. ఈ ఊరు నాకేం కొత్తది కాదులే."-ఇనస్పెక్టరు.

"కాదు సార్. మీరు నన్ను నమ్మండి నేనిప్పుడే ఇదిగో వచ్చా..." అంటూ శంభు.

"సరే మంచిదే. మాకూ అదే కావాలి. ఏమైనా తంటాలు పడు. గవర్నమెంటు డబ్బు గవర్నమెంటు కియ్యి"- ఇనస్పెక్టరు.

కొద్దిసేపట్లో శంభు, భాగవత్ ఇద్దరూ వచ్చారు. అధికారికీ పంచాయితీ సభ్యులకు నమస్కారాలు చెల్లించారు. శంభు భార్య, భాగవత్‌ను కొంచెం ఇలా రమ్మనమని చెప్పింది. భాగవత్ ఇంటిలోపలికి ఆమెతో పాటు వెళ్లాడు.

శంభు పెళ్లాం ఒకటే మొత్తుకోవడం. ఆమెకు నోటివెంట మాట కూడా పెకలడం లేదు. శంభు నాతో ఏమి ఎక్కువగా చెప్పలేదు. ఏమిటి జరిగింది? ఉన్న విషయం ఉన్నదున్నట్టు చెప్పు. బైటపడడానికి, ఏదో దారి కనిపెడుదాం. అని భాగవత్.

"వీళ్లు ఇల్లు జప్తు చేస్తారుట. ఇంట్లో ఏమి లేదు. ఓ మూల జొన్నలున్నాయి. అవి కూడా తీసుకొని పోతే ఏమి తింటాం? గిన్నెలు, బొచ్చెలూ, కుండా, చట్టీ అన్నీ పోయిం తర్వాత కాపురం చెయడం ఎట్లాగా? నువ్వే చెప్పు. అంది శంభు భార్య. ఇంత గాబరా పడుతావెందుకు? ఆ సంగతేమిటో మేం చూసుకుంటాంలే. నాకో సంగతి చెప్పు. ఎప్పుడైనా శంభు ఏ కొంచెమైనా డబ్బు చెల్లించాడా? నేనతన్ని అడిగితే ఏమి చెప్పడం లేదు. ఊరికే ఏడుస్తాడు. ఇంట్లో ఏమైనా ఉంటే వాళ్ల మొహాన పారెయ్యి. కొద్దో గొప్పో ఎంతున్నా సరే.-భాగవత్.

ఏమి లేని పరిస్థితి పట్టింది యింటికీ. ఏడ్వకపోతే ఏం చేస్తాడు. ఏ కొంచెం డబ్బులు నిలవ చేయలేదు భాగవత్. నువ్వు మా పిల్లడు నాంటి వాడివని నీకో విషయం చెబుతున్నా నిప్పుడు. ఇది ఇరుగుపొరుగు వాళ్ళ చెవిని కూడా ఇంతవరకు పడలేదు. కిందటేడాది మేం పిల్ల పెళ్లి చేసాం. దేవుళ్లకు చెల్లించవలసిన ముడుపులు చెల్లించాం. అన్నీ చేసాం. కాని ఏం లాభం. మొహంపైని గీతను ఎవరు మారుస్తారు. ఆ అల్లుడు దరిద్రగొట్టు దామోదరుడుగా తయారయ్యాడు. వట్టి మోసగాడుగా అరితేరాడు. దమ్మిడీ సంపాదన లేదు. పిల్లను కోసుకుతింటున్నాడు. పస్తులు పడుకోబెడుతున్నాడు. నాకు ఒకే ఒక్క బంగారం తునకలాంటి పిల్ల. ఈ ఉన్నదీ మన్నదీ మనం చచ్చిన తర్వాత మూట గట్టుకొని మన వెంట వస్తుందా? అందుకని నేనిక్కడ సొమ్ము, నగ, నట్రా, డబ్బూ దుక్కం దొంగచాటుగా పిల్లకు పంపుతూ

వచ్చాను. అందుచేత ఇక్కడి సంసారం గుల్లయిపోయింది. డబ్బులు కట్టకుండా ఎగొట్టే రకం మేం కాదని నీకు తెలియదా?

"మరో సంగతి. చెప్పకూడదు, కాని చెప్పవలసి వస్తోంది. నీకు తెలిసే వుంటుంది. ఈయన మెడలో తులసీమాల వుందని. అయితేనేం, డబ్బుచింతా, పిల్లను గురించిన చింతా ఈయన బుర్రలో సెలలు వేస్తూనే వుంటుంది. తిండి లేదు. తిప్పలు లేదు. కంటికి కునుకు లేదు. ఇప్పటికి కొన్ని నెలలనుంచీ, ఇదంతా మఱచిపోవడానికని, మందు(కల్లు, సారాయి) పుచ్చుకోవడం ప్రారంభించాడు. మా కర్మ ఇలా కాలుతోంది ప్రస్తుతం! ఏం చెప్పను నీకు!"

శంభు పెళ్లాం రోదన ధ్వని పెరిగి పోయింది. భాగవత్ మరింత నివ్వెఱ పోయాడు. అతను మెదలకుండా బైటికి వచ్చేసాడు.

"భాగవతరావు! ఈయన రికవరీ ఆఫీసరు షిందే సాహేబు. మీ తాలుకాకు వసూలు కోసం కొత్తగా వచ్చారు." ఇనస్పెక్టరు.

"నమస్కారమండీ!"భాగవత్.

"ఈ భాగవత్‌రావు గురించీ - ఈయన వ్యవసాయంలోని నైపుణ్యాన్ని గురించీ, మీ కింతకు, ముందే చెప్ప వున్నాను." ఇనస్పెక్టరు.

ఎదురుగా ఒక మంచం వాల్చారు. దానిపైన భాగవత్ పంచాయితీ సభ్యులు కూచున్నారు.

"ఏం శంభు కాకా! దొరగారు ఏమంటున్నారు?" భాగవత్.

"ఏం లేదు. నువ్వే తెలుసుకో. అదేమిటో" శంభు.

"ఈయన ఆరు వందల రూపాయలు బాకీ పడివున్నాడు. ఆ రకం వసూలు చేయాల్సివుంది." ఇనస్పెక్టరు.

"ఈయన ఇంతవరకూ ఏమి చెల్లించనే లేదా?" భాగవత్

"నాలుగు వందలు చెల్లువేసాడు. రెండు వందలె వడ్డీ కింద జమకట్టాడు. కొంచెం మెహార్టీ వడ్డీ కూడా వుంది. మిగతా డబ్బు అసలు కింద కట్టాడు." సెక్రటరీ.

"ఈయన సంవత్సరాలుగా బాకీ చెల్లించడం లేదు?" భాగవత్.

"కేవలం నిరుటి నుంచే" సెక్రటరీ.

"అంటే ఎన్నో ఏళ్ళు కాలేదన్నమాట" భాగవత్.

"కాని భాగవత్‌రావూ! ఇప్పుడు పాత సంవత్సరం ముగిసి మళ్లీ జనవరీ నెల వచ్చిందిగా. ఇహ ముందు ఈయన దగ్గిర ఏం సొమ్ము తీసుకోవాలి?" ఇనస్పెక్టరు.

"శంభు ప్రతిసారి తప్పకుండా సొమ్ము చెల్లిస్తున్నాడని మీకు తెలుసు. ఈసారి కొంచెం ఆలస్యమైనందుకేనా ఆయన మీద ఇంత వ్యవహారం నడిపించడం? పై పెచ్చు, నూట ఒకటి చట్టం కిందనా ఆయన మీద వ్యవహారం?" భాగవత్.

"మీ బోటి వాళ్లు ఇలా చెబుతూ వుండడమే వీళ్లందరికీ సందుగా వుంది. మిగతావాళ్లెవరూ ఊళ్లో లేనేలేరు. ఇదేం వూరో!" ఆఫీసరు.

"అంటే శంభు ఊళ్లో ఉండడం, అతడు చేసిన నేరం అన్నమాట. ఇది ఎలా వుందంటే–గుడ్డి ఊళ్లో సాధువుని ఊరిదీసారట వెనకటికి-అట్లా వుంది" భాగవత్.

"నేరమో, పొరబాటో అదేం చెప్పతాం మేం? మా పని, రావలసిన బాకీ వసూలు చేసుకోడం." అధికారి.

"అదే నేను చెబుతున్నాను. వేలాదిమంది ఊళ్లో నుంచి, మిమ్మల్ని చూసి పారిపోయినా వాళ్ల పొలాల్లోని పైరు పంటలు ఎక్కడివి అక్కడే వున్నాయి, శంభు దగ్గర నుంచి డబ్బు వసూలు చేస్తే మీకు ఊళ్లో మొత్తం రావాలిసిందంతా వచ్చినట్టే వుంటుందనుకుంటాను. శంభు కట్టకుండా వుండేవాడు కాదు. ఈసారి కొంచెం పరిస్థితులు తప్పరావడంతో కట్ట లేకపోయాడు. అప్పుడప్పుడూ, పరిస్థితులు మనిషిని లొంగదీస్తాయి." భాగవత్

"మేము మా పైవాళ్లకు ఇలాంటి జవాబులు చెప్పడానికి లేదు." అధికారి.

నేను చెప్పేదేమంటే మీకు శంభు ఒక్కడే కనబడ్డాడా? అని. మిగతా బాకీదార్లను కొంచెం పరీక్షించి చూడండి. ఎనిమిదేసి యేళ్లు చెల్లించని వాళ్లున్నారు ఊరిలో. కేవలం, వాళ్లకు దయవచ్చినప్పుడు, కాస్త వడ్డీ డబ్బు రాలుస్తూ వచ్చారు. నూటికి నూరుపాళ్లు పెద్ద మనుషులు వాళ్లు. నాకిదంతా ఎంతో వింతగా వుంది ఊహించడానికి!" భాగవత్.

"ఇదిగో చూడండి భాగవత్ రావుగారూ! మేమెప్పుడు ఖాళీ చేతులతో ఎంతమాత్రం వెనక్కి వెళ్లే వాళ్లం కాము. మీ బోటివాళ్ల వసూలు చేయడంలో మాకు అడ్డు తగిలితే, ఏం చెప్పేది?" ఆఫీసరు.

"ఇటుచూడండి, షిందే గారూ! ఇది, మీరు నన్ను పొరబాటు అర్థం చేసుకోవడం. శంభు మా కులం వాడు కాదు. మా గోత్రం వాడు కాదు. అయితే అతనొక మంచిమనిషి అని, నేనిందులో జోక్యం కలగజేసుకొన్నాను." భాగవత్.

"మీరు ఆయన డబ్బు చెల్లిస్తారా?" అధికారి.

"శంభే చెల్లిస్తాడు. ఆయనకు కొంచెం గడువివ్వండి" భాగవత్.

"అంటే మీరు కూడా ఆయన తరఫున బాధ్యత వహించడం లేదన్నమాట." అధికారి.

"ఆయన చెల్లిస్తాడు. చెల్లించగలడు. అందుకని ఆ విధంగా చెబుతున్నా. ప్రస్తుతం ఆయన ఇంట్లో ఒకే ఒక్క జొన్నల మూట వుంది. దాన్ని మీరు తీసుకుంటే మాత్రం మీ బాకీ అంతటితో తీరిపోతుందా!" భాగవత్

"అదే మాకు మేరువంత." అధికారి.

"ఇటు చూడండి షిండే గారూ! మీరు ఊరికే వాదం పెంచుకుంటూ పోతే,నేను కాదనను, కాని, ఇది మంచి పద్ధతి గాదు." భాగవత్.

"నేను చెప్పింది నీకు కష్టంగా తోస్తే బాధ్యత మీ మీద పెట్టుకోండి" అధికారి.

"జవాబ్దారీ అంటూ బాధ్యత అంటూ పదే పదే ఎందుకు చెబుతారండీ! పడుగుకీ, బిచ్చానికీ ఒకటే మంత్రమా! అందరినీ ఒకే త్రాసులో తూస్తే ఎట్లా? ఇది చాలా చిన్న విషయం. ఎంతకూ మొండి పట్టూ! వేలాదిమంది బాధ్యత వహించకుండా తప్పుకున్నారు. మీరు బాధ్యత అని అంటున్నారు. ఆయన చెల్లించాలిసిందంతా నేను చెల్లించేస్తాను. అయితే ఇంకా, ఒక మనిషి కోసం, ఇంకో మనిషి అగ్ని పరీక్షలో నిలబడవలసిన సమయం ఇంకా రాలేదు. మరిమరీ తెలుసుకోండి. ఈ గాంధారి గ్రామంలో అంతకంతకీ మీ బాధ్యత పెరిగిపోతుందే గాని తగ్గేదేమీ లేదు." భాగవత్.

"అది మాకు పట్టని విషయం. దానిలో ఏమంత కష్టముంది?" అధికారి.

"సరేలెండి. శంభు పైకం ఇప్పుడే పంపిస్తున్నా."

"సావకాశంగా పంపండి. దానికంత హడావుడి ఎందుకు?" ఇనస్పెక్టరు.

"అట్లా ఎట్లా? మేం కూడా ఎక్కడికైనా పరుగెత్తిపోతే!" అంటూ భాగవత్ చక్కా వెళ్లాడు.

"సరే. శ్రీ గణేశాయనమః అని వసూలు ప్రారంభమైంది. సొసైటీ ఆఫీసులో పోయి కూచుందాం."అధికారి.

"మీరు భాగవత్ రావు చెప్పింది అంగీకరిస్తే బాగుండేది. షిండే గారూ! మీరూ తెగేదాకా సాగదీసారు వాదాన్ని." ఇనస్పెక్టరు.

"అందులో ఏమిటి కొంప మునిగిపోయింది! ఇట్లా అడుగడుక్కీ గాబరా పడిపోతే పని ఎలా జరుగుతుంది? మీరు బొత్తిగా పిరికివాళ్లులా కనబడుతున్నారు. అనుభవం చాలదింకా" అధికారి.

"కాదండీ! నేను మీకంటె అనుభవం ఉన్న వాణ్ణేనండి. అయితే గాంధారిలో నేను ప్రతి మనిషినీ బాగా స్టడీ చేశాను. కొత్తగా వచ్చింది మీరే. ఇక్కడ ఉన్న వాళ్లలో తక్కువ బాకీ ఉన్నవాళ్లు బాకీ సరిగా చెల్లించేవాళ్లు ఒకళ్లిద్దరే. వాళ్లల్లో ఒకడు శంభు. అంతే గాకుండా భాగవతరావు ఒక్కడూ లక్షమంది మనుషుల పెట్టు. ఈ ముదనష్టపు ఊళ్లో కొంచెమైనా బాకీలు వసూలు కావాలంటే అతని చేదోడు వాదోడు మనకుండాలి. మిగతా వాళ్లంతా టాలాటోలీగాళ్లే, చవిటి పర్రమొహాలే. అటువంటి వాళ్లకూడా, ఆయన సాయంతో, పుష్కలంగా డబ్బు ఇచ్చి, వడ్డీ వసూలు చేశాను క్రిందటి సంవత్సరం- ఇనస్పెక్టరు.

"ఏదైనా ఆయనేమి ఊరికి సర్పంచ్‌గాని, ఛైర్మనుగాని కాడుగా?" అధికారి.

"అదేమిటల్లా అంటారు. అతిరథులు, మహారథులూ అందరూ ఆయనంటే హడలెత్తిపోతారు. ఛైర్మను పదవి ఏమంత గొప్పది ఆయనకు? ఆయన ఇవ్వాళకూడ ఈ ఊళ్లో ఏది కావాలంటే అది కాగలదు. అయితే ఆ మనిషి ఆదర్శాలు ఇక్కడి ఈ మనుషులు భరించలేరు. నిరుడేమైందనుకున్నారు. ఎందుకో ఆయనకో ఊపు వచ్చింది. ఈ ఊరి గొడవలన్నింటిలోనూ తల దూర్చి అందరి సమస్యల్ని పరిష్కరించి మరీ చూపాడు తన ప్రజ్ఞనీ, పట్టుదలనీ. ఈయన తన ధాన్యపు దుకాణాన్ని క్యాష్ క్రెడిట్ పద్ధతి మీద కాకుండా తను డబ్బు నష్టం మీద నడిపాడు. మనకు డబ్బు వసూళ్లు ఆ సమయంలో అదివరకు కంటె జాస్తిగా జరిగాయి. ఈ గ్రామంలో ఎవరూ ఎవరిమాట వినేది లేదు. భాగవత్ మద్దతు తీసికొని డబ్బు వసూలు చేసుకోవలసిందే కాని, అంతకు మించి ఈ ఊరి వాళ్లను భయపెట్టగలిగినవాడెవడైనా వుంటే వాడు నిజంగా గొప్పవాడే. ఆయన కెవరి దగ్గరనైనా చెడుకనపడిందో, వెంటనే అవసరమైతే, వాడి వొళ్లు తాట ఒలిపించాడన్నమాటే. తర్వాత వాడు చావనీ, బతకనీ, లేక గోతిలో వాడిని పాడ్చిపెట్టనీ. ఇప్పుడింతకీ ఏం చేస్తారు?" ఇనస్పెక్టరు.

"భలేవాడివే! అటువంటి సంగతైతే నాతో ముందుగా ఎందుకు చెప్పలేదు? నేను మామూలు గాంధారి ఊరి ధోరణిలో అందరితోబాటే ఇతనూ అనుకొన్నాను." అధికారి.

"మీరు వింటేనా అండి! నేను మిమ్మల్ని కొంచెం నొక్కాను కూడా. మీరు గమనించలేదు. ఆయనకుపైగా మన ఛైర్మను గారి దగ్గిర కూడా కావలసినంత చనువూ, పలుకుబడీ వున్నాయి. ఇదంతా మీరు వృథాగా తెచ్చిపెట్టిన గొడవ."

ఇనస్పెక్టరు.

"మహా బాగుంది! ఈ సెక్రటరీ ఒకడు మహామూర్ఖుడు. ఇక్కడకు బైలుదేరి వచ్చేముందు ఈ ఊరు పరిస్థితులన్నీ నాకు చెప్పాలా అక్కర్లేదా? కేవలం తప్పుడు వసూళ్ళు మన లెక్కల్లో చూపించవలసి వస్తోంది అని - పని అయిపోయిన తర్వాత తెలివిని బడితే ఏం లాభం? చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకొన్నట్లు!" అధికారి.

"అయ్యా!" సెక్రటరీ.

"పిచ్చివాగుడు మానవయ్యా!" అధికారి.

"అయ్యా! కొంచెం వినుదురు బాబూ! ఈయన రామారావు పాటీలు గారు మిమ్మల్ని భోజనానికి రమ్మనమని పిలుస్తున్నారు. చెప్పడానికి వచ్చాను." సెక్రటరీ.

రామారావు పాటీలు రెండు చేతులు జోడించి, విచారగ్రస్తమైన ముఖంతో నిలబడివున్నాడు.

"భోజనం తయారయిందండీ. దయచేయండి." పాటీలు.

"ఏమయ్యా సెక్రటరీ! భోజనం ఏర్పాట్లు మీ ఇంట్లో చేయించమని గదా చెప్పాం. వసూళ్ళ సమయంలో షిందే సాబు, మాంచి కలుపుగా వుంటారని, మొహమాటాలకు లోబడడని తెలుసుగా" ఇనస్పెక్టరు.

"కానీండీ! ఈ పాటీలు గారు నా మాట వినలేదండి. మీరు పాటీలు గారికి దగ్గర బంధువులటండీ. ఎల్లాగంటే పాటీలుగారి మేనత్త కొడుకు షడ్డకుడికి మీరు పినతండ్రి కుమారులవుతారటండి. ఇంత దగ్గిర చుట్టరికం వుంటూ వుంటే మా ఆఫీసరుని, మీ ఇంటికి భోజనానికి ఎల్లా తీసుకువెళ్ళనిస్తానని అంటున్నారండి పాటీలుగారు." సెక్రటరీ.

"కానీ పాటీలుకు మాకు ముఖ పరిచయం కూడా ఎన్నడు లేదే" అని షిందేసాబు.

"కాని నాకు పూర్తి పరిచయం వుందండి బాబు. నేను మీ ఊరి ప్రక్కలనే వుండే వాణ్ణి నాలుగైదు సంవత్సరాలైంది. ఇక్కడికి వచ్చి ఈ గందరగోళంలో."

"ఇక్కడికి ఎందు కోసం వచ్చారు?"

"ఇక్కడ పొలాలు అమ్ముతుంటే కొనుక్కొని ఇక్కడే వుంటున్నాడు ఈయన" సెక్రటరీ.

"అదా సంగతి. ఈయనకు కూడా బాకీ ఏమైనా వుందా?" షిందే సాబు.

"అవునండీ! అయిదువేల రూపాయలు. మూడేళ్ల నుంచి ఎగ గొట్టు తున్నాడు. చెల్లించకుండా."

"అట్లా చెప్పు. ఇప్పుడర్థమైంది పాటీలు నన్ను భోజనానికి ఎందుకు ఆహ్వానించాడో!" షిందేసాబు

"అందుకని కాదు బాబు. అటువంటి ప్రశ్న ఏమి లేదు. మీరు మా మేనత్త కొడుకు వంటివాడు-"

"ఆపండి, ఆపండి. ఎక్కువగా చుట్టరికం కలపకండి. మేము మీ ఇంట్లో భోంచేయడానికి ససేమిరా ఇష్టపడం." షిందేసాబు

"అదేం మాటండీ! ఊళ్లో సరైన వసతి లేదని షిర్దాపూర్‌కు పరుగెత్తుకొని పోయి కోడిపుంజు పట్టుకొని వచ్చాను. ఏర్పాట్లన్నీ చేశాను. అదీగాక ఇప్పుడే మిట్ట మధ్యాహ్నం ఎక్కడి కెలా పారిపోతారు?" పాటీలు.

"పాటీలు అంతగా బతిమాలుతుంటే, అడ్డు చెప్పం" ఇనస్పెక్టరు.

"పైగా కోడి మత్తు చూపిస్తుంటే ఏమిటి చేస్తా నేను మాత్రం. మత్తెక్కితే మరి వసూళ్ల మాత్రమేమౌతాయి. సోదరావద షర్వాలేదు. ఇదిగో వస్తున్నాం." షిందేసాబు.

ఊళ్లో భజనమండలి, దాసుల సంకీర్తన సమాజం, వీళ్ల హడావుడి వేదాంతం నూరిపోసే 'యేడాకాకా' ఇంట్లో వేరే గుంపు. సర్‌పంచ్ ఇంట్లో గ్రామాన్ని ఎల్లా ఉద్ధరించడమా అనే చర్చాగోష్ఠి ఈ రకంగా ఎన్నో గోష్ఠులు, మండలులు, సమాజాలు, జోరుగా నడుస్తూ వుంటాయి. ఇటీవల ఓ గోష్ఠి కొన్ని సంవత్సరాలుగా 'హరీబాకోళీ' గుడిసె దగ్గిర అంతకంతకూ పెరుగుతూ వస్తోంది. హరిబాకోళి కిప్పుడు నలభై ఒక్క ఏళ్లుంటాయి. కాని మంచి గట్టిబారుగా యువకుడులా వుంటాడు. హరిబా నపుంసకుడుగా పుట్టాడు. దృఢమైన శరీరపుష్టి అతనిది. రూపం రంగు కూడా చక్కగా వుంటాయి. దీనికి తోడు కావలసిన తెలివితేటలు కూడా వున్నాయి. హరీబా గ్రామంలో పెద్దపెద్ద వాళ్ల ఇండ్లల్లో తరుచు వంటపని చేస్తుంటాడు. వాళ్ల ఇండ్లల్లో అంట్లుతోమడం, నీళ్లు మోయడం, అప్పుడప్పుడూ రుచారు వంటకాలు చేయడం, పిల్లల్ని పాపల్ని సంబాళిస్తూ వుండడం, లాంటివి చేస్తూ వుంటాడు. ఇటీవల లాల్‌జీ ఇంట్లో కూడా జాస్తి పని చేస్తూ వచ్చాడు. హరిబా మాట, నడక ప్రవర్తించే తీరు, అంతా ఆడదానిలాగా వుంటుంది. హరిబా మహిళలాగానే జుత్తు కూడా పెంచుకున్నాడు. ఆడ సమాజంలో, వాళ్లల్లో వాళ్లు ఎంత రహస్యాలు చెప్పుకుంటున్నా, హరిబాను ఎవరూ లేచి పొమ్మనరు. హరిబా వాళ్లలో కలిసి మెలిసి పోతాడు. ఇంతదాక ఎందుకు? ఎందరో ఆడవాళ్లు అతని ఎదుటే అల్పాచ మానానికి కూచోవడానికి భిడియపడరు. హరిబా కుటీరం ఎప్పుడూ 'విఠోబాగావడే' భీమాకోళీ,'

జానకీరాం - ఈ అసలు సిసలైన గంజాయి తాగే వాళ్ల సభ తీర్చే వుంటారు. ఈ సభకు వాళ్లు ముద్దుగా 'జయభోలే క్లబ్' అని పేరు పెట్టుకున్నారు. వాళ్లకూ హరిబాకు మధ్య కుటుంబ బాంధవ్యం లాంటి స్నేహం. హరిబా ఇంట్లో కావలసినంత గంజాయి. వాళ్లూ హరిబాకు వీలు వెంబడి చిలుం త్రాగిస్తూ వుంటారు. అందుకు బదులుగా అప్పుడప్పుడు హరిబా వాళ్లకు కోడిమాంసం, మేకమాంసం వండిపెట్టుతూ వుంటాడు. బాగా మత్తెక్కే సారాయి తాగించి, రాత్రంతా గప్పాలు కొడుతూ, కూచుంటారు. జానకీరాం, విఠాబా గావడే, శాస్త్రాల్లోంచి, పురాణాల్లోంచి, చమత్కారంగా వుండే కథలూ, కబుర్లూ ఎన్నో చెపుతూ వుంటారు. ఎన్నో కథలు కల్పించి కూడా చెపుతారు. హరిబాకు గ్రామంలోని గొప్పోళ్ల ఇంట్లో జరిగే రగడలూ, రాద్ధాంతాలూ చెబుతూ వాటిమీద విమర్శలు చేస్తూ హరిబా ఇంటి దగ్గిర వృథాకాలక్షేపం చేస్తూ వుంటారు. అప్పుడప్పుడూ, హరిబా వద్దకు ఎగ్గొట్టి సోమారిపోతులాగా తిరిగే ఒడ్డ భైరవులు కొంతమంది పిల్లకాయలు వస్తూ వుంటారు. అతన్ని ఆట పట్టిస్తూ ఎగతాళి చేస్తూ వుంటారు. పిల్లి మొగ్గలు వేస్తూ వుంటారు. హరిబా వాళ్లను కూడా బాగా సంతోషపెడుతాడు. చాయి, తమలపాకు బీడా, మొదలైనవి ఇస్తాడు. ఓసారి హరిబా మంచి హుషారుగా ఉన్నాడు. పిల్లకాయలకు చెప్పటం మొదలెట్టాడు. లాల్జీ వేళ్ల మీద సావిత్రికి మోజెక్కువ. లాల్జీ వేళ్లకు ఓసారి సావిత్రి గోరింటాకు నూరి పట్టించింది. బాగా తడిగా జిల్లుమంటూవుంది. నేనే గోరింటాకు నూరి కలిసి ఇచ్చింది. తెల్లని ముద్దు వచ్చే చేతులతో లాల్జీ వేళ్లకు గోరింటాకు ముద్ద మెట్టుతూ పోయింది. వేళ్ల గోరింటాకు తన'చోలీ' లోపల అంటుకుంది. అకస్మాత్తుగా ఆమె కళ్లల్లో అశ్రుబిందువులు. లాల్జీ అంతవాడు ఏమి మాట్లాడలా. ఆమె మొగం తన రెండు చేతులతో గట్టిగా పట్టుకొన్నాడు. ఆమెను దగ్గిరగా తీసుకున్నాడు. మరి ఏడ్వడం ప్రారంభించాడు. సావిత్రి అతన్ని గట్టిగా కౌగలించుకుంది. నేను దొడ్డి గుమ్మం వైపు అంట్లు తోముతూవున్నా. దొంగ చాటుగా ఇదంతా చూశా. రెండోరోజు, సావిత్రి బుగ్గలమీద ఎర్రని గోరింటాకు అచ్చులు. నేను అడిగా 'బుగ్గలమీద ఈ ఎట్టని మచ్చులేమిటి?' అని. ఆమె చెప్పింది"లాల్జీ రాత్రంతా నన్నొకటే ముద్దులో ముంచి లేపనెత్తాడు."

హరిబా దగ్గిర ఎవ్వరూ లేకపోతే, పక్కింటి ద్వారకా అటుపక్కవాడలో వున్న సార్జాబాయి, నేమంతీ, వీళ్లు కబుర్లు చెప్పుకోవడానికి వచ్చి కూచుంటారు. వైరిమైరి కబుర్లన్నీ చెప్పుకుంటూ వుంటారు. ఊళ్లో ఒకళ్లోకళ్లు చెవులు కొఱుకుకుంటూ

కూచుంటారు. ఇవ్వాళ సాయంకాలం, కొంచెం తొందరగా భోంచేసి వాళ్లు హరిబా దగ్గిరకు వచ్చి చేరారు. ఏదైనా ముఖ్యమైన కథా కమాయిషు వుంటే సారజాబాయి హరిబా దగ్గిర రాత్రి పగలూ అనే తేడా లేకుండా పోతుంది. తమలపాకు చుట్టలు తినడం అయింతర్వాత పొగాకు నములుతూ సారజా ఏదో ముంచుకుపోతున్నట్టు అడిగింది.

"హరిబా! ఇవ్వాళ మధ్యాన్నం ఊళ్లో చాలామంది పోలీసుల గుంపు వచ్చిందటనే! మోటర్లమీద! ఊళ్లో ఏం గడబిడ జరిగిందేమిటి?"

"నాకు కూడా చూస్తే పోలీసు వాళ్లేమో అనిపించింది. కాని ఏం పోలీసువాళ్లు! అజంతాగుహలకు సంబంధించిన, ఫారెస్టు లేదా అదేమిటో అంటారే దాని జనంట వాళ్లు. కాకీ దుస్తులతో ఉన్నారు. ఈ ఊళ్లో మనుషులు చాలా వింతైనా వాళ్లు. అదిగో తోక అంటే ఇదిగో పులి అంటారు!"

"అసలేం జరిగింది!"

"కిందటేడు భాగవత్ గారింట్లో చాల బంగారం నగా నట్రా వుందని ఓ ఆకాశరామన్న ఉత్తరం ఎవరో పైకి పంపారు. దానికే వీళ్లంతా వచ్చి ఇప్పుడూరిమీద విరుచుకుపడడం! టేకు కలప చెక్కలు ఓ రెండు వందల దాకా వున్నాయట ఇంట్లో."

"అయితే! ఆ తర్వాత!"

"భాగవత్ చాలా వింతైన మనిషి. అందరిలాంటి వాడు కాడు. సూటిగా ఇల్లూ వాకిలీ, చెట్టూ చేమా, అంతా వాళ్లకు తానే చూపించేశాడు. నాలుగైదు కలప ముక్కలుంటే అవి కూడ చూపించాడు. కొండలమీద వుండే బంజారీ వాళ్లు నాట్లు వేసే రోజుల్లో, పస్తులుంటూ, కొయ్య కట్టెలు తీసుకుని వచ్చి నాకు జబర్దస్తీగా అంటకట్టి వెళ్లారు. వాళ్ల కొంగులో ఇన్ని జొన్నలు పోశాను. అప్పుడో నాలుగు కలప చెక్కలు కూడా ఇచ్చారు. ఊరికే నేను వాళ్ల సొమ్ము తీసుకోలేదు. అది నేరమైతే, నేను ఆ నేరానికి శిక్ష అనుభవిస్తాను. అని చెప్పాడు భాగవత్. అంతటితో వాళ్లు చల్లబడ్డారు. బిల్లు ఇచ్చి చక్కా వెళ్లిపోయారు. ఈ అర్జీలు పెట్టేవాళ్ళు నాటకం ఇదొకటి."

"కాని భాగవత్ మీద అర్జీలు పెట్టేవాళ్ళు వాళ్ల పేరెందు కివ్వరు హరిబా?"

"నువ్వు బొత్తిగా కొజ్జా సంతానమే సారజా! వాళ్లకు తండ్రి లేకపోతే వాళ్లేం పేరిస్తారు? ఎక్కడో గుడిసెల్లో పుట్టిన నాయాళ్లు! వాళ్లకు ఓ పేరు, ఓ ఊరు ఏముంటాయి! తండ్రి ఎవరో తల్లి ఎవరో వాళ్లకే తెలియదు. వాళ్లకు పేరేమిటి పేరు? అందుకని పేరు లేకుండానే రాసి పడేస్తారు. ఎవరైనా చూసినా ఫర్వాలేదని. మరీ

దరిద్రం మూక ఇక్కడి వాళ్లు తల్లీ! వాళ్లు చేసే పనులకు నీతీ నియమాలు ఏమి లేవు. ఒసే నేమంతీ! భాగవత్, జయవంతా పేళ్లు జోడించి ఇల్లాగే ఓసారి అల్లరీ ఆగం చేసారుట. ఆ జయవంత తల్లి కూడా దేవిగుడి చుట్టూ గొర్రెల్ని మేపుతూ వుండేదిట-దేవాలయంలో ఆ మారాజు వెళ్లిపోయిన తర్వాత-ఇప్పుడు మరో సాధు బైరాగి వచ్చి కూచున్నాడుటగా. ఏమిటో ఇదంతా, ఏమి సరిగా అంతు పట్టడం లేదు."

"దాని దుంపతెగిరి. ఆ సంగతి పోనీలే. శుభమూ అంటూ పెళ్లి నడుస్తుంటే, తోటమాలి శంభు ఇంట్లో, అప్పులవాళ్లు వచ్చి హంగామా చేశారు. ఈ యేడు ఇవ్వాల్సిన డబ్బులు కోసం చాలా గొడవ చేసారు. వేధించారు. అంతే గాదు మరో ఉపద్రవం కూడా జరిగింది. అప్పుల వాళ్ల రౌడీలుట శంభు కూతుర్ని బాది బాది ఖతం చేసారు. అయితే వాళ్ల పిల్లి కూడ కోరికోరి దెబ్బలాటలు తగాదాలు, నెత్తికి తెచ్చుకుంటుందిట. శంభు పెళ్లాం మేకలా ఏడ్చిందిట!"

"అవునమ్మా. చాలా చెడ్డ జరిగింది. ప్రపంచం లో ఎంతెంత రాక్షసముండా కొడుకులుంటారమ్మ! మన ఊరు చూడిప్పుడెంత చెడిపోయిందో! అందరూ ఇప్పుడు ముండా కొడుకులే. అందరూ అప్పు చేసి పప్పుకూడు లగాయించే వాళ్లే! పొగాకు దమ్ము కొట్టేవాళ్లే."

"హరిబా! పొద్దస్తమానం ఈ గొడవలు అడిగి తెలిసి కోడం తోటే పొద్దు వాటారిపోతోంది."

"ఇంకా ఏమైనా?"

"సర్పంచ్ వాడలో నువ్వు అంట్లు తోముతుంటావు గదా!"

"అవును చాలా రోజుల్నుంచీ పని చేస్తున్నాను."

"ఆ వీథిలో గవర్నమెంటులో పనిచేసే ఆడావిడ వుంది కదూ! - చూశావా ఎప్పుడైనా?"

"ఎర్ర త్రికోణం ఆవిడ. ఊరందరికీ తెలుసు ఆవిడంటే."

"అది కాదు. ఆవిడ ఇప్పుడెక్కడా తలుచు కనబడడం లేదు తెలుసా ఊళ్లో."

"ఔను, సర్జా! పది పదిహేను రోజులనుంచీ కనబడడం లేదు, నిజమే."

"ఆవిడను గురించి ఏమైనా విన్నావా?"

"ఏం గొడవ జరిగిందేం?"

"ఆమెగారు కడుపుతో వుందిటమ్మా!"

"అల్లాగా! ఎవడినో తగుల్కొని వుంటుంది తన మర్జీ తన ఖుషీ గదా!"

ఆవారా తిరిగే ముఠా చాల రోజుల్నుంచి ఆమె వెంట పడి తిరుగుతున్నారు. రాత్రి యనక పగలనక వేళ కాని వేళల్లో ఆమెను మందు మాత్రలు(గర్భనిరోధకాలు) ఇమ్మని, తమ పెళ్లాలకు చెప్పి వాడాలిసి వుంటుందని, అడుగుతూ వుంటారు. ఆమె ఏమైనా అంటే మరునాటి ఉదయమే వచ్చి ఆమె మీద విరుచుకు పడతారు. నీ పని ఇది. మేం ఏటైంలో వచ్చి నా నువ్వు మాత్రలు ఇచ్చి తీరాలి. గౌర్నమెంటు జీతం తింటున్నావు. ఊరికే నీవేమి పనిచేయడం లేదు. గౌర్నమెంటు ఓ వైపు నుంచి, సంతానం పరిమితం చేయాలని గోలపెడుతూంటే నువ్వు మాత్రలివ్వనంటే ఎల్లా? ఈ విధంగా గోల చేస్తారు. ఆమె ఎప్పుడైనా తాలూకా ఆఫీసుకు ఏదైనా పనిమీద వెళ్లిందనుకోండి. ఎద్దు వెంబడి తోకలా వీళ్లూ బైలుదేరుతారు ఆవిడతో పాటు. ఆమె ఆఫీసుకు ఏదైనా పని మీద వస్తే వీళ్లూ అక్కడ గుమిగూడి రగడ చేస్తూ వుంటారు.

"ఆమెకు ఎవరో ఒకాయన అంటి ఉన్నాడు అని విని ఉన్నా."

"లేదమ్మా. ఆమె అటువంటిదిగా కనబడదు. చాలా మంచి మనిషిగా కనబడు తుంది."

"ఔను. మగోళ్ల ఆపరేషనులు ఆడవాళ్ల ఆపరేషన్లు. అన్నిటినీ అన్ని వేళలా చూస్తూ సేవచేస్తూ వుండడమే ఆవిడ వృత్తి. రాత్రింబవళ్లు కళ్లెదుట ఈ తతంగం జరుగుతూ వుంటే మనస్సు చలించకుండా వుంటుందా! ఆవిడ మనస్సైనా నిండి పొంగులు వారే మనస్సేగా. రాతి బండేమి కాదుగా. అందుకే అన్నారు మనిషి మనస్సు చెదరితే పంద్రెండూళ్లు పాడుపడాల్సిందే అని."

"ఎంత విపరీతం జరిగిందమ్మా ఇప్పుడు! పిల్లలు ఎక్కువమంది పుట్టకుండా చూసుకోవాలని చెప్పే ఆవిడకే కడుపు వచ్చింది. ఎంతో ధన్యురాలు!"

"కాని సారజా! ఆ అమ్మ చెడ్డ నడత గలది కాదు. మనిషి స్వభావం దాచినా దాగదు. మన ఊరంతా పోరంబోకుగాళ్లు కారణం లేకుండానే, ఆమె మీద ఈ రకంగా పుకారు పుట్టించి వుంటారు."

"అసలు నాకీ ఉద్యోగమే దరిద్రం అనిపిస్తుందమ్మా!"

"గౌర్నమెంటు వాళ్లకి కూడా ఏమి పనీపాటా ఉన్నట్లు లేదు. అడపాదడపా ఊరి మీద దండెత్తి ఎవళ్లో ఒళ్లు వస్తూవుండడం, ఇక్కడి కథలూ కమాయిషులూ అడుగుతూ వుండడం, ఇదేం పని. ఏదో ఒక కొత్త విడ్డూరం పుట్టుతూనే వుంటుంది."

"నిజంగా అంతే. ప్రపంచం తీగె పందిరికి పాకించి , దాన్ని గొడ్డలితో నరికేస్తే ఏంటావుంటుంది? ఈ విచిత్రమైన శాస్త్రం వెతికి తెచ్చారీ గౌర్నమెంటోళ్లు"

"ప్రపంచం బాగా పెరిగి పోయిందట. తింటానికి తిండిలేదట. ఉండటానికి నీడ దొరకదట. అని ఈ రకంగా చెబుతారు."

"ఏమనాలి ఈ ముదనష్టపు గౌర్నమెంటుని, ఎవడి కర్మతో వాడు పుట్టుతాడు. దాని ప్రకారం అందరూ తింటారు. తాగుతారు. పెరిగి పెద్దవుతారు. కాళ్లు చేతులూ వుంటే అందరూ సంపాయిస్తారు. పక్షులూ, పిట్టలూ వీటికి ఇల్లు లేదు; వాకిలి లేదు. సంసారం లేదు. ఏ రకమైన ఆధారం లేదు. అయినా గాలి కెరటాల్లో తేలిపోతున్నాయా. పుట్ట నాశ్రయించో, చెట్టు నాశ్రయించో బతుకుతునే వున్నాయి. మరి వీళ్లంతా మనుషులెరి. దేవుడి కళ్లు ఆకాశంకంటె పెద్దవిగా వుంటాయి."

"నేను విన్నదేమిటంటే ముసల్మానులు, ఈ వెధవ పని చేయరట."

"నాకు ఈ ఆడవాళ్లు మగవాళ్లు ఆపరేషన్ల కోసం ఎగబడడం, వట్టి అర్థం పర్థం లేని పనిగా కనబడుతుంది. మనిషి ఎంత దూరంగా వున్నా తొందరుడి ఒంటేలుకైనా కూచోం గదా మరి ఆ చోట."

"వాళ్లంటున్నారట-ఆవిడ రాకపోతే మగవాళ్లకు ఆపరేషన్లు చేయాలి అని."

"ఆ చచ్చినోళ్లు ఏమంటున్నారు? నీకు రమజాను భీలు(భిల్లుడు) గురించి తెలుసా?"

"ఔను. ఎఱుగుదును."

"అతడు పెళ్లయిన సంవత్సరమే ఆపరేషను చేయించుకున్నాడు. పెళ్లానికి చేయించలా. తానొక్కడే చేయించుకున్నాడు. తన్ను ఊళ్లోకి మోటారు మీద తీసుకువచ్చారు. అతని భార్యకు సంవత్సరం లోపలే నెల తప్పింది. అతను దాంతో అగ్గి బుగ్గై పెళ్లాన్ని గొడ్డును బాదినట్లు బాది మరీ వదిలి పెట్టాడు. గట్టిగా అరిచాడు-చెప్పు ముండాకానా! కడుపెట్లావచ్చింది? వెనకటికి ఎన్మిది కాన్పులు కన్నా కుతి తీరలేదట! ఒకావిడకు! అతను పెళ్లాన్ని ప్రాణాలతో వదిలాడు. అదే గొప్ప సంగతి. మరో తమాషా జరిగింది. సర్పాబాయి. గ్రామ సేవకుడు, ఎవడో మరో బీడివాలా వచ్చారు. అతన్ని మోటారెక్కించి డాక్టరు దగ్గరకు పరీక్ష చేయడానికి తీసుకుని వెళ్లారు. డాక్టరు చెప్పిన సంగతి. ఈయన ఆపరేషను సరిగా జరగ లేదు. అందువల్ల పెళ్లానికి నెల తప్పింది. నలుగురైదుగురి ఇళ్లల్లో మన ఊళ్లో ఇల్లాగే జరిగింది. అయితే సిగ్గు పోతుందని వాళ్లు నెత్తీ నోరు కొట్టుకోకుండా నోరు మూసుకున్నారు. ఆ పెద్ద మనుషులు కూడా రమజానుకు నచ్చజెప్పారు. కాని అతడు చెప్పిన వాళ్లందరినీ తెగ బూతులు తిట్టాడు. చేసేది డాక్టరు పనా? మంగలి పనా! చేతకాని పని

చెయ్యకూడదు. ఊరికే ఉత్తపున్నానికి ఆలుమగల మధ్య నిప్పు పెట్టి తమాషా చూడడమా! ఈ 'సొలగాళ్లు' చేతకాని దద్దమ్మలంతా డాక్టర్లమంటూ తయారవుతారు."

"రామాతేలి(నూనె వ్యాపారస్థుడు)కి మాత్రం ఆపరేషను చేయించుకున్నప్పటి నుంచీ చాలా మంచి జరిగింది. నాలుగు సంవత్సరాలైంది. మళ్లీ పిల్లా పీచూ ఎవరూ లేరు. పెళ్లి అయింతర్వాత-నాతడా చూసుకో- వెంట వెంటనే ఒకళ్ల తర్వాత ఒకళ్లు మూడేళ్లల్లో, ముగ్గురు పిల్లలు దిగారు. పెళ్లానికి చచ్చే అంత పని అయింది."

"ఆపరేషను లేకుండా వుంటే ఈ పాటికి ఎనమండ్రుగురు పిల్లలయ్యేవాళ్లు."

"కాని ఆ అమ్మ చెప్తోంది-ఇప్పుడావిడ ఆరోగ్యం కూడా కుదుట పడిందట. కుటుంబం కూడా ఓ దారికి వచ్చిందట. మొదట్లో ఎప్పుడు చూసినా సంసారం కటకటగా, పెటపెటగా వుండేదట."

"ఆమెకు మళ్లీ పిల్లలు లేరు. పిల్లల మధ్య వార బాగా వుంటే బాగుంటుంది."

"ఆమె అంటుంది ఆపరేషను చేయించుకోడం మూలాన నా సంసారం బాగు పడింది సార్జాబాయి! నిజంచెప్పనా! నువ్వేమైనా అను. నాకు ఏడుగుర పిల్లలు పుట్టివుండేవాళ్లు. వాళ్లను సాకలేక ప్రాణం మీదికి వచ్చేది. ఇద్దరి సంపాదన ఉప్పు మిరపకాయలకే చాలడం లేదు. హానిహానిగా జొన్నలు కొంటాం. పిల్లలు చిరిగిన చింపి గుడ్డలు కట్టుకొని తిరుగుతూ వుంటే మనస్సు పీక్కు పోతుంది. మొన్న మొన్నటిదాకా ఒంట్లో తిండికి జరిగేది కాదు. ఈయన మాత్రం తాగి ఇంటిలోకి వచ్చేవాడు. నేను పిల్లల్ని చావమోది చెవులు మూసేదాన్ని. పస్తుపరుండేదాన్ని. భోరుమని ఏడుస్తూ వుండేదాన్ని. అప్పుడనిపించింది. సర్కారు వాళ్లు చెప్పేది నిజమేనని. మా తెలివితక్కువ అర్థమయింది. నేను చెప్పేదేమంటే మంచి డాక్టరు దొరికితే ఆపరేషను చేయించు కొన్నంత మంచి పని మరొకటి లేదు. ఇప్పుడేటు వంటి కష్టం లేదు. ఆయనకంటావా? ముసలితనంలో ఏర్పడే నరాల బలహీనత పోయింది. శరీరమంతా కాయ శరీరమైంది. ఈయన పంద్రెండేన్గుల బలం శరీరానికి రప్పించుకొని మరీ నిద్రిస్తాడు. అరే! నేనేమిటి చెప్పుకుంటూ పోతున్నా! తీగ కదిలిస్తే డొంక కదిలినట్లు, ఇకదాని వెంబడి ఒకటి అన్ని కబుర్లు వస్తాయి. ఆపరేషను చేయించుకుంటే కొంత డబ్బు కూడా ఇస్తుంది గౌర్నమెంటు. కొన్ని సంవత్సరాల దాకా పిల్లలకు వంటి నిండా కప్పుకోవడానికి కూడా బట్ట వుండేది కాదు. అటువంటిది ఇప్పుడందరికీ కావలసినంత గుడ్డ గోచీ ఏర్పడ్డాయి. మనసులో చింత పోయింది."

"ఇటుచూడు సేమంతీ! ఒక విధంగా నువ్వు చెప్పేది సరైనమాటే."

"జయభోలే! భోలే బాబా దయాదృష్టి కావాలి. హుక్కా గొట్టం బంగారుతో తయారవుతుంది. హరిబాకోళీ రోజులు హాయిగా గడిచిపోతాయి. ఆయన పిల్లలు సర్పంచ్ అవుతారు. భోలే బాబా దయ కలగాలంటే అసలు సిసలైన గంజాయి సామాను కావాలి. హరిభావు, విఠోబా గావడే, జానకీరం, భీమకోళీ, అసలైన ఇప్పకల్లు పుచ్చుకొని ఊగులాడుతూ, ఇష్టం వచ్చినట్లు పేలుతూ వచ్చారు."

"వచ్చారు మూతరం తాగి. ఉచ్చ తాగందే వీళ్లకి వేరే పనే తోచదు." శేవంతి.

"ఉచ్చ అను మరేమైనా అను. మాకది అమృతమే. పైని స్వర్గంలో, దేవతలకు కూడా గంజాయిలేందే బొత్తిగా ఆనందమే లేదుట శేవంతిబాయి!... రేపు అమావాస్య. అందుకని ఇవ్వాళే ఓసారి, నియమం తెంచుకుని, తెగించి, ఇంత చుక్క పుచ్చుకున్నాం. అంతేగాని, మేం కల్లు వంక చూడనైనా చూడం, తెలుసా! దేవుడిమీద ఒట్టు."

"చచ్చినోళ్ల, నోళ్ల నుంచి ఒకటే కుళ్లు కంపు గుప్పుగుప్పున కొడుతోంది పద సార్జే. వీళ్ల యెసనం మనకు తగుల్కొంటుందేమో!"

"వెళ్లండి. గంగమ్మ ఒడిలోకి. మా అలవాట్లు మీకేం లాభం. మేం అకటావికటం మనుషులమైతిమి! జై భోలే! జయబజరంగబలీ! పగవాడి తల బద్దలు కానీ! ఇవ్వాళ్ల ఊరిలోని విశేషాలు చెప్పుకుందాం."

ఆడవాళ్లు లేచి వెళ్లి పోతారు. హరిబా గొంగళి పఱుస్తాడు. విఠోబా, జానకిరాం, భీమా, నిలువుగా, అడ్డదిడ్డంగా దానిపై వాలుతారు. హరిబా నల్లగా చిట్టెం కట్టిన హుక్కా గొట్టం ముందుంచుతాడు. కొంచెం నీళ్లు తెచ్చిపెడతాడు. ఇంట్లోంచి గంజాయి సామాను తెచ్చి అరచేతిలో నేర్పుగా బొటనవ్రేలితో నూరుతూ వుంటాడు.

* * * * *

"లాక్షీ! తలుపు తెఱు."

"ఎవర్క్కడ!"

"భాగవత్"

"తలుపు ఊరికే చేరగిల వేశాను. నువ్వే తెఱుచుకుని లోపలికి రా."

భాగవత్ తలుపు తెఱచుకుని, అల్లాగే కొంచెం సేపు ద్వారబంధంలోనే

నిలబడిపోయాడు. పట్టెమంచంమీద ఒకళ్ళకొకళ్లు, సందు లేకుండా లాల్జీ సావిత్రి, అంటుకొని పోయి కూచున్నారు. లాల్జీ అరచేతిలో సావిత్రి గోరింటాకు ముగ్గులు, పెడుతోంది.

"అల్లా చూస్తావేం! ఈ సంగతి ఇంతవరకూ నీవు కని విని ఉండలేదా! ఈమనే నేరుగా అడుగు."

సావిత్రి లాల్జీ కళ్లలో కళ్లు పెట్టి చూస్తూ పకపకా నవ్వింది.

"వదినా! మీరిద్దరు నిజానికెంతో అదృష్టవంతులు. ఇంతటి మంటను జీర్ణించుకుని, స్వతంత్రంగా బతకగలగడం, మా బోటి వాళ్లకు చేతనైన పని కాదు."

"అరే ఏం స్వేచ్ఛగా బ్రతకడం. ఇంతకు కొంచెం నేను ముందే ఈమె గారి కళ్లల్లో నీళ్లు తొణికిసలాడాయి. ఈమె తలకాయలో ఎప్పుండేమి తోస్తుందో ఎవరూ చెప్పలేరు."

"లాల్జీ నువ్వు బొత్తిగా దాతిగుండెవాడివి. నీకు ఎప్పుడైనా అనిపించిందా. వదినెను అర్థం చేసుకోవాలని. ఆమె మనస్సులోని ఆలోచనలు ఎంతెంత తుఫాను రేపుతున్నాయో ఎప్పుడైనా అడిగి చూశావా? ఇటువంటి శోక వ్యాకులమైన మనిషి కేవలం నాపైనే ఆధారపడి, నాదగ్గిరకే ఎందుకు వచ్చి చేరిందా అని గాని, ఆమె కొరకు నేనేమి చేయలేకపోతున్నానని గాని, నీవెప్పుడైనా నీలో నీవు ఆలోచించావా?"

"చేయడానికేమి లేదు. నీవు వెర్రివాడిలా ఏమిటి ఇటీవల ఇల్లా మాట్లాడుతున్నావ్."

"నేను సరిగానే మాట్లాడుతున్నా. నీకే అర్థం కావడం లేదు."

"నీవు మనసు విప్పి ఏమాటా ఇటీవల చెప్పడం లేదు. ఏదో సమస్య నా ముందు తెచ్చి పెడుతావు. నన్ను నిష్కారణంగా తికమక పెడుతావు. సావిత్రీ! కొంచెం ఏదైనా తినడానికి తెచ్చిపెట్టు"

"ఇప్పుడు తింటానికే మీ వద్దు. కేవలం చాయి చాలు."

"నువ్వు మన మధ్య వుండే ప్రేమను పలచన చేసేశావు. అసలు మా దగ్గిరకు ఎప్పుడో గాని రావు. వస్తే ఏదో ఇలాగే సమస్య గురించి మాట్లాడుతావు."

"వదినె మంచిది కోపగిస్తావెందుకు? ఏమైనా ఉపాయం చూడు."

"లాల్జీ! నిజంగానే నాకిటీవల ఏమి సరిగా తోచడం లేదు."

"ఎందుకల్లా! నువ్వేమైనా చెబితేగా! ఎప్పుడైనా?"

"కుట్రలు, పన్నాగాలు ఏమి కావు. అప్పుడప్పుడూ ఎందుకోగాని, ఏమి తోచ

కుండా శూన్యంగా ఉండి పోతాను. ఇంట్లో, బైట ఊళ్లో, పొలం షెట్రలో, అంతటా ఓ విధమైన నీరసుత్త వ్యాపించి పోతుంది. ఆలోచనలు కుంటుపడిపోతాయి."

"నేను నీకెన్ని సార్లు చెప్పాను! నేను మహారాజు(బాబా) ఎక్కడవున్నా వెదికి పట్టుకొస్తానని. దేవాలయంలో మా రాజున్నన్నాళ్లు నీకేమైనా తోచకపోతే, ఆయన చెప్పిన దానిలోంచి నీవు మార్గం కనిపెట్టేవాడివి. నువ్వే అంటూ వుండేవాడివి. 'నాకు మళ్లీ మహారాజును గురించిన చింత పట్టుకున్నదని.' నువ్వు ఎప్పుడు వెళ్లమంటే అప్పుడు బైలుదేరి వెళ్తాను. ఆయన ఎక్కడ వున్నదీ వెదకడానికి."

"వద్దు వద్దు లాల్జీ! మహారాజు ఎక్కడని దొరుకుతాడు? ఆయన ఏ హిమాలయ గుహల్లోకో, వెళ్లిపోయివుంటాడు."

"నువ్వు బలే ఊహాచక్రం తిప్పుతావు. మహారాజు మహా అయితే 'ఆళంది'లోనో పండరిపురంలోనో ఉండి వుంటాడు.

"కాని నేనంటున్నాగా, వెళ్లవద్దని."

"గ్రామంలో ఆయన పేరు చెప్పుకున్నారు. దేవి నగలు పోయినప్పుడు అని చెప్పావు నువ్వు. దొంగిలించిన ముగ్గురు నగలతో బాటు పట్టుబడ్డారు. ఈ సంగతి ఊళ్లో వాళ్లందరికీ తెలుసు. అయినా ఉట్టి పున్నానికి, మహారాజుకు చెడ్డపేరు తెచ్చారు వీళ్లు."

"మహారాజును నేనిప్పుడు పూర్తిగా మఱచిపోయాను."

"నువ్వు అట్లా ఎట్లా చెబుతున్నావు భాగవత్?"

"ముందొక గ్లాసెడు మంచినీళ్లు ఇయ్యి. తర్వాత ఎప్పుడైనా చెబుతాను. నాకు ఎండదెబ్బ తగిలినట్లు అనిపిస్తోంది."

భాగవత్ మంచినీళ్లు గటగటా త్రాగి పట్టె మంచం మీద నడుం వాల్చాడు. కళ్లు మూతలు పడుతున్నాయి.

"భాగవత్! నీకేమైంది?" లాల్జీ వ్యాకులపడ్డాడు.

"ఏమి కాలేదు!"

"నా మీద ఒట్టు. నిజం చెప్పు. ఏం రగడ జరిగింది? నువ్వు జరిగిదంతా చెప్పు. నేను చూసుకుంటాను. ఈ దిస్సమొుల ఊరిలో దిస్సమొులగానే వ్యవహరించాలి. లేకపోతే మనం బ్రతకలేం. నిలవలేం."

"అటువంటిదేమి లేదు లాల్జీ!"

"నా దగ్గర దాచి ఏం లాభం! నీ ఖర్మ వేడెక్కి పోవడం తప్పు!"

"నీకు వినే ఓపిక, ధైర్యం వుండాలి"

"అయితే నన్ను నీవేమనుకుంటున్నావు. చెప్పేయి."

"మహారాజా గారి మీద నీకు శ్రద్ధ వుందా?"

"చాలాచాలా! ఎంతైనా శ్రద్ధా భక్తులున్నాయి."

"మహారాజా ఊరువిడిచి వెళ్లిపోయిన తర్వాత, ఈనాటికీనా?"

"అవును. ఏనాటికీ కూడా. మహారాజాలాంటి జ్ఞానిని, నేనెక్కడా చూడలేదు. అంతేగాక, ఆయన మూలాన, నా బుర్రలో పాతుకున్న భ్రమలెన్నో తొలగి పోయాయి. అయితే నేను స్వతః మందబుద్ధిననుకో."

"ఆయన్ను గురించి ఏమైనా విపరీతంగా వింటే?"

"అల్లా చెప్పేవాడు నా ఎదుటబడితే, వాణ్ణి విఱిచి పోగులు పెడతాను."

"అయితే నువ్వు నన్నే విఱిచి పోగులుపెట్టాలి."

"ఏమిటల్లా మాట్లాడుతావు? ఏమి చెప్పకుండా! మహారాజా ఎక్కడున్నాడు?"

"హవుసా గుర్తుందా?"

"హవుసా! ఏ హవుసా?"

"అదే పొలంలో వుండేది, కడొబా హత్యకు మూలమైంది"

"వహ్వా! దానినెవరెరుగరు? దాని ఉరిత్రాడు నా మెడకు తగిలించేదే! ఒట్టి రగడ ముండ! దాని కేమైంది? ఇటీవల గ్రామంలోకి అది రావడం తగ్గిపోయింది"

"నిన్న సాయంత్రం, నిద్రమత్తువేళ, పెద్ద పొలంలోకి వచ్చి నన్ను కలుసుకొన్నది"

"మళ్లీ రభసా, రచ్చా, ఏమైనా జరిగిందా?"

"దానికి మళ్లీ నెల తప్పిందట."

"ఎవరివల్ల?"

"మహారాజావల్ల!"

"ఏమిటి నువ్వు మాట్లాడేది?"

"నేను నిన్ను ముందే అడిగా నీకు గట్టి శ్రద్ధ వుందా?"

"అది వట్టి ఱంకుటాలు. ఏదైనా చెబుతుంది"

"అట్లాకాదు లాల్జీ! ఈ సంగతి ముమ్మాటికీ నిజమే."

"ఇది సరాసరి పచ్చి అబద్ధం. మహారాజా ఈ ఊరు విడిచివెళ్లి ఎన్ని రోజులైంది! దీనికి ఆయనవల్ల కడుపు ఎక్కడనుంచి వచ్చింది?"

"మహారాజా ఆమె పొలంలో ఈ ఆరు నెలల మధ్య రెండేసి రాత్రిళ్లు వచ్చిపోతూ వుండేవాడుట."

"భాగవత్! ఆమె మాటలు నీవు నమ్ముతున్నావా? పోలీసులు ఆమెను ఊరి నుంచి తప్పించకుండా వుంటే బావుండేది. నిజానికి సూటిగా జైలు ఖానాలో పడేస్తే బావుండేది"

"లాల్జీ! నీవు అడ్డదిడ్డం మాటలు మానేసెయ్యి. నేను చెప్పే దాన్ని ముందుగా శ్రద్ధగా విను. నా బుర్ర అసలే వేడెక్కి పోతోంది. మహారాజిప్పుడు వెనకటి మహారాజాకాడు. మనిషి ఎవడైనా ఇంతగా మారిపోయిన వాడు లేడు మహరాజంత. నాకు నిన్నటిదాకా వుండే భావం,కేవలం బూటకంగా బుజువైంది. నిన్న హౌసా కలుసుకొని మాటలాడిన తరువాత ఉన్న భావమంతా చెల్లాచెదరై పోయింది నేను నీకు సవిస్తరంగా గది లోపల చెబుతాను తర్వాత. హౌసాకు మొదట కడుపు అయిందని ఊరంతా గగ్గోలు పుట్టింది. ఆ గర్భం కూడా మహారాజా ప్రసాదమే. దేవియే సాక్ష్యం. అటు తర్వాత మహారాజుని కాపాడడం కోసం కడోబా చావు తప్ప లేదు. నీకు నాకూ అది సంభ్రాంతి కలిగించేదే అయినా, ఆ సంగతి కూడా నిజమే. ఆ అధ్యాయం అంతటితో ముగిసింది దేవాలయంలో మహారాజా ద్వారా ఎప్పుడా పాపం బద్దలైందో, అప్పటినుంచీ, మహారాజా హృదయంలోంచి, దేవి మాయమైంది. ఇప్పుడు హౌసా చెప్పేదంతా నూటికి నూరుపాళ్లు నిజమే. మహారాజా దగ్గిర ఇప్పుడు వాసనాభరితమైన శరీరం, మనస్సు మాత్రమే ఉన్నాయి. మహారాజా రాత్రి, అపరరాత్రి ఆమె గుడిసెలో దయ్యం పట్టిన వాడిలా దూరుతూ వుంటాడు. పైశాచికకాండ జరుగుతూ వుంటుంది. హౌసా ఆయన్ను వదిలించుకోలేక పోవడం, తన మానసిక దౌర్బల్యమేనని ఒప్పు కుంటుంది. మొన్న రాత్రి మహారాజా ఆమె దగ్గిరకు వచ్చాడు. అప్పుడామె కడుపు సంగతి చెప్పిందాయనకు. మహారాజా పిచ్చెక్కిన వాడికంటె కూడా కనా కష్టంగా అసహ్యంగా మాట్లాడాడు. తిరిగి దాని కాళ్లు పట్టుకున్నాడుట. సాంగత్యం మళ్లీ కోరాడుట. బతిమాలి బామాలాడాడుట. ఆమెను ఎక్కడికైనా ఏ కాశీక్షేత్రంలాంటి చోటికో వెళ్లిపొమ్మని సలహా ఇచ్చాడు. అక్కడే వుండి పొమ్మన్నాడు కూడా దానికంగీకరించిందామె. గర్భాన్ని దింపుకోనని ఆమె నాతో చెప్పింది కాని తిరిగి మళ్లీ రాదుట ఇక్కడికి. ఆమె కళ్లు ఆ సమయంలో బొటబొట కన్నీళ్లు కారుస్తున్నాయి. ఏమిటో ఎందుకో ఏమి తెలుసు? నేనూ ఆమెతో మాట్లాడలేదు. నేనసలే కంపించి పోతున్నా మనస్సులో. ఆమె తన పొలం ఆ దేవికి మాన్యంగా

గ్రామానికి కప్పగించేసింది. ఈ కాగితం మీద ఆ ప్రకారం రాయించింది. దీనికింద ఆమె నిశాని వేలి ముద్ర వేసింది. ఇదంతా రాసింది ఎవరో నువ్వు సరిగా చూసి తెలుసుకో-"

"మహారాజుగారి చేతి వ్రాతే యిది"

" కాని దీన్ని గ్రామంలో ఏ మొహం పెట్టుకుని చూపించడం?"

"నువ్వీ కాగితం, నీ దగ్గిర ఎందుకు పెట్టుకున్నావు? అసలే మన గ్రామం, నీలాపనిందలు వేయడానికి సిద్ధం, ఇందులోంచి మరేదో పుకారు పుట్టించడం, మళ్లీ మనం దాన్ని మాపుకోవడం కోసం, ఇటూ అటూ పరుగెత్తడం. ఇదే పని."

"దేవి మీద ఒట్టు పెట్టి చెప్పడం, మరి ఆమె పడుతున్న మధన చూసి కాగితన్ని చేతిలోకి తీసుకున్నా. అంతేగాక ఆమె నాపైన ఎంతో నమ్మకం పెట్టుకున్నది నేను తర్వాత చెబుతాను."

"ఎంతెంత భయంకర సంఘటనలు ఇక్కటొక్కటిగా వచ్చి పడుతున్నాయి. ఇంతింత కథలూ, కమాయిషులూ జరుగుతుంటే, నువ్వు నా నుంచి వీటన్నింటినీ దాచి పెడుతున్నా వన్నమాట."

"పోనియ్యవయ్యా లాల్జీ! ఇదొక్కటేమిటి, గ్రామంలో జరుగుతున్న విషయాలు, దీనికంటె కూడా అధ్వాన్నంగా వున్నాయి. నీకు అన్నీ చెబితే, నువ్వు 'పిచ్చెక్కి పోతావు. నువ్వసలే ఉడుకు రక్తంతో వుండే, ఉద్దండుండానివి. జరిగేదేదో జరుగుతూ వుంటుంది. నా మనస్సు కూడా ఇదివరకంత సుకుమారం కాదు. అయినప్పటికీ, మనస్సు మీద ఈ వార్తలు ఎంతో దెబ్బ తీస్తాయి. గ్రామం ఉమ్మడి మంచి కోసరం, నేను నా స్వార్థాన్ని కూడా తగలబెట్టుకున్నా. ఇప్పుడు నా మీదే దోషారోపణ చేసుకుని మెదలకుండా కూచుంటున్నా. జనులందరినీ, పట్టపగలు, బాహాటంగా, రక్తమాంసాలు పిండేవాణ్ణీ మొత్తం గ్రామాన్ని, నీ, నా, అనే వివక్ష లేకుండా, దోచుకునే వాణ్ణి చెప్పుకింద తేలులాగా పడివుండేటట్లు చేయడమేమంత కష్టమైన పని కాదు నాకు. కానైతే-నేనీ మట్టిపైననే పుట్టి పెరిగినా,-ఇక్కడి మనుషుల విపరీత ధోరణులు, ఎంత పరిశోధించినా నాకంతు పట్టడం లేదు. మనుషుల నుంచి తిరిగి కొంచెం దూరంగా వుండి చూద్దాం. పొలం పుట్రా పనీపాటమీదా కొంచెం ధ్యాస తిరిగి పెట్టుదాం. చాలాచాలా అనుభవానికి వచ్చింది ఇంకచాలు. దుమ్మును, గులాలు అని చెప్పడం, మన కెప్పటికీ చేతనైన పని కాదు. నా అంతట నేను బాగా పరీక్షించి చూసుకున్నాను. కాని నాకే సిగ్గుచేటనిపిస్తుంది. జనానికింకా బట్టబయలు కానీ, నేను

నీకు చెప్పనే లేదు; నా చేతులు కాల్చుకుని, ఊరి వారికి తీర్థ ప్రసాదాలు పంచిపెట్టాను. ఊళ్లో ఎక్కడ రాగులు, జొన్నలు, ధాన్యం దొరకడం లేదని, ఇంట్లో డబ్బు ఖర్చు పెట్టి ఓ దుకాణం పెట్టాను. అది పాత సంగతి. అందులోంచి, ఎక్కడి నుంచో ఒకటొరెండు నిజమో, అబద్ధమో, తగాదాలు వచ్చి పడ్డాయి. ఎక్కడి సంగతి, ఎవరి సంగతి, అనే గుర్తు కూడా నాకు లేదు. కాని నేనే, దానికి మూలం కదా అని, వాళ్ల విరుద్ధంగా అర్జీపెట్టాలని, గ్రామానికయ్యే ఖర్చులో సగం భరించాము. అది పూర్తి అయింది కదా అనుకుంటుంటే, ఇప్పుడీ ఓ మహారాజుగారి కథ బుర్రలో. పంట పండించడం వైపు ఉత్సాహం తక్కువ, పాల్లు దంచడం వైపు ఎక్కువ. ఈ గ్రామం సంగతంతా ఇలాగా వుంటుంది.

"నువ్వన్నది ఎంతైనా నిజం."

"ఈ అటుకులు తీసుకొని తినుముందు. ఎక్కడెక్కడి చింతల్లో ఎప్పుడు ఇద్దరం మునిగి పోతామో మనకే తెల్వదు. ఇంత మాంద్యమైతే ఎట్లా?"

"మన కెక్కడి మాంద్యం? ఇంతసేపు కావాలిసినంత గప్పాలు కొట్టాం. నాట్ల సమయం దగ్గిరకు వచ్చింది. చింతలతో పొగెత్తి పోయాయి ప్రాణాలు."

"మీ ఇద్దరి చింతలన్నీ భగవంతుడు తొలగించెయ్యాలని మేమిద్దరం, సోమవారం మహాదేవునికి అభిషేకం చేయించడానికి వెళ్తాం. రోజంతా అక్కడే వుంటాం."

"ఇద్దరి కోసరం వేడడం ఎందుకు? మొత్తం గ్రామం మంచి కోసరం మ్రొక్కు కోండి."

"అట్లాగా! సరే! నలుగురం వెళ్లదాం పదండి. ముందు మీ దంపతులు మ్రొక్కుకోండి. మీరు వేడుకుంటే, మీ కోర్కెలు విశ్వంభరుడు చెల్లించేస్తాడు."

"ఏమయ్యా లాల్జీ ఒప్పుకుంటావా?"

"నిక్కచ్చిగా ఒప్పుకుంటాను."

"పదినా? పక్కామాటే గదా!"

"లేకపోతే ఇదేమైనా గమ్మత్తా?"

"సరే సోమవారం పక్కా."

బాయి, పక్కా తీసుకున్నాడు. భాగవత్ ఇంటినుంచి బైట పడ్డాడు. ఎంత దూరంగా వెళ్లిపోయినా, ఇద్దరూ ద్వారంలోనే నిలబడి చూస్తున్నారు.

7

"రేపు ప్రొద్దున్నే ఎవరూ పొలాల్లోకి వెళ్లకండోయి! సర్పంచ్ సాబు మీటింగు పెడుతారంటాహెూ!"

"రేపు శ్రావణ మంగళవారం. జనమంతా అమ్మోరికి చద్దిబోజనం తీసుకు పోవాలండాహెూ!"

"రాత్రి ఒకదాని వెంట ఒకటి, రెండు దెబ్బలు డప్పు మీద జోరుగా కొట్టి 'తోతామాంగా' మరీ చెప్పాడు. సర్పంచ్ సాబు ఏం మీటింగు పెట్టబోతున్నాడో జనం ముందుగానే 'తోతా' నుంచి వాకబు చేస్తారు. తోతా, మెంబరు నుంచి కూడా బీడీ ముక్క అడిగి తీసుకుని, చేతిలో ఉన్న వెదురుబుట్టలోకి కూర, కాయ వసూలు చేసుకుని, మరీ చెప్పుంతూ వుంటాడు. బైటనుంచి యెవ్వడైనా పై అధికారిగాని, ఏ నాయకుడైనా గాని, వచ్చేలాగావున్నా, మరి ఋణాలు పంపిణీగాని వేరే సౌకర్యాలు గాని కల్పిస్తారన్నా జనం గుమికూడుతుంది. బాకీలు వసూలు చేస్తారని గాని, చందాలు, నిధులూ, మొత్తం వసూలు చేయాలెక్కడనుంచైనా సరే అనిఅని, ఆ సంగతి తోతా నుంచి ముందుగానే తెలుసుకొని, తెల్లవారకముందే పొలాల్లోకి గాని, బైట ఊళ్లకు గాని ప్రయాణం కట్టి వెళ్లిపోతారు. ఎక్కడెక్కడో ఉత్సవాలని, పండగలని, పబ్బాలని, భూమి పూజ అనీ, పాఠశాల ప్రారంభోత్సవమనీ, గ్రామగౌరవం నిలబెట్టాలనీ, వచ్చి నాయకుల సత్కార సమారంభాలకనీ, ఇలా ఎన్నెన్నో అవసరమైన కార్యాలకు చందాలు కట్టలేక జనం విసుగెత్తిపోయారు. గ్రామం ఉమ్మడి వ్యవహారమంటూ, మర్యాద కాపాడుకోవడానికి వాళ్లవాళ్ల పరిస్థితుల కనుగుణ్యంగా డబ్బులిస్తూ వచ్చారు. కాని పరిస్థితుల వైపరీత్యం వల్ల, ఈ సంవత్సరంలో ఎన్నో చందాలు చెల్లించే లొందరకు భయపడి, జనం పరుగెత్తుకొనే పోతారు. జగదేవు ఎట్లాగైనా సరే, పని పడ్డప్పుడు దాన్ని నిర్వహించే తీరుతాడు. సభాసమావేశాలు జరిపించడమంటే

ఆయనకెక్కడ లేని ఆవేశం వస్తుంది అదంతా తన డబ్బే అన్నట్టు ఖర్చు పెట్టి పారేసి తన పై అంతస్తు నిరూపించుకుంటాడు.

"గ్రామంలో కొద్దిమంది ఆసామీ పెద్ద మనుషులు, ఓ పదిమంది దగ్గిర బాగా రాబడి ఉన్నవాళ్లపైన, భారం వేసి డబ్బు చాలా వసూలు చేసి పెట్టాడు. జనం కూడా ఎక్కువ కటకట పడకుండా, అడిగిందిచ్చి ఊపిరి పీల్చుకుంటారు. గొప్ప గొప్ప అధికారుల, గొప్ప గొప్ప నాయకుల, దాబులూ దస్కాలూ, భరించి, సొంతంగా ఏమైనా పనులుంటే సాధించుకుంటాడు. కాని ఇటీవల అధికార్లూ, నాయకులూ, ఈయన చాకచక్యాన్ని, తెలివి తేటల్ని గమనించారు. అధికార్లు అతను పెట్టింది బాగా తిని, త్రాగి, వెనకనుంచి డబ్బు వసూళ్ల నోటీసులు పంపుతున్నారు. నాయకులు, చచ్చి గింజుకున్నా, ఎక్కడా కూడా, ఎక్కడి నుంచి కూడా, అతనికి ఎన్నికల్లో నిలబడడానికి టిక్కెట్టు ఇప్పించడం లేదు. "చేయి చూపించి, అవలక్షణం చెప్పించుకోకు" అని సలహా ఇస్తున్నారు. ఒక వేళ జగదేవు స్వతంత్ర అభ్యర్థి గా నిలబడ్డాడో, అతనికి పోటీగా, పాటీలును నిలబెట్టి ఓడించి పరాభవిస్తున్నారు. ఆ సందర్భాల్లో 'జగదేవుకు స్మశానవైరాగ్యం వస్తూ వుంటుంది.' అనుకుంటూ వుంటాడు-ఇహ ఈ పాలిటిక్సు అంతా వదిలేసి, తానొక కృషి పండితునిగా రాణించాలని-వీళ్లంతా నెంబరువన్ బద్మాషులు. నేనే వీళ్లందరినీ పెద్దవాళ్లను చేశా. అటువంటిది నన్నే ఈ లండీకేలు అణచి పారేస్తున్నారు. ఈవిధంగా ఎన్నోసార్లు కోపం పట్టలేక నాయకులనందర్నీ వాళ్ల లోపాలూ, అవగుణాలు వేలెత్తి చూపించి, నలుగురిలో తూరుపార బట్టుతాడు. నాయకులు కూడా తెలివైనవారే. కొంత సావకాశం చూసుకొని తిరిగి జగదేవుని పొగడుతూ వుంటారు. అతనికి భ్రమ కలిగిస్తారు. అతని పనులు-గడ్డుగా వున్నాయి. త్వరత్వరగా, చేసి పెడుతారు. మళ్లీ ఎన్నికల హడావుడి వచ్చేదాకా, ఆయనతో తియ్య తియ్యగా మాట్లాడుతూ వుంటారు. ఇట్లా ఎన్నో వందల సార్లు ఈ వ్యవహారం నడిచింది.

రెండోరోజు, ఉదయం తొమ్మిది గంటలకు, గ్రామ పంచాయతీ చావడిలో, చప్రాసీ చాలా కష్టం మీద పోగుచేసి తెచ్చిన పది పదిహేను మంది జనం. ఏవో కొన్ని పనులు అడ్డంగా తిరిగి అవస్తపడుతున్న వాళ్లు మిగతావాళ్లు ఎవరంటే-గ్రామకరణం, గ్రామసేవకుడు, సొసైటీ సెక్రటరీ, వ్యవసాయ అసిస్టెంటు, ఇద్దరు ముగ్గురు మాష్టర్లు ఒక గ్రామపంచాయితీ సభ్యుడు, మరో సొసైటీ సభ్యుడు, పోలీసు పాటేలు, ఇనస్పెక్టరు, ఇటువంటిదే మరికొంత సిబ్బంది-అందరూ, సర్పంచ్ గారికోసరం

ఎదురుచూస్తున్నారు. అయితే ఈ లోపల, వ్యవసాయాన్ని గురించిన, ఆయా కబుర్లు సభారంగంలో చోటుచేసుకున్నాయి.

"మీరేమైనా చెప్పండి కరణంగారు! వెనకటి కాలం వెళ్లిపోయింది. ఎటువంటి కాలమది. రాజాకాలం. ఒక మనిషి సంపాయిస్తే మొత్తం ఇంటిల్లిపాదీ కూచుని హాయిగా అనుభవించేవాళ్లు. ఈ కాలంలో ఇంటిల్లి పాదీ సంపాదిస్తున్నా, పస్తులతో పండుకోవాల్సి వస్తోంది. మన గ్రామం పూర్వం, చుట్టు పక్కల పది గ్రామాలకు ధనధాన్యాలు, సమకూరుస్తూ ఉండేది, మరి ఇవ్వాళ్లో అడిగారూ!"

"గ్రామం అదే. నేల అదే. మనుషులూ వాళ్లే. ఇట్లా ఎందుకైందో మీరే చెప్పండి!"

"అన్నీ ఎక్కడివక్కడట్లాగే వున్నాయి. కాని మనుషుల నీతిలోనూ, వాళ్లు పాటించే ధర్మంలోనూ తేడా వచ్చిపడింది."

"బలే! మా మంచి తెలివైన వాడు మొలుచుక వచ్చాడు! నీతి నియమాలున్న వాడు! దేవాలయంలో పీఠం పెట్టిన మహారాజానుంచి ఆ సంపూర్ణ జ్ఞానమంతా నీ బుర్రలోకే అవతరించినట్టుంది."

"మహారాజుగారెప్పుడూ ఎవరికి కూడా, కూడని మాట చెప్పలేదు. మన కర్తవ్యాన్ని, మన ధర్మాన్ని మనకు గుర్తుకుతెచ్చారంతే."

"మరెందుకు ఆయన్ను పట్టుకుని ఊరు కదలకుండా కూచో పెట్టలేదు? నీ వంటివాళ్లు శిష్యులుగా సుమారు ఏభైమంది తయారైతే ఈ పాటికి ఊరిని ఉద్ధరించి వుండేవాడుగా. ఆయన."

"దేవి నగలు దొంగిలించి పారిపోయాడు. లుచ్చా! ఆయన మనకు కర్తవ్యం బోధ చేస్తాడుట."

"నగలు దొంగిలించి పారిపోవడానికాయన ఏమంత దరిద్రుడు కాడు. ఆయన మహాపురుషుడు. నీకు భాగవత్ మీద, మా మీద కోపం వుంది గనుక నువ్వు మహారాజును గురించి ఆ విధంగా మాట్లాడుతున్నావు. నీ కిష్టం లేకపోతే ఆయన గొప్పతనాన్ని అంగీకరించకు. మహారాజే కదా! దేవీ మందిరం ముందు, దీప మాలికలన్నీ ఏర్పఱచి జ్యోతి వెలిగించిన వాడు. ఆ సంవత్సరం, దేవి ఆశీర్వాదం వల్ల ఊళ్లో ఎంత పంటో చెప్పడానికి వీల్లేదు. ఈ గ్రామంలోని సకల ప్రాణుల ఉనికి మారుతీరాయని మీద, దేవి మీద ఆధారపడివుంది."

"ఈ మాట మీరు కూడా అంగీకరిస్తారా రావుగారూ! ఒక గొప్ప సాధువు నాతో అన్నాడు కదా మీ ఊళ్లోని మారుతీరాయనికి పూజావేదిక కట్టిన రోజునుంచి ఊళ్లోని లక్ష్మి అంతా మాయమైపోయింది"

"ఏమిటి గాడిద గుడ్డు సోది అంతా."

"అరేవింటే నువ్వే ఒప్పుకుంటావు. ఎందుకూరికే బడబడలాడుతావు. ఈ పూజా వేదిక కట్టిన వాడొక మహ్మదీయుడు. అతను చాలా వెర్రి పని చేశాడు. అతను గోడ కట్టడంలో ఆవు ఎముకలూ, బొమికలూ, కూడా చేర్చి కట్టాడు. అప్పటినుంచీ, మారుతి మహారాజు ఆగ్రహించి ఊరు వదిలిపెట్టి వెళ్లి పొలిమేరలో వుండి పోయాడు. హోమం, హవనం, పూజా మొదలైనవి చేసి ఆయన్ను తిరిగి పల్లకీలో ఊరేగింపుగా తీసుకుని రావాలి ఊళ్లోకి. మళ్లీ కొత్త వేదిక కట్టించాలి" అని ఆ సాధువు నిష్కర్షగా చెప్పాడు.

"అంటే దేవాలయంలో ఇప్పుడు, మనకు కనబడుతున్న ఆంజనేయస్వామి, వట్టి బూటకమన్నమాట! వొట్టి బుర్రలేని పిల్లి సన్నాసులు మీరంతా! మారుతిని తిరిగి ఊళ్లోకి ఊరేగింపుతో తీసుకువస్తే మీరు ఇల్లాగే ఇళ్లల్లో గంజాయి తాగుతూ కూచున్నా, మీ పొలాలు పుష్కలంగా పాటంతటవి పండు తాయని వెర్రిమొర్రి కలలు కంటున్నట్టున్నారు! భాగవత్, రామలాల్, పాండుకాకా, వీళ్లమీద ఆంజనేయస్వామి ఆగ్రహించలేదేం? ఇవ్వాల్టి రోజు వాళ్ల ఇళ్లలో లక్ష్మి తాండవిస్తోంది. మెచ్చుకోవాలిసిందే! మీ మట్టి బుర్రల్ని."

"అరే! నాకెందుకు చెబుతావు ఈ వృథా మాటల్ని. ఆ సాధువు ఒట్టు పెట్టుకుని మరీ చెప్పాడు. తాను చెప్పినట్టు కాకపోతే, రాళ్లు రువ్వమన్నాడు. ఎంతైనా అవమానం పాలు చేయమన్నాడు."

"బలే బాగుంది బాబూ! నువ్వు చాలా గొప్ప వాడివి. మీ నాయన అంతకంటె గొప్పవాడు. మేమే వొట్టి పనికిమాలిన గాడిదలం."

"మరి నువ్వెందుకట్లా దెబ్బలాడుతావు? ఏదో మామూలు సంభాషణలో ఎందుకింత రగడ పెంచుతావు. నువ్వూ, ఈ గ్రామం కూడా చాలా విచిత్రమైనవి. ఏదో ఒక నిమిత్తం కావాలి. పోట్లాడుకోటానికి, కాట్లాడుకోడానికి. ఈ దెబ్బలాటల్లోనేగా, ఓ మార్వాడి ధారపోసాడు. ఎంత డబ్బు ఖర్చయింది ఎంత ఇబ్బంది పడ్డాడు. ఆయన ఒక్కొక్క కుట్రతో గ్రామంలో పడ్డ చీలికలు నేటికీ అట్లాగే

వున్నాయి. అంతకంతకూ పార్టీలు చీలికలు కక్షలు పెరిగిపోతూనే వున్నాయి. వీటివల్ల ఎవడికీ మంచి జరగడం లేదు. కాని ఒక్కొకడుంటాడు-మంచిపనిచేసి చూపించేవాడు కూడా విచార వైషమ్యాన్ని మఱచిపోయి, ఓ చోట శాంతంగా కూచోవడానికి వీల్లేదని-దీనికంతటికీ అర్థమేమిటో?"

"మీరే చూడండి కరణంగారూ! తనకు తాను బుద్ధిమంతుడనీ, ఇక్కడ వున్న మిగతావాళ్లంతా, తెలివితక్కువ సన్నాసులనీ, ఖచ్చితంగా, అనుకుంటాడు ప్రతివాడూ! వాడు గాడిద, వాడు మూర్ఖుడు, వాడట్లా, వీడట్లా... అంటూ పంచాంగం విప్పుతాడు."

"కేవలం ఈ ప్రసంగం మార్చాలనే ఉద్దేశంతో, కరణం, ఆఫీసులో పడివున్న పాత 'మరాఠ్వాడా' పత్రికలోంచి ఒక వార్త చదివి వినిపించాడు.

"పింపల్‌గావ్‌లో భూవికాస బ్యాంకు అప్పు మీద త్రవ్విన దిగుడు బావి (సర్వే నం.73) దొంగలు దొంగలించారుట. కోర్టులో దాని మీద కేసు." మిగతా వాళ్లంతా వెర్రిమొహాలు వేసుకొని చూస్తూ వుండిపోయారుట.

"దిగుడుబావి ఎట్లా దొంగలింప బడుతుంది? కొంచెం సరిగా చదవండి కరణంగారూ!"

"పొరపాటున ఏదో రాసిపారేసి వుంటాడు. ఈ వ్యవహారం నాకు తెలుసు. ఏం? మన ఊళ్లో మాత్రం ఇటువంటివి జరగడంలేదా? ఎన్ని చూపించమంటారు?"

"కుట్రలు, కేసులు, అప్పులూ మన ఊళ్లో చాలా వున్నాయి. ఒక్కొక్కడికీ గొంతు దాకా వున్నాయి. కాని ఇటువంటి కేసు ఎక్కడ వున్నది?"

"నేను ఊరి కరణాన్ని. నేను మీకు చెప్పకూడదు. అందరి వ్యవసాయం, పొలాలు, నేను చూస్తూనే వుంటాను. బ్యాంకు మీకెంత డబ్బు కావాలంటే అంత ఇస్తుంది. వాళ్ల దేం పోయింది? నల్లరేగడిలో పంట పండిస్తావో, తెల్లచవిటిలో పోస్తావో డబ్బు! అది వాళ్లకేం పట్టదు. కాని దిగుడు బావి కంటూ తీసుకున్న ఋణంలో, మర్యాద నిలవాలంటే, కనీసం, పది పన్నెండు మూరల లోతైనా బావి త్వ్వాలా, అక్కర్లేదా? బ్యాంకు ఛైర్మను కూడా మీవాడే. జనం బీదస్థితి గమనించి, పెద్ద మనుషుల మాట మీద నమ్మకముంచి, డబ్బులిస్తారు. పంచనామా కరారు చేసి తేసుకుంటారు. మీ కోసరం ఆయన ఇంత చేసారు, లేకపోతే మేమే బైటపడి చెప్పి ఇప్పించాం అయినా మా పని ఏ కొంచెం చేయలేదని ఒకటే కాకిగోల పెడుతూ వుంటారు. ఆయన మీమీద ఇంత నమ్మకం చూపిస్తే మీరు ఆయన మీద కత్తి నూరుతూ వుంటారు. అప్పు ఇచ్చాడు, కరారునామా రాయించాడు, పంచనామా జరిపించాడు, ఇదంతా

ఎందుకు చేసాడను కుంటున్నారు? ఈ యేడు ఏర్పడ్డ కఱవు, కాటకం చూసి మీ ఆర్థిక దుస్థితి చూసిన్నీ. కాగితాలలో, మ్యాపుల్లో, దిగుడుబావి ఉంది. అది దొంగిలింపబడడం, మీ నమ్మక ద్రోహం వల్లనే. ఎదురు నడక నడవడం ఈ 'ఫార్క్-జనానికి వంటపట్టిన విద్యే. ఇంతెందుకు? ఇదేకాదు, అరటితోటకని, అప్పుతీసుకొని మొత్తం అరటిచెట్లన్నీ తవ్వి పారేసిన మహానుభావులెందరో ఈ ఊళ్లో ఉన్నారు. ఇదంతా మీకు తెలిసిన విషయమే.

"ఓ అప్పా! ఈ అధికార్లు చాలా ముందు చూపుతో వుంటారు. బ్యాంకు చెప్పేది ఒకటి, వీళ్లు చేసేది మరొకటి. పోయిన వారంలో కొంతమంది ఇండ్లలోంచి, మినుములు, పెసలు, పత్తి అప్పు కింద జప్తు చేసి తీసుకెళ్లారు. కొంతమందిని గురించి పంచాయితీ చేశారు. ఈ సంవత్సరం ఎట్లాగు పంటరాబడి తక్కువే. మీరు కూడా చూసే వుంటారు. అయిదణాల వంతు పంట కంటె వుండదని. మన సొసైటీ వాళ్లు ఋణాలు వసూలు చేయడం ఆపి, వాయిదా వేయాలి, అని లిఖితపూర్వకంగా తీర్మానం పంపించి వున్నాం. మరి బ్యాంకు వాళ్లు డబ్బులు అడగాల్సిన పనేముంది! అటువంటి అధికారమే వాళ్లకు లేదు. నియమాల్లో, తేగేసి అట్లాగే చెప్పబడి వుంది"

"మంచిది నాయనలారా! మంచిదే. మీ రూల్సులో ఎట్లాగైనా వుండనీ, మెట్టుమంట, దిగుబడి సరిగా లేదని నేనూ ఒప్పుకుంటాను. కాని వడ్డీ అయినా చెల్లి వేయడానికి సరిపోదని చెప్పడం ఎలా? తోటల మీద వచ్చే పంటల మీదనైనా ఎవడైనా బాకీలు చెల్లిస్తున్నాడా ఏమన్నానా? వాళ్లను ఎందుకు మన్నించాలో? ఏడు సార్లు బాకీ లెక్క రాసిందే రాస్తూ కూచున్నాం. ఇప్పుడు రాయడానికి ఖాళీ చోటు కూడా లేదు. ఇంతటి వాళ్లు ఈ గ్రామం లోని పెద్ద మనుషులు. ఒక్కడూ చెల్లించింది లేదు. వేలల్లో ఉంది రావాలిసింది. వచ్చింది శూన్యం."

"మొత్తం అప్పు మాఫీ చేయించుకోవాలని చూస్తున్నాం బాబూ! బ్యాంకు బాబు చేయాలంటే విసుగు కుంటున్నాడు, ఇది ప్రజాస్వామ్యానికి చెందిన ప్రభుత్వం. మరొకటి మరొకటి కాదు. నిజాం షాహీ ప్రభుత్వం కాదు. జనం తీర్మానించి పంపిస్తే ఎవడూ ఏమి చేయలేడు. డబ్బు చెల్లించడాని కెవ్వడూ తయారుగాలేడు, కఱవు కాటకంలాంటి పరిస్థితులు ప్రతి యేటా ఒకదాని వెంబడి ఒకటి వస్తూనే వుంటాయని."

"అల్లాగైతే చాలా సంతోషకరమైన సంగతే మేమేం చేయగలం?"

చప్రాసీగాడు వేగంగా ఉరుకులూ, పరుగులూ పెడుతూ రావడం చూసి,

సర్పంచ్‌గారు వస్తూ వుండడం చూసొచ్చారు. దూరంనుంచి, సర్పంచ్‌సాబు, జగదేవుగారు ఆయన ఎప్పటివలెనే, ఊగులాడుకుంటూ, ప్రొద్దున్నే తొమ్మిది కొట్టగానే గొడుగు విప్పి పట్టుకుని వస్తూ ఉన్నారు. ప్రక్కల్ని, మామూలాగా ఉండే మిత్రులు, ఒకరిద్దరు పంచాయతీ సభ్యులు, మరి తోతా పెద్దగా ఏదో మాట్లాడుతూ వస్తున్నాడు జగదేవు. మిగతా వాళ్లు వంతు కలుపుతున్నారు. "సరిగా అంతే. మీరు చెప్పేది ఎంతైనా నిజం చెప్పేమాట అంటే ఇట్లా వుండాలి." అంటూ గప్పాలు కొట్టుకుంటూ వస్తున్నారు. దారినుంచి మళ్లీ వెనుదిరిగి చూస్తే చెట్టా పట్టాలు పట్టుకొని వస్తు భాగవత్, ఒకల్లిద్దరాయన స్నేహితులూ కనపడ్డారు. లాల్జీ గుర్రం మీద కూచుని, ఎటో, గుర్రం డెక్కల చప్పుడు 'టక్ టక్' అంటూ వుండగా, చక్కా పోయాడు, జగదేవు కతిదగ్గిరగా. జగదేవు అతని వంక చూసి కూడా చూడనట్లు నటించాడు.

జగదేవు చావడి దగ్గిరకు రాగానే కొంతమంది లేచి నిలబడ్డారు. కొంతమంది కారణం లేకుండానే ఊరికేనే కూచున్న వరుసల్లో ఇటూఅటూ సర్దుకోవడం ప్రారంభించారు.

"ఏం సోదరులు! కూచోవడానికి చాపలు మొదలైన ఏర్పాట్లు చేశారా?"

"అన్నీ ఏర్పాట్లూ చేశామండి"

"అందరూ ఇంకా వచ్చినట్లు లేదు. ఊళ్లోకి బంట్రోతును పిలవడానికి పంపించండి."

"ఇప్పుడెందుకు పంపించడమండీ! రాదలచుకున్న వాళ్లు రానే వచ్చారు. ఇంక వచ్చేవాళ్లెవరూ లేరు."

"అయితే సరే. అదేం పేపరయ్యా! నువ్వు చూస్తున్నది?"

"పాత పేపరిక్కడ పడి వుంటేను."

"పాతదైతే మాత్రమేం? చెప్పుదూ."

"మరాఠ్వాడా! ఇందులో సంపాదకీయానికి శీర్షిక, వట్టి గాడిదలా పెట్టాడు. ఎక్కడా ఖర్మ ఉన్నట్లు లేదు."

"మా చక్కగా చెప్పావు. బొంబాయి పేపరు కాదుగా?"

"ఇవ్వాళ మీటింగు చాలా ఆలస్యమైంది కొంచెం."

"మంచిది. త్వరగానే ముగించేద్దాం. ఏమైందంటే. ఎనిమిది గంటలకల్లా తాలూకానుంచి చప్రాసీ లెటరు తీసుకొచ్చాడు. రెండు మూడు మీటింగు లున్నాయి. నాకు అక్కడి అజెండా ఇచ్చారు. అది నేను చదివాను. నేను మొన్ననే అక్కడికి

వెళ్లివచ్చా. అధ్యక్షునితో వాదులాడాను. అరే భాయీ! మన గ్రామం కోసమని దెబ్బలాడాలిసే వస్తుంది. ఔరంగాబాదు ఆ ఇంజినీరు కూడా కలిసాడు. రెండు మూడు రోజుల్లో నువ్వు మా ఊరికి ఎలిట్రిసిటీ లైను ఇస్తే సరే సరి లేకపోతే చూడు నా తడాకా - నిన్ను భరతం పట్టిస్తా. ఏమిటనుకున్నావో! నేను నేరుగా ఢిల్లీకే వెళ్తా. ఆయన చాలా గాబరాపడిపోయాడు. అల్లా చేయకండి సార్ అన్నాడు. మన ఊళ్లోకి లైట్లు వచ్చాయంటే చాలు, చీకటంతా పటాపంచలు! ఊరు ఒక్క దెబ్బను, ఆరోగ్యంగా శోభాకరంగా తయారవుతుంది- ఏమంటారు?"

"కచ్చితంగా అంతే సార్! మీరు చెప్పిందంతా పూర్తిగా నిజం."

"వేళ అయిపోతూ వుంది జనం వాళ్ల వాళ్ల పనుల మీద పోవాలి. నేను కూడా తాలుకాకు రివెన్యూకు సంబంధించిన మీటింగుకు పోవాలి. ఏముందో దబ్బున జరగనివ్వండి. మిగతావి తర్వాత మాట్లాడుకోవచ్చు."

"సరేనండి! పనులెప్పుడూ వుంటూనే వుంటాయి. మన గ్రామవికాసానికి మీరు కూడా చేదోడువాదోడుగా నిలబడాలి."

"ఏమర్రా! 'చాయిపానీ' ఏర్పాటేమైన ఉందా? గ్రామసేవక్ గారు! కొంచెం చాయి సంగతి చూడండి ఆ లోపల మేమితర విషయాలు చర్చించి, నిర్ణయాలు తీసుకుంటాం."

"భాగవత్‌రావు, మరి ఇతరులందరూ హాజరయ్యే ఉన్నారు. ముందుగా తమరు తయారుచేసిన కార్యక్రమం యొక్క రూపురేఖ లేమిటో చెప్పండి సర్పంచ్‌గారూ!"

"అవునవును. అది నేను మరిచిపోయాను. నేను ఊరికి సర్పంచ్‌ను. ఆ హోదాతో మీతో మాట్లాడవలసిన విషయాలు కొన్ని వున్నాయి. మన తాలూకా నుంచి మండలి పరిషత్తుకు ఎన్నికైన సాధారణ సభ్యులకు జిల్లాపరిషత్సభ్యులకు, ఈ రెండు రకాల నాయకులకు మన ఊళ్లో సన్మాన సభ ఏర్పాటు చేయడానికి నిశ్చయించడమైంది. వాళ్లు వస్తే మన ఊరి అభివృద్ధికి కావలసినంత ధనం లభిస్తుంది. మీరందరు కూడా వికాసాన్ని కోరుతున్నారు కదా! ఊళ్లో వాళ్లకు ఊరేగింపు జరిపించాలి, బ్యాండు మేళం, పుష్టిగా భోజనం ఏర్పాట్లు మంచి రంగస్థలం, లవుడు స్పీకరు, ఇవన్నీ ఏర్పాటు చేయాలంటే ఒక వెయ్యి రూపాయలు ఖర్చవుతాయి. అంచనా ప్రకారం, అంత ఖర్చు తేలింది. ఎప్పుడూ ఇటువంటి సందర్భాల్లో, లాల్జీ, రాములాల్, భాగవత్‌రావు, వీళ్ల మిత్రులు, వీళ్లే రొక్కం ఇస్తూ వుంటారు. ఈ సందర్భంలో కూడా వారిపైన అయిదు వందల రూపాయలు, మన వాళ్లు

పంపవలసిన జనవరీ డిమాండు చెక్కులోంచి తీసుకుందాం. అది నా వంతు. మీరెప్పుడైనా అడగ్గానే చేతికెముక లేకుండా, దానం చేస్తూ వుంటారు. ఆ నమ్మిక నాకుంది. ఈ ప్యాడు మీద సంతకాలు చేయండి. కొంచెం డబ్బులు తొందరగా పంపించండి ఏమంటావు సెక్రటరీ!"

"ముమ్మాటికీ అట్లాగే!"

"మీరు మీ అయిదు వందలు నాకివ్వండి. నేనైదు వందలిస్తాను. జనాన్ని ముందుగా కష్టపెట్టడమెందుకు? మీరేమంత పేదవాళ్లు కారుగా." భాగవత్.

"అల్లా కాదండి. పుణ్యకార్యాన్ని అందరూ సమంగా పంచుకోవాలి."

"అయితే నేనొక్క రూపాయి కూడా ఇచ్చేది లేదు."

"అట్లా అంటే ఎట్లా కుదురుతుంది? బుద్ధిమంతుడైన వాళ్లు కూడ గ్రామాభివృద్ధి కార్యక్రమంలో అభిరుచి చూపించకపోతే పనులెల్లా జరుగుతాయి. ఇదివరకల్లా ఇటువంటి ఫంక్షన్లు జరిగినప్పుడు, మీరిస్తూనే వున్నారు. మీ వ్యవసాయం, ఫలసాయం రెండూ ఎక్కువేకదూ! జనమంతా మిమల్ని పొగడ్తూ వుంటారు.

"దయచేసి మిథ్యా స్తుతిచేసి నన్ను తెలియని షావుకారిగా జమకట్టకండి. ప్రతి సందర్భంలోనూ, లోగడ నేను డబ్బిచ్చే వున్నా. గ్రామంలో ఇతరులూ, ఇచ్చారు. ప్రతిసారీ జనమెక్కడి నుంచి ఇస్తారు? సన్మానాలికింతింత డబ్బు కావాలంటే ఎట్లా? మీకా నాయకులతో ఎక్కువ సంబంధముండి వుండవచ్చు. కాని నాకు కూడా వారితో పరిచయం చాలా వుంది. వాళ్లను సన్మానించాలంటే మాకేమి వ్యతిరేకాభిప్రాయం లేదు. వాళ్ల విషయంలో ప్రేమ వుంటే సన్మానికింత కావాలని చెప్పండి. ఖర్చు చేయడంలో అదీ మీ ఇంట్లోనే చేయడంతోనే ఆ ప్రేమ వ్యక్తం కాదు. సగం డబ్బు కార్యానికి, సగం డబ్బు జేబులోకి, అని మీ వాళ్లే చెబుతూ వుంటారు. అంతేగాక, బైటంతా, ఈ ఖర్చంతా నేనే భరిస్తున్నాను, నా జేబులకు చిల్లులు పడిపోతున్నాయని, డాబులు దర్పాలూ, వెళ్ల బోస్తూ వుంటారు! అటువంటప్పుడు జనాన్ని డబ్బుల కోసం అడగడం దేనికి? "

"ఇది శుద్ధ అబద్ధం, అలా అని ఎవరు చెప్పేది?"

"మీరే. తాలూకాలో జిల్లాలో ఉన్న స్నేహితులీ విషయం చెబుతారు. కావాలంటే మీ మొహంమీదే వాళ్లచేత ఆ విషయం చెప్పిస్తాను."

"ఈ వృథా నేరారోపాలు మధ్యలో తీసుకరావాల్సిన పని లేదు. నువ్వేమి డబ్బివ్వక్కర్లేదులే. ఇవ్వాల్సి వస్తుందేమోననేగా వీళ్లందర్నీ తప్పుదారి పట్టిద్దామని

చూస్తున్నావు. ఎన్ని సందర్భాలు నేను నా జేబులోంచి ఖర్చు పెట్టి గ్రామ వికాసానికి తోడ్పడ్డవి ఉన్నాయి."

"అదంతా అటుండనీ సర్పంచ్ గారూ! అంతా నాకు తెలుసు. నేరుగా నిజాం సర్కారు ముగలాయి దర్బారురోజుల్నించి నేనిక్కడే వున్నాను. నువ్వే ఈ గ్రామంలోకిప్పుడిప్పుడే వచ్చి చేరుకున్నావు. నేనిక్కడే పుట్టి ఇక్కడే పెరిగాను. ఊరు కోసరం ఇంటిని పాడుపెట్టుకొని, తీర్థ స్థలంగా మార్చేటంతటి మహోదాతను నేనింత వరకు చూసింది లేదు. ఈ గ్రామంలోనే, నేను నిజాం సర్కారు మొదల్కొని నేటి దాకా, యాభై వర్షా కాలాలు గడాపాను. ఈ గ్రామంలోని గుర్రాలు, పచ్చిగడ్డి దానాతో మైళ్ల కొలదీ వేగంగా పరుగెత్తేవి. ఇప్పుడో కొంచెం తొందరగా పోవడానికి రెండు తన్నులు తంతే చాలు, రెండు కాళ్ల మీద నిలబడి పోతాయి. ఎడ్ల బళ్లు లోగడ బందుగుల ఊళ్లదాకా ఒకే బిగిని పరుగెత్తేవి-ఇప్పుడో ఒక్క అడుగు వేయకుండా కుప్పకూలబడి పోతాయి. మనుషులు ఓ గ్రామం నుంచి ఇంకో గ్రామానికి తరలి పోతున్నారు. ఇంతైనా మీ సభల్లో, ఈ అన్నదమ్ముల్ని గురించి ఎవడూ అడిగేవాడు, విచారించేవాడు లేడు. ఎవడైనా చెప్పగలరా? ఇంత మందీ చచ్చిపోయారని? ఊరంతగా చిక్కిపోయినప్పటికీ, ఊళ్లో జనాభా తగ్గినట్లు మీకు తోచే తోచడం లేదు. గ్రామం యొక్క రూపురేకలు పూర్వంలాగానే వున్నట్టు అన్నీ కప్పిపుచ్చుతారు. భాగవత్, ఉన్నదున్నట్లు చెబుతుంటే మీకు పాపం వింటానికి కష్టంగా వుంటుంది. నిజం చెబితే కన్నతల్లికి కూడా కంటకంగానే వుంటుందన్నమాట అబద్ధ మెన్నటికీ కాదు సుమండీ!" అని తోతామంగ్.

"మళ్లీ నోరెత్తావా అంటే చెప్పుం తీసుకుని తంతా నేమనుకున్నావో! నీ హద్దులో నీ వుండాలి. సాలా! పనికిమాలిన వెట్టి వెధవ!"

"నాలుగు చెప్పుం దెబ్బలు తిన్నా నేను చెప్పేది చెప్పేదే. అంత తురకాళ్ల రాజ్యంలోనే దరోగాలన్నా అమీన్ సాబులన్నా, దడిసింది లేదు. ఇప్పుడేమి భయ పడతాను? ఈ మాలోళ్లే నిన్ను సర్పంచ్‌గా ఎన్నుకున్నది. ఇంతట్లోకే మరచి పోయినట్లున్నావు. హోదా పటపుల మీద కూచుని ఇప్పుడు వాళ్ల రక్తమే తాగుతున్నావు. నీ హోదా కాపాడుకోమని చెబుతున్నా. నేను నీ మాటలకు ఉబ్బిపోయివుండే వాణ్ణి కాదు. నీ వల్ల నాకు ఒరిగేదీ జరిగేదీ ఏమి లేదు. ఈ ఊరినుంచి పోయి మరో ఊళ్లో ఇన్ని గంజి మెతుకులు తినలేకపోను. ఈ ఊళ్లో మంచి మాటకు వత్తాసు ఉండదు. జనం అన్నానికి మొహం వాచిపోతున్నా ఈయన

గారి క్ష్యాలిసిన వాటాలు ఇవ్వాలిసిందే. ఇవ్వని వాడు తెలివి తక్కువ వెధవ! రాష్ట్ర పాటేలుగారి భాగవత్ లా!

"చప్రాసీ! వీడిని రెండు చెప్పు దెబ్బలు కొట్టి బైటికి తోసెయ్యి. అందరూ మా ఇంటికి రండి. అక్కడ కూచుందాం. భాగవత్! సంతకం పెట్టి మరీ వెళ్ళండి"

"సంతకం గింతకం ఏం లేదు. ఇక్కడకు రావడమే ఓ పెద్ద పొరపాటు."

"మిమ్మల్ని ఎవరు బొట్టు పెట్టి పిలిచారు? మేముండగా గ్రామంలో ఏ పనీ, ఆగిపోదు."

"నీ మనుషులు, నువ్వూ మా ఇంటి చుట్టు మూడు సార్లు తిరిగి 'ముక్కును' లగాయించారు. అందుకని వచ్చాను. నాకు కూడా ఇక్కడికి రావాలిసిన అవసరం ఏమి లేదు. అనేక విషయాల్లో నీకు నేటికీ నన్ను గురించి ఎన్నో అపోహలున్నట్లున్నాయి పాపం! నీకూ నాకూ ఇంతటితో రాం! రాం!"

"మంచిదే!"

భాగవత్ చక్కా పోయాడు. ఆయన వెనకాల్నే తోతా కూడా వెళ్ళి పోయాడు. చుట్టూ మిగిలి వున్న నలుగురైదుగురి కేకల్లో, బొబ్బల్లో ఏదో వాగుతూ, జగదేవ్ విసుగుల పడ్డాడు.

కిలకిల ధ్వనులు చేసే పిట్టలు చెట్ల ఆకుల మధ్యలో దూరి నిశ్చింతగా బస చేస్తున్నాయి. పొలాల్లో ఉన్న స్త్రీ పురుషులు, ఆలమందలూ, పశువులూ, ఇండ్ల వైపు మళ్లాయి. నీడలు మందగించాయి. దేవాలయాల్లోంచి, ఘంటా నినాదాలు, మంగళహారతి ధ్వనులు మెల్లిమెల్లిగా వినబడుతున్నాయి. ఇంకా కూడా భాగవత్ లేవలేదు. దిగుడు బావి తిన్నె అంచుమీద ఒంటరిగా పడి వున్నాడు అడ్డదిడ్డంగా, బావిలోని నల్లని నీళ్ల కాలుకలో తన కళ్లు ముంచుతూ. వ్యగ్రంగా. ఏకాగ్రమైన ఏదో ధ్యానంతో, ధ్యాసతో. నీటిమీది నల్లని తరంగాలు పైకి లేస్తూ వాని కాంతులు తన కళ్లను ఏదో ప్రశ్నిస్తున్నాయి. ఆయనకు దిగుడు బావి నీళ్లల్లో జయవంత ప్రేతము కనబడుతోంది అది ఇటూ అటూ కదలాడుతున్నట్లుంది జయవంత శరీరాన్ని కట్టి పోలీసులు, ఇతర జనం, అతి ప్రయాసగా, బావిలోంచి శవాన్ని బైటికి తీయడం అతనికి గుర్తువస్తోంది. అతని శరీరం మీద ఆ స్మృతులు రోమాంచం కలగజేస్తున్నాయి. ఓసారి మారెమ్మ మీద ఒట్టు వేసి తోతా చెప్పాడు-ఊళ్లోని రౌడీ మూక ఊళ్లో నిన్ను, జయవంతను జత చేసి ఏదో, ఏదో డప్పు వాయిస్తున్నారని-బావి కింది పొలంలో ఇద్దరూ కలిసి వుండడం, మేకలు మేపుకొనే 'శివబా' చూసి చెప్పాడని-

తానప్పుడు వాడి మొహం మీద ఎంత బలమైన దెబ్బ కొట్టాడు. ఆతర్వాత తాను రెండు రోజులు భోజనం కూడా చెయ్యలేదు. శివాబా చెప్పింది నిజమే. దిగుడు బావి నీటి కాలవ మడుగులో పెద్ద నాగుబాము కనబడడం, ఆమె గాబరా తిని, తన్ను కౌగిలించుకోవడం, ఉన్న విషయం తాను చెబితే, దానికి విపరీతార్థం కల్పించారు వీళ్లు. జయవంత అవ్వ కూడా సందేహించింది. ఆమె జయవంతకు తిండి కూడా పెట్టలా. గుచ్చి గుచ్చి అడగడం మొదలుపెట్టింది. ముసలిది బాబా దగ్గరకు వెళ్లి వచ్చిన తర్వాత మరీ, కారాలు మిరియాలు నూరింది. ఒట్టి గాడిద కొడుకు! బంగారంలాంటి పెళ్లాం ఇంట్లో వుంటే, వీడికి పరాయి ఆడదానిపైన మోహమెందుకో? రాత్రి అనక, పగలనక, అర్థరాత్రిళ్లు కూడా పొలం మీదనే పడి వుంటాడు. ఇంట్లో వీడికేం ప్రమాదం వచ్చి పడింది? బాబా మాటలు, ముసలిదాని మాటలతో పోకిరివాళ్ల పాచిక పారింది. ఊళ్లో వాళ్లకు ఇందుమూలంగా మరో వింత కాలక్షేపం దొరికింది. శివబా మాటలు గ్రామంలోని మాగా, ఆడ ఆడుకొనే మాటలు డబ్బు తిని కల్లబొల్లి మాటలు ప్రచారం చేసే కిరాయివాళ్లు సాక్ష్యం. ఎన్నోసార్లు అనుకున్నాను వీళ్లను పిచ్చిపిచ్చి ఆలోచనలు చేయవద్దని చెబుదామని. కానీ ఆ సమయాల్లో కోపం పెనవేసుకున్తుంది. అయితే నా కోపాన్ని ఎవరిమీద చూపడం? నేను కూడా జయవంత వలెనే ఆత్మహత్య చేసుకుంటే? బావిలో పడి - ఎంత ప్రయత్నించినా బుర్రలోంచి ఈ కుళ్లు పోవడం లేదు. బుర్ర అంతా కటకటలాడుతోంది. నా మనస్సులో నేనే నిశ్చయించుకున్నాను. కాని ఏం లాభం? కాని ధైర్యం కలగడం లేదు. నా బతుకు మీద తీష గంగ్రబతుకు మీది తీష నన్ను నా మనస్సును వెనక్కు పీకుతున్నాయి. జయవంత తన దారిని తాను పోయింది. ఎన్నో కథలూ, కావ్యాలూ నా మీద అన్ని వైపుల నుంచీ అల్లించి. భగవంతుడు గ్రుడ్డివాడు కాడు. కళ్లుంటాయి. ఏది నిజం, ఏదబద్ధం అనే విషయం ఆయనకు బాగానే తెలుస్తుంది. ఆయనే అందరినీ ఉద్ధరించేవాడు, మనమేమిటి చేయగలం? నల్లని ఆ నీటి తరంగాలు కదులుతున్నాయి. అన్నట్లుగా కళ్లల్లో ఒక విధమైన ఆభాసగా ఊగుతున్నాయి తిరిగి జయవంత కళ్లల్లో కన్పించింది. నీటి అంచుల మీద జయవంత బతికే వుంది! విప్పారిన కళ్లతో నా వంకే చూస్తోంది. బుగ్గ సొట్టల్లో నవ్వు మొగ్గలివిగో! జయవంత ఇటీవల, గంగ దగ్గిర, తన దగ్గిర, అప్పుడప్పుడు, తన మనసు మొగ్గలోని రేకులు విప్పారజేసి మాట్లాడుతూ వుండేది. ఆమె అత్తింటి వైపు వ్యక్తిగతమైన మాటలడిగితే చెప్పేది కాదు. ఏమి ఎఱుగనట్లు, కళ్లల్లోకి నీళ్లు రానీకుండా, కప్పిపుచ్చేది. ఆ తర్వాత ఎక్కువ నేప్పు,

మాట్లాడేది కాదు. ఆమె చెప్పింది. ఊరి బైట దేవి గుడిలో రెండు మూడు రోజులపాటు కాషాయవస్త్రాలు ధరించిన, సాధువొకడు ఓసారి వున్నాడని గడ్డం బాగా పెరిగి వుంది. ఆయన ఊళ్లో, సాయం కాలం పూట గోధుం పిండి ముష్టి అడిగేవాడు. అతను ఆమె మొగుడేట. ఆమె అతన్ని సరిగానే గుర్తుపట్టిందట. ఆయన తన్ను పిలవనంపాడుట కూడా. అయితే తాను వెళ్లలేదుట. తాను తన అవ్వకు చెప్పిందట. అవ్వ గంపెడాశతో దేవి గుడి దగ్గరకు వెళ్లిందట గాని, ఆయన అంతకు ముందే అక్కడినుంచి పలాయనం చిత్తగించాడుట. ఆయన జయవంతను బలాత్కారించకుండా వున్నాడా? ఆయనే మాటిమాటికి వస్తూ వుంటే ఆయనతో కూడా జయవంత లేచి పోయి వుంటుందేమో? జయవంత ఓసారి, గంగతో చేనికంచె దగ్గర, అర్ధరాత్రి దాకా, తన జీవితంలోని, కష్టసుఖాలు, సమస్యల గారడీ అంతా చెబుతూనే పోయింది. జయవంత పెనిమిటి, తీరైన నాగరకమైన వాడున్నూ. కనుముక్కు తీరు చూసి తీరాలి. కళ్లలో దూరి కూచుందామా అనిపిస్తుంది. మంచి కుటుంబానికి చెందినవాడు కానీ ఏం లాభం, జయవంత కర్మ కాలింది! అతను ఆడంగిరేకి. జయవంత అందుకు శుద్ధ వ్యతిరేకం! జయవంత నూటికి నూరు పాళ్లు రత్నప్రతునక! ఆయన మగతనం అంతంత మాత్రమే! తన్నుతాను చూసి సిగ్గుపడే రకం. అయితేనేం? ఊళ్లో అన్ని విషయాలకు, అగ్రతాంబూలం అతనిదే. డాబూ దర్పంలో అతనిదే పై చెయ్యి. బైట మాత్రం దమ్మిడీకి కొఱగాడు. ఏమిటి చెయ్యడం? ఆయనకు అంతకంతకు పిచ్చెక్కిపోయింది. జయవంతను చూస్తే ఆయనకు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నట్లవుతుంది. ఎన్నో రకాలుగా ఆవిడను ఏడిపించడం మొదలుపెట్టాడు. ఆమెకు ప్రాణం విసగెత్తి పోయింది. కోపం రేగుతోంది కానీ ఆయన తన పెనిమిటి. ఇట్లా ఏడాది రెండేళ్లు గడిచాయి. ఆయన బుర్రలో సందేహాల పాములు పాకడం మొదలైంది. ఓ రోజు రాత్రి ఆయన ఇంట్లోకి ఓ పరాయి మనిషిని తెచ్చాడు. తానే జయవంతకు చెప్పాడు. బ్రతిమాలాడు. ఆమె కాళ్ల మీద పడ్డాడు. 'పిల్లలు కలుగుతారుగా' అని నచ్చ జెప్పబోయాడు. ఆయన ఏంచేసినా, ఆమె సమ్మతించలా. ఆమెను బలవంతంగా దిసమొలచేశాడు. ఆమె పెద్దపెట్టున అకాండతాండవం చేస్తూ కేకలు పెట్టింది ఆ పరాయి మనిషి ఆ దెబ్బతో పరుగెత్తుకు చక్కాపోయాడు. ఆయన వెళ్లిపోయాడని ఈయనకు కోపం. తలుపులు మూసేశాడు. ఎర్రగా కణకణలాడుతూ మండుతున్న ఇనుప కడ్డీ తీసుకొని, ఆమె తెల్లని ఒడిలో, తొడల మీద, వాతలు పెట్టడం మొదలెట్టాడు. ఆమె పెద్దపెట్టున గోలపెట్టి

రగడ చేసేసింది. ఆయన ఆ దెబ్బతో రాత్రే ఇల్లు వదిలిపెట్టి వెళ్లి పోయాడు. ఇహ ఎన్నటికీ తిరిగి వచ్చే ఉద్దేశం లేదాయనకు. జయవంత, నేటికీ అక్షరాలలో వ్రాయడానికిగాని, ఉచ్చరించడానికి గాని, వీలులేని ఎన్నో సందర్భాలు, గంగకు రహస్యంగా చెప్పిందట. మొన్న గంగ చెబితే విని నేను నిర్ఘాంతపోయాను. ఇన్ని చేదు అనుభవాలైనా, జయవంతకు చచ్చిపోవాలని అనిపించలేదు. అటువంటిది ఇప్పుడు బావిలో ఎట్లా పడింది? పడాలిసినంత ఏం జరిగిందో? నన్ను పాచిక చేసి తన వశం చేసుకోవడానికేనా, ఆనాడు బలంగా నాపై పడి గట్టిగా కౌగలించుకోవడం-ఇదంతా ముందుగా యోచించి చేసిందేనేమో! నా కొరకై బలి అవుదామనుకుందో యేమో! భాగవత్ కళ్లల్లో తిరిగి నీడలు. తిరిగి నీటిమీది సన్నని జాలులో ప్రతిబింబిస్తూ కదలుతున్న ప్రతిమ. అతను తిరిగి దిగ్భ్రాంతుడైనాడు. ఆమె చెంగు సవరించుకొంటోంది కూడా? ఎందుకోసరమో? సర్పమైథున సమయంలో నన్నెంత గట్టిగా కవుగిలించుకున్నది ఎంతసేపో! అరటి తోటలో నగ్నంగా తన దేహంతో తనకండూతి తీర్చుకున్న జయవంత. ఇప్పటి ఈ సౌందర్యం ఇదివరకెప్పుడూ చూడలా. వాసు, నన్ను గాని ఆమెను గాని ఇదివరకెన్నడూ కదిలించలా. జయవంత కేవలం నవ్వుతూ వుంది బుగ్గలోనే. పూర్తిగా ఎంచక్కాగా! పాపటలో ఎర్రని కుంకుమ బాదుకుంది. ఎంత ఆశ్చర్యకరమైన విషయం, జయవంత, సజీవంగా కదులుతోంది నీళ్లల్లో. ఎప్పటినుంచో తెలుసునా ఈ నిల్చోవడం?

భాగవత్ ఎంతో గాబరా తిన్నాడు. అతని సర్వావయవములూ, చెమటతో తడిసి పోయినాయి. గంగ, బావి ఒడ్డున ఎప్పుడో వచ్చి, నిలుచున్నా అతనికా ఎఱుక లేదు. బావి అంచున నిలుచుండం చేత, బావి నీళ్లల్లోని ఆమె నీడ అతనికి జయవంతలాగా భాసించింది. జయవంత భూతం తనతో మాట్లాడుతోంది కాబోలునని మొదట అనుకున్నాడు. ఆయన గంగవైపు చూశాడు. కానీ అతనికి తనంత తానే మైకంలోంచి బైట పడాలంటే చాలా కష్టంగా వుంది. ఇంతసేపైనా, గంగతో అతను మాట్లాడలేక పోయాడు. చెవిటివాడిలా ఊరికే ఆమె వంక చూస్తూ వుండిపోయాడు. ఇట్లా చాలా సమయం గడిచి పోయింది. గంగకు కూడా ఈ నడుస్తున్న ఘట్టం మత్తు కలిగిస్తోంది.

"నీ గమ్మత్తు ఏవిటో చూడాలనే నిశ్చయించాను. ఎంతో సమయమైంది నేనిక్కడ నిలబడి. ఏమిటింత గంభీరంగా ఆలోచన సాగుతోందో అర్థం కావడం లేదు. నీకీ ప్రపంచమంతా అమ్ముడుపోయి, దివాలా తీసినట్లనిపిస్తోందా?"

"అట్లా ఏమి లేదు."

"చీకట్లు ఎంత దట్టంగా ప్రలుముకున్నాయి. ఇంటికి వెళ్లే ఆలోచన లేదా?"

"కొద్దిసేప్పుండి వెళతాను."

"ఇవ్వాళ బాగా అలసిపోయి పోయినట్లున్నావు. ఏమైనా కష్టం కలిగిందా?"

"ఏమిటి ఎక్కడా? ఊరికేనే ఉన్నా."

"నువ్వా మాట బుర్రలోకి తేవద్దు. పొలంపని మరీ పెంచుకోవద్దు. నీ చేతులతో నువ్వు నీ ప్రాణం మీదికి తెచ్చుకుంటూ వుంటావు. ఇతరులకు నువ్వెట్లా పోయినా, ఏమి పట్టదు. ఎవడు చచ్చినా బ్రతికినా ఏమి పట్టదు గాని, నీ ధోరణే ధోరణి. జొన్నలు, పత్తి అరటితోటలు, దిగుడుబావి అసలు ఇవి తప్ప వేరే ఇంకోటి ఏవీ పట్టవు."

"నాకు తెలుసు. నేనేదీ నాకోసరమే చేయడం లేదు. నిన్ను చూసే నేను మరికాస్త ఎక్కువ కష్టపడుతున్నా."

"ఇంతా నా ఒక్కరికోసరమే."

"అట్లాగని కాదు. నీకు కొంచెం తలకాయ వుంటే అర్థమయి వుండేదే. తొందరగా! పొట్టలో పెరుగుతున్న శిశువును గురించి ఆలోచించాలా అక్కర్లేదా?"

"నాకు తెలుసు. నువ్వెంతగా ఆలోచిస్తున్నావో?"

"సరిలే. నిన్ను గురించి ఇటీవల పట్టించుకోవడంలేదా? అది కూడా అబద్ధమేనా? నువ్వే చెప్పు నిజమేమిటో?"

"ఇటు చూడు. వట్టి కబుర్లు కట్టిపెట్టు. ఇంట్లో ఎప్పుడూ, ఏదీ చెప్పుకోవడానికే తీరదు. పొట్టలో ఇటీవల ఏదో కొంచెం నొప్పిగా వుంటోంది. బాగా కడుపులో తిప్పుతున్నట్లుంటుంది. ఇంట్లో ఎప్పుడు చూసినా అశాంతి. కష్టంగాని, నష్టంగాని దేన్ని ఇంట్లో లెక్కపెట్టే నాథుడు లేడు. నేనొక్కత్తెనే ఎలా ఈ సంసారాన్ని ఈదడం నెత్తిన వేసుకుని ఒంటరిగా? నాకు ఎంతో దుఃఖంగా వుంది నా జీవితాన్ని తలచుకుంటే."

"ఏం చింత అక్కర్లేదు. అంతా తిన్నగా నడుస్తుంది. ఈశ్వరుని మీద విశ్వాసముంచు. ఆ భగవంతుడే మన చింతని తొలగిస్తాడు. ఇంతవరకు ఆయనే కనిపెట్టి వున్నాడు. ముందు కూడా ఆయనే రక్షకుడు. నీకో సంగతి గట్టిగా చెబుతున్నాను. నేననేక విషయాలు మనస్సులో పెట్టుకుని వున్నా. పొలం పనులు, తోట పనులు, భారమైనవన్నీ ఇప్పటికే చేసేశాను. తోట బాగా పెద్ద దయింది.

ఇప్పుడు కేవలం పచ్చని నీడల్లో తిరుగుతూ వుండడమే, నీ పసుల్లను చంక కెత్తుకుని. ఇంటి కోసరం నాకంటె నువ్వెక్కువ కష్టపడుతున్నావు. నేనంటె బైటకి పారిపోతాను. పోట్లాటలు, కాట్లాటలు నాకు సరిపడవు. వీటి ఆందోళన నాక్కర్లేదు. ఇప్పుడు నీకోసరం కంటె కూడా, నీకు కలగబోయే బిడ్డ కోసరం, పొలంలోనే, తోటలోనే, ఓ పూరి గుడిసె వేసుకుని వుండాలి. పడమటి వైపున్న పెద్ద పొలంలో, అరటి చెట్లకూ, బత్తాయి చెట్లకూ మధ్యగా ఓ చిన్న కుటీరం వుంటే చాలు. పనీపాటూ వదిలి ఇటూ అటూ వెళ్లే పద్ధతి కాదు. తోటను వదిలి వెళ్లడానికి లేదు. గంగ కోపం కూడా తొలగిపోతుంది. నీకు కూడా బాగా స్వతంత్రంగా వుంటుంది. ఈ పొలం తల్లి పుణ్యం చాలా గొప్పది గంగా! ఈమె ఆశ్వీరాదం వల్ల అన్నీ చక్కగా నడుస్తున్నాయి. ఇక్కడ ఈ భూమాత మట్టిలో రాత్రింబగళ్లు పడి వుండడం వల్ల మనకు దేనికీ లోపం వుండదు. పొలం పంటల్లో, పిట్టల పక్షుల కలకలారావాలతో నువ్వు నీ కష్టమంతా మరచి పోతావు. ఇటీవల నాకైతే పొలంలో తప్ప వేరే చోట ఉండ బుద్దే కావడం లేదు. ఇంటిలో వుండటం మాట అటుంచు-ఊళ్లో నడిచే కుట్రలు, పన్నగడలు, అవ్వే మాట్లాడు కుంటూ కాలం గడుపడం, అటువంటి వాళ్లతో మొగం విప్పి మాట్లాడవలెనంటే, నాకు చాలా కష్టంగా వుంటోంది. కొన్నాళ్లపాటు పొలంమీదనే వుందాం.

ఊళ్లో నడుస్తున్న గందరగోళాల్లో, తిరిగి పొలంలో ఏ కొంచెం బాగు చేత చేయించకుండా వుండి పోయాను. మొన్న పరభాణి నుంచి, పూనా నుంచి అక్కడి వ్యవసాయ కళాశాలల వాళ్లు వచ్చి వెళ్లారు. దాంతో నాలో మళ్లీ ఉత్సాహం రేకెత్తింది. అరటి తోటలోంచి బాగా తయారైనా కొన్ని అరటి గెలలనూ, హైబ్రీడు విత్తనాలు రాగులవీ, జొన్నలవీ, కొన్ని గింజ పట్టిన కంకులనూ వాళ్లు మహారాష్ట్ర వ్యవసాయ ప్రదర్శనం కోసరం పైవారం వచ్చి తీసుకుని పోతారుట. వాళ్లే యీ పని అంతా చేస్తూ వున్నారు. సర్కారు వైపునుంచి ఈ వ్యవసాయానికి, సంబంధించి, ఎంతైనా గుర్తింపు, మన్నింపు వుంటుందట. నిజం చెప్పాలంటే, గంగా! నీ యీ విషయమై మనస్సులో ఆలోచనే లేదు. నేను మన తిండి తీర్థాల కోసరం ఈ పొలం పనులు నాకిష్టమని చెబుతూ, ఇక్కడే పాటు పడుతూ వుంటాను. ఓ వేళ మనకో జాగీరు ఊరికే దొరికినా, ఈ పొలం పని మనల్ని వదలదు. నేననేదేమంటే అలా వుండడమే మంచిది సరైన పద్ధతి. ఈ వ్యవసాయం మాత ఆశీర్వాదం. ఇక్కడి ఈ పచ్చ పచ్చని పైరు, పంట, ఉద్యానవనాల కంటె కూడా సుందరంగా వుంటుంది. కొత్త సృష్టి

మళ్లీ ఇక్కడ నిలబెట్టాలి. ఈ గాంధారిలోని జనం, అక్షరాలా వెర్రివాళ్లై వుండాలి. ఎందుకంటే వ్యవసాయం పనుల్లో తిరిగే నన్ను వెర్రివాడి కింద జమకడుతూ వుంటారు. ఎన్నో సందర్భాలు కళ్లల్లో మెదలుతూ వుంటాయి. మొన్న ఇప్పపొద నీడలో కాస్సేపు కూచున్నాను. రెండు పసి చిలకలు, నా భుజం మీద వ్రాలి కూచున్నాయి. నేను కదలలేదు. అల్లాగే నిశ్శబ్దంగా వున్నా. ఆ పసి చిలకలు ఏవో చిలకపలుకులు దొర్లిస్తున్నాయి. నాకేమి తెలవడం లేదు. కాని ఎంత మధురంగా ఉంది వాటి గొంతు.

"రాం రాం!"

"రాం రాం! ఎవరయ్యా అది! పంధరా? ఇవ్వాళ ఈ పొలం వైపు ఎందుకు వచ్చినట్లు?"

"మీరంతా పది పదిహేను రోజులు, అక్కడి తోటవైపు ఎక్కువ ధ్యాసపెట్టండి. చెఱకు, వేరుసెనగ, వాటిని సరే వదలండి కానీ అరటి తోట, ప్రత్తి చేను - వీటిని గురించి ఎక్కువ కష్టపడండి. మొన్ననే వాళ్లు వచ్చి వెళ్లారు. తిరిగి పది పదిహేను రోజుల్లోగా వస్తారు. నీళ్లు అరటి తోటకు పెట్టారా? లేక చెఱకు తోటకా?"

"........................"

"ఒరి! నీళ్లు ఎక్కడ పెట్టారు అని అడుగుతుంటే?"

"అక్కడి తోటలకే పెట్టాలి దొరా!"

"అదెట్లా! నువ్విప్పుడే అటునుంచి వస్తున్నావు?"

"తల బద్దలైపోయింది దొరా!"

"ఏం జరిగింది? సరిగా చెప్పకుండా నీళ్లు నములుతూ నిలబడ్డావేం?"

"మన బతుకంతా మట్టిపాలయిపోయింది బాబూ!"

"ఒరే గాడిదా? ఏం జరిగిందిరా?"

"పైకి పంపవలసిన హైబ్రిడు కంకులు, తయారయి సిద్ధంగా వున్న అరటిగెలలు, రాత్రికి రాత్రి ఎవరో కోసేసి తీసుకువెళ్లారు. కొడవళ్లన్నీ కాజేశారు. ఇక్కడకు వచ్చి చెప్పాలంటే మధ్యాహ్నం నుంచి, ధైర్యం చేయలేకపోయాను. ఎవడో గిట్టని వాడింత ఘోరానికి తలపెట్టాడు. క్రిందటేడాది - నాట్లకు ముందే నాగలి, వానకు తలదాచుకునే పొలం గుడిసె తగల పెట్టారు! ఇప్పుడీ దారుణం..."

భాగవత్ గడ్డకట్టుకొని పోయిన వాడిలా కేవలం వింటూ వుండిపోయాడు. అజంతా పర్వత పంక్తులలోంచి దావాగ్ని పెరుగుతూ పోయింది రాగిలా ఎర్రనైనా, ఆకాశంలోని అగ్నిజ్వాలా జిహ్వలు నిశీధాన్ని కబళించి వేస్తున్నాయ్.

Laser typesetting by FoturnePublishers, 59/9 Kalkaji New Delhi and printed at
The Central Electric Press, Narina Phase I, New Delhi-110 028